

# మిసిమి

మాస పత్రిక

మే 2007




రూ.8/-




బుద్ధుని చంపవచ్చి పరివర్తనుడైన అంగులిమాల

చిత్రకారుడు : ఉల్చి, చీరాల

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 18 | మే 2007 | సంచిక 5

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


| | |
|---|---|
| నాలందా విశ్వవిద్యాలయం - పునరుద్ధరణ | అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి |
| అమెరికన్ ధర్మప్రవర్తకుడు కల్నల్ హెచ్.ఎస్.ఆల్కాట్ | 'శ్రీ విరించి' |
| బౌద్ధ దర్శనం - సామాజిక ప్రయోజనం | ముంగర జాషువ |
| మనసు దారి మళ్ళించాలే కాని నిరోధించడం-నిగ్రహించడంకాదు | మ. శివరామకృష్ణ |
| విశ్వైక మానవునికి శాశ్వతాదర్శ ఆచరణా పథం - బౌద్ధం | మాకినీడి సూర్యభాస్కర్ |
| బాధా తప్త హృదయాలకు బ్రహ్మ విహారాలు | డా॥ బి.వి.ఎస్. భానుశ్రీ |
| తెలంగాణాలో బౌద్ధం | మలయశ్రీ |
| బౌద్ధ ధర్శన ప్రభావం | శివలింగం |
| వెయ్యేళ్ళ బౌద్ధ ప్రవాహం - మానవాళిపై ప్రభావం | జె.యస్. రఘుపతిరావు |
| అహంకార శూన్యత - కరుణాపూర్ణత - బౌద్ధం | డా॥ వావిలాల సుబ్బారావు |
| ఏకాగ్రత - స్మృతి - అంతర్దృష్టి - అవగాహన | షణ్ముఖానంద |
| అంబేడ్కర్ బౌద్ధం ఎందుకు స్వీకరించాడు? ప్రపంచ మానవుడిగా ఎదగాలంటే బౌద్ధమే మార్గం | కత్తి పద్మారావు |
| కమ్మ (కర్మ) | ఇంకొల్లు ప్రభాకరరావు |
| బౌద్ధధమ్మ వ్యాప్తితో పునీతుడైన ధమ్మాశోక చక్రవర్తి | - సవేర |
| బుద్ధుని ధమ్మం - విజ్ఞాన శాస్త్రం | పి.రాంబాబు |
| బౌద్ధ ధమ్మం - ప్రపంచశాంతి | దొమ్మేటి సత్యనారాయణ బోధి |
| అశోకుని జీవితంలో ప్రధాన ఘట్టాలు | డా. ఈమని శివనాగిరెడ్డి; వై. మురళీ మోహన్‌రాజు |
| మానవజన్మ - పవిత్రత | కంజుల సత్యనారాయణ రెడ్డి |
| వజ్రయాన దేవతలు - మంత్రాలు | ఘండికోట బ్రహ్మాజీరావు |
| కాలచక్ర - 2006 | డాక్టర్ చింతల వెంకట శివసాయి |
| బౌద్ధ దేవతలు - ఒక పరిశీలన | డాక్టర్ వి.వి. సుబ్బారెడ్డి |
| బుద్ధుడు - బౌద్ధం | నల్ల భూమయ్య |
| **Western Interpreters Of The Doctrine Of The Buddha** | Anagarika Dharmapala |




విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం: ఆర్టును మించిన వాస్తవం : 'ఆమ్రపాలి' సినిమాలో బుద్ధునిగా సునీల్ శర్మ

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimireddy@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**



## Anagārika Dharmapāla,


*The Founder of the Mahā Bōdhi Society of India*

Anagarika Dharmapala, who founded the Mahā Bōdhi Society of India in 1891, heralded a new age when Buddhism was at its decline in the 18th century. Born to a well-to-do Buddhist family in Sri Lanka the young David Hewavitarana as he was then named, grew up in an atmosphere of traditional Simhala Buddhist piety, and he showed a keen interest in the Buddha Dhamma from his youngest days.

In January 1891 he visited Buddha Gaya on a pilgrimage and the state of neglect and desecration which he saw in this holiest spot where the Lord Buddha gained Enlightenment was a turning point in his whole career. He stayed on in India and dedicated his life for the revival of Buddhism in India and the spread of the message of Love and compassion of the Buddha throughout the world. The Anagarika Dharmapala was one of the greatest Buddhist Missioneries and one of the men most responsible for the revival of Buddhism in India and the world in modern times.

# నాలందా విశ్వవిద్యాలయం - పునరుద్ధరణ

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి



ప్రపంచ విశ్వవిద్యాలయలలోకే అత్యంత ప్రాచీన విశ్వవిద్యాలయం నాలందా విశ్వవిద్యాలయం. నాల అంటే పద్మం. పద్మం జ్ఞానానికి ప్రతీక. దా అంటే ఇవ్వడం. అందుకని నాలందా అంటే అర్థం. జ్ఞానాన్ని ప్రసాదించేది అని అర్థం. ఈశాన్య భారతదేశంలో, నేటి నేపాలు సరిహద్దుకు అనతి దూరంలో దక్షిణ పాట్నాలో క్రీ.శ. 427లో స్థాపితమైంది. 1127లో టర్కీ ముస్లిమ్ దండయాత్రలతో, భక్తియార్ ఖిల్జీ అనే ముస్లిమ్ సేనాని చేతుల్లో ఇది ధ్వంసమైంది.

చరిత్ర కందినంతవరకు ప్రపంచంలోనే తొలి విశ్వవిద్యాలయాలలో ఇది ఒకటి. ఇది బౌద్ధానికి ముఖ్య కేంద్రమే అయినా, లలిత కళలు, వైద్యం, గణితం, ఖగోళం, రాజనీతి, యుద్ధ కళలను ఇక్కడ బోధించేవారు.

వాస్తు పరంగా చూస్తే, పారిసరికంగా చూస్తే అది ఒక అద్భుత వాస్తు కళా ప్రతీక. దీనిలో ఎనిమిది వేరు వేరు ప్రాంగణాలున్నాయి, 10 దేవాలయాలున్నాయి. ధ్యానమందిరాలు, తరగతి గదులు, సరస్సులు, విహార వనాలు ఉన్నాయి. 9 అంతస్తుల గ్రంథాలయం ఉంది. ఇందులో గ్రంథాలను పరిశోధక విద్యార్థులు చూసి వ్రాసుకొని తమ వ్యక్తిగత గ్రంథాలయాన్ని తయారు చేసుకొనేవారు. ఈ గ్రంథాలయాన్నే భక్తియార్ ఖల్జీ తగల బెట్టాడు. అది ఆరు నెలలు కాలిందంట. 'ఖుర్-ఆన్' అందులో ఉన్నదా అన్ని గ్రంథాలయాధికారిని ఖిల్జీ అడిగాడట. "లేదు", అని సమాధానం రావడంతో, 'ఇక అటువంటి గ్రంథాలయం నిరుపయోగం" అని తగుల బెట్టాడట.

అక్కడ విద్యార్థులు ఉండడానికి పెద్ద శాలలుండేవట. దాని ఉచ్చదశలో అక్కడి విశ్వవిద్యాలయంలో 10,000 మంది విద్యార్థులు, 2,000 ల మంది ఆచార్యులు ఉన్నారు. ఆ రోజుల్లో ఇది ప్రపంచ విశ్వ విద్యాలయం గూడ ఎలాగంటే కొరియా, జపాన్, చైనా, టిబెట్, ఇండోనేషియా, పర్షియా, టర్కీ దేశాల నుంచి విద్యార్థులు, పండిత పరిశోధకులు ఇక్కడకు వచ్చేవారు.

ఇది కాలక్రమంలో శిథిలా వస్థకు వచ్చే సమయానికి ఇంగ్లాండులో ఆక్స్‌ఫర్డ్, ఇటలీలో బోలోగ్న విశ్వవిద్యాలయాలు అప్పుడే మొదలవుతున్నాయి. హార్వర్డ్, యేల్ విశ్వవిద్యాలయాల ఆరంభానికి అర్ధ

సహస్రాబ్దిముందే, నాలందా అంతమైంది. క్షీణించడానికి కారణం బౌద్ధం మీది ప్రీతి సన్నగిల్లడం, రాజపోషణ కరువుగావడం, అంతిమంగా ఆఫ్ఘనిస్థాన్ ముస్లిమ్ దండయాత్రలు కారణాలు.

నాలందా నుంచి ఆసియా దేశాలు ఇప్పుడు మంచి స్ఫూర్తిని పొందవచ్చు. అది ప్రపంచ విశ్వవిద్యాలయం. ఆ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని పుణికి పుచ్చుకొంది. ఒక నాటి వివిధ జాతుల, సంస్కృతుల ప్రశాంత సంబంధాలను పునరుద్ధరించగలదు. ఇప్పుడు ఆసియాకు లేని ఒకప్పటి మృదువైన ప్రభావక శక్తి ఆకర్షణలను ఇవ్వగలదు. పాశ్చాత్యాలే దానికి సంబంధించిన గ్రీకు, రోమను మూలాలను పునరుద్ధరించుకొనే సుదీర్ఘ సంప్రదాయం ఉంది. ఇటువంటి స్ఫూర్తితో నాలందా విశ్వవిద్యాలయ ప్రాజెక్టును వేదికగా చేసుకోచ్చు. అయితే ఇది ఆధునిక లక్షణాలతో భావిని దృష్టిలో పెట్టుకోవాలి.

రాబోయే వారం (December 9, 2006 తరవాత) సింగపూర్, ఇండియా, జపాన్, ఇంకా ఇతరులతో జరగబోయే ఆసియా దేశాల శిఖరాగ్ర సదస్సు పాత నాలందా సమీపంలో నూతన విశ్వవిద్యాలయ నిర్మాణానికి అవసరమైన ఒక 5 మిలియన్ డాలర్లను, రోడ్లు మొదలైన ప్రాథమిక సౌకర్యాల కల్పనకు అవసరమైన మరో 5 మిలియన్ల డాలర్లు సమకూర్చే విషయాన్ని చర్చిస్తుంది. అసలు సమస్య ఏమంటే, ఆసియా నేతలు దీనిని గురించి కావలసినంత పెద్దగా ఆలోచించడం లేదు. నాలందాను ఒక సాంస్కృతిక కేంద్రంగానో లేదా ఒక తాత్విక కేంద్రంగానో చేయాలనే ఆలోచన తప్ప ఒక ఆధునిక మొదటి తరగతి విశ్వవిద్యాలయంగా దిద్దాలనే కోర్కె అంతగా లేనట్టుంది. ఈ ఆర్థిక గణాంకాలు ఏ యేల్ విశ్వవిద్యాలయం, హార్వర్డ్, కొలంబియా విశ్వవిద్యాలయాల వ్యయంతో చూస్తే ఏ మూలకు సరిరావు. ఒక సాహసోపేతమైన దృష్టిని సారించవలసి ఉంటుంది. ఈ పునర్నిర్మితమయ్యే నాలందా విశ్వవిద్యాలయం ప్రాచీన నాలందాలాగే, ఒక బౌద్ధిక (Intellectual) కేంద్రంగా ఉండాలి. ఇలా సాధించడం దుర్లభం. ఈ రోజుకు గూడ ఆసియా విశ్వవిద్యాలయాలు అత్యున్నత స్థాయికి చేరాలంటే, అవి ఇంకా ఎంతో దూరం పయనించాల్సి ఉంది. ప్రపంచంలోని మొదటి 25 విశ్వవిద్యాలయాలలోకి ఒక్క టోకియో విశ్వవిద్యాలయం మాత్రమే చేరుతుంది, అని న్యూస్ వీక్ రాసింది. ది టైమ్స్ ఆఫ్ లండన్ పత్రిక ఏమో మొదటి 25 విశ్వవిద్యాలయాలలో, పాశ్చాత్యేతర విశ్వవిద్యాలయాలు మూడు మాత్రమే ఉన్నాయి అంది.

ప్రాచీన నాలందా, బహుశా ప్రపంచంలోనే మొదటిగ ప్రవేశ పరీక్ష (entrance exams) లు నిర్వహించిన విశ్వవిద్యాలయమై ఉండవచ్చు. ఈ విశ్వవిద్యాలయంలో గణిత సిద్ధాంతాలలో, ఖగోళంలో నూతన ఆవిష్కరణలు చేసిన ఆచార్యులు ఉన్నారు. అనేక భాషలలోకి, మత గ్రంథాలను అనువదించిన, వ్యాఖ్యానించిన ఆచార్యులనేకమంది ఉన్నారు.

ఈ నూతన నాలందా విశ్వవిద్యాలయం, పాత నాలందాకు ఉన్న ప్రపంచ దేశాలతోటి ఉన్న సంబంధాలను తిరిగి పట్టుకోవాలి. ప్రపంచంలో ఉన్న నేటి ఉన్నత విద్యా సంస్థలన్నీ, విద్యార్థులలో,

అచార్యులలో, పరిశోధనలో, పాఠ్యాంశాలలో ఇంక ఇంక అంతర్జాతీయతను సంతరించు కోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని ఆసియా విశ్వవిద్యాలయాలు ఈ పరంగా ఎంతో వెనకపడి ఉన్నాయి. శిథిలాల నుంచి ప్రారంభమవబోయే ఈ నాలందా సంస్కృతుల, జాతుల సమ్మేళనంలో విశ్వమానవాళిలోకి శక్తిని, దిశను చొప్పించడానికి, నిజమైన అంతర్జాతీయ నాయకులను తయారు చేయడానికి, ఒక ఆదర్శవంతమైన విశ్వవిద్యాలయంగా కావాలి.

ప్రాచీన కాలంలో నాలందా ఒక బౌద్ధ విశ్వవిద్యాలయమే కావచ్చు. కాని అది, ఆ మతాన్ని వివిధంగా వ్యాఖ్యానించడానికి గూడ అది సహనాన్నే ప్రదర్శించింది. వివృత మనస్కగా ఉంది. దాని మౌలిక స్ఫూర్తికి అనుగుణంగా, ఈ రోజు అది ప్రపంచ పరిమాణంలో మతాల సమైక్యతకు అంకితమైన ఒక సంస్థగా రూపొందగలదు.

ఇవ్వాళ నాలందాకు ఒక మంచి అవకాశం ఉంది. అదేమంటే అనేక ఉన్నత విద్యా సంస్థలలో ఏది కొరవడిందో, దానిని ఇది కొల్లగొట్టాలి. పేదలకు ఆరోగ్యాన్ని చేకూర్చే వైద్య సంస్థలు. అంతర్జాతీయ చట్టాలను నొక్కి చెప్పే న్యాయ కళాశాలలు, రేపటి మధ్య తరగతిగా మారగల శక్తి ఉన్న, రోజుకు రెండు డాలర్లతో కుక్షి నింపుకొనే బిలయన్ల జనం మీద దృష్టి నిలపిన వాణిజ్య కళాశాలలు, ప్రపంచ పరిసర సమస్యల మీద దృష్టి నిలపే విద్యా సంస్థలు అన్నీ గూడ నాలందా కొల్లగొట్ట వలసిన వాటిలో ఉన్నాయి. ఆసియా ఈ పని విజయవంతంగా చేయగలదా? ఆర్థికంగా చూస్తే ఇది తేలికే. చైనా విదేశీ నిల్వలు ప్రపంచ రికార్డులనే బద్దలు కొట్టాయి. 1 ట్రిలియన్ డాలర్లకు అవి చేరాయి. జపాన్ రొఖ్కం పర్వతం (mountain of cash) ఎంతో వెనక పడి లేదు.

అసలు సమస్య ఎక్కడుందంటే సరైనా ఆలోచన, సంకల్ప బలం. తమ లాభాల కోసం ప్రపంచ లాభం కోసం జరిగే వాణిజ్య ఒప్పందాలు తప్ప, మరి దేనికైన ఒక నిర్దిష్ట కార్యక్రమం వెనకాల ఐక్యంగా నిలబడడానికి సిద్ధంగా ఆసియా దేశాలు ఉన్నాయా అనేది స్పష్టం కాలేదు. "గొప్ప భావనల నుంచి, వాటిని ఉత్పాదం చేసిన వారి నుంచి నిజమైన బలం వస్తుంది. విశ్వవిద్యాలయాలు నిజమైన శక్తి కేంద్రాలు" - ఈ విషయాన్ని ఆర్థిక సముత్పన్న శక్తి, మహా సేనా వాహినులతో కూడి ఉన్న ఆసియా దేశాలు అర్థం చేసుకొంటాయా? ఈ అంచనాలలో నేను తప్పితే సంతోషిస్తాను. ఈ నాలందా పునర్నిర్మాణం ఒక మంచి పరీక్ష.

Courtesy : New York Times, December 9, 2006. Jeffrey E. Garten, former - dean of the Yale School of Management, is a professor of international trade and finance there.



## అమెరికన్ ధర్మప్రవర్తకుడు

# కల్నల్ హెచ్.ఎస్.ఆల్కాట్

- 'శ్రీ విరించి'

శ్రీలంకలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 17 తేదీన కంచుదీపాలు వెలిగించి ఒక అమెరికన్ బౌద్ధ ప్రవర్తకుడికి సాంబ్రాణి పొగలతో నివాళులు సమర్పిస్తారు. 'థేరవాద' ఆలయాలలో ఆయన చిత్రపటం ముందు సగౌరవంగా ప్రణామం చేసి తమ కృతజ్ఞతలు తెలుపుకుంటారు. ఆ ద్వీపంలోను, యితర ఆసియాదేశాలలోను బౌద్ధమతానికి ఒక సమన్వయం కూర్చిన మహనీయుడుగా చెప్పుకొంటారు. చరిత్రకారులు ఆయనను 'దివ్యజ్ఞాన సమాజం' (The Theosophical Society) కి వ్యవస్థాపక అధ్యక్షుడుగా మాత్రమే చెప్పుకొంటారు. ఆయన భారత పునరుజ్జీవనానికి, బౌద్ధమత పునర్వికాసానికి, ప్రపంచ మతాలన్నిటి ఏకత్వ ప్రతిపాదనకు అవిరళంగా పనిచేశాడు. హెన్రీస్టీవ్ ఆల్కాట్ (1832-1907) సాహసోపేతమైన జీవితాన్ని గడిపినవాడు. చిన్నతనంలోనే వ్యవసాయ రంగాలలో విలువైన మార్పులు తేవడం, 'స్పిర్చువలిజమ్' పేరుతో ప్రపంచ వ్యాప్తంగా బయలుదేరిన ప్రభంజనాన్ని ఆధ్యాత్మ రంగం వైపు మళ్లించడం, నిజాయితీకి - నిష్కళంక ప్రవర్తనకు ప్రతీకగా నిలవడం - ఆయన సాధించిన కొన్ని అసాధారణ కృత్యాలు.

1879లో బొంబాయి నగరానికి చేరుకున్న కల్నల్ ఆల్కాట్ ఆ మరు సంవత్సరమే కొలొంబో నగరాన్ని సందర్శించాడు. తన ఆధ్యాత్మ సహవాసి అయిన మేడమ్ బ్లావట్స్కీతోపాటు (1831-1991). కీర్తి కాంతులు అప్పటికే ప్రపంచ వ్యాప్తం అవడం వల్ల వారికి రాజమర్యాదలతో స్వాగతం లభించింది ఆ మహానగరంలో. మే 25, 1880 న గల్లె (Galle) లోని విజానంద మోనాస్టరీలో బుద్ధుని బృహత్ విగ్రహం ముందు నిలబడి యిద్దరూ పాళీభాషలో 'త్రిరత్నాలను, 'పంచశీల'ను ఉద్ధరించి బౌద్ధులుగా మారిన యూరోపియన్ - అమెరికన్ల శ్రేణిలో ప్రథమ పంక్తిలో చేరారు. 'మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు ఆమోదించ వలసి వచ్చినట్లయితే మేం పంచశీల తీసుకు వుండే వాళ్లం కాదు. పది నిమిషాలైనా అక్కడ నిలచేవాళ్ళం కాదు. మాది శాక్యముని గౌతమ బుద్ధుని పంథాకు చెందిన పవిత్ర తత్వం. ఆర్యుల ఉపనిషద్ విజ్ఞానానికి, ప్రపంచంలోని యే ఇతర ప్రాచీన మత తత్వానికి వ్యతిరేకమైనది కాదు ఇది అన్నాడు ఆయన. అప్పటికే బౌద్ధమత సంప్రదాయాలలో నెలకొన్న కొన్ని రుగ్మతలను ఆయన విప్పి చెప్పగలిగాడు. బౌద్ధ విజ్ఞానాన్ని శుద్ధంగా, పవిత్రంగ ప్రచారం చేయడం కోసం ఏడు శాఖలను, ఒక ఆశ్రమాన్ని కూడ స్థాపించగలిగాడు. క్రిస్టియన్ మత ప్రచారధోరణులు సామాన్య ప్రజలను 'మతమార్పిడి'కి గురిచేయకుండా ఈ శాఖలు ఉపకరించాయి. సింహళ బాలబాలికల కోసం కొన్ని బుద్ధిష్ట్ సెకండరీ స్కూళ్ళు, ఆదివారం తరగతులు యేర్పాటు చేసి సింహళంలో పాశ్చాత్య రీతులలో బుద్ధ సంప్రదాయ ప్రచారం జరిపించాడు. ఎందరో బౌద్ధ సన్యాసులకు బాసటగా నిలిచాడు. హిక్కదువే సుమంగళ (Hikkaduve Sumangala) ఈయనకు అత్యంత ఆప్తుడు అయినాడు.

1881లో రెండవమారు సింహళం వెళ్ళినప్పుడు ఆయనకు మోహత్తివత్తె గుణానంద (Mohottivatte Gunananda) సహకారం కూడా లభించింది. ఇద్దరూ కలిసి ఎనిమిది నెలలపాటు

డా॥ ఎన్.సి. రామానుజాచారి, థియోసాఫికల్ సొసైటీ భారతశాఖకు జాయింట్ జనరల్ సెక్రటరీ, 'శ్రీ విరించి' గా ప్రసిద్ధులు, డైరక్టర్ ఆఫ్ స్టడీస్, అంతర్జాతీయ కేంద్రస్థానం, అడయార్, చెన్నై

అతడే నిర్మాణం చేసుకున్న 'ఎద్దులబండి' లో పడమట దేశం అంతా సంచరించారు. ఈ బండి విన్యాసాన్ని, చూడడానికే సింహాళీయులు వేనకువేలు ఆతురతగా పోగయ్యేవారట. చదువుకునేగది, పుస్తకాల అలమరలు, వంటగది, వాననుంచి రక్షణ యేర్పాట్లు .. ఇవన్నీ ఆ బండిలో భాగమే. సింహాళ బాలబాలికల విద్యాభివృద్ధికి ఆయన 'నేషనల్ ఎడ్యుకేషన్ ఫన్డ్' స్థాపించి ఆ కార్యక్రమాలన్నీ పర్యవేక్షించాడు. ద్వీపంలో వున్న మూడు తెగల బౌద్ధులు ఆయన సంస్కరణోద్యమాలకు దోహదం చేశారు. వారిని సమీకరించడం లోనే ఆయన చాకచక్యం ద్యోతక మవుతుంది. జన సామాన్యంలో వున్న దురభిప్రాయాలను పాక్షిక ధోరణులను తొలగించడంలో కృతకృత్యుడయ్యాడు. ప్రశ్నలు-జవాబులు (Catechism) రూపంలో బౌద్ధ ధర్మ సూత్రాలను క్రోడీకరించి, నిష్కళంక ప్రచారం చేయగలిగాడు. ఆయన సమీకరించిన 'ది బుద్దిస్ట్ కేటకిజమ్' అనే చిన్న పుస్తకం నలభై పైబడ్డ పునర్ముద్రణలు పొందింది. అంతే కాక, ఇరవై ఎనిమిది ప్రపంచ భాషలలోనికి తర్జుమా అయింది. దీని ప్రథమ ముద్రణ **24 జులై 1881** తేదీన, ఇంగ్లీషు, పాళీ భాషలలో. అది యిప్పటికీ సింహాళ పాఠశాలలో అమలులో వుంది. ఈ పుస్తకం క్రిష్టియన్ మత ప్రచారానికి 'అడ్డుకట్ట'గా చక్కగా ఉపకరించింది. శరీర రుగ్మతలను తొలగించి మిషనరీలు సామాన్య జనాన్ని క్రిష్టియన్ మతంలోనికి మార్పిడి చేయడం గమనించి, 'బుద్ధుని పేరుతో మీరు యిటువంటి ఆరోగ్య ప్రయోగాలు చేసి ఆ దురాగతాలను ఆపుచేయండి' అని బౌద్ధ సన్యాసులను ప్రోత్సహించాడు. తానే స్వయంగా అనేక రుగ్మతలకు చికిత్సలు చేసి - మెస్మరిజమ్, స్పిరిచువల్ హీలింగ్‌ల ద్వారా - దారి చూపించాడు. వేలసంఖ్యలో ఆయనకు అనుయాయులు ఏర్పడ్డారు. మిషనరీ క్రిష్టియన్లకు బౌద్ధ ఆశ్రమాలకు మధ్య యేర్పడు తగాదాలలో ఆయన జోక్యం ప్రజా శ్రేయస్సుకు ఎంతగానో ఉపకరించింది. బౌద్ధమత ధర్మ పరిరక్షణకు ఆల్కాట్ చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల నుంచి, 'బౌద్ధ పంచశీల' స్వీకరించగల అధికారాన్ని కూడా దత్తం చేశారు. ఇటువంటి అధికారం పొందిన పాశ్చాత్యులలో ఈయనే ప్రథముడు.

ఆల్కాట్ తన జీవిత కాలంలో సింహాళద్వీపానికి ముప్పయి ఏడుసార్లు వెళ్ళాడు. ఒక్కో సంవత్సరం రెండు మూడు మార్లుకూడా వెళ్ళవలసి వచ్చిందట, అక్కడి కార్యకలాపాలు సమీక్షించటానికి, సమీరకించటానికీని. తనే కాకుండా కొంతమంది పాశ్చాత్యులను అక్కడికి పంపి విద్యాభివృద్ధికి దోహదం చేశాడు. బుద్ధిస్ట్ స్కూల్స్‌కు మేనేజర్‌గా పి.డబ్లు. లెడ్ బీటర్‌ను పంపాడు. **1889**లో ఈయన బుద్ధిస్ట్ హైస్కూల్ ప్రారంభించాడు. ఇదే దామిలా 'ఆనంద కాలేజి'గా రూపుకట్టుకుంది. ఎఫ్.ఎల్. ఉడ్‌వర్డ్ అనే ఆయన్ను పంపి 'గల్లె'లో మరొక హైస్కూల్ స్థాపింపచేశాడు. ఇదే ఇప్పటి 'మహీంద్ర కాలేజ్'. దేశ పురోభివృద్ధికి స్త్రీల సముద్ధరణ అవసరం అని గుర్తించి **1889**లో 'నారీ శిక్షాదానసమితి' నెలకొల్పాడు. మిసెస్ కె.ఎస్. పికెట్ అనే ఆమె దీనిని నడిపింది, ఆమే బుద్ధిస్ట్ కాలేజికి ప్రథమ ప్రిన్సిపల్. ఈమె తరువాత వచ్చిన మిస్ మేరీ మూసెస్ హగ్గిన్స్ మరో బాలికల కాలేజి స్థాపించింది. ఈ విద్యాలయాలన్నీ యిప్పటికీ సింహాళంలో ఉన్నత ప్రగతికి మార్గదర్శకంగా ఉన్నాయి.

బౌద్ధ ధర్మానికి ఆయన చేసిన సేవలలో అతి ముఖ్యంగా చెప్పుకోవలసినది అప్పుడు దేశంలో పరస్పర శత్రువులుగా భావిస్తున్న 'మూడు శాఖల'ను ఏకీకరణం చేయడం. ముగ్గురూ బుద్ధ ధర్మాన్నే ప్రచారం చేస్తున్నా, వారి మార్గాలు - పద్ధతులు వేరువేరుగా వుండడం ఒకరంటే మరొకరికి పడకపోవడం "ఆల్కాట్‌కు 'విడ్డూరం' అనిపించింది. ముగ్గురికీ అనుసరణీయంగా ఆయన ఒక పతాకాన్ని కూడా ఏర్పాటుచేశాడు. దీని రూపకల్పనకు ఒక 'కమిటీ'ని నియమించి, అందరికీ ఆమోదయోగ్యం అయిన తీరులో పతాకాన్ని ఆవిష్కరించడమేకాక, దానిని ప్రపంచ వ్యాప్తం చేశాడు. ప్రజాభిప్రాయాన్ని

సమీకరించటానికి ఒక వార్తాపత్రిక వుండడం అవసరం అని ఉద్బోధించి 'సరసవి సందరేశ' అనే పత్రిక యేర్పాటుకు సహాయపడ్డాడు. పాళీ భాష లోనే కాకుండ, దీనికి ఇంగ్లీషు సప్లిమెంట్ కూడా చేర్పించాడు. అధికారులలో లంచగొండితనం, కుమార్గ ప్రవర్తన తగ్గించటానికి ఈ పత్రిక సహాయపడింది.

మహాయాన, తేరవాద వర్గాలకు అంగీకారంగా వుండే 'బుద్ధిస్ట్ ఫండమెంటల్ బిలీఫ్స్' (బుద్ధ ధర్మ ప్రాధమిక సూత్రాలు) అక్టోబర్ 1891లో వెలువరించి అందరినీ ఒక తాటికిందకు తీసుకువచ్చాడు. అదే సంవత్సరం 'బుద్ధగయ మహాబోధి సొసైటీ'ని నెలకొల్పాడు. దీనికి 'ధర్మపాల' జనరల్ సెక్రటరీ అయితే, వెనెరబుల్ సుమంగళ అధ్యక్షులు. కల్నల్ ఆల్కాట్ డైరెక్టర్‌గా, ప్రధాన సలహాదారుగా పై యెత్తున వుండేవాడు.

చేయవలసిన పనులను సూచించడం, వ్యక్తులను నియోగించడం, వారి నైపుణ్యాన్ని పెంపొందించడం ఆయన పద్ధతి. తన సమయం, ధనము, సేవ వాటి కోసం వినియోగించేవాడు. కానీ పెత్తందారీ తనం వహించేవాడు కాదు. ఒక ఆదర్శనాయకుడి లక్షణాలు ఆయనలో మూర్తీభవించి వుండేవి.

*ఆయన ప్రతిపాదించిన 14 బౌద్ధమత ధర్మ సూత్రాలు యిలా ఉన్నాయి:*

1. బౌద్ధులు సర్వమానవులపట్ల సహనము, నిగ్రహము, సోదర భావము చూపాలి. అలాగే జంతు వర్గం పట్ల కూడా దయచూపాలి.
2. విశ్వం పరిణామం చెందింది గాని సృష్టింపబడలేదు. విశ్వమంతా ఒక ధర్మానికి కట్టుబడి నడుస్తుంది గాని ఎవరో దేవుడి దయ వల్ల కాదు.
3. బుద్ధ ధర్మం సహజ సత్యాల మీద ఆధారపడివుంది. అనేక కల్పాల నుంచి యీ ధర్మం బుద్ధుల వల్ల ప్రవర్తింప బడుతోంది. 'బుద్ధుడు' అంటే 'ఆధ్యాత్మ దర్శనం' పొందినవాడు అని అర్థం.
4. ఈ 'కల్పం'లో నాలుగవ ఆధ్యాత్మ గురువు శాక్యముని అయిన గౌతమ బుద్ధుడు. భారతదేశంలో సుమారు 2500 సంవత్సరాల క్రితం ఒక రాజవంశంలో జన్మించాడు. చరిత్రలో ఆయన పేరు 'సిద్ధార్థ గౌతముడు.'
5. శాక్యముని బోధ : అజ్ఞానం కోరికలను జనింపచేస్తుంది. తీరని కోరికలవల్ల జన్మ పరంపరలు వస్తాయి. ఈ పరంపరలే దుఃఖానికి మూలం. దుఃఖ నివారణ జరగాలంటే జన్మరాహిత్యం కావాలి. అంటే కోరికలను అంతమొందించుకోవాలి. అందుకు అజ్ఞానం నుంచి బయటపడాలి.
6. అజ్ఞానం వల్లనే పునర్జన్మ తప్పనిసరి అనే అభిప్రాయం యేర్పడుతుంది. అజ్ఞానాన్ని నాశనం చేసుకున్నప్పుడు, పునర్జన్మల అవసరం - అవకాశం మరి వుండదు. అజ్ఞానం వల్లనే మనిషికి ఒకే జన్మ వున్నదనీ, దీని తరువాత సుఖమో దుఃఖమో - యే మాత్రం మార్చలేనిది -కలుగుతుందనీ దురభిప్రాయాలు యేర్పడుతాయి.
7. అనుదిన వర్తనంలో పరోపకార పారీణత, వివేకం, ఆలోచనలలో మెలుకువ, ఇంద్రియ లాలసను తొలగించుకోవడం అవసరం. వీటిని చక్కగా అభ్యాసం చేయాలి.
8. జీవించాలనే కోరిక పునర్జన్మకు కారణం అవుతోంది గనుక, ఆ కోరిక నశిస్తే అప్పుడు ధ్యాన ప్రక్రియల ద్వారా పరిపూర్ణత పొంది మానవుడు నిర్వాణ స్థితిని అందుకుంటాడు.

9. శాక్యముని బోధన మేమంటే - నాలుగు పరమ సత్యాల ఉపాసన ద్వారా దుఃఖ నివారణ చేసుకోవచ్చు. అవి : దుఃఖం ఉన్నదనే ఎఱుక, దుఃఖానికి కారణం (మూలం) కోరిక. దుఃఖ నివారణం సాధ్యం. ఈ సాధ్యత అష్టాంగ మార్గం వల్ల సమకూరుతుంది.
*అష్టాంగ మార్గం:* సమ్యగ్ (సగ్రము, సక్రమము అయిన) విశ్వాసం, ఆలోచన, వాక్కు, క్రియ, జీవనం, కృషి, స్మృతి, ధ్యానం.
10. సరయిన ధ్యానం వల్ల ఆధ్యాత్మ వికాసం (దర్శనం) సాధ్యం అవుతుంది. ప్రతి మనిషి లోను వున్న 'బుద్ధ' తత్వానికి పెంపుదల సమకూరుతుంది.
11. *బౌద్ధ ధర్మ సారాంశం :* చెడు చేయకుండా వుండడం; మంచి చేయడం నేర్చుకోవడం, హృదయాన్ని పవిత్రంగా ఉండనివ్వడం.
12. విశ్వం సహజమైన కర్మప్రక్రియలపైని నడుస్తోంది. వెనకటి మంచి-చెడు ప్రస్తుతాన్ని నియమిస్తాయి. మనిషి తన ప్రస్తుత స్థితి గతులకు - అనుభవాలకు వెనకటి చర్యలే కారణం.
13. సుకర్మను అడ్డగించకుండా యీ క్రింది కార్యకలాపాలు అభ్యసించాలి. హింస చేయకపోవడం. దొంగతనం చేయకుండా వుండడం. ఇంద్రియ లాలసలో మునగకపోవడం. అబద్ధాలు చెప్పకపోవడం. మాదక పదార్థాలు పానీయాలు తీసుకోకుండా వుండడం. మరో అయిదు యిలాంటి సూత్రాలే వున్నాయి. అవి తగినంత పరిశ్రమ చేయాలనే పూనిక వున్నవారికి మాత్రమే అనుసరణీయం.
14. బౌద్ధం ధర్మం మూఢనమ్మకాలను పరిత్యజించమంటోంది. గౌతమ బుద్ధుని ఆదేశం ప్రతివారూ శాస్త్రవిజ్ఞానం, సాహిత్య స్పృహ కలిగి వుండాలని. ఇతరులు చెప్పినది, పుస్తకాలలో వున్నదీ, సంప్రదాయం అనుకునేదీ తనంత తనకు యుక్తం, తార్కికం అనిపిస్తేనే నమ్మాలి, ఆచరించాలి.

- ఈ సూత్ర ప్రణాలికను ఆల్కాట్ రూపొందించి తన సంతకం నమోదు చేశాడు. దేశ దేశాలలోని మతాచార్యుల ఆమోదం కోసం విన్నవించాడు. 1891 జనవరి 8నుంచి 12 వరకు అడయారులో జరిగిన బౌద్ధ సమ్మేళనంలో హాజరయిన యీ నలుగురు మతాచార్యులు తమ సమ్మతి తెలుపుతూ సంతకాలు చేశారు : జపాన్ కోజెన్ గుణ రత్న, బ్లెజో తోకుజవా; బర్మా- యిహమో త ఆంగ్; సిలోన్-దర్మపాలహేవ వితరణ; చిట్టిగాంగ్-మాష్కుకృష్ణ చంద్ర చౌదరి తరఫున మాంగ్ ధర్వే.

బర్మాలో యితర మతాధికారులు 23 మంది ఫిబ్రవరి 1891, 3 తేదీన తమ ఆమోదం నమోదు చేశారు.

సింహళంలోని అయిదుగురు మతాచార్యులు ఫిబ్రవరి 1891, 25 తేదీన, జపాన్‌లోని తొమ్మిది మంది మతాచార్యులు, చిట్టిగాంగ్‌లోని ఇద్దరు మతాచార్యులు కూడా సంతకాలు చేశారు.

ఈ ప్రకటనవల్ల బౌద్ధం ధర్మంలోని విభిన్న మార్గాలవారు తమలోతాము తగాదాలు పడడం, వ్యతిరేకతలు ప్రదర్శించడం సమసిపోయింది. ఒకే ధర్మానికి చెందిన విభిన్న - వివిధ దేశాలవారు ఇలా సమరసంగా ఒక అవగాహనకు రావటానికి, తద్వారా మూల తత్వాల బహుళ ప్రచారం, అనుశీలన జరగటానికి ఆల్కాట్ ఎంతో శ్రమించి సాధించాడు. తాను చరితార్థుడు అవడమే కాకుండా చారిత్రకూ సమున్నత సార్థకత చేకూర్చాడు.

# బౌద్ధ దర్శనం - సామాజిక ప్రయోజనం

- ముంగర జాషువ

కవితాకళ అయినా, మరే ఇతర లలిత కళలైనా, అస్తిత్వవాదం, భౌతిక వాదం, భావ వాదం, నాస్తిక వాదం లాంటి ఇంకే ఇతర వాదాలయినా సామాజిక ప్రయోజనం కలిగి వుండాలి అనేది నిర్వివాదాంశంగా కనిపిస్తుంది. అయితే వ్యక్తి వికాసానికి ప్రాముఖ్యతనిచ్చి, తద్వారా సామాజిక ప్రయోజనాన్ని సాధించడం బౌద్ధం యొక్క విశిష్టతగా గుర్తించవలసిన ఆవశ్యకత వుంది.

అయితే, సామాజిక ప్రయోజనం లేకుండా, కేవలం సౌందర్యాత్మకంగా ఉండే కళలూ, కేవలం చర్చలకు, వాదోపవాదాలకు, తార్కిక ప్రతిభకు, గ్రంథాల వరకు పరిమితమైన తాత్త్విక సిద్ధాంతాలు అనేకం ప్రచలితం అయివున్నవి. అయితే వాటి ప్రయోజనాలు కూడా నిర్లక్ష్య పరచవలసినవి మాత్రం కాదు. ప్రస్తుతం బౌద్ధ దర్శనం అనుభవిక, ఆచరణాత్మక సఫల సిద్ధాంతంగా ఈనాడు ప్రపంచం ముంగిటిలో వుంది.

ఈ విధంగా భిన్న ప్రయోజనాలు, తార్కిక, ధార్మిక ప్రయోజనాలు కలిగినవి 'ఉనికి' కలిగివున్న నేపథ్యంలో బౌద్ధం ఆనాటి సమాజాన్ని ప్రభావితం చేసినట్లే, నేటి ఆధునిక సమాజాన్ని ప్రభావితం చేయగలదా? అనే సందేహం, సామాన్యుల్లో, మేధోజీవుల్లో కొంత చోటుచేసుకొని ఉన్నది. కనుక, ప్రస్తుత వ్యాసోద్దేశం బౌద్ధ దర్శనం వలన నేటి సమాజానికి కలిగే ప్రయోజనాన్ని స్థూలంగా పరిశీలించడమే !

విఖ్యాత తాత్త్వికుడు, జిడ్డుకృష్ణమూర్తి మనిషిలోని మత విశ్వాసాల గురించి ఒక మంచి మాటంటారు: "విశ్వాసం దౌర్జన్యానికి దారితీస్తుందని." ఎంతమంది తాత్త్వికులు ఎంత చెప్పినా, ప్రస్తుత సమాజం మతాన్ని వీడలేక పోతుంది. విశ్వాసాల పడగ నీడలో జీవిస్తుంది. మతం అన్ని అభివృద్ధి సూత్రాలకు అడ్డు గోడ అయినప్పుడు, నేటి సమాజం, ఎక్కువ భాగం మతం యొక్క ధృతరాష్ట్ర కౌగిలిలో నలిగి పోవడానికే నిశ్చయించుకొంది. అందువలన, ప్రతిక్షణమూ మతం మనిషిని నీడలా వెంటాడి, తన గుప్పిటలో నుంచి మనిషిని వదిలిపెట్టకుండా, తన కనుసన్నలలో తిప్పుకొనడం గమనార్హం. ప్రాచీన బౌద్ధానికి మత దృక్పథం లేదు. దార్శనిక స్వభావం కలిగిన ధమ్మాలు అనేకం వున్నవి. అందులో బుద్ధుడు చెప్పిన దొకటి మచ్చుకి "వినినంత మాత్రాన, తరతరాలుగా వస్తుందన్నంత మాత్రాన, అనేకమంది చెప్పారని, మత గ్రంథాలలో ఉన్నదని, గురువులు, పెద్దలు చెప్పారని నమ్మకుండా స్వయంగా గమనించి, విశ్లేషించి, సహేతుకమైన దానిని, సమాజానికి మేలు కల్గించే దాన్ని స్వీకరించి, ఆచరించాలి" అనేది. ఈ దృక్పథం అలవడితే వ్యక్తి వికాసం మత విశ్వాసాలకు దూరంగా ఏర్పడుతుంది.

క్రైస్తవ, ముస్లిం మతాలకు 'విశ్వాసాలే' ప్రాతిపదిక. ఈ రెండు మతాలకు తాత్త్విక నేపథ్యం లేదు. జైన మతానికి తాత్త్విక నేపథ్యం ఉన్నప్పటికీ, ఆచరణలో అది అతి క్లిష్టత కలిగిస్తుంది. హిందూమతం 'ప్రతీకలు' పై ఆధారపడివుంది. ఉపనిషత్‌లు భావ వాదానికి, దర్శనాలు కొంత భౌతిక వాదానికి ప్రాముఖ్యతనిచ్చాయి. అయితే 'స్థితి శీలత' గలిగిన అద్వైత తత్త్వమే ప్రధాన సూత్రధారిగా నిలిచింది. హిందూమతం వర్ణవ్యవస్థను సమర్థించడమూ, ఆచరించడమూ ఆ మతం యొక్క బలమైన బలహీనత.

---

ముంగర జాషువ, కెనాల్స్, "గీతిక" హిల్‌కాలని, నల్లగొండ జిల్లా.

ఇటువంటి నేపథ్యంలో బౌద్ధం ఒక్కటే సమ దృష్టితో అన్ని వర్గాలను, వర్ణాలను సమీకరించింది. దీనికి తోడు మనో విస్తృతిని కలిగించే దార్శనిక విలువలు బౌద్ధంలో పుష్కలంగా ఉన్నవి. బౌద్ధానికి ఒక పార్శ్యం కొంత మత ధోరణి వున్నప్పటికీ, ఇంకొక పార్శ్యం బలమైన దార్శనిక స్వభావం కలిగి, అంతర్గతంగా వున్న మత స్వభావం కలిగిన బౌద్ధం సమాజానికి ప్రయోజన కారి కాగలదు.

బౌద్ధం తాత్త్వికాంశాలలో ముందున్నప్పటికీ, ఆధునిక, వైజ్ఞానిక సమాజానికి బౌద్ధం యొక్క అవసరం లేదనే వర్గం ఒకటుంది. ఆధునిక సమాజంలో మతం, యాంత్రికత, పచ్చి భౌతిక వాదం, సుఖ లాలసత్వం, వర్గ సంఘర్షణలు, వర్ణ ద్వేషాలు, ఆర్థిక అసమానతలు, ఇంకా అనేక రుగ్మతలు చోటు చేసుకొన్నవి. వీటి కారణంగా వ్యక్తి అనేక ఫోబియాలకు, భ్రమలకు, విభ్రమలకు, మానసిక వత్తిడులకు గురి అయి ఘర్షణామయ, వేదనామయ మార్గంలో పయనిస్తున్నాడనటం ఒక వాస్తవం. ఇటువంటి వైరుధ్యాలతో కూడిన వ్యక్తి, సమాజం, కాంతిమయ, శాంతిమయ మార్గం కోసం వెదుక వలసిన ఆవశ్యకత ఏర్పడింది. అందువలన, మానవీయ విలువలతో కూడిన బౌద్ధం వ్యక్తికీ, సమాజానికి 'తక్షణా వసరంగా' మారింది. అందువలన 2006లో వేలాదిమంది, బౌద్ధంలోకి మారడం రాబోయే ఒక గొప్ప సామాజిక పరిణామాన్ని సూచించే అంశమవుతుంది.

సామాజిక, మానసిక సంకీర్ణతల నుంచి కొంచెం వైదొలిగితే బౌద్ధం బోధించే శీల, సమాధి, ప్రజ్ఞలతో కూడిన అష్టాంగ మార్గము, పంచశీల, దశపారమితలు, చతురార్య సత్యాలు, ప్రతీత్య సముత్పాదం, అనుత్తర సమ్యక్ సంబోధి, చేతన విజ్ఞానం లాంటి అంశాలు, సమాజం యొక్క లోతుల్లోకి పయనిస్తాయనడం సత్యదూరం కాదు.

ప్రస్తుతం, అభివృద్ధి చెందుతున్న సమాజిక వర్ణాలు, దేశాలు, ఆర్జించడం తెలుసుకొన్నవిగాని, తర్కబద్ధమైన, సమగ్రమైన సామాజిక న్యాయం అనేదాన్ని దూరంగా విసరివేస్తున్నాయి. అందువలన పీడితవర్గం ఒకటి ఏర్పడి, పేలడానికి సిద్ధంగావున్న 'అణ్వాస్త్రంలా' సమాజం గుండెలపై కూర్చుని వుంది. ఈ వర్గానికి 'ఆయుధం' పట్టడమో లేక బుద్ధుని 'మధ్యేమార్గంతో' తమ ప్రయోజనాలను సాధించుకోవడమో తప్ప అన్యమార్గం లేదు. అయితే ప్రజా బాహుళ్యము 'సాయుధ విప్లవానికి' చాలాదూరం గనుక, బుద్ధుని 'శాంతిపూర్వక విప్లవాన్ని' అనుసరించి పరిష్కార మార్గాలను తమంతట తాము ఆచరించే సమయం ఎంతో దూరంలో లేదు.

మతం ఉగ్రవాదానికి, భూస్వామ్యవర్గం తీవ్రవాదానికి, అగ్రవర్ణం దళిత వాదానికి, పురుషాధిక్యత స్త్రీ వాదానికి జన్మనిచ్చి, మేధోమాంద్యం కలిగిస్తున్న తరుణంలో, బౌద్ధంలోని మౌలికమైన మనోవైజ్ఞానిక, తాత్త్వికాకంశాలను సమాజంలోకి సక్రమంగా, అంతర్లీనంగా ప్రవహింప జేయగలిగితే, ముఖ్యంగా విద్యారంగం లోకి ప్రవేశపెట్టగలిగితే 'చట్టం తనపని తాను చేసుకొని పోతుంది' అన్నట్లు, సమాజంలో ఆవశ్యకమైన, గణనీయమైన మార్పులు సంభవిస్తాయనడంలో సందేహంలేదు. అందువలన డా. అంబేడ్కర్ తాను బౌద్ధాన్ని స్వీకరించి, లక్షల మందితో స్వీకరింప జేశాడు.

జనం యొక్క దాహార్తిని తీర్చడానికి, కృష్ణా జలాలను అనేక చోట్లకు తరలించినట్లు, మానవ మానసాల్లోకి 'విపస్సన' ధ్యానాన్ని ప్రవేశపెడితే, మూసుకొన్న తలుపులు తెరుచుకొని, జిజ్ఞాస ఏర్పడి, కొత్తభావజాలం ప్రవేశించడానికి దారి ఏర్పడుతుంది. మత విశ్వాసాలతో, అనేక ముద్రలతో (im-

pressions) నిండిపోయిన మానస మందిరాన్ని 'ధ్యానం' శుద్ధి చేస్తుందనడంలో సందేహం లేదు. స్వల్పకాలిక ధ్యానం ద్వారా బుద్ధుని బోధనలు అవగాహనకు సులభతరమవుతాయి. మనిషికి బాహ్యదృష్టి అంతర్ దృష్టి అనేవి సమంగా సహజీవనం చేయాలంటే బౌద్ధాన్ని ఆశ్రయించవలసిందే! దానికి తగినంత మనోవిజ్ఞానం బౌద్ధంలో వుంది. ఈ ధ్యానాన్ని గురించి అన్నపరెడ్డి వేంకటేశ్వరరెడ్డి 'మానవీయ బుద్ధ' గ్రంథంలో ఈ విధంగా అన్నారు: "ధ్యానం రెండు విధాలు మొదటిది మనస్సును కేంద్రీకరించడం, రెండవది చైతన్యస్రవంతిలో పోయే దానిని, వచ్చే దానిని అలా నిర్లిప్తంగా చూస్తూ ఉండటం, మొదటిదానిని ఏకాగ్రత అంటారు, రెండవదానిని సతీ (mind fulness) అంటారు". ఈ విశ్లేషణ సులభతరంగా వుంది. ఇందువలన అధోచేతన నుంచి ఊర్ధ్వ చేతనకు పయనించడానికి ధ్యానం సాధనంగా, సహాయకారి ఔతుందనడంలో అతిశయోక్తిలేదు. అది జిజ్ఞాసను రగిలిస్తుంది. కూడా!

వ్యక్తికీ, సమాజానికి రెండు విషయాలు శత్రువులు. ఒకటి పేదరికం, రెండవది దుఃఖం. ఈ రెంటినీ ఒకచోట పేర్కొనడం వలన, పేదరికం వున్నచోట దుఃఖం వుందనిగాని ; దుఃఖం వున్నచోట పేదరికం వున్నదని గాని అర్థం చేసుకోగూడదు. ఈ రెంటినీ ఛేధించే ఆయుధాన్ని బౌద్ధం అందించ గలిగింది. అది మధ్యేమార్గం.

పేద, ధనిక దేశాల్లో వర్గాలను స్థూలంగా పరిశీలించినా, అవి ఆర్థిక, రాజకీయ, శృంగార భూమికల్లో జీవిస్తున్నవని తెలుస్తుంది. ధార్మికత్వం, సామాజిక న్యాయం అనే అంశాలకు విలువ ఇవ్వడంలేదు. నైతికత, మిగులు ఆర్థిక వనరుల పంపకం లాంటివి చాలావరకు మృగ్యం. ఈ అంశాలకు విలువ ఇచ్చినట్లు కనిపించినా అది పైపూత మాత్రమే! ఇటువంటి స్థితిలో సామాజిక న్యాయం జరగాలంటే బౌద్ధంలోని పలు అంశాలు తోడ్పడతాయి. ప్రాచీన భారతదేశ చరిత్ర - డి.డి. కోశాంబి పరిచయం' (అనువాదం కె. బాలగోపాల్) అన్న గ్రంథంలో "బుద్ధుడు వైదిక కర్మకాండను వ్యతిరేకించడంతో పాటు, నూతన వ్యవసాయక వర్గ సమాజానికి బౌద్ధం సమగ్రమైన దార్శనిక సిద్ధాంతం" అని అన్నారు. సామాన్య ప్రజ 'రాజకీయ మానవుని' సర్ప పరిష్వంగనను వదిలి, 'ధార్మిక మానవుని' అండ చేరవలసిన సమయం ఆసన్నమైంది.

మన మేధో సమాజంలో చాలా కాలం భౌతిక, భావ వాదాలు సంఘర్షించుకొన్నాయి. ఈ సందర్భంలో ప్రముఖ మేధావులు త్రిపురనేని గోపీచంద్, సంజీవదేవ్‌లు, భౌతిక, భావ వాదాలను సమన్వయించడం బుద్ధుని బోధనల వెలుగులోనే అనడం అసమంజసం కాదు.

వ్యక్తి వికాసంతోపాటు, సామాజిక ప్రయోజనాన్ని సాధించడమే బౌద్ధ దమ్మంలోని ప్రధానలక్షణం. వ్యక్తి వికాసం, సామాజిక అభివృద్ధి అనే అంశాలు పరస్పరాశ్రితాలు. ఈనాటికి గూడా బౌద్ధ దమ్మం కాంతిమయం, శాంతిమయం, జ్యోతిర్మయం, విజ్ఞాన మయం.

(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారు ఈ సంవత్సరం, జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించిన "బౌద్ధధర్మం-20వ శతాబ్దం తెలుగు సాహిత్యంలో బౌద్ధ ధర్మ సిద్ధాంతాలు" అనే అంశంపై ఏర్పాటయిన అంతర్జాతీయ సదస్సులో సమర్పించబడిన పరిశోధనా పత్రం - P.S.తెలుగుయూనివర్సిటీ వారికి కృతజ్ఞతలు - రచయిత)

# మనసు దారి మళ్ళించాలే కాని నిరోధించడం - నిగ్రహించడం కాదు

- మ. శివరామకృష్ణ

మనం సృష్టించుకున్న బుద్ధుడు, బౌద్ధధర్మం మన అంతరంగ అవసరాలని పట్టి, మన ఆ జీవితాను భవాలని పట్టి సృష్టించుకున్న బుద్ధుడు. ఇంతేకాదు : తరతరాల నుంచి వస్తున్న, బుద్ధుడి చుట్టూ అల్లుకున్న, అందమైన అవాస్తవాలు, భ్రమలు. వీటి నుంచి తప్పించుకోవాలన్న ఆందోళన. ఈ ఆందోళనకి కారణాలు మన ప్రస్తుత పరిస్థితులలో కోకొల్లలు. ఆర్థిక అసమానతలు, సాంఘిక వైషమ్యాలు, పెరుగుదల ఉన్నా దుర్భర పరిస్థితుల కొనసాగింపు, హింసా ప్రవృత్తుల ప్రజ్వలన. అన్ని చోట్లా, దాదాపు అన్ని రంగాలలోనూ కనిపిస్తున్న లంచగొండితనం... ఇట్లా ఎన్నో చెప్పుకోవచ్చు.

ఈ కారణాల వల్ల బుద్ధుడి హితోక్తులు మన జీవితంలో అన్వయం చేసుకోవాలంటే కొన్ని అనివార్యం అయిన వాస్తవాలని అంగీకరించాలి. మొట్టమొదటిది : ఈ ప్రపంచం ద్వంద్వాల ఇటుకల పైన నిర్మించబడినది. ఇది తిరుగులేని వాస్తవం. ఒకటి లేందే మరొకటి ఉండదు. ఉండటానికి వీల్లేదు. ప్రకృతి సృష్టి సూత్రం ఇది. ఉదాహరణకి అవతారాలని చూడండి : శ్రీకృష్ణుడి కాలంలోనే కంసుడు ఉన్నాడు. రావణుడి హయాంలో శ్రీరాముడు. మరి గాంధీజీకి గాడ్సే. జీసస్‌కి జూడాస్. సినిమాల్లో? వీరుడు ఉంటే ఆ వీరుణ్ణి వీరుడుగా చెయ్యాలంటే విలన్ అవసరం. అమితాబ్ ఉంటే అమ్రేశ్‌పురీ!

వీటిని మనం positive, negative అని వర్ణించుకుంటాం. అయితే ఇవి నీటిపైన గీతల్లాంటివి. కొన్ని పరిమితులు దాటితే ప్రకృతే వికృతి అవుతుంది. ఒక్కొక్కసారి negative కి ఎక్కువ ఉపయోగం ఉంటుంది. negative లేనిదే కెమెరాలో ఫోటో print రానేరాదు. Digital లో కూడా స్థూలంగా negative లేకపోయినా, ఆ సూత్రం మరొక రూపంలో ఉండే ఉంటుంది) ఆ అర్థరాత్రి గాంధీజీ ఆ రైల్వే కంపార్ట్‌మెంట్ నుంచి 'అమానుషంగా' బయటకు త్రోయబడకపోతే సత్యాగ్రహాస్త్రం రూపు దిద్దుకొనేది కాదు. 'ఆగ్రహం' కూడా అవసరమే. అయితే మహనీయులు 'శ్రీరామ్' అన్నట్లు ఆగ్రహం లాంటి "వికృయల్ని" 'అదుపు'లో ఉంచుకుని 'పొదుపు'గా వాడుకోవాలి.

ఇది ఒక వాస్తవం. రెండవది : ఎందరో మహానుభావులు, ఎన్నో బోధనలు, ఆధ్యాత్మిక ప్రక్రియలు, అంతరంగ పరివర్తనకి అందమైన గుళికలు. ఆ శ్రీకృష్ణుడి దగ్గర్నించి, ఈనాటి జిడ్డుకృష్ణమూర్తి దాకా ప్రపంచాన్ని "మార్చాలని" ప్రయత్నం. అయితే శ్రీకృష్ణుడు మనుషుల్ని మార్చాలని ఆవిర్భవించలేదేమో. "ధర్మాన్ని" రక్షించటానికి అవతార అవతరణ. ధర్మగ్లాని కారణం. అంటే సహజంగా చక్కగా ఉన్న చెట్టుకి చెదలు పుడితే చికిత్స చేస్తాం. ఇది సహజ ప్రకృతి ధర్మం. అట్లా అని, సమూలంగా, శాశ్వతంగా చెదలు నశిస్తాయా? ఇది అప్రాకృతం.

దీనికి సంబంధించినదే మూడవది : భగవంతుడి సృష్టి ఇది అని ఆస్తికుల విశ్వాసం. పైగా సర్వగుణాల సంపన్నుడు అని అన్ని మంచి గుణాలూ ఆయనకి ఆపాదిస్తారు. మరి అంతటా

---

ప్రొ. మ. శివరామకృష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల శాఖాచార్యునిగా పదవి విరమణ చేశారు. హైదరాబాదు.

గుణవంతుడి సృష్టిలో ఇన్ని అవకతవకలు ఉంటాయా? మృదువైన లేడి, రక్త పిపాసి అయిన పులి, సింహం! కనిపిస్తే చాలు కాటేసే తేలు ... అనంతం ఈ ఉదాహరణలు, మరి భగవంతుడు ఇటువంటివి ఎందుకు సృష్టిస్తారు? ఆఖరికి శ్రీకృష్ణుడు కూడా బాణం దెబ్బ తిని దేహత్యాగం; బుద్ధుడు కలుషిత ఆహారం తిని నిర్యాణం! cancer తో జిడ్డుకృష్ణమూర్తి. ఇన్ని అవక తవకలా? అంత దాకా ఎందుకు 1% అత్యంత ధనవంతులు 30% సంపదకి అధికారులు! మన ఆర్థిక శాస్త్రవేత్తలకి దీనికి ఒక కారణం ఉంది. మనం కారణాలు చెప్పచ్చు. కాని ఈ ధరణిని మార్చగలగటం అసాధ్యమేమో! మనం సృష్టించుకున్న భగవంతుడు - మనల్ని సృష్టించిన భగవంతుడు రెండింటికీ ఎంతో తేడా ఉంది. మన ప్రవృత్తుని పట్టి మన భగవంతుడి రూపాలు. మవం అనుకున్నట్లు, మన దృష్టిలో ఏది మంచిదో అది కాపాడాలని, ఏది చెడ్డదో దాన్ని శిక్షించాలని మన తత్వశాస్త్ర, మతపరమైన ఆలోచనలన్నీ అసలు సర్వగుణసంపన్నుడైన ఆ భగవంతుడి సృష్టిలో ద్వంద్వాలు దేనికి? పైగా, ప్రయోజనం లేని, ఉపయోగ రహితమైనది సృష్టిలో ఉంటుందా?

ఈ నేపథ్యంలో దుఃఖ నివృత్తి పట్ల బుద్ధ భగవానుడి తత్వాన్ని అర్థం చేసుకోవాలి. దుఃఖనివృత్తి దేనికి? సుఖప్రాప్తికి అంటాయి మతాలన్నీ. ఇది సహేతుకం, సమంజసం. అయితే దుఃఖం పోగానే సుఖం వస్తుందేమో, గాని స్థిరమైన శాంతి రాదేమో! మొదట ఒక విషయాన్ని గమనిద్దాం. ఏ ప్రయోజనం లేకుండానే ప్రకృతి ('భగవంతుడు' నచ్చని వాళ్ళకి ప్రకృతి పర్యాయపదం) సృష్టిస్తుందా? "దారిపక్క గడ్డిపూలు తొంగిచూస్తుంటాయ్" అన్నాడు. మన కంటికి ఆనని, గడ్డిపూల గురించి, ఒక కవి. మరి గడ్డి పశువులకి మేతే కాదు అవి వాటికి Dunlopillo లు! "Bed and boardingd" వాటికీ ఒకటే అంటారు 'శ్రీరామ్'. ఇక దుఃఖం సంగతి చెప్పాలా? అయితే ఒక పక్క శోకం నుంచి శ్లోకం వస్తుందంటాం. మరి శోకం పోతే శ్లోకం అదృశ్యం! పైగా ఆనంద భాష్పాలు ఇవి అని సినిమాల్లో గ్లిసరిన్ కన్నీళ్ళకి కారణాలు చెపుతారు తాము కాని తమ పాత్రల ప్రకారం నటించే నటులు, నటీమణులు!

ఎన్నో రకాల దుఃఖాలు. మనిషికే కాదు. సమస్త ప్రకృతిలో ప్రతీ అణువుకి దానికి తగ్గ దుఃఖం దానికి ఉంది. నారుమళ్ళు చేతపట్టి పీకి వేరేచోట నాటువేస్తారు. "మమ్మల్ని ఈ విధంగా హింసిస్తున్నారు. ఈ కిరాతకులు!" అని అవి అనుకుంటాయేమో! మనం ఒక్కసారి స్నానం చేస్తే ఎన్ని క్రిములు నశిస్తాయో... ఈ విధంగా ఆలోచిస్తే ప్రకృతి అంతా అహింసని తోసిపుచ్చి, హింస రాజ్యం ఏలుతుంది అనిపిస్తుంది.

ఇవన్నీ చూస్తే బౌద్ధ ధర్మం యొక్క మౌలిక తత్వం కొంత తెలుసుకోవచ్చు. దీన్ని వివరిస్తూ ఈ మధ్యనే ప్రచురణ జరిగిన తన పుస్తకం 'The Great Transformation' లో Karen Armstrong వ్రాసింది : బుద్ధుడు తన మనసుని నిశితంగా పరిశీలించి అది ఎంత శక్తిమయమో, ఎంతగా అణగ దొక్కాలని ప్రయత్నించినా, లొంగదో తెలుసుకున్నాడు. ఇంత అనూహ్యమైన శక్తి మనసుకి ఉంటే దాన్ని లొంగదీసుకొనటం కన్నా "మచ్చిక చేసుకుంటే" సరైన దారికి వస్తుంది కదా. అలజడితో నిండిన

మనసుకి ఎంత శక్తి ఉన్నదో, ప్రశాంతంగా ఉన్న మనసుకి కూడా అంతే శక్తి. అందువల్లనే ఆ శక్తి gear మారిస్తే అదే మన శ్రేయోభిలాషి అవుతుంది. మిగతా యోగ పద్ధతులని బుద్ధుడికి ఇక్కడే తేడా. స్థూలంగా చెప్పాలంటే "నిరోధించటం, నిగ్రహించటం కాదు - దారి మళ్ళించటం, బుద్ధుడి మార్గం".

ఈ విషయాన్ని వివరిస్తూ Armstrong అంటుంది : Buddha "did not stop at contem plating these negative truths, he also fostered the more 'skillful' (kusala) states while performing the yogic exercises, sitting cross-legged, and practicing the breathing rituals of pranayamu. He was not only eliminating hatred from his mind but was also making sure that it was also 'full of compassion, desiring the welfare of all living beings.' He was not only freeing himself of laziness and inertia but cultivating 'a mind that is lucid, conscious of itself and completely alert.' In short, it is a mind that is "calm and still . . . had out grown debilitating doubt." (Karen Armstrong, The Great Transformation ; New York; Alfred A. knopf; 2006; p. 280)

దీని సారాంశం ఏమిటంటే మనసు నుంచి కేవలం negatives (వికృతమైన అంశాలని) తొలగించటం ఒక్కటే కాదు. మనసులోని "మంచి" గుణాలతో నింపటం. ద్వేషం, మోహం లాంటివి తీసెయ్యటం ఒక ఎత్తు. కాని అదే మనసులో - అదే శూన్యంలో - మంచి, నైతికంగా అమూల్యమైన గుణాలని నాటటం. (ఇదే కాటెయ్యటం, నాటెయ్యటం). ప్రశాంతంగా, స్థిరంగా ఉండటం మనసులో కొత్తగా ప్రవేశపెట్టిన గుణాలు కావు. అవి చిత్తంలో ఉన్నవే. Negatives ల కలుపు మొక్కల్ని తీసేస్తే ఇవి చిగురిస్తాయి. కలుపు మొక్కలు లేకుండా కేవలం గులాబీలు మాత్రం ఉండటానికి వీల్లేదా? ప్రకృతిలో అవసరం లేనిదే ఏదీ ఉండదు కనుక వాటి అవసరం ఉంది. అది నాకు తెలియకపోవచ్చు.

ఈ దృష్టితో "ధమ్మపదం" లో ఏ వాక్యం చూసినా both positive and negative పక్క పక్కనే కనిపిస్తాయి : "వాడు నన్ను తిట్టాడు, వాడు నన్ను కొట్టాడు ; వాడు నన్ను ఓడించాడు; వాడు నన్ను దోచుకున్నాడు' ఇటువంటి భావాలకి చోటు కల్పిస్తే ద్వేషం శాంతించదు" మరి ద్వేషం పోవాలంటే : "వాడు నన్ను తిట్టాడు; వాడు నన్ను కొట్టాడు. వాడు నన్ను ఓడించాడు, వాడు నన్ను దోచుకున్నాడు' : ఇటువంటి భావాలకి చోటు కల్పించకపోతే ద్వేషం శాంతిస్తుంది."

ఎంత సరళంగా ఉంటుందో ఈ చిట్కా! మనసులో ఆవాసం కల్పించటం, కల్పించకపోవటం ఇంతే. Negatives ఉంటే ద్వేషం. తొలగిస్తే, శాంతి, ప్రేమ. కాని దీనికి మాధ్యమం మనసే. ఇక్క దేవుళ్ళపైన విశ్వాసం, యజ్ఞయాగాల నిర్వహణ లాంటి rituals కి అవసరం లేదు. కావలసింది mind fulness. "Bear and forbear" అదీ సూత్రం : ఏది దేనికి విరుగుడో అది గ్రహించి మందువేయటం.

ఈ దృష్టితోనే శూన్యం - పూర్ణం - Void and fulness - అన్న equation ని అవగాహన చేసుకోవాలి. ఇంతేకాదు : సంసారం- నిర్యాణం అన్న equation కూడా. ఎందుకంటే "కాదేదీ కవితకనర్హం" అన్నట్లు. అప్రమత్తతకి కాదేదీ అనర్హం. ఉదాహరణకి : కోరికలతో కూడినది సంసారం

కనక కోరిక ఉండకూడదంటారు. మరి Zen Master Ajahn Chah ఏమంటారో చూడండి : We don't want desire, but it there is no desire why practise? we must have desire. to practise. Wanting and not - wanting are both defilements, both are problems, delusious, lacking wisdom. Buddha had desire too. It's there all the time, only a condition of the mind. Those with wisdom, however, have desire but no attachment. Our desires are like catching a big fish in the net - we must wait until the fish loses its strength and then we can catch it easily. But all the time we keep on watching it so that it doesn't escupe." (A Tree in a Forest : A Collection of Ajah Chah's Similes; Chungli, Taiwan, 1994; p. 25.)

కోరిక ఉండటం సమస్యకాదు. దానికి అతుక్కుపోవటం సమస్య. తీరిన కోరిక ఎంత సుఖమో, మోతాదు మించితే అదే దుఃఖానికి కారణం. కోరిక, అనాసక్తత రెండూ భ్రమలే. కావలసినది wisdom. Negatives లేందే wisdom రాదు. కాని wisdom అంటే సమతౌల్యంగా ఉండటం. Balancing. ఇదే మద్ధే మార్గం. మంచిని ఎంచుకుంటే దాని వెనకాలే చెడుకూడా వస్తుంది. సుఖాన్ని ఎంచుకుంటే దుఃఖం కూడా వెనక వస్తుంది. మన నీడ మన వెనక వచ్చినట్లు. అందువల్ల రెండింటినీ అంగీకరించాలి. పైగా negativeలో positive ఉంటుంది. Positiveలో negative ఉంటుంది కాని మనసు ప్రవేశించి ఒకటి choose చేసి chase చేస్తుంది. అదే "అదుపులో ఉంచి పొదుపుగా వాడుకోవటం".

ఇంతేకాదు : మనస్తత్వాన్ని పట్టి మనస్సుకి నచ్చ చెప్పటం అవసరం. అందువల్ల బుద్ధ భగవానుడి బోధలు అందరికీ ఒకే రకంగా పని చెయ్యవు. ఎవరి స్థితి, పరిస్థితి వారిది. అందుకే Ajahn Chah ఒక చక్కటి మాట చెప్పారు. "మీరు మీ దగ్గరకు వచ్చిన వాళ్ళతో పరస్పర విరుద్ధమైన బోధలు చేస్తుంటారే" అని అడిగితే ఒక ఉదాహరణ ద్వారా సమాధానం చెప్పారు: "నేను ఈ మార్గాన్ని బాగా ఎరిగినవాణ్ణి. ఆ రోడ్డు నాకు బాగా పరిచయం. అందువల్ల ఎవరేనా కుడిపక్కకి వెళుతూ ఒక గొయ్యిలో పడిపోతుంటే ఎడం పక్కకి వెళ్ళమని చెపుతా. అదే విధంగా ఎవరేనా ఎడం పక్కకి వెళుతూ గొయ్యిలో పడిపోతుంటే కుడిపక్కకి వెళ్ళమని చెపుతా. నా బోధలు భిన్నంగా ఉంటాయి. కాని ప్రయాణించే మార్గం మాత్రం ఒక్కటే !"

బౌద్ధధర్మాన్ని ఈ విధంగా అవగాహన చేసుకుంటే అది ఈనాటి అంతరంగ అన్వేషకులకి ఎందుకు అంతగా నచ్చుతుందో అర్థమౌతుంది. Lacan వంటి పాశ్చాత్య దార్శనిక - మనస్తత్వ శాస్త్రజ్ఞు లకి Zen ద్వారా తమ తమ అభిరుచులకి సహాయపడటం, కొన్ని సూక్ష్మాలు తెలిసి రావటం పెద్దగా ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. పరస్పర విరుద్ధంగా కనిపించే వాటిని విడదీయకుండా, ఒక దాన్లోంచి మరొక దాని అర్థానికి మార్గాలు వెతకటం. ఈ బౌద్ధతత్వం ఇచ్చిన అమూల్యమైన కానుక. అందువల్ల దుఃఖాన్ని పోగొట్టుకొనే మార్గం ఉంది. కాని ఆ మార్గం దుఃఖాన్ని ఆనందానికి వికృతంగా చూడకుండా, రెండూ విడదీయలేని బొమ్మాబొరుసూ అని చూపుట ద్వారా తన అపూర్వతని నిర్వచించుకుంది - బౌద్ధధర్మం. మనసే అంతా. అదీ సారాంశం.

# విశ్వైక మానవునికి శాశ్వతాదర్శ ఆచరణా పథం - బౌద్ధం

- మాకినీడి సూర్యభాస్కర్

విశ్వానికి సృష్టికర్త అయిన వాడెవడూ లేడని, శాశ్వతమైన ఆత్మ అనేది అసలే లేదనీ, వైదిక కర్మకాండలు అర్థం లేనివనీ నిర్ద్వంద్వంగా ఖండించాడు బుద్ధుడు. తన కాలంలో అస్తిత్వంలో ఉన్న మత దార్శనిక భావాలను తీవ్రంగా విమర్శించి, పూర్తిగా భిన్నమైన తనదైన మార్గాన్ని 'ధమ్మపథం'గా మానవ జాతికి అందించిన అజేయ సంకల్పశీలి బుద్ధుడు. అయినప్పటికీ ఆయన జీవితం శాంతియుతంగా, పూజనీయంగానే సాగింది. దాని క్కారణం భయానికి ఆయన మనస్సులో స్థానం లేకపోవడమన్నది ముఖ్యం కాగా, తాను ఏ ధర్మాన్ని, కర్మకాండలను తీవ్రాతి తీవ్రంగా ఖండించాడో ఆ ధర్మ కర్మానుయాయుల పట్ల మృదువుగా, సున్నితంగా వ్యవహరించడం అసలు కారణం. వారి మనోభావాలను ఏమాత్రం కించపరచకుండా జాగ్రత్త వహించేవాడు బుద్ధుడు. బ్రాహ్మణులతో చర్చిస్తూ, నామ పవిత్రంగా భావించే అగ్నిహోత్రం ముందు వారితోపాటు కూర్చునేవాడు. ఆ కర్మకాండను ఎంతమాత్రం తూలనాడేవాడు కాదు. అంతేకాక, వివాదాస్పద విషయాలను ప్రస్తావించేటపుడు పాతపదాన్ని ప్రయోగిస్తూనే వాటికి కొత్త అర్థాలు కల్పించేవాడు. 'ధమ్మపథం' లో బ్రాహ్మణుని గురించి ఎంత ఉదాత్తంగా వ్యాఖ్యానించాడో చూడండి-

"ధ్యాని రజోగుణ రహితుడు
జ్ఞాని మహా స్థిర చిత్తుడు
మాలిన్యం లేనివాడు. కృతకృత్యుం డుత్తముడే
బ్రాహ్మణుడంటాను నేను" అన్నాడు. ఆ విధంగా బ్రాహ్మణున్ని నిందించకుండానే, జ్ఞానము నిర్మల చిత్తమూ కలిగినవాడే నిజమైన బ్రాహ్మణుడని ఉద్ఘాటిస్తూ, కేవల యజ్ఞయాగాది క్రతుకాండలు, బాహ్యాడంబర పూజాదికాలు నిర్వహించేవాడు ఎంతమాత్రం బ్రాహ్మణుడు కాదనీ, అటువంటి వైదిక బ్రాహ్మణ్యం మనిషిని మోక్షదిశగా నడపలేదనీ సుతిమెత్తగానే అయినా, నిర్ద్వంద్వంగా, ఏ సందిగ్ధతకు ఆస్కారం లేకుండా ఖండించి పారేశాడు. గొప్ప సౌమ్యశీలియైన విప్లవకారుడు బుద్ధభగవానుడు.

బుద్ధుడు బోధించిన బౌద్ధ ధమ్మంలోని విశిష్టాంశాలను తెలుసుకుందాం. ఒక రకంగా బౌద్ధంలో నాకు నచ్చిన అంశాలివి. క్లుప్తంగా వివరిస్తాను.

బౌద్ధంలో సృష్టికర్త అయిన దేవుడి ప్రస్తావన లేదు. బాహ్యాడంబర కర్మకాండకు ప్రాధాన్యం లేదు. వీటి స్థానంలో నీతి, శాంతి నిలిచాయి. అయితే కర్మ సిద్ధాంతానికి ప్రాధాన్యముంది. పూర్వ పుణ్య, పాప కర్మలాధారంగా జన్మ పరంపర సాగుతుందనే వైదిక విశ్వాసాన్ని బలపరిచే కర్మసిద్ధాంతం కాదిది. బౌద్ధంలోని కర్మ సిద్ధాంతం ఒక వైయక్తికమైన సహజ సిద్ధాంతం. మనిషి చేసే పనులు (కర్మలు) ఆధారంగా మంచి చెడులు ఇప్పుడే, ఈ జీవితంలోనే అనుభవంలోనికి వస్తాయంటుంది బౌద్ధకర్మ సిద్ధాంతం. కాని ఏదో కనబడని ఒక అద్భుత అతీత శక్తి దానికి ఆలంబనం కాదు. ఈ కర్మయే

---

మాకినీడి సూర్యభాస్కర్, ప్రముఖ చిత్రకారుడు, రచయిత, కాకినాడ.

బౌద్ధంలో దేవుడికి ప్రత్యామ్నాయం. భౌతిక మానసిక ఆధ్యాత్మిక విషయాలతో సహా ప్రపంచంలో అన్ని విషయాలూ కార్యకారణ సంబంధం కలిగి ఉంటాయని బుద్ధుని ప్రతిపాదన. దీనినే 'ప్రతిజ్ఞ సముత్పాద సిద్ధాంతం'గా చెప్పాడు బుద్ధుడు. ప్రపంచంలోని ప్రతి పదార్థం, ప్రతి లక్షణం మారుతుందని, అటువంటి మార్పు సహజమని అంటాడు.

★ అవిద్య ఆధారంగా సంస్కారాలు సిద్ధిస్తాయి.

**'అవిజ్జ తచ్చయ సంభావా'** (1-2)

★ సంస్కార మాధారంగా విజ్ఞానం సిద్ధిస్తుంది.

**'సంఖార పచ్చయా విజ్ఞాణమ్'** (2-3)

★ విజ్ఞానం ఆదారంగా నామరూపాలు సిద్ధిస్తాయి

**'విజ్ఞాన పచ్చయా నామరూపమ్'** (3-4)

★ నామ రూపాలాధారంగా షడాయతనాలు సిద్ధిస్తున్నాయి.

**'నామరూప పచ్చయా షడాయతనమ్'** (4-5)

★ షడాయతనాల ఆధారంగా స్పర్శ సిద్ధిస్తుంది

**'షడాయతన పచ్చయా ఫస్సో'** (5-6)

★ స్పర్శ ఆధారంగా వేదన సిద్ధిస్తుంది

**'ఫస్సో పచ్చయా వేదనా'** (6-7)

★ వేదన ఆధారంగా తృష్ణ సిద్ధిస్తుంది.

**'వేదనా పచ్చయా తణహా'** (7-8)

★ తృష్ణ ఆధారంగా ఉపాదానం సిద్ధిస్తుంది.

**'తణహా పచ్చయా ఉపాదానమ్'** (8-9)

★ ఉపాదాన మాధారంగా భవం సిద్ధిస్తుంది

**'ఉపాదాన పచ్చయా భవో'** (9-10)

★ భవం ఆధారంగా జన్మ సిద్ధిస్తుంది

**'భావ పచ్చయా జాతి'** (10-11)

★ జన్మ ఆధారంగా మరణం సిద్ధిస్తుంది.

**'జాతి పచ్చయా మరణం శోకమ్, పరిదేవనమ్**
**దోర్మనస్యమ్ సంభవంతి'** (11-12)

ఈ విధంగానంభవించే జరామరణ శోక పరివేదనలను దుఃఖనిరోధం ద్వారా తొలగించుకోవాలంటాడు బుద్ధుడు. ఇదే సిద్ధాంతాన్ని ప్రతిలోమంగా (చివరనుంచి మొదటికి) మననం చేసి దుఃఖనిరోధ విధానాన్ని 'చతురార్య సత్యాలు'గా చాటాడు. అవి -

1. మానవ జీవితం దుఃఖమయం.
2. దుఃఖ కారణం తృష్ణ. తృష్ణవల్ల జన్మజరా వ్యాధి మరణాలు సంభవించి దుఃఖ కారణాలవుతున్నాయి.
3. దుఃఖ నివారణ - తృష్ణను నాశనం చేయడం
4. దుఃఖ నివారణ మార్గం - తృష్ణను నాశనం చేసేమార్గం - అష్టాంగం.

అష్టాంగమార్గంలోని అంశాలు-

| | | | |
|---|---|---|---|
| 1. | సమ్యక్ వచనం | - అన్యోన్య సౌఖ్యదాయకమైన ప్రియ భాషణం... సత్యభాషణం | శీల |
| 2. | సమ్యక్ కర్మ | - సంఘానికి హానికరాలైన ప్రాణఘాతం, దొంగతనం, వ్యభిచారం మొదలైన కర్మలను వదలి సమాజాభ్యు దయ కారకాలైన కర్మలను ఆచరించడం | శీల |
| 3. | సమ్యక్ఆజీవనం | - సంఘానికి అపకారం కలిగించే జీవన విధానాన్ని విసర్జించి మంచిగా జీవించడం | సమాధి |
| 4. | సమ్యక్ స్మృతి | - శరీరం అపవిత్ర పదార్థమయమని ఎరిగి సుఖదుఃఖ కారకాలైన వేదనల నవలోకించుకుని మానసిక ప్రవృత్తిని అర్థం చేసుకుని దుర్భర కారకాలైన ఇంద్రియాలను వర్జించే ప్రయత్నం | సమాధి |
| 5. | సమ్యక్ సమాధి | - శరీరం మీదగాని, మైత్రి, కరుణవంటి మానసిక ప్రవృత్తుల మీదకాని, భౌతిక పదార్థాల మీదకాని మనసును ఏకాగ్రం చేసి ధ్యానించడం | సమాధి |
| 6. | సమ్యక్ వ్యాయామం | - దురాలోచనలను పరిహరించి సదాలోచనలను జనింపచేసుకొని, వాటిని అభివృద్ధి పరచుకుని పరిపూర్ణతను అందుకోడానికి చేసే మానసిక ప్రయత్నం. | సమాధి |
| 7. | సమ్యక్ సంకల్పం | - స్వార్థాభివృద్ధిని కాంక్షించని, కామోపభోగ బద్ధం కానటువంట ఆలోచన | ప్రజ్ఞ |
| 8. | సమ్యక్దృష్టి | - చతురార్య సత్యాల యదార్థ జ్ఞానం. ఇది శాంతిదాయకం, పరమజ్ఞాన మోదకం. | ప్రజ్ఞ |

మానవుని భౌతిక అవస్థను హేతుబద్ధంగా అర్థం చేసుకుని ఆధ్యాత్మిక ఔన్నత్యానికి చేర్చగలిగే ఆచరణీయమైన కర్మలకై సూచనల నందించిన అత్యంత ప్రాచీన విధానమైన ఈ బౌద్ధ అష్టాంగంలో


ముందుగా సమస్యని గుర్తించి, దాని కారణాలను వెదకి పరిష్కారమార్గాన్ని కనుగొనడమనే అత్యంత ఆధునిక శాస్త్రీయ దృక్పథం ఇమిడి ఉంది. అందుకే ఐన్‌స్టీన్ - "ఆధునిక శాస్త్రీయావసరాలకు సరిపోయే మతం ఒక బౌద్ధమే" అన్నాడు.

బౌద్ధంలో 'కర్మ' అనేది పూర్వజన్మ సుకృత దుష్కృతాల సంచిత ఫలం కాదనుకున్నాం కదా! మనిషి తన కర్తవ్యాన్ని తాను సక్రమంగా నిర్వహించడమే కర్మం. అదే మనిషి ధర్మం. దీనికి మంచి, చెడు పనులే ప్రమాణం. అంతా కర్మానుబద్ధం. లోకమూ, ప్రజల వర్తనమూ అంతా కర్మకు అనుగుణంగా సాగుతుంది.

**"కమ్మనా వత్తతే లోకా, కమ్మనావత్తతే పజా**
**కమ్మ నిబంధనా సత్తా రథస్సాణీరతా యధా"**

మనిషి జన్మకాదు ముఖ్యం. అతని ప్రవర్తన అతి ముఖ్యం. జాతీగోత్రం కాదు. చేసే మంచి, చెడు పనులు (కర్మ) మనిషి వ్యక్తిత్వాన్ని నిర్ధారిస్తుంది. రథం గమనాన్ని ఇరుసు సీల నియంత్రించి నట్లుగా, లోకమంతా, ప్రజలంతా కర్మకు లోబడి కొనసాగాలంటాడు బుద్ధుడు. అప్పట్లో ఉనికిలో ఉన్న వృత్తుల ఆధారాంగా ప్రజలను ఏడు వర్ణాలుగా విభజించవలసి ఉంటుందంటూ, నాలుగు వర్ణాల సిద్ధాంతాన్ని సమూలంగా తిరస్కరించాడు బుద్ధుడు. వాటితోపాటు వర్ణాల అగ్రత్వాన్ని, ఆధిపత్యాన్ని కూడ తోసిరాజన్నాడు.

ఎవరి కర్తవ్యాన్ని వారు సక్రమంగా నిర్వహించడమే ధర్మం (ధమ్మం). అంటే విచక్షణతో నిర్ణయించుకుంటూ ఎవరికి వారుగా నిర్వర్తించే మంచీచెడు పనులే కర్మ. వాటినే కుశల, అకుశల కర్మలుగా బుద్ధుడు వింగడించాడు. అకుశల కర్మలు వదులుకోవలసినవి కాగా కుశలకర్మలు అనుష్ఠించి, బాగా పెంపొందించుకోవలసినవి.




మనిషి తనలోని అకుశల కారకాలను గుర్తించి వాటిని నెమ్మదిగా కుశల కారకాలతో తొలగించుకోవాలి. ప్రతి అకుశల కారకానికి వ్యతిరేకమైన కుశల కారకం ఉంటుంది. కుశల కారకాలతో ఏర్పడిన మానసికస్థితిని కలిగి ఉన్నప్పుడు మనిషి నీతివంతంగా, ధర్మపరంగా జీవించగలుగుతాడు. కాబట్టి మనిషి ప్రవర్తనకి అతడు బాధ్యుడు కాదు. అతని మానసిక స్థితిదే ఆ భాధ్యత.

కాబట్టి మనసుకు శిక్షణ ఇవ్వాలంటుంది బౌద్ధం. కుశల, అకుశల కారకాలను, మంచి చెడు ఆలోచనలను గుర్తించేట్లు సాధకుడు తన మనసుకు శిక్షణను ఇచ్చుకోవాలి. కుశలమైన ఆలోచనలను పెంపొందించుకుంటూ, అకుశల మైన ఆలోచనలను రానీయకుండా జాగ్రత్తపడుతూ, ముందుకు సాగుతూ చివరికి ప్రజ్ఞను సాధించాలి. ప్రజ్ఞద్వారా లోభ మోస ద్వేషాలనే దుర్గుణాలను తొలగించుకోవాలి. అప్పుడే సాధకుడు మంచిదాన్ని మంచిదనీ, చెడ్డదాన్ని చెడ్డదనీ గుర్తించగల యదార్థ జ్ఞానాన్ని పొందగలుగుతాడు.

ఆ విధంగా మనిషి తన కర్మలకు తానే బాధ్యత వహిస్తాడు. వాటి ఫలితాలను ఇప్పుడే ఇక్కడే అనుభవిస్తాడు. మంచి పనులు చేసేవాడికి మంచి ఫలితాలు - సుఖ సౌమనస్యాలు - లభిస్తాయి. అలాగే చెడుపనులు చేసేవాడికి చెడు ఫలితాలు- దుఃఖ దౌర్మనస్యాలు - ప్రాప్తిస్తాయి.

మానసిక శిక్షణ ద్వారా అకుశల కారకాలను కుశల కారకాలతో నింపి మానసిక స్థితిని మెరుగుపరుచుకుంటూ, మనిషి తన ప్రవర్తనను స్వతఃసిద్ధంగా మార్చుకోవాలి. అంతేగాని నీతిమాటలూ, ధర్మ ప్రబోధాలూ అతన్ని మార్చలేవు.

**చిత్తోపాసన :** మనిషి తనకు తానుగా మారడానికి బుద్ధుడు అందించిన ప్రక్రియ చిత్తోపాసన. మనస్సును ఆరో జ్ఞానేంద్రియంగా గుర్తించాడు బుద్ధుడు. అసలు ప్రపంచ సమస్యలన్నీ మనస్సును ఇంద్రియంగా గుర్తించినందువల్లే ఏర్పడుతున్నాయి.

ఆలోచనకు జ్ఞానేంద్రియం మనసు (మానసికస్థితి) అంటాడు బుద్ధుడు. కొన్ని మానసిక కారకాల కలయికతో మానసిక స్థితి ఏర్పడుతుంది. ఏయే కారకాల కలయికతో మానసిక స్థితి ఏర్పడిందనే దాన్ని బట్టి మనిషి ప్రత్యేకత, అనన్యతలు నిర్ణయమవుతాయి. పైన చెప్పిన కుశల, అకుశల కారకాలే మానసికస్థితిని నియంత్రించే, నిర్ధారించే కారకాలు.

అయితే మనిషి అంటే కేవలం మనసు మాత్రమే కాదు. కాకూడదనికూడా మనిషొక సజీవ చైతన్య స్రవంతి. అయితే దానికి మూలం మాత్రం అతని మనసు లేదా చిత్తం. అతని చర్యలన్నిటినీ అదే నడిపిస్తుంది. బౌద్ధంలో మనసు యొక్క విశిష్టత ఎంతటిదంటే, ధమ్మపదం **'మనో పుబ్బంగ మాధమ్మా'** అంటూ ప్రారంభమౌతుంది. "మనిషే కాదు, ప్రపంచాన్నే మనసు శాసిస్తుం" దంటాడు బుద్ధుడు. అంతా చిత్త అధీనంగానే నడుస్తుంది.

"చిత్తేన లోకే నీయతి, చిత్తేన పరికస్సతి
చిత్త స్య ఉప్పన్నస్సవ సంగచ్ఛతి" అని బుద్ధుని తీర్మానం.

అటువంటి చేతనాత్మక ప్రపంచంలో జీవించే చైతన్యజీవి యాంత్రికంగా ప్రవర్తిస్తూ, అంధ విశ్వాసాల బరువుతో క్రుంగి కృశించి నశించి పోకూడదని బుద్ధుని ఆశ... ఆశయం.. ఆక్రోశం.

ఈ ఎరుకతో మనిషిని బంధనాల నుంచి విముక్తిణ్ణి చేసి, తనను తాను అధిగమించి ఎదిగేట్లు చేయడమే ధమ్మం లక్ష్యం. బుద్ధులు కేవలం మార్గాన్ని చూపేవాళ్ళే. ఎవరికి వారు ఆ మార్గంలో సొంత ప్రయత్నంతో ముందుకు సాగవలసిందే. మనిషి మరే అలౌకిక శక్తిమీదనో కాక, తన మీద తాను ఆధారపడేట్లు చేసేదే బౌద్ధ ధమ్మం.

ఎవరికి వారుగా తమని తాము లోతుగా పరిశీలించుకుని పరిశుద్ధం గావించుకునే ప్రక్రియ సమాధి. బౌద్ధంలోని విపస్సనా సంప్రదాయం దీనికి పునాది. దీనిలోని దాపరికంలేని ధ్యానం. మనిషికి తనకు తననే అద్దంలా కనిపింపజేస్తుంది.

గతాన్ని వర్తమానంతో, వర్తమానాన్ని భవిష్యత్తుతో ముడిపెట్టి భయపెట్టడాన్ని బుద్ధుడు సమర్థించలేదు. గడచిపోయినది గతం. తిరిగి రాదు. భవిష్యమేమిటో ఎవరికీ తెలియదు. గతానికి కలతపడక, భవిష్యానికి ఎదురు చూడక కుశల కర్మానువర్తులు కావడమే ప్రధానం.

**భావనాస్వేచ్ఛ :** బౌద్ధం మనిషికి అపారమైన భావనాస్వేచ్ఛను ఇచ్చింది. ఇతరులకు మేలు చేయని, నిశిత పరిశీలనకు గురిచేయని దేనినీ అంగీకరించవద్దంటుంది.

ధర్మాన్ని ఒక తెప్పతో పోల్చాడు బుద్ధుడు. నదిని దాటడానికి తెప్ప ఎలా ఉపయోగపడుతుందో, సంసార సాగరాన్ని దాటడానికి ధమ్మం అలానే ఉపయోగపడాలన్నాడు. అంతేకాకుండ, "తాను చెప్పినదాన్ని కూడా కేవలం తన మీద గౌరవంతో అంగీకరించవద్దని, తెలివైనవాడు బంగారాన్ని గీటురాయి మీద రాసి రుద్దినట్లుగా, ప్రతి విషయాన్ని పరిశీలించి, నిగ్గు తేల్చిన తరువాతనే అంగీకరించాలని **(అనుమేతబ్బో, తులేతబ్బో, తీరే తబ్బో)**" బుద్ధుడు చెప్పాడు. భావనా స్వేచ్ఛను కాపాడుకోవాలనీ, ఎవరో చెప్పిన దానిని ప్రమాణంగా స్వీకరించి దానిని దూరం చేసుకోకూడదనీ గట్టిగా చెప్పాడు.

గృహస్థయినా, భిక్షువయినా స్వీయ చింతనతో, అవగాహనతో, నిర్ణయంతో పురోగమించాలి. అర్థం చేసుకోకుండా గుడ్డిగా విన్నవాటిని యాంత్రికంగా జ్ఞప్తికి తెచ్చుకోవడాన్ని బుద్ధుడు అంగీకరిచంలేదు. విన్న దానిని గురించి ఆలోచించి, అర్థం చేసుకుని, అవసరమైతే గురువులను ప్రశ్నించి సందేహ నివృత్తి చేసుకోమన్నాడు. ఆఖరుకు తన ఉపదేశాలకు కూడా ఈ నియమాన్ని వర్తింపజేయడం బుద్ధుని విశిష్టత.

ఆధ్యాత్మికత విషయం కూడా అంతే. ఎవరికి వారుగా కృషి చేసి దాన్ని సాధించుకోవలసిందే. క్రమక్రమంగా వ్యావహారిక స్థితినుంచి (లోకీయ), శాస్త్రీయ అవగాహనా స్థితికి (లోకోత్తర) పరిణమించాల్సిందే. స్వార్థ చింతనను అరికడుతూ, పదార్థ ప్రవృత్తిని పెంపొందించుకుంటూ, కామ క్రోధ ద్వేషాలను అణచుకుంటూ విశ్వశ్రేయస్సును కాంక్షించే దిశగా అభివృద్ధి చెందాల్సిందే.

**"విద్యాచరణ సంపన్నోయే సెత్థో దేవమానుసేతి"** - విద్యాచరణ సంపన్నులే దేవ మానవులలో శ్రేష్ఠులు. సక్రమంగా అర్థం చేసుకోవడం, అర్థం చేసుకున్న దానినే చెప్పడం **(యధా ఖమెయ్య తథావాెయ్య)**, చెప్పిన దానినే ఆచరించడం **(యధావాెయ్య తథా కారెయ్య)** ప్రధానమన్నాడు బుద్ధుడు. ఇతరులకు ఉపదేశించడంలోనే కాకుండా, ఈ ఆదర్శాన్ని తన జీవితంలో ఆచరించి చూపాడు కూడా - 'యధావాదీ తథాకారీ, యధాకారీ తథావాదీ - చెప్పిందే చేసాడు, చేసిందే చెప్పాడు.

స్వతంత్ర జీవనానికి మానవాళిని ప్రేరేపించాడు బుద్ధుడు. ఎవరికి వారు స్వేచ్ఛగా బ్రతకాలని వాంఛించాడు.

★ పారతంత్ర్యంలో బ్రతకడమే దుఃఖం. స్వతంత్ర జీవనమే సుఖం.

'సబ్బం పరవసం దుక్ఖం, సబ్బం ఇస్సరీయ సుఖం

★ దానికై చెమటలు చిందించాలి - సేదావఖిత్తో

★ ఆ విధంగా చెయ్యగలిగినదంతా చెయ్యాలి. అదే మార్గం.

'నవాయమెయ్య సబ్బత్థ'

★ ఇతరుల మీద ఆధారపడి ఎప్పుడూ జీవించవద్దు.


'నాజ్ఞం నిస్సాయ జేనెయ్య' అంటూ, శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆవిష్కరించాడు. రైతుని (కర్షక), దుకాణదారుని (పాపుణిక), కార్మికుని (కమ్మ కర) స్వతంత్ర జీవనానికి ఆదర్శంగా ఉదహరించాడు.

సమదృష్టి - విశ్వైక మానవత : అందరినీ సమదృష్టితో చూడాలన్నాడు బుద్ధుడు. సంఘ జీవనానికి ఆదర్శంగా 'సమానర్థతా, సమచరియా, సమజీవితా' అని ప్రబోధించాడు.

★ అందరి శ్రేయస్సును, అభివృద్ధిని కాంక్షించడం - సమానర్థంతా

★ అందరినీ సమంగా పరిగణించడం - సమచరియా

★ సాంఘిక ధర్మ నిర్వహణ - సమజీవితా. ఇది మూడు విధాలు.



వైయక్తిక ప్రవృత్తి - లాభనష్టాలను, సుఖ దుఃఖాలను సమానంగా స్వీకరించడం.

కుటుంబ ప్రవృత్తి - భార్యకు సమాన ప్రతిపత్తినిచ్చి జీవితంలో భాగస్వామిని చేయడం

సంఘ ప్రవృత్తి - సంఘంలో ఉన్నవారందరినీ సర్వసమానంగా ఏ వివక్ష లేకుండా చూస్తూ జీవించడం.

ఇటువంటి ఉత్తమ ప్రవృత్తి అందరికీ అవసరం. అది అప్రయత్నంగా లభించేది కాదు. దానికి అవసరమైన కృషి చేస్తూ, క్రమ క్రమంగా మనిషి పురోగమించాల్సి ఉంటుంది. ఈ సాధ్యలో వైయక్తిక బలహీనతల నుండి, సాంఘిక దేశకాల పరిమితుల నుండి బయటపడి మనుషు లందరూ విశ్వ మానవులుగా మారాలంటాడు బుద్ధుడు.

ఈ విధంగా క్రమక్రమంగా అభివృద్ధి పథంలో పురోగమించగలిగిన వారు విశ్వ మానవులువుతారు. ఏ లౌకిక పరిమితులూ వారికి వర్తించవు. వారిని బంధించవు, బాధించవు. అటువంటివారి జీవితం లోకోత్తరం. అటువంటి జీవనాన్ని అందుకోవటం అందరికీ సాధ్యమేనంటూ, దానినే మానవాళికి జీవన గమ్యంగా నిర్దేశించాడు బుద్ధుడు.

ఈ సందర్భంలో ఆదిమ మానవుడు ఆధునిక మానవునిగా సాగించిన ప్రస్థానం గమనించదగింది.

పరిణామక్రమంలో జంతు జాలంలో అత్యున్నతంగా ఉద్భవించింది క్షీరదం. క్షీరదాలు రెండు రకాలు - శాకాహారులైన సాధుజంతువులు, మాంసాహారులైన క్రూరజంతువులు.

మానవుడు మొదట్లో, ఆదిమ దశలో మాంసాహారుడై క్రూరుడుగా జీవించాడు. మెల్లమెల్లగా శాకాహారిగా మారుతూ సాధుత్వంలోకి ప్రయాణిస్తూ ఉన్నాడు. ఈ క్రమాన్ని వేగవంతం చేసేదే మానసిక శిక్షణ - మనిషిని మానవత్వం దిశగా నడిపేది.

మానవత్వం కలిగి ఉండడంపట్ల ఆసక్తి లేకపోతే మనిషి ఎప్పటికీ బుద్ధుడు కాలేడు.

నేటి ఆధునిక జీవితానికి కూడా సరిపోయే మానవతా సంస్కృతిని ప్రబోధించిన ప్రజాస్వామిక సిద్ధాంతం బౌద్ధం. ఈ మానవతా సంస్కృతి పూర్తిగా వికసించాలంటే అది సామాన్య ప్రజల్లోకి చొరబడాలి. అటువంటి చొరవ తీసుకోగల సంస్కృతి బౌద్ధం.

బౌద్ధం ఒక మతం కాదు. అదొక విధానం... సంస్కారం. నెరసి, ఒక జీవన విధానం... ఒక జీవన సంస్కృతి.

సమాజంలో ఎప్పుడైనా, ఏ దశలోనైనా, వ్యక్తిగత సంస్కారాన్నిబట్టి మానవ (తా) సంస్కృతి భిన్న దశల్లో ఉంటుంది. సమాజంలోని ఒక సమూహంలో లేదా సమూహంలోని ఒక వ్యక్తిలో సాంస్కృతిక వికసనం భిన్నదశల్లో ఉండవచ్చు.

వ్యక్తి సంస్కృతి, సమూహ సమాజ సంస్కృతి - వరుసగా సాంస్కృతిక వికసన దశల్లో ఒకదాన్ని మించినది మరొకటి.

వ్యక్తి స్థాయిల్లో సంస్కృతిని బుద్ధుడు చెప్పిన కుశలాకుశల కారకాలు. మానసిక శిక్షణ (చిత్తోపాసన) తీర్చి దిద్దితే, సమూహ స్థాయిలో, సమాజస్థాయిలలో సంస్కృతిని అష్టాంగమార్గం దిద్ది తీరుస్తుంది. శీల, సమాధి, ప్రజ్ఞాగతాలైన అష్టాంగ క్రమాచరణతో ధమ్మ మార్గాన్ని అందరూ అనుసరిస్తే - తోటి మనిషిపై, తోటి సమూహంపై, తోటి సమాజంపై, తోటి జాతిపై మరో మనిషి, మరో సమూహం, మరో సమాజం, మరో జాతి చేసే అన్యాయం, అమానుషత్వం, దోపిడీ మాయమవుతాయి.

విభిన్న సాంఘిక రాజకీయార్థిక భాషా చారాలవల్ల ఏర్పడే ఒకే దేశంలోని ప్రాంతీయ సంస్కృతుల్లోని, భేదాలు, దేశదేశాల వివిధ జాతీయ సంస్కృతుల్లోని విభేదాలు ప్రస్తుతకాలంలో మానవ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. సంఘజీవనంలో గందరగోళం సృష్టిస్తున్నాయి.

వీటికి విరుగుడుగా ప్రాంతీయ, జాతీయ సంస్కృతుల స్థానే విశ్వైక మహామానవతా సంస్కృతిని సంస్థాపించగల ఆచరణాత్మక జీవన విధానం బౌద్ధ ధమ్మం.

మనిషికి అనివార్యంగా ఉండాల్సిన గుణం మానవత.

మానవత లోపించడం దానవత. బాగా వికసించడం మహా మానవత.

అధో చేతనలో మనిషి దానవుడుగాను, సమ (సహజ) చేతనలో మానవుడిగాను, ఊర్ధ్వ చేతనలో మహామానవుడు (బుద్ధుడు) గాను ఉంటాడు.

అధోచేతనలో హేతువాదం నిద్రాణంగా ఉంటుంది. మంచికీ చెడుకీ (కుశలాకుశలాల) తారతమ్యం తెలీదు. ఇదే తమోగుణం.

సహజ చేతనలో హేతువాదం పూర్తిగా మేల్కొని ఉంటుంది. మంచికీ చెడుకీ విచక్షణ ప్రతిస్థాయిలో వికసిస్తుంది. ఇది రజోగుణం.

ఊర్ధ్వ చేతనలో హేతువాదం సంబోధిలోకి రూపాంతరం చెందుతుంది. ఇదే సర్వ గుణం (బోధిసత్వం).

బుద్ధి అకుశల కారకాలతో మరుగున పడిపోవడమే దానవత.

అకుశల కారకాలను కుశల కారకాలతో తొలగించడం మానవత. బుద్ధి సంబోధిగా మారితే మహా మానవత. అదే బుద్ధత్వం !

బుద్ధం శరణం గచ్ఛామి.

# బాధా తప్త హృదయాలకు బ్రహ్మ విహారాలు

- డా॥ బి.వి.ఎస్. భానుశ్రీ

మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష అన్న నాలుగు భావాలు పైకి కనిపించినంతటి సామాన్యమైనవి కావు. మాట ధ్వనించినంత తేలిక కాదు వాటినర్థం చేసుకోవడం. అవి ఎంతో లోతైన, ఉదాత్తమైన మానశికావస్థలు. బౌద్ధంలో వీటిని బ్రహ్మవిహారాలు అంటారు. అంటే ఉన్నతమైన, శ్రేష్ఠమైన సత్య స్థావరాలు. దిఘనికాయలో (III, 220) వాటి ప్రస్తావన ఉంది. సంయుక్త నికాయలో (V, 326) వాటి వివరణ ఉంది. ఐదవ శతాబ్దానికి చెందిన బుద్ధ ఘోషుని విశుద్ధి మగ్గలో (chap 13) వాటి విస్తరణ ఉంది.

ఇక వాటి అర్థాలను పరిశీలిస్తే: 'మైత్రి' అంటే మనకి తెలిసిన భాషలో స్నేహం, ప్రేమ అని అర్థం. 'కరుణ' అంటే దయ సానుభూతి. 'ముదిత' అంటే సంతోషం, 'ఉపేక్ష' అంటే మానశిక సమతౌల్యం - అని అర్థం. అయితే బౌద్ధంలో వీటికి ఎంతో ఉన్నతమైన, విస్తృతమైన అర్థాలున్నాయి. ఇవి మానవ వ్యక్తిత్వ వికాసంలో ప్రధానమైన స్థానాన్నాక్రమిస్తాయి. తోటి మనిషి నర్థం చేసుకోవడంలో, సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో బాధ్యత గల పాత్ర వహిస్తాయి. వీటిని 'బ్రహ్మవిహారాలు' అనడంలోనే వాటిస్థాయి ఏంటో అర్థమవుతున్నది. 'బ్రహ్మ' అంటే ఒక ఉన్నత సత్యాన్ని గురించి వివరించే మాట; ఎన్నెన్నో మనకి కనబడని లోకాలకి కూడ ఆధిపత్యం వహించే సత్యపదార్థం. అటువంటి పదార్థం స్థావరం ఏర్పరచుకున్న ప్రదేశం -విహారం. ఇవి అద్వితీయమైన భావనలు. అనంత దృష్టి కలిగినవి. ఆ స్థాయికి చేరిన వారి ప్రతి చర్యలోను ఆధోరణి అభివ్యక్తమవుతూనే ఉంటుంది. అవి ఏ ఒక్కరినో ఉద్ధరించడానికి కాదు; పాక్షికమైనవి అసలే కావు.

అయితే, అటువంటి స్థితిని పొందడం సాధ్యమయే పనేనా? అసాధ్యం మాత్రం కాదు. వ్యక్తిత్వ వికాసానికి, మనసు నల్లరి పెట్టే కల్లోలపు అలల తాకిడిని ప్రతిఘటించే సామర్థ్యానికి - బౌద్ధంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మనిషి మానసికంగా, భౌతికంగా ఎన్నో విధాల ఆందోళనలకు లోనవుతున్నాడు. అయితే, కష్టాలు, కన్నీళ్ళు, విపత్తులు, విచ్ఛిన్నాలు ఈనాడు కొత్తకాదు; వింతకాదు. ఇంతటి దుఃఖాందోళనలకు గురికావడం మనిషికి మొదటిసారి కాదు. సృష్టితోనే దుఃఖం మొదలైంది. అది జీవితం ఉన్నంత కాలం కొనసాగుతూనే ఉంటుంది. దుఃఖ విధానం, దుఃఖ పరిమాణం మాత్రం కాలాన్ని బట్టి, పరిస్థితిని బట్టి మారుతుంటాయి.

ఈనాడు అన్నిటికన్న దయనీయమైన స్థితిలో ఉన్నవి మానవ సంబంధాలు. ప్రపంచమంతా ఒక కుగ్రామంగా కుంచించుకుపోతుంటే, మనుషుల మధ్య మాత్రం అగాధాలు ఏర్పడుతున్నాయి. అనుమానాలు, అపార్థాలు, అపనమ్మకాలు, అభద్రతా భావాలు ఆందోళన పరస్తూ ఊహించని అడ్డు గోడలు కడుతున్నాయి. అవి మనుషుల మధ్యే కాక దేశాల మధ్య కూడా దూరాన్ని పెంచుతున్నాయి. రాధాకృష్ణన్ అభిప్రాయపడినట్టు 'కోల్డ్‌వార్'కి మూలకారణం భౌతిక సంపదల కోసం పడే దురాశకాదు - కేవలం భయం, ద్వేషం. అయితే ఇప్పుడా 'కోల్డ్‌వార్' స్థాయి దాటిపోయింది. అధికారం కోసం, ధనం కోసం మనుషులు ఒకరితో నొకరు అడివి జంతువుల్లా పోట్లాడుకుంటున్నారు. పెరుగుతున్న సైన్స్ అండ్ టెక్నాలజీ మానవ జీవితాలను సుఖవంతం చేసినా, దాని వలన ఏర్పడిన ఖాళీ సమయం మనిషిని మనసుని దెయ్యాల కర్మాగారంగా మారుస్తూంది - ఫలితంగా దురాశలు, దోపిడీ మనస్తత్వాలు

డా॥ బి.వి.ఎస్. భానుశ్రీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, విశాఖపట్టణం.

పెరిగేయి. శాంతి అనేది కేవలం రెండు యుద్ధాల మధ్య విశ్రాంతి అయిపోయింది. ఆకాశపు పుష్పంగా మిగిలిపోయింది. ప్రపంచం నలుమూలలా తీవ్రవాదం ప్రబలిపోయింది. అది పూర్తిగా రాజకీయం చేయబడి ఎవరి స్వార్థం కోసం వారు ఇష్టమొచ్చినట్టు వాడుకుంటున్నారు. ఈనాడు ప్రజల బాగోగులు చూసి, దేశ ప్రయోజనాన్ని కాపాడే నిజమైన పాలకులు లేరు. కేవలం అధికారం, అక్రమ సంపాదన తప్ప మరో లక్ష్యంలేదు. నిజమైన నాయకత్వం అసలే రంగరంలోనూ లేదు. భౌతిక ప్రపంచంతోపాటు, మానసిక ప్రపంచమంతా కాలుష్యంతో నిండిపోయింది. పచ్చదనం, వెచ్చదనం పూర్తిగా కనుమరుగయి పోతుంది. కనీవినీ ఎరుగని రోగాలు వ్యాపిస్తున్నాయి. గ్లోబలైజేషన్ పేరుతో సాంస్కృతిక అరాజకత్వం పెరిగిపోతుంది.

రానురాను జీవితం మానవత్వాన్ని, విలువల్ని కోల్పోతుంది. గొప్ప విలువల్ని, గొప్ప సత్యాన్ని సాధించడానికి బదులు మనిసి మనసు జీవితంలోని స్వల్ప విషయాల చుట్టూ మిణుగురు పురుగులా తిరుగుతుంటుంది. బెల్లం పాకంలో అతుక్కుపోయిన ఈగలా నిస్సహాయంగా అయిపోయింది అతని పరిస్థితి. కారుణ్యం లేని ఈ కాలుష్యపు ప్రపంచంలో మనిషి తనను తాను పూర్తిగా పోగొట్టుకుంటున్నాడు. బాధాకరమైన విషయం ఏమిటంటే తన నిస్సహాయతను తనే గమనించలేని అజ్ఞాన స్థితిలో ఉన్నాడు. ప్రపంచంలోని వేదన, అశాంతి క్షణికత్వం - జీవితాన్ని చెప్పాలంటే గమ్యం లేని పడవ ప్రయాణంలా అయి పోయింది మనిషి బతుకు.

ఇటువంటి పరిస్థితుల్లో బౌద్ధం మనిషికి తన సహాయ హస్తాన్నందించగలదా? తప్పకుండా అందించగలదు. అయితే దాన్నందుకోడానికి మనిషి సిద్ధంగా ఉన్నాడా అన్నది ప్రశ్న. తక్షణ సమాధానం అయితే 'లేదు' అనే వస్తుంది. ఈ సజీవ సున్నిత లోకం పట్ల తన హృదయ ద్వారాలను విశాలంగా తెరిస్తే తప్ప దానికి తన అవసరం ఎంత ఉందో అర్థం కాదు. అయితే, ముందుగా అతనికి - తన హృదయ ద్వారాలను తెరచి, వాస్తవాన్ని మనసారా దర్శించాలన్న దృఢ నిశ్చయం ఉండాలి. అప్పుడే అతను బౌద్ధానికి దగ్గరయి లేదా బౌద్ధమే అతనికి దగ్గరయి దాని సారాన్ని అర్థం చేసుకోగలగుతాడు. బౌద్ధం ఒక సిద్ధాంతమో, ప్రవచనమో కాదు. జీవితంలో - నిరంతర సమస్యల విషవలయాల్లో కొట్టుకు పోతున్న మనిషికి సరయిన దారి చూపించే ఒక "మార్గం." ఆచరణాత్మకమైన ఒక జీవన విధానం. కష్టాల అలల నించి జాగ్రత్తగా బయటపడే ఒక ప్రవర్తనా నైపుణ్యం. 'ఈ విధానం, ఈ నైపుణ్యం, ఈ వ్యక్తి జీవన పోరాటం - ఇదే బౌద్ధం అంటే' - అంటాడు జాకబ్ సన్ అనే బౌద్ధ రచయిత.

ఉన్నతమైన స్థాయిలో సంపూర్ణ వ్యక్తిత్వం వికసించాలని బౌద్ధం యొక్క ముఖ్యోద్దేశం. ఈ రోజుల్లో అది చాల అవసరం. ఇంద్రియలోలత్వాన్ని చైతన్య పూరితమైన మానసిక ఔన్నత్యంతో అధిగమించాలి. అదొక నైతిక చైతన్య స్థితి. ఒక స్థిత ప్రజ్ఞత.

ఈ రంగు రంగుల ఆకర్షణీయమైన జీవితం, సిరిసంపదలు, అధికారం కాదు మనిషిని బానిస చేసేది - అచేతన స్థితిలో వాటిని పట్టుకు వేలాడే తలత్వం. ఈ ప్రపంచాన్ని విసర్జించాలి అంటే - ఎటువంటి ప్రపంచాన్ని? అటువంటి లోలత్వంలోంచి ఉద్భవించిన - వక్రభాష్యాలలో చిక్కుపడి ఉక్కిరి బిక్కిరవుతున్న మాయా ప్రపంచాన్ని విసర్జించాలి- అని బౌద్ధం చెప్తుంది. కేవలం విసర్జించడం కాదు. ఈ ప్రపంచంలోనే ఉంటూ ఆ స్థితిని అధిగమించాలి. అయితే మనలో లోతుగా పాతుకు పోయిన వాంఛా బీజాలు తమ ఉచ్చుల్లో బిగించి, ఉక్కిరి బిక్కిరి చేసి, ఈ దుఃఖ మయ ప్రపంచంలో మనల్ని బంధించి ఉంచుతాయి. అందుకే బుద్ధుడు మనది కాని దాన్ని విసర్జించమని, కనీసం ఆశించవద్దని చెప్పాడు.

ఈ సమస్యలన్నింటిని అధిగమించడానికి మైత్రి, కరుణ, మురిత ఉపేక్షవంటి గొప్ప మానసిక భావనలను పెంపొందించుకోవాలని బుద్ధుడు నిర్దేశించేడు. అందుకు అష్టాంగ మార్గాన్ని నిశ్చయంగా, నిజాయితీగా అనుసరించాలి. దానికన్న ముందు పంచశీలను పాటించాలి. అహింసా భావాన్ని పెంపొందించుకుని, మనస్ఫూర్తిగా పాటిస్తే తప్ప అసలు మైత్రీ భావమే అర్థం కాదు. బౌద్ధ గ్రంథాలలో ఈ బ్రహ్మ విహారాల వివరణ ఎలా ఉందో పరిశీలిద్దాం.

**మైత్రి :** 'మైత్రి' అనే మాటని స్నేహం, ప్రేమ అని అనువదిస్తే అవి సామాన్య మయిన మాటలే అవుతాయి. ఇది కేవలం ఇద్దరి మనుషుల మధ్య ఉండే సంబంధం కాదు; ఎందుకంటే స్నేహం శత్రుత్వానికి దారి తీయవచ్చు. స్త్రీ, పురుషుల మధ్య ఉండే ఆకర్షణ అసలే కాదు; ఆ ప్రేమలో ఈర్ష్య, ద్వేషం, లోభం, మొహం, అన్నీ ఉంటాయి. ఇంద్రియాలను వేధించి, హింసించి, హింసించి, గాయాలను మాన్పించే బదులు ఇంకా మండించే భావం కాదు; అందులో వేదన ఉంది. ఈ క్షణానికి భగ్గుమని మరుక్షణానికి ఆరిపోయే నిప్పు కాదు ప్రేమంటే; ఎదుకంటే నిప్పు ఆరిపోయే అవకాశం ఉంది; నమ్మిన వారిని నాశనం చేసే గుణం ఉంది ఇంకాస్త ఒంటరితనాన్ని స్తబ్ధతని మిగిల్చేది అసలేకాదు.

ఎడారిలాంటి జీవితంలో ఎండిపోతున్న వారికి వర్షపు జల్లు లాంటిది ప్రేమ. ప్రేమరాహిత్యంలో నిస్తేజంగా జీవిస్తున్న వారి జీవితాల్లో వెలుగును నింపేది ప్రేమ. దీనులను, హీనులను, ఎటువంటి సానుభూతికి నోచుకోని వారి జీవితాలను అక్కున చేర్చుకుని, ఆశను బలాన్ని కలిగించేది ప్రేమ. ఊగిసలాట లేనిది, దృఢమైనది. ఇవ్వడమే గాని తీసుకోవడం తెలియనిది. దుఃఖాగ్నితో మండిపోతున్న వారికి చల్లదనాన్నిస్తుంది. కోరికల సుడిగుండంలో కొట్టుకు పోతున్న వారికి చేరవలసిన తీరాన్ని చూపిస్తుంది. మంచులాంటి ఒంటరితనపు ఎడారిలో వెలివేయబడ్డవారిని వెచ్చగా పలకరిస్తుంది. దుఃఖ సముద్రపు లోతుల్లోంచి ఆర్తిగా పరితపించే శూన్య హృదయాలకి స్నేహ హస్తాన్నందిస్తుంది - 'మైత్రి'తో నిండిన హృదయం.

దీఘనికాయలో ఈ మైత్రీ భావ ప్రస్తావన ఉంది: ప్రేమ - ఉన్నత హృదయాలను, కుసంస్కారులను, మంచి వారిని, చెడ్డ వారిని - అందరినీ ఒకేలా వర్తిస్తుంది. ఉన్నతులు, మంచి వారి పట్ల ప్రేమ దానంతటదే ప్రవహిస్తుంది. సహజంగా అలాంటి వారి నెవరయినా ప్రేమిస్తారు. అయితే నీచులు, దుర్మార్గుల్ని కూడ ప్రేమ వరిస్తుంది. ఎందుకంటే అసలు ప్రేమ అవసరం వారికే ఉంది కాబట్టి. చాల మందితో మంచి తనమనే విత్తనమే చచ్చిపోయింది. కావలసిన వెచ్చదనాన్ని పొందక ప్రేమ రాహిత్య ప్రపంచంలో మంచులా ఘనీభవించి పోయింది - అని వివరించడబడింది. నిష్కామమైనది ప్రేమ. మనకుపయోగపడేవారిని, మనను సంతోషపెట్టే వారినే కాక, ఈ జనన మరణ చక్రంలో సహచరులైన ప్రతివారిని అలరిస్తుంది ప్రేమ. మనసంతా నిండిపోయిన మైత్రీభావానికి నువ్వు, నేను అన్న భేదం లేదు. ప్రేమ శక్తివంతమైనది పొందడంలో కన్న ఇవ్వడంలోనే తృప్తి సంతోషం ఉంటాయి. తల్లి మనసంత విశాలమైనది ప్రేమ. 'ఒక తల్లి తన ఏకైక పుత్రునికోసం తన ప్రాణాన్ని సైతం లెక్క చేయక ఎలాకొనసాగుతుందో, అలాగే ప్రతి ఒక్కడు సర్వభూతాలయెడ హద్దులు లేని (స్నేహ) మనస్సును కల్పించుకోవాలి" (1.8.7. (149) మెత్తసుత్త: సుత్తనిపాత . అనువాదం : అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి).

**కరుణ:** ప్రపంచం దుఃఖ సముద్రంలో కొట్టుకుపోతూనే ఉంటుంది. అయితే చాలామంది ఏం పట్టనట్టుండి పోతారు. జీవితమంతా ఆగకుండా ప్రవహిస్తున్న కన్నీటి ప్రవాహాన్ని చూడలేరు.

ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తున్న శోకధన్వనులను వినలేరు. స్వార్థంతో నిండిన - వారి హృదయాలు ఇరుకయి పోయి, బిగుసుకుపోతాయి. అటువంటి వారు ఉన్నత లక్ష్యాల కోసం ఏం పోరాడగలరు? నిజానికి తృష్ణను జయించగలిగితే దుఃఖ విముక్తి పొందగలరు.

అయితే ఎంతటి బరువైన దూలాల నయినా కదలించగల శక్తి కరుణకి ఉంది. అది ఇరుకు హృదయాలను, స్వేచ్ఛా ద్వారాలను విశ్వమంత విశాలంగా తెరవగలదు. బరువైన జడత్వాన్ని, నిస్త్రాణమైన భారాన్ని హృదయంలోంచి తొలగించగలదు. దీనంగా, హీనంగా, హేయమైన బతుకుల్లో కూరుకుపోతున్న వారికి రెక్కలు తొడగ గలదు.

నిజానికి, దుఃఖం నించి తప్పించుకోవడం అంత సులభం కాదు. ఎంత పెద్ద చెట్టునయినా నరికేస్తే అది మళ్ళీ చిగురించినట్టు, దుఃఖం ఎప్పటి కప్పుడు పెరుగుతూనే ఉంటుంది. పేరుకుంటూనే ఉంటుంది. కరుణ, దుఃఖాన్ని ధైర్యంగా ఎదుర్కోవడం నేర్పుతుంది. అది మనల్ని ముంచెత్తినప్పుడు మనల్ని శక్తివంతుల్ని చేస్తుంది. మనకన్న ఎంతో దయనీయ స్థితిలో నున్న వారిని చూపించి మన లక్ష్యాన్ని నిర్దేశించుకునేలా మనల్ని సమాధాన పరుస్తుంది. నిరంతర శోక కూపాల్లో కూరుకుపోతున్న ప్రాణులకోసం, ఈ అలుపెరుగని జనన మరణ చక్ర గమనాన్ని ఆపి, కరుణతో నిండిన హృదయ ద్వారాలు తెరవమని బౌద్ధం ప్రబోధిస్తుంది. కరుణ భావాన్ని పెంపొందించుకోలేని వారు ఒకనాడు దానికోసం పరితపిస్తారు. ఇది గొప్ప జీవన న్యాయం. కరుణ ఒక శక్తి. వివేకాన్ని, జ్ఞానాన్ని ఇస్తుంది.

**ముదిత:** ఇతరుల కష్టసుఖాలను పంచుకున్న ఆనందానుభూతి. మాటల్లో వర్ణించలేని అనుభూతి అది. ఎంతో ఔన్నత్యం ఉంటే తప్ప అది తెలియదు, అర్థం కాదు. ఇతరుల మనో వేదనలను పంచుకుని వారికి ఓదార్పునివ్వడంలో ఆనందమే కాదు, ధైర్యం కూడ ఉంది. హృదయాన్నెంతో దృఢంగా చేస్తుందది.

**ఉపేక్ష:** మనచుట్టూ ఉన్న సమతౌల్యం లేని దారుణమైన పరిస్థితులను చూసి ఎవరైనా నిరుత్సాహ పడకమానరు. అయితే ఎటువంటి పరిస్థితులకి బెదిరి పోకుండా, ధైర్యంగా నిలుచునే వాడు ఏమైనా సాధించగలడు. జీవితం గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోగలరు. అటువంటి పరిజ్ఞానంతో కూడిన స్థితప్రజ్ఞతే ఉపేక్ష అంటే. నాలుగు బ్రహ్మ విహారాల్లోను సంపూర్ణత సిద్ధించిన స్థితి ఈ ఉపేక్ష.

ఈ నాలుగు మానసికావస్థలు ఒకదానినొకటి సరి చేసుకుంటూ సంపూర్ణ వ్యక్తిత్వానికి భంగం కలుగ కుండా కాపాడతాయి. అటువంటి వ్యక్తిత్వాలు ఈ నాడెంత అవసరమో చెప్పక్కర్లేదు. అయితే మానసికావస్థను సాధించడం ఎలా అన్నది ప్రశ్న. ఒక పద్ధతి ప్రకారం చేసే ధ్యానం ద్వారా ఈ బ్రహ్మ విహార భావనని పొందగలరు. ధ్యానం పట్టు వదల కుండా చేస్తే అది రెండు విధాలుగా ప్రభావితుల్ని చేస్తుంది. మొదటి, ఈ భావాలను మనసులో లోతుగా పాతుకుపోయేలా చేస్తుంది. దాని వలన ఇవి అనన్య ప్రేరితాలై, సులభంగా తీసివేయలేని వవుతాయి. రెండోది, విశాలంగా తెరుచుకుని సృష్టంతా విస్తరిస్తాయి. ఇవి ఎంత విశాలంగా విస్తరిస్తాయో బౌద్ధ గ్రంథాల్లో స్పష్టంగా వివరింప బడింది వీటి వల మనుషుల మధ్య, దేశాలమధ్య ఉన్న హద్దులు ఒక పద్ధతి ప్రకారం చెరిగిపోతాయి.

ఈ ధ్యాన సాధనతో మైత్రి, కరుణ చేరవలసిన వారికి క్రమంగా చేరుతాయి. ఎలా అంటే - మనిషి ముందుగా తన క్షేమాన్ని చూసుకుంటాడు. తరవాత ఇంకాస్త ముందుకెళ్ళి క్రమంగా, తానెంతో గౌరవించే వ్యక్తికి, ప్రేమించే వ్యక్తులకి, రక రకాల వారికి, ఇష్టంలేని వారికి, శత్రువులకి కూడా ఈ మైత్రీ భావనను వ్యాపింపజేస్తాడు. 'నేను దుఃఖం నుండి విముక్తి పొంది సుఖంగా ఉండాలని ఎలా అనుకుంటానో, ఎదుటి మనిషితో పాటు మిగతా ప్రాణులన్నీ అలాగే సుఖపడాలని కోరుకుంటున్నాను' అనుకుంటాడు సంపూర్ణంగా వికసించిన హృదయంతో.....

# తెలంగాణాలో బౌద్ధం

- మలయశ్రీ

మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2, 3 వందల ప్రదేశాల్ల పురాతన నిర్మాణాలు కనిపించినై. వాటిలో పదిహేను మాత్రమే తెలంగాణా ప్రాంతంల ఉన్నయ్. కారణాలేవైనా వాటికీ వ్యాప్తి తక్కువే. "తెలంగాణాలో బౌద్ధం" ఈ ప్రసంగ వ్యాసంలో మనం వాటి వివరాలను సంగ్రహంగా అయినా సమగ్రంగా సమాలోకనం కావిద్దాం.

ఈ నా భాష తెలంగాణది. ఎందుకంటే తెలంగాణ మాండలికం మరుగున పడిపోవద్దనే నా ఈ ప్రయత్నం. పైగా, నా వివరణ అంశాలు ఎన్నో మీకు కొత్తగా, మీ అభిప్రాయాలకు భిన్నంగా అనిపించవచ్చు. సహృదయతతోని విని, ఆలోచించవలసిందిగా మనవి.

**తెలుగు - ఆంధ్రులు:** తెలుగు భాష రెండు వేలేండ్లది. తెలుగు శాసన సాహిత్యం పదిహేను వందలేండ్లది. తెలుగు కావ్యసాహిత్యం వెయ్యేండ్లది. ఆంధ్రమనే పేరు దీనికి ఆంధ్ర జాతిని పట్టి వచ్చింది. శాతవాహనులకు (క్రీ.పూ. 200) పూర్వం ఆంధ్ర రాజులు ఈ ప్రాంతానికి ఏలికలు. శాతవాహనులు ఆంధ్రభృత్యులు. ఆంధ్రుల తర్వాత వారు ఇక్కడి పాలకులు. క్రీ.శ. 200 వరకు అంటే ఇంచుమించు 400 సంవత్సరాలు ఈ శాలివాహనుల పాలన సాగింది. వీరు మగధను కూడా జయించిన్రు.

చంద్రగుప్త మౌర్యుని కాలపు మెగస్తనీస్ (క్రీ.పూ. 320) ఆంధ్రులకు బలమైన ముప్పది కోటలున్నవని, తన 'ఇండికా' గ్రంథంలో రాసిండు. ఆ మాటే విదేశ యాత్రికుడు ప్లినీ కూడా అన్నాడు. ఐతరేయ బ్రాహ్మణం ఆంధ్ర జాతిని, వాల్మీకి రామాయణం ఆంధ్రదేశాన్ని, ఆంధ్రశ్చ బహవః అని వ్యాస భారతం, భాగవత, వాయు, గరుడ పురాణాలు ఆంధ్ర రాజుల (శాతవాహనులను) గురించి పేర్కొన్నవి. విశేషమేమంటే రామాయణంల బౌద్ధ ప్రసక్తి ఉంది కాని, బౌద్ధ త్రిపిటికాలందు రామాయణ ప్రస్తావన లేదు. క్రీ.పూ. 2000 ఏండ్ల నాడు ఆర్యవైదిక మత సంస్కృతి ఈ దేశంలో ప్రవేశించింది - వ్యాపించింది. క్రీ.పూ. 3వేల ఏండ్ల నాటిది సింధూలోయ స్థానిక అనార్య ద్రవిడ నాగరికత, మన తెలుగు ప్రముఖ ద్రవిడ భాషలలో ఒకటి.

**ఆర్యులు - వైదిక మతం:** క్రీ.పూ. రెండువేలేండ్ల నాడు ఆర్యులు సింధూ ప్రాంతాన్ని ఆక్రమించుకొని క్రమంగా గంగానది వరకు చేరుకున్నారు. వింధ్య పర్వతాల పై భాగమే ఆర్యావర్తం, ఆర్యులు సంచార జీవులు, పశుపోషకులు, స్ఫురద్రూపులు, వీరులు, యుద్ధ ప్రియులు. వారి దేవతలూ ఆయుధ ధారులే. పశుపోషణతో పాటు వ్యవసాయం నేర్చుకొని పల్లెలు నిర్మించుకొని స్థిర జీవితానికి అలవాటుపడి క్రమంగా పట్టణాలు - రాజ్యాలు ఏర్పరచుకున్నారు వాళ్ళు.

ఆర్యుల మత గ్రంథాలు చతుర్వేదాలు. అవి శ్రుతులు. వ్రాత లేదు, వారు యజ్ఞ ప్రియులు. ప్రకృతి దేవతలను ఆరాధించే వారు. విగ్రహారాధన లేదు. వర్ణవ్యవస్థ వారి కాలంలోనే ఏర్పడ్డది. అది వివిధ కులాలుగా చీలింది.

అప్పుడు యజ్ఞాల కారణంగా పశుబలి పెరిగి వ్యవసాయ దారులకు ఇబ్బందిగ మారింది. వైదిక కర్మకాండల వ్యయాల భారం సామాన్య గృహస్థులకు భరించరానిదైంది. అది ఒక విధంగా

డా॥ మలయశ్రీ, భౌతికవాద రచయిత, నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షుడు,
వేమన నగర (రేకుర్తి), కరీంనగర్.

బ్రాహ్మణాధిక్య మతం. రాజులు దైవాంశ సంభూతులు! వైశ్యులూ బాధితులే. వ్యవసాయం పశు పోషణ వైశ్యుల వృత్తులని మనుస్మృతి పేర్కొంది. వాణిజ్యం అనంతర కాలాన వారిని చేరి ఉంటది. శూద్రులకు పై త్రైవర్ణికుల సేవ ప్రధాన విధి. పంచములు అస్పృశ్యులు - గ్రామ బాహ్యులు. ఇదీ ఆర్య వైదిక సంస్కృతిక సామాజిక పరిస్థితి.

**వేద మతంపై తిరుగుబాటు:** జైనం - బౌద్ధం రెండూ ఇంచుమించు ఒకే కాలాన (క్రీ.పూ. 6వ శతాబ్ది) ఆర్య వైదిక మతాన్ని వ్యతిరేకిస్తూ వచ్చినై. అవి వేద ప్రామాణ్యాన్ని - యజ్ఞ యాగాలను, దేవుళ్ళను - పరలోకాలను, వర్ణ వ్యవస్థను ఒప్పలేదు - పైగా వాటిని ఖండించినై. శాంతి, అహింసలకు పట్టం కట్టి సర్వ మానవ సమతా భావాన్ని ప్రబోధించినై. ఆ రెండు తాత్త్విక సిద్ధాంతాల ప్రవర్తకులు వర్ధమాన మహావీరుడు, సిద్ధార్థ గౌతమ బుద్ధుడు క్షత్రియులు - రాజకుమారులే. అదేమిటో కాని, జైన, బౌద్ధ ధర్మాలు రెండూ ఒకే కాలనివి, ఒకే ప్రాంతానివి అయినా (ఉత్తర భారతదేశం) ఒకరి ధర్మ గ్రంథంల మరొకరి ప్రస్తావన లేదు.

**బుద్ధుడు - బౌద్ధం:** వైదిక వర్ణ భేదాల యుద్ధాల - యజ్ఞాల, హింస - మత కర్మకాండల - సాంఘిక అసమానతల, బాధల భారంతోని మన భారత దేశ సమాజం సంక్షుభితమై ఉన్న పరిస్థితుల్లోపల వైదిక మతంపై తిరుగుబాటుగా వచ్చింది బౌద్ధం. అనతి కాలంలోనే అది విజయ బావుటా ఎగురవేసి, దేశ విదేశాలకు వ్యాపించింది. ప్రజల - రాజుల అభిమానం పొందింది. బౌద్ధ ధర్మ సిద్ధాంత ప్రబోధకుడు సిద్ధార్థ గౌతముడు. అతడు కపిలవస్తు (నేపాల్) గణ పాలకుడైన శుద్ధోదన రాజు పుత్రుడు. లోక దుఃఖ నివారణ కోసం యువ వయస్సునందే అతడు సంసారాన్ని - రాజ్యాన్ని విడిచి పెట్టి సన్యసించి అడవులకు చేరి ఆరేండ్లు కఠోర తపశ్చర్యంతో గడిపిండు. వివిధ గురువుల ఆశ్రయించిండు. చివరికి బోధిగయ వద్ద సిద్ధార్థునికి జ్ఞానోదయం అయ్యింది. అప్పటి నుంచి అతడు బుద్ధుడు, బుద్ధ ధర్మం బౌద్ధం.

బుద్ధుడు జన్మించింది, జ్ఞానోదయం కలిగింది, మహాపరినిర్వాణం పొందిందీ వైశాఖ పూర్ణిమనాడే. బుద్ధుడు తన నూతన ధర్మాన్ని ఆషాఢ పూర్ణిమ నాడు ఉరువేల మునులకు తన తొలి శిష్యులకు మొదటిసారి ఉపదేశించాడు. అదే ధర్మచక్ర ప్రవర్తన. ఆషాఢ పూర్ణిమను హిందువులు వ్యాస పూర్ణిమ (గురు పూర్ణిమ - బుద్ధునిది) గా మార్చుకున్నారు.

చతురార్య సత్యాల గుర్తింపు బౌద్ధులకు ముఖ్యం, త్రిశరణాలు పారాయణ పవిత్ర వాక్యాలు, అష్టాంగ మార్గాల ఆచరణ జీవనమార్గం.

బౌద్ధం ఆర్యుల వైదిక సంస్కృతిని తిరస్కరించింది. యజ్ఞాల పశు బలిని నివారించింది. వర్ణ భేదాలను ఖండించింది. దేవుళ్ళను, పరలోకాలను చివరికి ఆత్మను కూడ కాదంది. పంచ భూతాలందు ఆకాశాన్ని వదలి వేసి నాలుగే అంది. శాంతి, అహింస, భూతదయ, సేవ లకు పట్టం కట్టింది. అది ఒకరకంగా ఆదిమ భౌతిక వాదం, మానవ సమతా మార్గం, ఏభై ఏండ్లు బుద్ధుడు తన నూతన ధర్మ ప్రచారం కావించి ఎనుబదవ ఏట కుశినార పట్టణ సమీపాన నిర్వాణం పొందిండు. అతని శిష్యుల రాజుల ప్రజల బుద్ధ భక్తి కారణంగా అతని చితాభస్మం స్మృతిగా ఉంచుతూ అనేక స్థూపాల నిర్మాణం జరిగింది.

మౌర్య అశోక చక్రవర్తి కళింగ యుద్ధ విధ్వంసానంతరం బౌద్ధ ధర్మ స్వీకారం కావించి ప్రచారం ప్రారంభించాడు. అప్పుడే బౌద్ధం చీనా - సింహళం మొ॥ విదేశాలకు వ్యాపించింది.

బౌద్ధం బుద్ధుని కాలంలోనే అనేక రాజుల ప్రజల ఆదరణ పొందింది. బౌద్ధా శ్రమాలు - విహారాలు వెలసినై. బౌద్ధ సన్యాసులు వీతరాగులు, సద్ధర్మ ప్రచారకులు, స్వచ్ఛంద ప్రజాసేవకులు.

బుద్ధుడు ఆలోచనకు, తర్కానికి, వ్యక్తి స్వేచ్ఛకు విలువ ఇచ్చిండు. మానవ సమానతను బోధించినాడు. వైదిక మత విశ్వాసాల కాదన్నాడు. అయితే బుద్ధ ప్రబోధం అక్కడికే ఆగిపోలేదు. రాను రాను అది వింతగా మారింది. బుద్ధుని తర్వాత కొద్ది కాలానికే అది మహాయాన బుద్ధ శాఖగా చీలి బుద్ధున్ని దేవుడన్నది, దానితోని కళలు - సాహిత్యం వృద్ధి పొందినా, ఆదిమ బౌద్ధం తన నిజ స్వరూపాన్ని కోల్పోయింది. మూల బౌద్ధం థేర - స్థవిర వాదం, హీనయానం అని పిలువబడింది. ఉభయ (మహాయాన, హీనయాన) బౌద్ధాలు తర్వాత అనేక విభాగాలుగా చీలిపోయినై,

జైన బౌద్ధాల ప్రభావంతోని వైదిక మతం పురాణాల హిందూ మతమైతే, హిందూమత దేవుళ్ళ మంత్రాల పూజల ప్రబావం పడి మహాయానం నుంచి వజ్రయాన బౌద్ధం రూపొందింది. అదే మొన్న **(5-16** జనవరి **2006)** మన అమరావతిలో కాలచక్ర పూజలు నిర్వహించింది. బుద్ధుడు ఆంధ్రదేశానికి వచ్చి బౌద్ధ ధర్మోపదేశం చేసిండనేది అభూత కల్పన. అది ఒక బౌద్ధ శాఖ విశ్వాసం మాత్రమే.

ఓ వెయ్యేండ్లు రాజుల - ప్రజల ఆదరణ పొంది మహా వైభవోపేతంగా మన దేశాన విలసిల్లిన బౌద్ధం దానిలోని చీలికల విభేదాలతోని, ఇంకా ఆర్య వైదిక హిందూమత విజృంభణ కారణంగా క్రమంగా మన దేశాన అంతరించింది.

క్రీ.శ. 7వ శతాబ్ది హ్యూన్‌త్సాంగ్ కాలానికే బౌద్ధాశ్రమాలు - విద్యాలయాలు చాలావరకు కళతప్పినట్లు తెలుస్తున్నది. క్రీ.శ. వెయ్యి సంవత్సరాల దాకా అంతో ఇంతో బౌద్ధ వాసన ఈ దేశాన ఉన్నా ఆ తర్వాత పూర్తిగా కనుమరుగై పోయింది.

మల్లా **20**వ శతాబ్ది డి.డి. కోశాంబి, రాహుల్ సాంకృత్యాయన్, ప్రొ. లక్ష్మీ నరసు, డా. కె.బి. కృష్ణ పరిశోధనల - రచనల కారణంగా మన దేశ మేధావుల దృష్టి బౌద్ధం దిక్కుమారి - బౌద్ధం చర్చనీయాంశం అయ్యింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ **1956**లో **4, 5** లక్షల మంది అనుయాయులతో కలిసి బౌద్ధ ధర్మ స్వీకారం చేశాడు. బౌద్ధానికి ఈ తన పుట్టిన నేలమీద పునరుజ్జీవనం అనవచ్చు. అయినా అదీ పాక్షికమే.

ఇప్పటికీ జపాన్, బర్మా, థాయిలాండ్, శ్రీలకం మొ॥ పలు దేశాల్లో బౌద్ధం ప్రభుత్వమతంగా ఉంది. తన పుట్టిన దేశంలో మాత్రం నామమాత్రంగా మిగిలింది. ఇప్పుడు మన ప్రభుత్వ - విశ్వవిద్యాలయాల దృష్టి బౌద్ధం దిక్కు ప్రసరించుట ముదావహం. అందులోని ఒక భాగమే ఈ ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగ జాతీయ బౌద్ధ చర్చాగోష్టి అనవచ్చు.

**ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధం:** బుద్ధుని కాలాన్నే బౌద్ధం మన రాష్ట్రానికి పరిచయం అయినట్లు బౌద్ధ పూర్వసాహిత్య - చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అశ్మక గోదావరి తీర బావరి ముని శిష్యులు మగధకు వెళ్ళి బుద్ధునితో సంభావించి బౌద్ధులుగా మారి వచ్చిన కథన సుత్తనిపాత - పారాయణ వగ్గ. బౌద్ధుల లలిత విస్తర గాధలో బింబిసారుని సమక్షాన ఆంధ్ర నాటికలు 'మహాబోధిని' నాటకాన్ని ప్రదర్శించినట్లు ఉంది. బుద్ధుని శిష్యుడు మహాకాత్యాయనుడు అశ్మక రాజుకు బౌద్ధ ధర్మ దీక్ష ఇచ్చినట్లు 'విమాన వత్తు' చెప్పింది. బౌద్ధ శిష్యుడు కొండన తెలుగు వాడట.

సెరివణిజ జాతకం 'తెలినాగ' నదీ తీర ఆంధ్రనగరని పేర్కొంది. అట్ట కథలు అంధకరట్ట పదాన్ని వాడినై, కోటి లింగాల కోటి స్థూపం. ఆంధ్రుల నిర్మాణాలు, ధూళికట్ట స్థూపం. నాగముచిళింద నిర్మాణం. అక్కడి కోట ఆంధ్ర రాజులది. ఇవి శాతవాహనులకు పూర్వ **3, 4** శతాబ్దాలవి.

మొదటి, రెండవ బౌద్ధ సంగీతులకు ఆంధ్రులు పోకున్నా మూడవ సంగీతికి అశోక చక్రవర్తి పిలుపుపై వెళ్ళి అప్పుడు బౌద్ధం చీలి, మహాయాన బౌద్ధులు దక్షిణానికి చేరుకున్నారు. నాగార్జున కొండ, అమరావతి నాటి బౌద్ధ కేంద్రాలు.

ధూళికట్ట - నాగముచిళింద, భట్టిప్రోలు స్థూప నిర్మాత - కుబేరుడు, అమరావతి / వడ్డమాను / సోమకుడు, గుంటుపల్లి - సద, తెలుగు వ్యక్తులు, అశోకుని శాసనాలు జొన్నల గిరి, అమరావతి వద్ద కన్పించినై. దంతపురం, అమరావతి, భట్టిప్రోలు స్థూపాల్లో బుద్ధ ధాతువు నిక్షిప్తమై ఉంది. భట్టిప్రోలు ముఖ్యస్థలం క్రీ.పూ. 4వ శతాబ్ది.

మహాయాన బౌద్ధా చార్యుడు మొదటి నాగార్జునుడు (కనిష్కుని కాలం క్రీ.శ. ఒకటవ శతాబ్ది), బహుగ్రంథకర్త రెండవ నాగార్జునుడు (క్రీ.శ. రెండవ శతాబ్ది - శాతవాహన చక్రవర్తి యజ్ఞశ్రీ కాలం, అమరావతి, మహాస్థూప ప్రాకార, నిర్మాత), ఆరవ శతాబ్ది వజ్రయాన బౌద్ధ గురువు మూడవ నాగార్జునుడు తెలుగువాళ్ళు, నందికొండ - నాగార్జున కొండ నివాసులు.

బుద్ధుని కాలం నుంచే ఇటు బౌద్ధం ప్రచారమైంది. అశోకునికి పూర్వం నుంచే ఇక్కడ బౌద్ధ స్థూప - చైత్య - విహారాల నిర్మాణం జరిగింది అనేది చారిత్రక సత్యం. 7వ శతాబ్ది హ్యూన్‌త్సాంగ్ ఆంధ్ర దేశంలో సంచరించి ఇక్కడి బౌద్ధ క్షేత్రాల పరిస్థితి వివరించాడు.

**తెలంగాణాలో బౌద్ధం:** ముందు శాతవాహనుల కాలంలో వెనుక ముస్లింల పాలనలో మినహాయిస్తే 12, 13 శతాబ్దాల్లో ఒక్క ఓరుగల్లు కాకతీయుల సామ్రాజ్యంలోనే తెలుగు ప్రాంతమంతా ఒక్కటిగా ఉంది. మిగితా కాలాల్లో ఇది అనేక రాజుల ఏలుబడిలో వేర్వేరు భాగాలుగా ఉంది. రాజకీయ కారణాలవల్ల కోస్తాంధ్ర, రాయలసీలమ, తెలంగాణ అని మూడు ప్రధాన ప్రాంతాలుగ వ్యవహారం ఉంది. తెలంగాణ పదం ముస్లింల కాలాన విస్తృతార్థంగా వాడబడినా, 1956 నవంబర్ 1 ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ప్రస్తుతం పది జిల్లాల ప్రాంతం తెలంగాణా అని వ్యవహరింపబడుతున్నది. ఆంధ్రులు అనే పదం కోస్తా వారికి వర్తిస్తున్నది. కాబట్టి తెలుగు పదం ఎక్కువ వ్యాప్తికి వస్తున్నది. తెలుగు - ఆంధ్ర పదాలు అభేదాలు - సమానార్థకాలు.

భారత స్వాతంత్ర్యానికి - నైజాం విముక్తికి పూర్వం తెలంగాణ ప్రాంత భాషా సాహిత్యాల ఏర్పడిన స్వచ్ఛంద సంస్థ పేరు 'ఆంధ్ర సారస్వత పరిషత్తు.' ఇప్పుడు ఆంగ్లభాషా వ్యామోహం నుంచి మన మాతృ భాషను రక్షించటానికి రూపొందిన సంస్థపేరు 'తెలుగు భాషోద్యమ సమాఖ్యం.'

ఆంధ్రప్రదేశ్‌ల సుమారు 300 బౌద్ధ నిర్మాణాల ప్రదేశాలు కనిపిస్తే వాటిలో కేవలం 10-15 మాత్రమే తెలంగాణా ప్రాంతానివి. రాశికి తక్కువైనా వాసికి మిన్నయినవే ఇవి. తొలి తరం బౌద్ధం థేర / స్థవిర వాద (హీనయాన) బౌద్ధ ప్రభావమే ఇటు ఎక్కువ. గోదావరి తీర ప్రాంతమంతా అంతే. మహాయానం వ్యాప్తి కృష్ణానదీ పరీవాహక ప్రాంతానిదే.

తెలంగాణలో గోదావరి - కోటిలింగాల (కరీంనగర్ జిల్లా) శాతవాహనులకు పూర్వపు ఆంధ్ర రాజులకు, తొలి శాతవాహన చక్రవర్తులకు రాజధాని. కృష్ణా తీర విజయపురి నాగార్జునకొండ (నల్గొండ జిల్లా) శాతవాహనుల కాలాన ప్రముఖ బౌద్ధ కేంద్రం. తర్వాత 3వ శతాబ్ది ఇక్ష్వాకుల రాజధాని.

కరీంనగర్ జిల్లా ధూళి కట్ట స్తూపం అశోకునికి మొదటిది. అశ్మక రాజధాని బోధన్ - నిజామాబాద్ జిల్లాల ఉంది. మెదకు జిల్లా కొండాపురం శాతవాహన పట్టణం. కరీంనగర్ జిల్లా పెద్ద బొంకూరు

శాతవాహన గ్రామం. బుద్ధుని కాలపు బావరి మునిది కరీంనగర్ - ఆదిలాబాద్ జిల్లాల మధ్య గోదావరి ద్వీపగ్రామం బాదనకుర్తి.

**జిల్లాల వారీగా తెలంగాణ ప్రాంత బౌద్ధ స్థావరాలు:**

1. నిజామాబాద్ - బోధన్ 2. మెదకు - కొండాపురం 3. కరీంనగర్ - కోటిలింగాల, ధూళికట్ట, పాశిగాం, మీర్జం పేట, 4. నల్గొండ - నాగార్జున కొండ, తిరుమల గిరి, ఫణిగిరి, గాజుల బండ, వర్లమాకుల 5. ఖమ్మం - న్యాలకొండపల్లి,అశ్వారావుపేట, కాపవరం, 6. మహబూబ్‌నగర్ - ఏలేశ్వరం.

ఆదిలాబాద్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాంతాల్ల బౌద్ధ నిర్మాణాల ఆనవాళ్ళు ఇంతవరకు కనిపించలేదు. బావరి నివాస స్థలం బాదనకుర్తిని పై వాటిలో చేర్చవలసి ఉంది. పై ప్రదేశాల పేర్లు ఆయా ప్రాంతాల బౌద్ధ నిర్మాణాల కాలాలవి మాత్రం కావు. తర్వాతి కాలాన రాజకీయ సాంఘిక కారణాలవల్ల ఎన్నో మార్పు చెందినై. కొన్ని పదాలకు ఇప్పుడు అర్థాలే తెలువవు.

**బౌద్ధ స్థూపాల విశేషాలు:** తెలంగాణ బౌద్ధ ప్రదేశాలన్నీ స్థూపాలవే. ఇటు కొండలు ఎక్కువే కాని, శిలలను తొలచిన గుహారామాలు, చైత్యాలు లేవు. అన్ని ఇటుక మట్టి సున్నం శిలాఫలకల నిర్మాణాలు. వాటి వివరాలు.

*1. కోటిలింగాల:* కరీంనగర్ జిల్లా గోదావరి తీరంలోని ఇప్పటి కుగ్రామం కోటిలింగాల. ఇది క్రీ.పూ. 3, 4 వందలేండ్ల కాలంనాడే గొప్పరేవు పట్టణం. శాతవాహనులకు వారికి పూర్వపు ఆంధ్ర రాజులకు ఇది రాజధాని. ఇక్కడ ఆంధ్ర రాజుల, శాతవాహన చక్రవర్తుల నాణాలు లభించినై. సిముఖ శాతకర్ణి నాణాలను పట్టి ఇదే వారి మొట్టమొదటి రాజధాని అని చరిత్రకారుల నిర్ణయం. పైఠాన్, ధరణికోట ఆ తర్వాత వారి రాజధానులు, ఇక్కడ రోమన్ నాణాలు కూడా లభించి నాటి మనవారి విదేశ వర్తక ప్రాముఖ్యాన్ని తెలిపినై. కోటిలింగాల నాణాల వల్ల తెల్సిన క్రీ.పూ. 3, 4 శతాబ్దాల పూర్వాంధ్ర రాజులు గోబద, కమవాయిసిరి, సామగోప, నారన, ఈ మధ్య 'ఆంధ్ర జ్యోతి' ఆదివారం సంచికల మన దేశ పూర్వ నాణాల గురించి పరిశోధన వ్యాసాలు రాస్తున్న డా॥ రాజారెడ్డిగారు - కోటిలింగాలలో దొరికిన నాణాలు భారతదేశంలోని మొట్టమొదటి నాణాలని పేర్కొనుట విశేషం - గమనార్హం.

1921 ల వెలుగు చూసిన హరప్పా - మోహంజోదారో సింధూలోయ తొలి (అనార్య, స్థానిక ద్రవిడ) నాగరికతకు ఎంత ప్రచారం - వ్యాప్తి లభించిందో మనకు తెలుసు. ఈ కోటిలింగాల గుర్తించబడి 20, 30 ఏండ్లు అవుతున్నా చరిత్రలో తగిన ప్రాధాన్యత - ప్రచారం జరుగలేదు. ఇక్కడి మట్టికోట, ఇటుకల స్థూప శిథిలాలు, సందర్శకులకు బాధను కలిగించుతవి. బ్రహ్మిలిపి , పాళీభాష శాసనం స్థూపం మీద ఉంది. కోట పాతది. శివలింగాలు కొత్తవి. కోటిలింగాలే కోటిలింగాల. మన రాష్ట్ర చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కల ప్రదేశం ఇది.

*2. ధూళికట్ట:* కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ తాలుకాలోని ఒక చిన్న వాగు ప్రక్కన ఉన్న ఈ స్థూపం చాలా పెద్దది. అమరావతి స్తూపం కన్నా చిన్నది. నాగముచిళింద నిర్మాణం. నాగబంధ శిల్పం రమ్యం. బ్రహ్మి లిపి, పాళీభాషలో పేర్లున్నవి. శిల్ప కళను పట్టి చూస్తే ఇది అమరావతి కన్నా పూర్వపుది అనవచ్చు. బుద్ధ ప్రతిమలు లేవు.

ఆచార్య రెండవ నాగార్జునుడు ప్రజ్ఞా పారమిత గ్రంథాన్ని నాగరాజు ముచిళిందుని నుంచి పొందినట్లు తెలుస్తున్నది. నామ సామ్యాన్ని పట్టి కృష్ణాజిల్లా మచిలీపట్నం కావచ్చునని కొందరి ఊహ.

కాని, మచిలీ అనేది ఉర్దూ పదం. చేప అని దాని అర్థం. ఆ పట్టణాన చేపకంటి ద్వారం ఉందని వినికిడి. బందరు అనేది కూడా బందర్గాహ అనే ఉర్దూ పదానికి సంక్షిప్త రూపం. అంటే హార్బర్ - ఓడరేవు. పురాతన చరిత్రకు ఆధునిక అన్యభాషా పదాల ఊళ్ళ పేర్ల ధ్వని సామ్యాన్ని పట్టి ఊహించుట సరియైనది అనుకోలేం.

ధూళికట్ట స్థూప నిర్మాత నాగముచిళింద బౌద్ధుడు. ఇతని నుంచే నాగార్జునుడు పై గ్రంథాన్ని తీసుకొని యుండవచ్చును. అని ఎందుకు అనుకోకూడదు. పైగా నాగార్జునాచార్యుని జన్మస్థలి వేదలి. అది గుంటూ జిల్లా యాదలిగా భావిస్తున్నారు. కాని, కరీంనగర్ జిల్లా మానేరు నదీ తీరాన 'వెల్డి' అనే చారిత్రక గ్రామముంది. వెల్డి - వేదలికి దగ్గరి పదం కదా. భావి పరిశోధకుల వల్ల నిజం తేలవచ్చు.

ఈ స్థూపానికి సమీపాన పురాతనపు ఇటుక కోట పురావస్తు శాఖ వారి తవ్వకాల్లో బయట పడ్డది. ఇది ఆంధ్రరాజులది. శాతవాహనుల పంచ్‌మార్క్ నాణాలు సైతం ఇక్కడ దొరికినై (అవి కొన్ని నావద్ద ఉన్నవి కూడా). మెగస్తనీస్ చెప్పిన ఆంధ్రుల 30 కోటల్లో రెండు కోటిలింగాల, ధూళికట్ట.

ఇక్కడి శిల్ప శిలా ఫలకాలు నాలుగు మొన్నటి అమరావతి కాలచక్ర ఉత్సవాలకు, కరీంనగర్ పురావస్తు శాఖ నుంచి తరలివెళ్ళినవి. అవి మళ్లీ తిరిగి వస్తవో రావో అని ఇక్కడి చరిత్ర అభిమానుల అనుమానం.

ధూళికట్ట స్థూపం పునరుద్ధరణకు జపాను వారి గ్రాంటు వచ్చినా అభివృద్ధి పని మధ్యలోనే ఆగిపోయింది. ఇక్కడికి పోవుటకు సరియైన దారి కూడా లేకపోవుట విచారణీయం.

***3. పాశిగాం:*** కోటిలింగాలకు సమీప గ్రామం పాశిగాం. కరీంనగర్ - లక్షెట్టి పేట బస్సు మార్గానికి ఇది కుడివైపున ఉంది. ఇక్కడ ఒక మట్టి దిబ్బ మీదవర్తులా కారంగా చిన్న బౌద్ధ స్థూపముంది. ఊరికి రోడ్డు వేస్తూ కంట్రాక్టర్లు మట్టికోసం దీన్ని కూలిస్తే స్థూప శిల్ప ఫలకలు మాత్రం మిగిలినై. కాళిదాసు మేఘ సందేశంలో పేర్కొన్న దిఙ్నాగుడు బౌద్ధ తర్కపండితుడు, కుందమాల నాటక కర్తది ఇదే ప్రదేశమని డా॥ వి.వి. కృష్ణశాస్త్రి అభిప్రాయం (కరీంనగర్ జిల్లా 'శాతవాహన కళోత్సవాల సంచిక - 2002). 'పాయసి సుత్త' లో బుద్ధునితో సంభాషించిన పాయసికి-ఈ స్థూపానికి ఏమైనా సంబంధం ఉండవచ్చునేమో అని నా భావన. పాయసి గ్రామం పాశిగాం అని మారుడు సులభం.

***4. మీర్జం పేట / పోచం పల్లి:*** స్థూపం చిన్నది. అయినా దీనిలోని భరణిలో చితా భస్మం లభించి విశేషతను సంతరించుకున్నది. అది ఎవరిదో ఏ కాలపుదో తెలిపే రాతల ఆధారాలు దొరుకలేదు.

***5. బోధన్:*** పురాణాల కాలపు షోడశ మహా జనపదాలలో చివరివి దక్షిణ ప్రాంతానివి అశ్మక ముళక. ముళక మెదకు జిల్లా పై భాగం. అశ్మక నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రాంతం. రెండూ ఉత్తర తెలంగాణవే. అయితే ఈ మధ్య ఒక బౌద్ధ రచయిత అశ్మక కళింగ ప్రాంతమని రాసుడు విచారణీయాంశం.

బోధన్ / పోతలి /పోతన నగరం అశ్మక రాజధాని. అశ్మకను పాలించే ఒకానొక రాజుకు బుద్ధ శిష్యుడు మహాకశ్యపుడు బౌద్ధ ధర్మోపదేశం కావించినట్లు పూర్వ బౌద్ధ సాహిత్యం పేర్కొంది. అశ్మకలోని గోదావరి తీర బావరి బ్రాహ్మణముని శిష్యులు 16 మంది గురువుగారి కోరికగా వెళ్ళి మగధలో బుద్ధునితో సంభాషించి సంతృప్తి చెంది తిరిగి వచ్చిన 'బౌద్ధ సుత్తనిపాత - పారాయణవగ్గ' గాధ తెలుపుతున్నది. బావరిది కోటిలింగాల అని మరో బౌద్ధ రచయిత భావన. కాని, అతని నివాసం

గోదావరి ద్వీప గ్రామం బాదకుర్తి కావచ్చునని ఠాకూర్ రాజారాంసింగ్ (పెద్దపల్లి) భావిస్తే, ఆదిలాబాద్ ఖానాపూర్ - కరీంనగర్ మెట్‌పల్లి మండలాల మధ్య ఉన్న ఆ గ్రామానికి వెళ్ళి అదే బావరి నివసించిన స్థలమని నిర్ణయానికి వచ్చింది నేను - 2001. బావరన్న కుర్తి - బాధున్నకుర్తి (వరదలకు) బాదనకుర్తి అని మారుట సహజం. కుర్తి పర్తి పురాతన గ్రామ నామాలు.

అయితే బోధన్‌కు బౌద్ధంతో కాక జైన క్షేత్రంగానే ఎక్కువ గుర్తింపు ఉంది. (కర్ణాటక శ్రవణ బెళగొళ గోమటేశ్వర 'బాహుబలి' మహా విగ్రహం) బాహుబలి అశ్మక రాజ్య పోతలి / బోధన్ పాలకుడు. మొదటి తీర్థంకరుడు అయోధ్యరాజు. రిషభ దేవుని రెండవ కుమారుడు ఈ బాహుబలి. తర్వాత విరాగి సాధు అయిన జిన - కేవలుడు. వర్ధమాన మహావీరుడు 24వ, తీర్థంకరుడని జైనుల విశ్వాసం. అంటే బహుబలి చాల పూర్వకాలం వాడన్నమాట. అంటే పోతలిపురం కూడా అంత పాతది.

లేములవాడ చాళుక్యుల (9, 10 శతాబ్దుల) తొలి రాజధాని బోధన్. మలి రాజధాని కరీంనగర్ జిల్లా లే/వేములవాడ, బోధన్, కొలనుపాక, హన్మకొండ, అలంపురి తెలంగాణా ప్రాంత ప్రసిద్ధ జైన కేంద్రాలు.

వేములవాడ చాళుక్యుల రెండవ అరికేసరి ఆస్థాన కవి జైనుడు పంపకవి 'విక్రమార్జున విజయం' పేర వ్యాస భారతాన్ని కన్నడ భాషల అనువదించిండు. క్రీ.శ. 941 (ఎ.డి.) అతడు కన్నడ ఆదికవి. మన తెలుగు ఆది కవి నన్నయ భట్టారకుని కంటె నూరేండ్లు పూర్వుడు. పంపకవి తమ్ముడు జిన వల్లభుడు జైనముని - కవితా గుణార్ణవుడు. అతని కురిక్యాల (కరీంనగర్ జిల్లా గంగాధర సమీపం) శాసనం సంస్కృత, కన్నడ, తెలుగు మూడు భాషలది క్రీ.శ. 946 (ఎ.డి.) శాసనం చివర మూడు తెలుగు కంద పద్యాలున్నవి. ఇవే తెలుగులో మొదటి కందాలు. నన్నయ భారత రచన (1052) వరకు ఆంధ్ర ప్రాంత శాసనాలందు తరువోజు, మధ్యాక్కర, సీసపద్యాలు తప్ప కందాలు కనిపించలేదు. కథా సరిత్సాగరం, యశస్తిలక చంపువు, నీతి సూక్తి ముక్తావళి రచించిన సంస్కృత కవి సోవదేవసూరి వేములవాడ నివాసి - 10వ, శతాబ్ది, అతడు కాశ్మీర పండితుడు. అయినా వేములవాడ వాగరాజు ఆస్థానకవి - జైనుడు. ఇక్కడే అతని రచనలు వచ్చినై.

*6. కొండాపురం (మెదకు జిల్లా):* ఇది శాతవాహనుల రాజధాని పట్టణం. ఇది వారికి టంకసాల కూడా. ప్రపంచ కథల కన్నింటికీ మూలం తలమానికం అనదగిన బృహత్కథను పైశాచీ భాషలో రాసిన గుణాఢ్యుడు కొండాపూర్ వాస్తవ్యుడు. హాల చక్రవర్తి 'గాథా సప్తశతి'కి ఈ ప్రాంతంలో సంబంధం ఉంది.

*7. నాగార్జున కొండ:* ఇది విఖ్యాత బౌద్ధ క్షేత్రం. కృష్ణా లోయ విజయపురి క్రీ.శ. 3వ శతాబ్ది ఇక్ష్వాకుల రాజధాని. వీరు హిందూ మతాభిమానులై అశ్వమేధాలు చేసినా హింద్వాలయాలు నిర్మించినా బౌద్ధాన్ని ఆదరించిన్రు. వారి రాణులు బౌద్ధ ధర్మాన్ని అనుసరించి మహాస్థూపాల నిర్మింప జేసిన్రు. అంతకు పూర్వం శాతవాహనుల కాలాన్నే ఇది విఖ్యాత బౌద్ధ కేంద్రం. ఒకటవ శతాబ్ది కనిష్క చక్రవర్తి చేత సంభావితుడైన్రు ఆచార్య మొదటి నాగార్జునుడు, అశ్వఘోషుని సమకాలికుడు ఈ నాగార్జున (నంది) కొండ నివాసి. రెండవ శతాబ్ది ఆచార్య రెండవ నాగార్జునుడు మహాయాన బౌద్ధ మహారచయిత. పారావత విహార బౌద్ధ విశ్వవిద్యాలయ ప్రాచార్యుడు. యజ్ఞశ్రీ శాతకర్ణి సమకాలికుడు. అమరావతీ దీపాల దిన్నె స్థూపానికి శిల్పాలంకృత మహా ప్రాకారాన్ని నిర్మింపజేసినవాడు. ఇతని సుహృల్లేఖ,

రత్నావళి, ప్రజ్ఞా పారమిత వ్యాఖ్య, మాధ్యమిక కారికలు, శూన్యతా సప్తతి మొ॥ సంస్కృత గ్రంథాలు సుప్రసిద్ధాలు.

నాగార్జున కొండ శిల్పం, అమరావతి శిల్పంవలె విశ్వ విఖ్యాతి పొందింది. ఇక్కడ బుద్ధ మూర్తులు లభించినాయి. తొలి తరం హిందూ దేవీ దేవతల విగ్రహాలు - ఇక్ష్వాకుల కాలానివి దొరికినవి. నాగార్జున కొండ కృష్ణానదికి అవతలిదరి గుంటూరు జిల్లా, ఇవతలి ప్రక్క నల్గొండ.

*8. ఫణిగిరి (నల్గొండ) :* ఇది కొండపై గల స్థూప సముదాయం. స్థూప ఫలకాలు శిల్పాలంకృతమై ఉన్నవి. శిథిలం, తవ్వకాలు ఇటీవలే జరిగినై. కాబట్టి వివరాలు వెలుగు చూడవల్సి ఉంది, బుద్ధ ప్రతిమల పట్టి మహాయాన బౌద్ధం అనవచ్చు.

*9. న్యాలకొండ పల్లి (ఖమ్మం):* స్థూపం ఇటుకవలది, పెద్దది. ఇక్కడ దొరికిన శిలా - పంచలోహ బుద్ధ విగ్రహాలకు నుదుట తిలకాలున్నవి. క్రీ.శ. 11వ శతాబ్ది మధుర, గాంధార శిల్పాల కాలం నాటికే బౌద్ధ శిల్పాలకు బొట్టు చేరింది.

## బౌద్ధం ఉనికి ఆధారాలు:

1. వరంగల్ జిల్లా బెక్కంటి బుద్ధ మందిరం ప్రసక్తి - కాకతీయ శాసనాల్లో ఉంది. కళ్యాణి చాళుక్య త్రిభువనమల్ల చక్రవర్తి కాలాన సామంత ప్రభువు మల్లారెడ్డి బెక్కంటిలో హిందూలయాలతో పాటు బుద్ధ మందిరాన్ని కట్టించినాడు. (వరంగల్ జిల్లా శాసనాలు ఆధారం).

2. కరీంనగర్ జిల్లా నగునూరు శాసనంలో కాకతి రుద్రదేవుని ప్రధాని వెల్లంకి గంగాధర మంత్రి బుద్ధ మందిరం నిర్మించినట్లు తెలుస్తున్నది. అయితే అది గౌతమ బుద్ధున్ని విష్ణుమూర్తి దశావతారాల బుద్ధమూర్తిగా భావించేనట.

3. 12వ శతాబ్ది పాల్కురికి సోమన వీర శైవకవి తన 'బసవ పురాణం' ద్విపద కావ్యంల శైవేతర మతల నిందిస్తూ జైన బౌద్ధ చార్వాకాల ఒక్క వరుసలో పేర్కొన్నాడు. మత వ్యాప్తి లేనిది నింద ఉండదు.

4. వరంగల్ జిల్లా పాలంపేట రామప్ప ఆలయం గర్భగుడి వెనుక భాగాన ఒక బుద్ధ సాధు మూర్తి ఉంది. ఇది కాకతి గణపతి దేవ చక్రవర్తి మంత్రి రేచెర్ల రుద్రుడు 13వ శతాబ్దిలో నిర్మించిన అద్భుత శిల్ప విన్యాసం కలిగిన శివాలయం.

5. రుద్రమదేవి కాలపు 13వ శతాబ్ది 'రంగనాథ రామాయణ' కర్త పేరు గోన బుద్ధారెడ్డి. పేరు గమనార్హం.

6. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం బుద్ధారం అనే ఊరు ఇప్పటికీ ఉంది. అంటే - 12, 13 శతాబ్దాల వరకు, మన రాష్ట్రంలో - తెలంగాణాల అంతో ఇంతో బౌద్ధం జనాదరణ పొందుతూ ఉన్నదని భావించవచ్చు.

## సాహిత్యం:

క్రీ.శ. ఆరవ శతాబ్ది బుద్ధ- బావరి శిష్య సంభాషణ 'సుత్తనిపాత - పారాయణ వగ్గ' పాళీ భాషల ఉంది. ఇక్కడి తొలి బౌద్ధ సాహిత్యం. అయినా అది కథా విషయం మాత్రమే తెలంగాణాది. రచన ఉత్తర భారత దేశానిదే.

ప్రధానంగా చెప్పుకోవల్సినది నందికొండ రెండవ నాగార్జునాచార్యుని మహాయాన బౌద్ధ గ్రంథాలు.

ఆ తర్వాత బౌద్ధం క్రమంగా సన్నగిల్లి ఈ మత ప్రసక్తి హిందూ గ్రంథాలందు నిందకు తప్ప ప్రశంసతో రాలేదు. 'శుద్ధ బుద్ధావతారం' అనేది మనవాళ్ళ తిట్టు. పనికి మాలినవాడు అని దాని అర్థం. చెవిలో పూవు పెట్టుకునే హిందువుల భక్తి ఆచారాన్ని ముస్లింలు వెక్కిరించినట్టుగానే ఇది.

తెలంగాణ వేములవాడల కన్నడ భారతంను పంపకవి జైన సంప్రదాయంతో రాస్తే, తర్వాత వందేండ్లకు నన్నయ బట్టు భారతం హిందూ మతాభి మానంతో వచ్చింది. (భారత అవతారిక పద్యాలు చూడండి).

తెలుగులో మళ్లా 20వ శతాబ్ది ఆరంభంలో తిరుపతి వేంకట జంట కవుల (1902) అశ్వఘోషుని 'బుద్ధ చరిత్ర' అనువాదమే తొలి బౌద్ధ గ్రంథం. ఆంధ్రలో బౌద్ధ రచనలు ఆ పరంపరలో వచ్చినా, తెలంగాణలో మాత్రం స్వల్పం. ఇక్కడి 20వ శతాబ్ది బౌద్ధ రచనల వివరాలు ఇవి.

1. డా. సి. నారాయణరెడ్డి - నాగార్జున సాగరం (గేయకావ్యం) - 1955
2. దాశరథి - మహాబోధి (జాతక కథల పద్య కావ్యం) - 1960 సుమారు
3. డా. మలయశ్రీ - ధర్మశ్రీ (పద్య కావ్యం) రచన - 1960, 61, ముద్రణ, 2000.
   " " శాంతి పథము (నాటకం) 1974
   " " ధర్మపదం (పాళీకి పద్యానువాదం) 1991
   " " అశ్వఘోషుని - వజ్రసూచి (వచనానువాదం) 1997
   " " నవ దీక్షిత బౌద్ధులు (రాహుల్జీ హిందీ రచనానువాదం) 2000
4. కనపర్తి - పరాజిత (గేయకావ్యం) - 1976
5. సుంకె వెంకటాద్రి - అశోక ధర్మచక్రం (బుర్రకథ) - 1978

ఇప్పుడు 'ఆనంద బుద్ధ విహారట్రస్టు' పలు పుస్తకాలు ప్రచురిస్తున్నా అవి తెలంగాణ రచయితలవి మాత్రం కావు.

**బౌద్ధం పతనానికి కారణాలు:**

ఉత్తర భారత దేశాన గుప్తయుగ హిందూ మతాభిమానంతో బౌద్ధం ప్రభ తగ్గింది. దక్షిణ భారత దేశాన ముఖ్యంగా మన ఆంధ్ర రాష్ట్రంలో, 8వ శతాబ్ది శంకరాచార్య అద్వైతం కంటె, 9, 10 శతాబ్దుల చాళుక్యుల జైన మతాభిమానంతోని (తెలంగాణాలో) 12వ శతాబ్ది కన్నడ బసవేశ్వరుని వీరశైవంతోని, తమిళనాడు రామానుజాచార్య విశిష్టాద్వైతం (వైష్ణవం)తోని, ఇంకా - బౌద్ధంలోని మహాయాన, వజ్రయానాల కారణంగానూ బౌద్ధం వెనుక దారి పట్టి క్రమంగా కనుమరుగయ్యింది.

కాకతీయ యుగంతో (12వ, శతాబ్ది) బౌద్ధం తెలంగాణాల పూర్తిగా అంతరించింది.

పునరుజ్జీవనం: 1956 తర్వాతనే, స్వతంత్ర భారత కేంద్ర ప్రభుత్వం బుద్ధ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుట వల్ల జనం దృష్టి అటు మరలి బౌద్ధ చర్చనీయాంశం అయ్యింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ అదే సంవత్సరం లక్షలమంది అనుయాయులతో బౌద్ధంలో చేరినా తెలంగాణా వాళ్ళు (దళితులు) ఇటీవలి కాలం వరకు అంబేద్కర్‌ను ప్రేమించినంతగా బౌద్ధాన్ని అభిమానించలేదు - స్వీకరించలేదు.

**ముగింపు:** ఇప్పటికి రెండు వేల అయిదు వందల ఏండ్ల క్రితం భారతదేశ కాల్పనిక అస్తిక మతాలపై తిరుగుబాటుగా అవతరించిన బౌద్ధం ఒకరకంగా అచ్చమైన భౌతిక వాదం. అది ఈ దేశ సంస్కృతిని - చరిత్రను మార్చింది. ప్రపంచ మేధావుల దృష్టిని ఆకర్షించింది. అందుకు నిదర్శనం ఈ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇప్పుడు నడుస్తున్న ఈ జాతీయ బౌద్ధ సెమినార్ కూడా. ఇప్పుడు మనం బౌద్ధంలో అనంతర కాలాన ప్రవేశించిన అసంబద్ధ విశ్వాసాలను ఆచారాలను తొలగించుకొని ఆదిమ - మూల బౌద్ధాన్ని గుర్తించి దాన్ని అనుసరించాల్సిన, ప్రచారం చేయవల్సిన అవసరం ఉంది.

అయితే, మన పరిశోధకులు - రచయితలు, సొంత ప్రాంత దురభిమానాలు వదలు కొని సత్యశోధన, విశాల దృష్టి అలవరచుకోవలె. లేకపోతే కానని వాని నూతగొని కానని వాడు సమస్త వస్తువులే కానని భంగి... అయిపోతాది.

ఉత్తర భారతదేశ ఆర్య సంస్కృతికి, దక్షిణ భారత ద్రవిడ సంస్కృతికి సంగమ స్థానం మన ఆంధ్రప్రదేశం. అందున తెలంగాణ, ఉత్తర భారతానికి మరీ సమీపం - సన్నిహితం.

తొలినాళ్ళలో బౌద్ధం తెలంగాణ నుంచే కోస్తాంధ్రకు వ్యాపించింది. తెలంగాణ ప్రాంత బౌద్ధ నిర్మాణాల - కేంద్రాల గురించి ప్రత్యేకంగా సమగ్ర పరిశోధన జరగవల్సి ఉంది. ఈ నా ప్రసంగం కేవలం విషయ పరిచయం మాత్రమే అని గ్రహించమనవి.

**ఉపయుక్త గ్రంథలు:**


1. ఆంధ్రదేశంలో బుద్ధ ధాతు పేటికలు - బండారు సుబ్రహ్మణ్యం, అనంద బుద్ధ విహార ట్రస్టు, సికిందరాబాదు, ఆం.ప్ర. 1997.
2. తెలుగులో బౌద్ధం - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తెలుగు అకాడెమీ, హైదరాబాదు, 2005.
3. సుత్తనిపాత - పారాయణ వగ్గ - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి,
4. రుగ్వేద ఆర్యులు - రాహుల్ సాంకృత్యాయన్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాదు.
5. కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ మలయశ్రీ, నవ్యసాహిత్య పరిషత్, కరీంనగర్, 1997.
6. విశుద్ధ బౌద్ధం - జె.ఎస్. రఘుపతి రావు, జనశ్రుతి పబ్లికేషన్స్, తిరుపతి, 2006.
7. శాతవాహన కళోత్సవాల సంచిక, కరీంనగర్, 2002.
8. Inscriptions of A.P. Karimnagar Dist. P.V. Parabrakara Sastry. Director of Archeology, Govt. A.P. Hyderabad - 1974.
9. The Essence of Buddhism. P.L. Narasu. Asian Educational Services, New Delhi - 1993
10. Gilmpses of Buddhism - N. Rameshan, Director of Archaeology Govt. A.P. Hyderabad.


*(27, 28 ఫిబ్రవరి 2006, ఆంధ్ర విశ్వవిద్యాలయం - విశాఖ, తెలుగు శాఖ జాతీయ బౌద్ధ సెమినార్ ప్రసంగ వ్యాసం )*

# బౌద్ధ ధర్శన ప్రభావం

- శివలింగం

బుద్ధవచన :

యే ధర్మ హేతు ప్రభవాహేతుం తేషాం తథాగతోహ్యావదత్
తేషాం చయో నిరోధ ఏవం వాదీ మహాశ్రమణః ॥

All (contaminated) phenomen a arise from causes which were described by the Tathāgata That which leads to their cassation was also explained by the paragan of Virtue.

మానవ జీవితం దుఃఖ మయం. ఈ అనుభవం నుండి తాత్వికాను భవానికి బుద్ధుడు తన జీవిత యాత్రను కొనసాగించాడు. ప్రాచీన భారతీయ దార్శనికులు ఒక్క చార్వాకులు మినహా అందరూ యాత్రలో భాగధేయులే. దుఃఖం లోకానుభవ సత్యం. దుఃఖ కారణం భవచక్రం అంటే పునర్జన్మ చక్రం. దుఃఖాన్ని నివారించడం కోసం బుద్ధుడు మార్గాన్ని చూపాడు. ఒకసారి అద్వైతాశ్రమ సన్యాసిని ప్రశ్నిస్తే వివేకానందుని మాటనే ఆయనా చెప్పాడు. To be good and do good to others then all the problems of life will be solved. బుద్ధుడు గాని మహావీరుడు గాని అంతర్గతమైన మానసిక దుష్టశక్తులతో పోరాడి జయించారు. అంతర్బుద్ధి అవగాహన, సెయింట్ ఆగస్టిన్, ఎక్కార్ట్, బోమ్ వీరికి ముందు ప్లేటో వీరందరూ మార్మికులే. ఆధునిక తాత్వికులు ప్రతిదాన్ని తర్కం ద్వారా రుజువు చేయాలనుకుంటారు. బుద్ధుడు మౌనమే అవగాహనకు మార్గం అంటాడు. సారనాథ్‌లో బుద్ధుడు యోగిలా కూర్చుని వుండే శిల్పం కన్పిస్తుంది.

బౌద్ధం బుద్ధి జీవుల్ని విశేషంగా ఆకర్షించింది. జర్మన్ దార్శనికుడు. దృగ్విషయ విజ్ఞానశాస్త్ర వ్యవస్థాపకుడూ అయిన ఎడ్మండ్ హుసరల్ (1859-1938)ను బౌద్ధం ఆకర్షించింది. సుత్తపిటకంలోని కొన్ని భాగాలు చదివాడు. 1922లో జర్మనీలోకి న్యూమన్ అనువదించాడు. 1925లో పైపర్ పబ్లిషింగ్ హౌస్‌వారు ఆ గ్రంథాన్ని సమీక్షించవలసిందిగా హుసరల్‌ను కోరారు. హుసరల్ 1925 లో బౌద్ధం మీద సెమినార్‌లు, చర్చలు ప్రవేశపెట్టాడు. 1926లో సోక్రటీస్ - బుద్ధుడు అనే వ్యాసం రాశాడు. యూరప్ తత్వశాస్త్రంతో భారతీయ తాత్విక చింతనను తులనాత్మక అధ్యయనం చేయటానికి ప్రయత్నించాడు. ఆయన మీద బౌద్ధ ప్రభావం వుందంటారు. ఒక తాత్విక వ్యవస్థకు కట్టుబడి వుండే ఆదర్శాన్ని పూర్తిగా తొలగించుకోవాలని, అయినా తక్కినవారి సాంగత్యంతో వినయశీలియైన కార్యకర్తగా శాశ్వత తత్వశాస్త్రం కోసం జీవించాలని అంటాడు. తులనాత్మక అధ్యయనాలు పాశ్చాత్యులకు కొత్తగాదు. జర్మనీలో పాత డస్సేన్, ఇంగ్లండు లో మాక్స్‌ముల్లర్. ఫ్రాన్స్‌లో పాల్‌మేసన్ అవర్‌సెల్ చేశారు. భారతదేశంలో అధ్యయనంలో రాధాకృష్ణన్ విశేషంగా కృషిచేశాడు. దాస్ గుప్తా కంపేరజన్ ను వ్యతిరేకించాడు. Radha Krishan holds the view that ultimate salvation is not possible unless it is the salvation of all humanity (P.T. Raju) ఈ మాటల్లో బౌద్ధ ప్రభావం కనిపిస్తుంది. అందరికి విముక్తి.

---

శివలింగం, చల్లపల్లికి చెందిన ప్రసిద్ధ చింతనా శీలి.

కరుణామయుడైన అవలోకితేశ్వరుడు ప్రపంచంలోని అన్ని ప్రాణులూ దుఃఖం నుండి విముక్తి పొందే వరకూ నిర్వాణం పొందడానికి నిరాకరించడం మహాయాన ఆదర్శం. అందరూ నిర్వాణం పొందడం సాధ్యం కాదు. ప్రజలమీద కరుణతో, ప్రేమతో చెప్పేమాట. సామాజిక, సామూహిక సద్వర్తన అందమైన భావం. తొలి బౌద్ధంలో నిర్వాణంగాని, ఉపనిషత్తుల్లోని తత్వమసి గాని ఎవరికి వారు పొందవలసిందే. వైయక్తికమేగాని సామూహికం కాదు. బౌద్ధంలో మహాపండితుడు అనేక భాషలు నేర్చినవాడు, నిత్యయాత్రాజీవి, బహుగ్రంథకర్త అయిన రాహుల్ సాంకృత్యాయన్ విదేశీయమైన మార్క్సిస్టు దృక్పథాన్ని వలచడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

బౌద్ధ పండితుడు నిజానికి దేని మీదా వలపు చూపకూడదు. నిబద్ధుడు కారాదు. ఆయన జీవితంలో మౌనధ్యానం చేసే సమయం లేకపోవడమే అందుకు కారణం. బహిర్ముఖుడైన వ్యక్తికి సమదర్శనం, సమబుద్ధి వుండదు. బాహ్యమైన విషయాలకు లొంగిపోతుంటాడు. అందుకే విపశ్యన సాధకునికి ముఖ్యం. ఈ ప్రపంచం 'కూచుండనీదురా కూసింత సేపు.' స్కంధాలు నశించినపుడు శుద్ధచేతన, చూచేది చూడబడేది. ఆలోచించేది ఆలోచన ఒకటేననే అనుభవం. సంసారాన్ని అధిగమిస్తాడు. సమాజానికి , ప్రపంచానికి నీకు వున్న సంబంధాన్ని మార్చడం కోసం పరిణామం చెందడం కోసం పనిచేస్తున్నావు. సమాజం మన సంబంధాల నుండి ఉత్పాదితం.

ఉండటం అంటే మిత్రత్వమేనని జె.కె అంటాడు. బౌద్ధ చింతనకు చాలాదగ్గర. 'నీవు ప్రేమించినపుడు ఏకత్వం గాని బహుత్వంగాని ఉండదు. ఒక్క ప్రేమే వుంటుంది. ఈ ప్రేమ బౌద్ధంలో మైత్రి. దాల్‌పాలారాహుల్, చోగ్యం రిన్‌పోచ్‌లతో జె.కె. జరిపిన సంభాషణల్లో ప్రచ్ఛన్న బౌద్ధుడుగా కనిపిస్తాడు జె.కె.

బౌద్ధం నుండి శంకరుడు అనేక పదాలను ఉపయోగించుకున్నాడు. నాగార్జునుని తత్వాన్ని బాగా ఉపయోగించుకుని లాభపడ్డాడు. జె.కె., శంకురులు బౌద్ధ ప్రభావితులే.

నాగార్జునుడు ప్రవచించిన మాధ్యమిక శూన్యవాదం ఒరిస్సా సంస్కృతిలో క్రీ.శ. ప్రథమ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకు విస్తరించింది. 16వ శతాబ్దం భక్తి ఉద్యమంలో అయిదుగురు సంతులు జగన్నాథదాసు, బలరామదాసు, యశోవంతదాసు, అచ్యుతానందదాసు, శిశు అనంతులు శూన్య పురుషునికి తుది రూపం యిచ్చారు. జగన్నాథుడు నిరాకారుడు నిర్గుణుడు అనిర్వచనీయుడుగా వర్ణించారు. శూద్ర భావం ఒక గుణం అహంకార రహితంగా సర్వమానవాళికి చేసే సేవాదృక్పథం శూద్రభావం అని అచ్యుతానందుడు శూద్ర భక్తిని వివరించాడు. అద్వైతుల, ఉపనిద్రుషుల బ్రహ్మ, బౌద్ధుల శూన్యం ఒకటేననే భావం. 'అతడు నిరాకారుడు. అనంతుడు శూన్య పురుషుడు, శూన్య శరీరుడు. అతడు బ్రహ్మ. అతడు శూన్యం. అతడికి పేరెట్లా వుంటుంది? అని బలరామదాసుడంటాడు.

భారతీయ భాషలలో వెలసిన సాహిత్యంలో బౌద్ధ ప్రభావం గురించి పరిశోధనలు విస్తృతంగా జరగాలి.

నమస్సర్వబుద్ధ బోధిసత్వేభ్యః

# వెయ్యేళ్ళ బౌద్ధ ప్రవాహం - మానవాళిపై ప్రభావం

- జె.యస్. రఘుపతిరావు

**బుద్ధుడు చారిత్రక పురుషుడు :**

బుద్ధుడు క్రీస్తుకు పూర్వం 563లో పుట్టాడు. అది మహావిర్భావం. క్రీ.పూ. 483 లో అస్తమించాడు. అది మహాపరి నిర్వాణం. 80 సంవత్సరాలు జీవించాడు. 17వ ఏట వివాహం చేసుకున్నాడు. 28వ ఏట ఇల్లు విడిచాడు. అది మహాభినిష్క్రమణ. 6 ఏళ్ళు తపస్సాధనలు చేశాడు. 34వ ఏట జ్ఞానోదయం పొందాడు. 46 ఏళ్ళు ప్రబోధం చేశాడు. అది ధర్మచక్ర ప్రవర్తన.

శాక్య, కురు, అంగదేశాలు - ఇంచుమించు ఉత్తర దేశమంతా తిరిగాడు. లుంబిని - రాజగృహాల మధ్య 250 మైళ్ళు పాదచారిగా ప్రయాణం చేశాడు. ఎద్దుబండి కూడా వాడలేదు. శ్రావస్తి, రాజగృహ, కపిలవస్తు, వైశాలి, కామసద్ధర్మ మున్నగు ముఖ్య కేంద్రాలకు ఎక్కువసార్లు వెళ్ళాడు. శ్రాస్తికి 75 సార్లు తిరిగాడు. భిక్షాటనతో జీవించాడు.

బుద్ధుడు మహాజ్ఞాని. పూర్ణచంద్రుడులాగ సంపూర్ణంగా వికసించాడు. లోబయలు మొత్తం తన ఎరుకలో వుండేది. తనపై తనకు పట్టు చిక్కింది. ప్రపంచాన్ని పట్టేశాడు. ప్రతిదీ స్థూలంగా, సూక్ష్మంగా, నిశితంగా హేతుబద్ధంగా, అనుభవపూర్వకంగా చూసేవాడు. శీల-ప్రజ్ఞ-కరుణ- ధ్యానంతో సంపూర్ణుడయ్యాడు. అతనికి అతనే సాటి. అతడు నిరంతరం నిర్వాణ స్థితిలో ఉండేవాడు. అంతేగాక మహా ఆకర్షణ గలవాడు. మధురమైన, ప్రేమ పూర్వకమైన, ప్రశాంతమైన వచనాలతో శోభిల్లేవాడు. 32 మహాపురుష లక్షణాలతో చూపరులను, శ్రోతలను, సహచరులను ఆకట్టుకునేవాడు. బుద్ధుని జీవితమే ధమ్మం. బుద్ధుడు ప్రవచించినదే బౌద్ధం. బుద్ధుని కాలంలో వేలాదిమంది బౌద్ధ భిక్షువులు తయారయ్యారు. వారు ముండనం చేయించుకునేవారు, కాషాయ దుస్తులు ధరించేవారు, సంచారం చేసేవారు, ధమ్మ ప్రచారం చేసేవారు. గ్రామ గ్రామాన తిరిగేవారు. క్రీస్తుకు పూర్వం సుమారు 500 సంవత్సరాలు మహాద్భుతంగా ప్రచారం జరిగింది. క్రీస్తు తర్వాత దాదాపు 700 సంవత్సరాలు ఆసియా ఖండమంతటా వ్యాపించింది. 1000 నుండి 1200 సంవత్సరాల పాటు బౌద్ధం మహా స్వర్ణయుగమైంది. బౌద్ధ విజ్ఞానం ప్రవాహరూపంలో విస్తరిల్లింది. పామరుని నుండి పండితుని వరకు బౌద్ధ జీవన విధానం సహజమై పోయింది.

**బౌద్ధం లక్షణాలు:**

బౌద్ధం ఎందువల్ల అంత గొప్పగా విజృంభించిందో తెలుసుకునే ముందు బౌద్ధం యొక్క లక్షణాలేమిటో టూకీగా తెలుసుకోవడం అవసరం. బౌద్ధం సహేతుకమైంది, మానవీయమైంది. మానవ కేంద్రీయమైంది, నైతిక (ధార్మిక)మైంది, నిర్వాణదాయకమైంది. శాస్త్రీయ (సైన్సుకు అనుగుణ్యా)మైంది. దుఃఖాంతికమైంది, సమసామాజికమైంది. శీల-ప్రజ్ఞ-కరుణ-ధ్యాన సముచ్ఛయమైంది, ప్రజాస్వామ్యబద్ధమైంది. ఈ లక్షణాలన్నీ కూడా మానవునికి, మానవ జీవితానికి సంబంధించినట్టివి. ఇవి మెదడున్న ప్రతి వాడూ ఆలోచించుకోవలసిన అంశాలు. ఇవి ప్రయోజనం చేకూర్చేవిగా కనిపిస్తాయి. ఇవి మనిషిని జడత్వం నుంచి చైతన్యం వైపుకు నడిపించేవి అని తెలుస్తుంది.

---

జె.యస్. రఘుపతిరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తిరుపతి

బౌద్ధం మహాగొప్పగా విజృంభించడానికి కారణాలు గ్రహిద్దాం. అందుకు అనుకూలించిన విధానాలేమిటి?

**1. బుద్ధుని మూర్తిమత్వం:**

మూర్తిమత్వం అనేది ప్రతిమకు, రూపానికి, భౌతికానికి, చూపుకు సంబంధించింది. అంతటితో సరికాదు, అమూర్తిమత్వం కదిలేది, కదిలించేది, చైతన్యవంతమైంది. బుద్ధుడు అందగాడు, ఆజానుబాహుడు, ఆకర్షణీయుడు.

హృదయ సంబంధమైన గుణాలతో రూపుదిద్దుకొనేది వ్యక్తిత్వం. వ్యక్తిత్వంలో ఒక నిండుదనం వుంటుంది. మూర్తిమత్వంలో భౌతికమైన పాలు ఎక్కువ. వ్యక్తిత్వంలో మానసికమైన పాలు ఎక్కువ. వ్యక్తిత్వంలో బుద్ధునిది ప్రేమ హృదయం; అతని వాక్కు మధురం, హితకరం.

బుద్ధునిలో మూర్తిమత్వం, వ్యక్తిత్వం - రెండూ పోటీపడి వికసించి, సమైక్యమై ప్రకాశించాయి. అది అతనిలో ఉన్న సమగ్రత. అది ఆకర్షణకు కారణం. అలాగే ప్రజ్ఞ, కరుణ రెండూ సమపాళ్ళలో సమున్నతంగా పెరిగి అతనిలో సమ్మిశ్రితమైనాయి.

**2. త్యాగం:**

ఉన్నటువంటి భౌతిక సంపదను ఇచ్ఛాపూర్వకంగా వదులుకోవడం త్యాగం. మరొకటి సంపాదించడానికి వున్నదాన్ని వదులు కోవడం త్యాగం కాదు. ప్రజాహితం కోరి త్యజించడం జనాన్ని ఆకర్షిస్తుంది. అబ్బురమైన పనిగా కనిపిస్తుంది. లోకంలో అతి తక్కువమంది చేసే చర్య కాబట్టి ఆకట్టుకొంటుంది.

సిద్ధార్థుడు యువరాజు. అదే గొప్ప పేరు. రాబోయే రాజ్యాన్ని వదులుకున్నాడు. వ్యక్తిగత సుఖ సౌకర్యాలను, వంశాభివృద్ధిని ఇచ్చే భార్యాబిడ్డలను వదులుకొన్నాడు. బంధువర్గం చేత, ప్రజాబాహుళ్యం చేత ప్రేమింపబడ్డాడు. అందర్నీ వదిలి అరణ్యాలకు వెళ్ళాడు. ఆ సంఘటన గొప్ప ముద్రగా ప్రజల్లో నిలిచి వుంది.

**3. కఠోర పరిశ్రమ:**

సుఖావకాశాలన్నీ త్యజించి, నిరాహారియై, కీకారణ్యంలో ఘోరతపస్సు చేశాడు యువరాజు జీవచ్ఛవంలా మారిపోయాడు. ఒక దాసి ఇచ్చిన పాయసం తిని ప్రాణాలు నిలుపుకోవలసి వచ్చింది. బుద్ధుని శ్రమ ప్రజకు ఎరుక అయ్యింది. వేనోళ్ళ చెప్పుకున్నారు.

**4. జ్ఞానోదయం:**

భారతీయ సంస్కృతీ జీవనంలో మోక్షానికి-జ్ఞానసిద్ధికి-గొప్ప విలువ వుంది. మోక్షం పొందిన వాడు మహోన్నతుడనే అభిప్రాయం ప్రబలంగా వుంది. జ్ఞానసిద్ధి, మోక్షం జనాభిప్రాయంలో ఒకటే. అట్టి లబ్ధిపొందినవాడు గౌతముడు. అతడు ఎంతో మహనీయుడు అనే గౌరవం ఏర్పడింది. నిజానికి జ్ఞానియైనవాడు జనానికి మేలే చేస్తాడు.

**5. ధమ్మసత్తా:**

ధమ్మం సార్వత్రికం, సర్వజనీనమై ఒప్పింది. అందుచే ప్రచారానికి అది బలమైన బీజం అయ్యింది. ధమ్మం తాత్వికతతో కూడిన నైతికత, అది నిత్యం జీవితంలో నిలుపుకొనేది, జీవితాన్ని నడిపించేది. బుద్ధుడు జీవించి చెప్పింది ధమ్మం.

**6. గ్రామ సంచారం:**

బుద్ధుడు మగధ దేశంలో గ్రామ గ్రామాన తిరిగాడు. ఇంటింట తిరిగి ఒంటిపూట భోజనం చేశాడు. చెట్టుక్రింద విశ్రమించాడు. ఆసక్తి పరులకు బోధించాడు. పీడితుల, బాధితుల పట్ల కరుణ చూపాడు. కనుక ప్రజల నోట నానాడు. ఆయన సంచారమే గొప్ప ప్రచారం అయ్యింది.

**7. ప్రజల భాషలో బోధ:**

ఆనాటి ప్రజల భాష పాళి. ఉజ్జయిని ప్రాంతంలో ఉన్న పాళిలా, మగధ ప్రాంతంలో మాగధి ఉండేది. అవి స్థానికుల భాషలు. ఇంచుమించు రెండూ ఒకటిగా ఉండేవి. బుద్ధుడు ప్రజల భాషలోనే మాట్లాడినాడు. సంస్కృతాన్ని అంగీకరించలేదు. తన మాటలు వేరే భాషలోకి తర్జుమా చేయొద్దన్నాడు. అందుచే బౌద్ధం ప్రజల్లో నాటుకునే అవకాశం ఏర్పడింది.

**8. మధ్యే మార్గం:**

అతివాదం, మితవాదం కాకుండా మధ్యే మార్గం అవలంబించాడు. అతి సూక్ష్మం, అతి తేలిక కాకుండా సామాన్యులకు మధ్యే మార్గాన బోధించాడు. అతిగా తినడానికి, అసలే తినకుండడానికి మధ్యరకంగా తినమన్నాడు. అతి లౌకిక విషయాలను, అతీంద్రియ విషయాలను గాక జీవిత వాస్తవాలను చర్చించాడు. మనసు స్వాధీనం లేని శరీరశోషణ గాని, శరీర పోషణగాని గాక, మనసును పుష్టింపజేసే శారీరక ఆరోగ్యాన్ని పాటింపమన్నాడు. మనసుకందని ఆధ్యాత్మిక విషయాలు, మనసును వినోదపరిచే మామూలు విషయాలు కాకుండా మనసును ఆలోచంపజేసే ధార్మిక విషయాలు గూర్చి చెప్పాడు. అన్నిటా సరియైనది, పరిశుద్ధమైనది, తెలివైనది మధ్యేమార్గం. అటు గుడ్డినమ్మకం గాకుండా, ఇటు పరాధీనతలేకుండా స్వశక్తితో నిజాన్ని నిర్ణయించుకోమన్నాడు. మౌనమూ పెట్టాడు, ధమ్మవాక్కులు పెట్టాడు, రెంటిలో జాగృతి పెట్టాడు. ఈ విధంగా మధ్యేమార్గం అవలంబించడం వల్ల జనులందరికీ బౌద్ధం అందుబాటైంది.

**9. రాజాదరణ:**

బుద్ధుడు క్షత్రియుడు కావడంవల్ల అప్పటి రాజులందరూ ఆదరించారు. కొందరు బౌద్ధులయ్యారు, రాజమతం కాకపోయినా క్షత్రియులు బాగా ప్రచారం చేశారు. శాక్యవంశజులు ఇంచుమించు అందరూ బౌద్ధధమ్మం అవలంబించారు. బ్రాహ్మణ వర్ణానికి దిగువ వర్గంలో ఒక మహాజ్ఞాని పుట్టాడని క్షత్రియులు గర్వపడ్డారు. అందుచే బ్రాహ్మణ వర్గానికి సమంగానో, మించియో ఎదగాలని క్షత్రియ వర్గం సహజంగానే భావించింది. పసినేది, బింబిసారుడు, అజాత శత్రువు బౌద్ధం అనుసరించారు. ఒక కాలంలో రాజమతం అయింది. అశోకుడు అమితంగా ప్రచారం చేశాడు.

**10. భిక్షు సంఘం:**

ఆచరణ, ప్రబోధం, ప్రచారం భిక్షుసంఘం యొక్క ప్రధానోద్దేశాలు. సంఘం అందుకే ఏర్పడినది గనుక ఆపనులు ఫలవంతంగా, బహుళ విస్తారంగా చేసింది. భిక్షువులు దేశంలో వివిధ ప్రాంతాలకే గాక, విదేశాలకు కూడ వెళ్ళారు.

**11. వర్ణ వివక్ష లేమి:**

బౌద్ధ ధర్మంలో కుల మత వివక్షలు లేవు. సర్వజనులకు ఎలాంటి వ్యత్యాసం లేకుండా, ధమ్మం అందుబాటైంది. దిగువ కులాలవారిని, హీన కులాల వారిని అస్పృశ్యులను సైతం బుద్ధుడు తన

సంఘంలో చేర్చుకొని సమాన హోదా, గౌరవాలు ఇచ్చాడు. సముద్రంలో చేరే నదుల్లాగ, బౌద్ధ సంఘంలో చేరినవారు కుల ముద్రలు కోల్పోతారు.

**12. స్త్రీలకు దీక్ష:**

స్త్రీల సంఘం కూడా తయారవడంతో ఇంటా బయటా బౌద్ధం, ప్రసిద్ధికి ఎక్కింది.

ఈ కారణాల వల్ల మొత్తం బౌద్ధం ఆదరణీయమైంది. సువ్యాప్తమైంది.

### బౌద్ధ ధర్మ ప్రచారానికి చారిత్రక ఆధారాలు:

బౌద్ధ ధర్మ వ్యాప్తికి బుద్ధుడు జీవితాంతం తీవ్రమైన కృషి చేశాడు. తన జీవితకాలంలో బౌద్ధం మగధరాజ్యమంతటా వ్యాపించింది. అప్పటికే ధమ్మపరిమళం దక్షిణ దేశం వరకు సువాసనలు వెదజల్లింది.

బుద్ధునికి ముందు పరివ్రాజకులు అంతగా లేదు. తాపసులున్నారు. వారు సత్యాన్వేషకులు. వారి ఆశ్రమాలలో విద్య అభివృద్ధి చెందింది. బౌద్ధమతంలో పరివ్రాజకుల సంఖ్య పెరిగింది. వైశాలి, చంపా నగరం, రాజగృహాలలో విహారాలు ఎక్కువగా వున్నాయి. బుద్ధుడు **45** సంవత్సరాలు పరివ్రాజక జీవనం గడిపాడు. (బౌద్ధ యుగం మొదటి సంపుటి - రత్నాకర బాలరాజు)

బుద్ధుడు శకులు దాయిని కలుసుకున్నట్లూ, వైఖాననుడు బుద్ధుని కలుసుకున్నట్లు మజ్ఝనికాయం చెపుతుంది. బుద్ధుని కేనియ చూస్తాడు. పోతని పుత్రుడు, సమర్థిని బుద్ధుని కలుసుకున్నట్లు బౌద్ధ గ్రంథాలలో వుంది.

బుద్ధుని కాలంలో ధమ్మం అంధక (ఆంధ్ర) దేశం చేరినట్లు సుత్తనిపాతంలో వుంది. బోధన ప్రాంతీయుడైన అస్సకదేశవాసి, బావరి అతని శిష్యులు ధమ్మం శరణుజొచ్చారు. (చెన్నూరి ఆంజనేయరెడ్డి పత్రం)

బుద్ధుడు క్రీ.పూ. **483**లో చనిపోయాడు. ఆ తర్వాత, అదే సంవత్సరం **(483)**లో రాజగృహ సమీప సత్తపన్ని గృహంలో మొదటి సంగీతి జరిగింది. అజాత శత్రువు ఏర్పాటు చేశాడు. మహా కాశ్యపుడు అధ్యక్షత వహించాడు. ఆనందుడు సుత్తపిటకం (బుద్ధుని బోధనలు) క్రోడీకరించాడు. ఉపాలి వినయ పిటకం (సంఘ నియమాలు) క్రోడీకరించాడు.

మహావీరుడు **(24**వ తీర్థంకరుడు) బుద్ధునికి ముందువాడు, సమకాలీనుడు, క్రీ.పూ. **599**లో పుట్టి **527**లో చనిపోయినాడు. సోక్రటీసు బుద్ధుని తరువాతివాడు. క్రీ.పూ **470-399**లో జీవించాడు. బుద్ధునికి ముందూ, బుద్ధుని తర్వాత ప్రపంచంలో మానవాళిలో మార్పు తెచ్చిన ప్రజ్ఞావంతుల్ని పేర్కొనడం జరిగింది.

కాల నిర్ణయానికి భాషా శాస్త్రం కూడా సహాయపడుతుంది. అందుకు వాగ్రూపంగానూ, లిఖితంగానూ వున్న గ్రంథాలు ఆధారం. వాటిని బట్టి ఆంధ్రభాషపై బౌద్ధం యొక్క ప్రభావం చూడ వీలవుతుంది.

పాణిని క్రీ.పూ. **8-7** శతాబ్దివాడు. తన "అష్టాదాయి"లో లిపి, గ్రంథ అనే శబ్దాలు వాడాడు. యాస్కుని నిరుక్తంలో అక్షరాలు ప్రాచీనమైనవని ఉంది. యజుర్వేదమునకు చెందిన తైత్తరీయ ఉపనిషత్తులో శిక్షావల్లి, వర్ణాలు, స్వరాలు గూర్చి వుంది. ఛాందోగ్యోపనిషత్తులో ఇంద్ర ప్రజాపతి, మహేశ్వరులు అక్షరాలు నిర్మించినట్లువుంది. తైత్తరీయం, ఛాందోగ్యం పాణినికి ముందున్నాయి.

స్మృతులూ పురాణాలూ అక్షరాల గురించి చెప్తాయి. (బహుశ వినయపిటకలోని నియమాల్ని బట్టి స్మృతులూ, జాతక కథలను బట్టి పురాణాలూ వెలిసి వుంటాయి.) రామాయణం లిఖిత గ్రంథం. మహాభారత శాంతి పర్వంలో వేదాలు బ్రాహ్మీలిపిలో వ్రాయబడ్డాయని వుంది. వేదాలు "శ్రుతులు" గానే ప్రసిద్ధి చెందాయి. సరిగ్గా ఎప్పుడు బ్రాహ్మీలిపిలోకి వచ్చాయో చూడాలి. వేదోపనిషత్తులు క్రీ.పూ. 7వ శతాబ్ది నుంచి వున్నాయి. ఆనాడు కావ్య పురాణాలు సూక్ష్మ (బీజ లేక మూల) రూపంలో వున్నాయని పేర్కొన్నా, అవి తర్వాత కాలంలో-బౌద్ధం తర్వాత-పూర్ణ రూపంలోకి వచ్చాయని అనుకోవలసి వస్తోంది.) బుద్ధుని చరిత్రలో పాండవ పర్వత గుహ ప్రసక్తి వచ్చింది.

బుద్ధుడు సూర్య వంశజుడనీ, సూర్యవంశ రాముని చరిత కూడ అప్పటికి తెలిసి వుంటుందనీ ఒక వాదం. పత్రాలు, లేఖలు వ్రాసే పద్ధతి క్రీ.పూ. 7-6 శతాబ్దాలలో ఉన్నట్లు తెలుస్తోంది.

యూఫ్రేడ్స్ లోయలోని పూర్వ సెమిటిక్ రూపమైన లిపి నుండి బ్రాహ్మీ లిపి జనించింది. (రైసు డేవిడ్సు). క్రీ.పూ. 8-7 శతాబ్దాలలో భారతీయ వర్తకులు దీన్ని భారత దేశానికి తెచ్చారు. బ్రాహ్మీలిపిగా పరిణమించడానికి వెయ్యి సంవత్సరాలు పట్టిందన్నారు. కాని ఇది భారత దేశంలోనే చిత్ర లిపి నుండి పరిణమించిందని కన్నింగుహోం దొర అభిప్రాయం. చిత్రలిపి సింధు లోయలోది. ఆర్మీనియను లిపి నుండి ఖర్ధోషిలిపి వచ్చింది. అది ఈజిప్టు పర్షియాలలో వ్యాపించింది. పారశీకులు గాంధారాన్ని జయించి అక్కడ ఖర్ధోషిని ప్రవేశపెట్టారని తక్ష శిలా ప్రాంతంలోని శాసనాల్లో వుంది. (భాండార్కరు అశోక). ఖర్ధోషి కీ.శ. - 5వ శతాబ్దిలో అంతరించింది. బ్రాహ్మీలిపి మాత్రం నైజాం ప్రాంతంలో బయటపడింది.

వేదాలు ప్రాకృతంలో శ్రుతమైనాయి. పిదప దేవనాగరిలో లిఖితమైనాయి. సంస్కృత భాష ఉన్నట్లే, అప్పటికి పాళి ప్రాకృత భాష జనులకు మాధ్యమమైవుంది. 'అంధకులు' ప్రాకృతంలో మాట్లాడుతున్న తెగవారై వుంటారు. దానిపై సంస్కృతం తుపానులా ఆవరించింది. అది నన్నయకు ముందున్న తెనుగైవుంటుంది. దీన్ని బట్టి ఆంధ్రం సంస్కృతం నుండిగాక, ప్రాకృతం -పాళీ నుండి పరిణామం చెందినదై వుండొచ్చు. పాణిని (800 బిసి) నుండి పతంజలి (150 బిసి) వరకు బ్రాహ్మణులు సంస్కృతం మాట్లాడేవారు. భరతుని ప్రకారం సంస్కృతం, ప్రాకృతం ఒకటే. పవిత్రంగానూ గొప్పగానూ గౌరవంలో వున్న ఆ సంస్కృత భాష బుద్ధుని ఆకర్షించలేదు. ఎందుకంటే అది బహుజనుల భాష కాదు. బుద్ధుని విచక్షణా శక్తి, నిర్ణయశక్తి, ఎంత అనుకంపతో కూడిందో అర్థమవుతోంది.

సంస్కృతి, సంస్కరణ, సంస్కారం, సంస్కృతం పర్యాయపదాలు. నడవడికలో హీనదశ నుండి ఉత్తమ దశకు, భాషలో ప్రాకృత (సామాన్య జన మాధ్యమం) దశ నుండి శుద్ధ సంస్కృత దశకు, జాతుల్లో సామాన్య భౌతిక మానసిక దశ నుండి ఉచ్ఛదశకు ఎదుగుటకు చేసే నిరంతర ప్రయత్న పరంపర సంస్కృతి. బాహ్య జీవితం నాగరికత, ఆంతరంగిక జీవితం సంస్కృతి అని కూడ వుంది. సంస్కృతి అంటే గతానిది అని చెప్పడం, అదే గొప్పదని రుద్దడం సరికాదు.

పూర్వం భిక్షువులు త్రిపిటకాలను నోటిద్వారా పరంపరంగా అందజేశారు. అట్టి జ్ఞానులు తరిగిపోవడంతో వత్సగామని కాలంలో భిక్షువులు సమావేశమై వాఙ్మయం గ్రంథస్తం చేశారు.

శీలవగ్గ అనే గ్రంథభగం 450 బి.సి.లో బుద్ధుని ప్రవచనాలతో 13 సూత్తాంతాలలో నిబద్ధం చేయబడింది.

'అక్కరిక' అనే ఆట పిల్లలు ఆడేవారు. అంటే ఆకాశంలోను, వీపు మీద అక్షరాలు (లాంటివి) వ్రాయడం. అది సన్యాసులు చేయరాదని బౌద్ధులు అభిప్రాయపడ్డారు. ఆత్మహత్య చేసుకోవచ్చని ఒక బౌద్ధ సన్యాసి రాస్తే అందులో ప్రతి అక్షరంలోను దోషముందని బౌద్ధులు నిషేధించారు. ధారణ పద్ధతే అనుసరించారు. వల్లె వేసుకోడానికి 'పాండితి' అని అంగుత్తరనికాయంలో వుంది. అది రక్షించుకొనే విద్య. పాతిమోక్ష గ్రంథం నెలకొకసారి వల్లింపబడాలి. పత్తి నుండి కాగితం, వ్రాసుకొనే ఉపకరణాలు బి.సి 4వ శతాబ్దిలో నేర్ఖస్ తయారు చేశాడు. బ్రహ్మ సూత్రంలో యాజ్ఞవల్క్యుడు కూడా అలాగే చెప్పాడు.

క్రీ.పూ. 1వ శతాబ్ది (43 బి.సి) సింహళద్వీపాన్ని పాలించే వత్సగామని కాలంలో బౌద్ధవాఙ్మయం ప్రప్రథమంగా అక్షర రూపంలో గ్రంథస్తం చేయబడింది (మహావంశం). వ్రాతజ్ఞానంలో స్త్రీ పురుషులిద్దరూ సమానులే.

బౌద్ధ గ్రంథమైన "మహావంశా" న్ననుసరించి బౌద్ధాన్ని పోషించిన రాజుల కాలం ఇలా వుంది. హర్యంక వంశంలో బింబిసారుడు క్రీ.పూ. 544-493, అజాత శత్రువు 493-462, ఉదయభద్రుడు, అనురుద్ధుడు 462-430, పిదప ముండకుడు నాగదాసుడు ఉన్నారు. శివనాగవంశంలో శివనాగుడు 430, తర్వాత కాలాశోకుడు, అతనికి 10 మంది కొడుకులు 364, తర్వాత నందవంశం 364-324, నవనందులు ఉన్నారు.

నందవంశం తర్వాత చంద్రగుప్త మౌర్యుడు సింహాసనం అధిష్టించాడు. 344 బి.సి.లో 11, 12, తరాలవారు పాలించారు.

ఈ వైభవాన్ని అలెగ్జాండరు చూశాడు. అతడు 323 బి.సి.లో మరణించాడు. (బౌద్ధయుగం-రత్నాకర బాలరాజు)

రెండో సంగీతి క్రీ.పూ. 383లో వైశాలిలో జరిగింది. కాలాశోకుడేర్పాటు చేయగా, సబకామి అధ్యక్షత వహించాడు. బౌద్ధం రెండుగా చీలింది. మార్పును కోరే మహా సాంఘికులు దూరమైపోయారు. వినయపిటకలో 10 సూత్రాలు మాత్రం గ్రహించారు. మహాకాశ్యపుడు (వైశాలి) నాయకత్వం వహించాడు. వాళ్ళ తత్వం అమరావతికి వ్యాపించింది. మొదట (హీనయానులనబడినవారే తర్వాత థేరవాదులు (స్థవిరులు)గా నిలిచిపోయారు. మహా కాత్యాయన కౌశాంబి (ఉజ్జయిని) ఈ శాఖకు నాయకుడయ్యాడు.

చంద్రగుప్తుని కుమార్డు బిందుసారుడు (భద్రసారుడు) (300-273 బి.సి), అతని కుమారుడు అశోకుడు (273-263 బి.సి.) వరకు బౌద్ధాన్ని గొప్పగా పోషించారు. ఉపగుప్తుడనే బౌద్ధ సన్యాసి వల్ల అశోకుడు బౌద్ధ దీక్ష గ్రహించాడు. సుషీముని కుమారుడైన న్యగ్రోధుని వల్ల గ్రహించాడని సింహళ గ్రంథాలు పేర్కొన్నాయి. అది కళింగ యుద్ధానికి ముందే జరిగింది. యుద్ధం అతడిని మరింత కరుణామయుణ్ణి చేసింది. అతడు సుమారు 30 సంవత్సరాలు పాలించాడు. అశోకుని కూతురు చారుమతి. ఆమె కూడా బౌద్ధ వ్యాప్తికి తోడ్పడింది.

**తెలుగునాట బౌద్ధం :**

ఐతరేయ బ్రాహ్మణమున ఉన్న ఆంధ్రులు, విశ్వామిత్ర పుత్రులైన ఆంధ్రులు, బౌద్ధంలోని అంధకులు - వీరిని ఆంధ్రులంటున్నాం. ఆఫ్ఘనిస్తాన్‌కి ఉత్తరాన మధ్య ఆసియా నుంచి వచ్చి వింధ్య

పర్వతాలను దాటి దక్షిణాన స్థిరపడ్డారు. కృష్ణా గోదావరీ గర్భ పరిసరాల్లో రాజ్యస్థాపన చేసి, మగధ సామ్రాజ్యమును కూడ జయించారు. గంగాతీరం నుంచి కృష్ణాతీరానికి వచ్చారని వుంది.

ఆంధ్రరాజ్యస్థాపన క్రీ.పూ. 5వ శతాబ్ది నుంచి బౌద్ధం తెనుగు ప్రదేశాలపై తన ప్రభావం చూపింది. నాగరాజైన నిశుంభుని చంపి, ఆంధ్ర మహావిష్ణువు రాజ్య స్థాపన చేశాడు (బ్రహ్మాండపురాణం). నాగులు మొదటి నుంచీ బౌద్ధులు. మహావిష్ణువు వైదిక ధర్మ నిష్ఠుడు. తండ్రి సుచంద్రుడు. (ఆర్యమంజుశ్రీ బౌద్ధ గ్రంథం). శ్రీకాకుళం రాజధానిగా క్రీ.పూ. 3వ శతాబ్దిలో రాజ్య విస్తరణ బాగా జరిగింది.

క్రీ.పూ. 4, 3 శతాబ్దం చివరిలో శాతవాహన (శాతకర్ణి) వంశం ఆంధ్రను ఏలింది.

క్రీ.పూ. 3వ శతాబ్దంలో ధరణివర నగరం (ధరణి కోట)ను రాజధానిగా చేసుకున్నారు.

ధరణికోట విద్యా పీఠంలో బ్రాహ్మణ-బౌద్ధ విద్యలు నేర్పారు. 7700 మంది భిక్షువులు, 6 కళాశాలలు, ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పారు. దీని ఆదర్శంగా టిబెట్‌లో లాసా నగరంలో 'డాపంగ్' సంఘారామం నిర్మించారు. వేంగి విద్యాపీఠానికి దిఙ్నాగాచార్యుడు అధ్యక్షుడు. క్రీ.పూ. 3వ శతాబ్దిలో ఉత్తర హిందూస్థానం నుండి కాంచీపురం విద్యాపీఠానికి విద్యార్థులు వచ్చేవారు. శ్రీశైలం సంఘారామానికి ఇతర దేశస్థులు వచ్చేవారు.

క్రీ.పూ. 300 సం॥నాడు ఆంధ్రులు మహా వైభవంగా వున్నారని మెగస్తనీస్ వ్రాశాడు.

బౌద్ధుల గురించి అహిచ్ఛత్రపుగాథ ఒకటుంది. ఈ గ్రామం గంగాతీరాన వుంది. మహీమతి పాలిస్తున్నాడు. అక్కడ ద్విజులకు బౌద్ధులకు వివాదం జరిగింది. రాజు ఒక కుండలో పామును బంధించి పైన తెల్లబట్ట వేసి, అందులో ఏముందో చెప్పమన్నాడు. పాముందని బౌద్ధులు చెప్పారు. "పామున్నాసరే అది లేకుండుగాక" అన్నారు బ్రాహ్మణులు. తెరచి చూస్తే పాములేదు. బ్రాహ్మణులే పవిత్రులని రాజు నిర్ణయించాడు. బౌద్ధులు ఆ గ్రామాన్ని విడిచిపోయారు. మాయోపాయంతో బౌద్ధులను ఓడించడానికి ఒక ఉదాహరణ. అహిచ్ఛత్రపురం జనులు ఆంధ్రకు వచ్చారు. మళ్ళీ గంగాతీరానికి వెళ్లారు. రాజువలన అటూ ఇటూ తిరిగారు. అహిచ్ఛత్రపురంలో క్షామం వస్తే 700 బ్రాహ్మణ కుటుంబాలు కృష్ణాతీరానికి వచ్చారు.

మూడవ సంగీతి క్రీ.పూ. 250 ప్రాంతంలో అశోకుడు ఏర్పాటు చేశాడు. మొగలి పుత్తలిస్స అధ్యక్షుడు. అభిధమ్మపిటకం ఏర్పడింది. అశోకుని కొడుకు మహేంద్రుడు థేరవాదాన్ని సింహళం తీసుకుని వెళ్ళాడు. అప్పటి నుండి బౌద్ధం దేశ విదేశాల్లో మహా విజృంభణగా వ్యాపించింది.

అశోక చక్రవర్తి క్రీ.పూ. 236లో మరణించాడు. దాన్ని బట్టి అతని రాజ్యపాలన కాలం తెలుస్తోంది. మగధలో విస్తరిల్లిన బౌద్ధాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి అశోకుడు వివిధ ప్రదేశాలకు ధర్మబోధకులను పంపాడు.

1. కాశ్మీర గాంధారములకు - మజ్ఝంతిక భిక్షువు.
2. మహిష మండలానికి - మహాదేవ భిక్షువు (ఆంధ్రమైసూరుల)
3. 'వనవాసి'కి -రక్షిత భిక్షువు.
4. అపరాంతకమునకు - ధర్మరక్షిత భిక్షువు.
5. మహారట్టమునకు - మహాధర్మ రక్షిత భిక్షువు

6. యవనలోకమునకు - మహారక్షిత భిక్షువు

7. హిమవంతపాదమునకు - మజ్జిమ కస్సపులు

8. సువర్ణ భూమికి - సోణక, ఉత్తరులు

9. తాంబపణ్ణికి - 'మహింద' భిక్షువు (సింహళద్వీపం)

మహాదేవ భిక్షువు వల్ల ధ్యానకటకంలో చైతక వాదం, చైతకనికాయం, మహా సాంఘికవాదం వ్యాపించాయి. బిసి 2వ శకానికి ముందు తాంబపణి అను సింహళ ద్వీపములో అనురాధపురమున దుట్టగామణి ప్రభువు మహాధూపం (ర్వాన్ వెల్లి) మమాస్తూపం నిర్మించేటప్పుడు ఆంధ్రలో పల్నాడు (పల్లవ భోగ్గ) నుండి మహాదేవుడు 4,60,000 మంది బౌద్ధ భిక్షువులను వెంటపెట్టుకొని వెళ్ళాడు (మల్లంపల్లి చారిత్రక వ్యాసాలు).

బౌద్ధ ప్రభావం వల్ల పల్నాడులో "ఇచ్చోట భుజియించిరేక కార్యస్థులై సామంత నృపతులు చాపకూడు" - శ్రీనాథుడు, అన్నట్లు సహపంక్తి భోజనాలు ఆరంభమైనాయి.

బౌద్ధం అత్యంతంగా వ్యాపించింది. అందుచే లక్షలాది మంది భిక్షువులు తయారు అయ్యారు.

ఆంధ్రలో క్రీ.పూ. 2, 3 శతాబ్దాలలో నాగార్జునుని వల్ల శాతవాహన రాజుల ప్రోత్సాహం వల్ల బౌద్ధం విరివిగా వ్యాపించింది. అంతకు ముందు అశోకుని ఆదరణతో వృద్ధి చెందింది. మొత్తం ఆంధ్రలో బౌద్ధం ఎన్నడూ రాజమతం కాలేదు.

క్రీ.శ. 133-154లో గౌతమీ పుత్ర శాతకర్ణి తర్వాత యజ్ఞశ్రీ 172-205లో ఆంధ్రను పాలించాడు. అతడు శ్రీపర్వతమున నాగార్జునాచార్యున కొక సంఘారామం నిర్మించి, దానమిచ్చాడు. ఈ విషయం పాహియాన్ క్రీ.శ. 413 లో భారతదేశ సందర్శమున గుర్తించాడు.

అమరావతి స్థూపం ప్రాథమికంగా క్రీ.పూ. 200 ప్రాంతంలో వెలసినట్లుంది. చైత్యక, పూర్వశైలి, అపరశైల, రాజగిరిక, సిద్ధార్థక నికాయాల్లో తెలుగు దేశపు ప్రాకృత శాసనములందు రాజగిరికులు (రాజగిరి-రాచకొండ), సిద్ధత్థకులు అను రెండు తెగలు ఉదహరింపబడ్డాయి.

నాగార్జునుడు క్రీ.పూ. 1వ శతాబ్దినుండి క్రీ.శ 2వ శతాబ్ది వరకున్నాడని కొందరు పేర్కొన్నారు. "మాతృతంత్ర కాలచక్రం", "మహాకాలతంత్రం" నాగార్జునునకు ధాన్యకటక చైత్యమున లభించినదందురు. క్రీ.శ. 4వ శతాబ్దిలో మహాచైత్యప్రభ ప్రబలంగా వెలిగింది. తర్వాత వజ్రయాన తాత్వికాచారం ప్రజాదృష్టిలో నింద్యమై, దుర్యశము నాపాదించుకొన్నది. అమరావతి మహాగొప్ప కళావిభూతితో వెలుగొందింది. అందుకనుగుణంగా అనేక శిలా శిల్పశకలములు నిదర్శనములైనాయి.

సారస్వతము, చిత్రకళలు, పరిశ్రమలు, రాజ్యాంగ సంస్థలు ఈ యుగంలో రమ్య పరిమళం పొంది అభివృద్ధి చెందాయి. ప్రజలు శాంతికాముకులైనారు. భూతదయాపరులైనారు. హింసా విదూరులైనారు. మానవతా ప్రపుల్లులైనారు. మహాయానమతం వికాసంలో చిత్ర కళాశిల్పాదులు, సాహిత్యమూ, అపూర్వ సౌందర్య పరిమళాలతో విలసిల్లాయి. ఇది భారత దేశ చరిత్రలో స్వర్ణయుగం.

కనిష్కుని కాలంలో (78-101 క్రీ.శ.) కల్హణుని 'రాజతరంగిణి' వచ్చింది. బౌద్ధుడైన అశ్వ ఘోషుడు సౌందర్యనందనం, బుద్ధచరిత, వజ్రసూచిక సంస్కృతంలో వ్రాశాడు.

విక్రమాదిత్యసోదరుడైన భర్తృహరి వైరాగ్య శతకం బౌద్ధ ప్రభావం వల్ల వ్రాశాడందురు. భట్టి కావ్యకర్త బ్రాహ్మణుడు. అతని జ్ఞానవైరాగ్యమంతా బుద్ధోపదిష్టమే.

గుణాఢ్యుడు వ్రాసిన బృహత్తరమైన "బృహత్కథ"లో బౌద్ధగాథలు, పురాణ గాథలు ఉన్నాయి. పైశాచిక భాషలో రచించాడు. దాన్నే సంస్కృతంలో కథా సరిత్సాగరమన్నారు.

శూద్రకుడు 1వ శతాబ్దం 'మృచ్ఛకటికం' వ్రాశాడు. అది వసంత సేనా చారుదత్తుల ప్రణయగాథ. వసంత సేన ఆమ్రపాళి వంటిది. చారుదత్తుడు బ్రాహ్మణుడు. 3వ శతాబ్దంలోబుద్ధుని జీవిత కావ్యమైనలలిత విస్తారం వ్రాయబడింది.

సుశ్రుతుడైన చరకుడు వ్రాసిన 'సుశ్రుత' గ్రంథంలో కొంత శ్లోక భాగం తీసుకొని నాగార్జునుడు గద్యవివరం వ్రాసి దాన్ని వృద్ధి చేశాడు. వైద్యంలో ప్రసిద్ధమైన శస్త్రచికిత్స గురించి సుశ్రుతుడు వ్రాశాడు. మిళింద ప్రశ్న అనే పాళీగ్రంథం కూడా ఈయనకు చెందిందే.

ఆర్య సూరుడు జాతక మాల అనే గ్రంథాన్ని సంస్కృతంలో గద్య పద్యమయంగా రచించాడు. 34 బుద్ధ జాతక గాథలున్నాయి. పాళీలో 550 లేక 560 జాతక కథలున్నాయి. ఒక సూక్తి, ఒక కథ జాతక కథలో ఉంటాయి. ఆర్యసూరుడు తన రక్తంతో 70 ప్రార్థనా శ్లోకాలు వ్రాశాడట. (కాళిదాసుని సమకాలికుడంటారు.)

నాగార్జునుని రచన ఉపనిషత్ లాంటిది. స్వీయ మోక్షం కోరుతుంది. హీనయానం నిర్గుణ బ్రాహ్మోపాసన లాంటిది. బుద్ధుడు దేవదేవు (అవతార పురుషు)డని సద్ధర్మ పుండరీకం చెపుతుంది.

ఆనాడు బ్రాహ్మణులపై క్షత్రియులు తిరుగుబాటు చేశారు. బ్రాహ్మణులు హీనులని జాతక కథల్లో తెలుస్తుంది. నిజమైన అర్థంలో క్షత్రియులే బ్రాహ్మణులయ్యారు. జాతిమాత్ర బ్రాహ్మణత్వం పనికిరాదని బుద్ధుని సూక్తి. ఉపనిషద్రష్టలు బ్రాహ్మణ క్షత్రియులైతే, బౌద్ధజ్ఞానులు మౌనంగా సచ్ఛీలులయ్యారు. బోధకులయ్యారు. అన్ని వర్గాల నుంచీ వచ్చారు. సర్వభూతాల్లో అభేద దర్శనం చేసుకొన్నారు. యాజ్ఞవల్క్యుడు స్త్రీకి జ్ఞాన బోధ చేశాడు. చార్వాకులు కూడ అప్పటివారే. ఇంకా 62 మత శాఖలున్నాయి. అన్నిటిపై బౌద్ధ ప్రభావం ఉంది.

బ్రాహ్మణులు ఉపాయంగా జానపదుల విద్యలను, వృత్తులను సొంతం చేసుకుని , మరో ప్రక్క ఉపనిషత్ విద్యలు మావేనని వర్గాధిపత్యం సంపాదించారు.

ఆంధ్రవాఙ్మయ చరిత్ర నన్నయ భట్టుతో ప్రారంభమైందన్నారు. అతడు చాళుక్య రాజగు రాజరాజనరేంద్రుని కుల బ్రాహ్మణుడు. క్రీ.శ. 1022-1063 నాటి వాడు. అప్పటికి 400 ఏళ్ళ పూర్వం తెలుగు నేలలో విరివిగా వ్యాపించిన బౌద్ధం మాయమైపోయింది. చాళుక్య రాజులు శైవులు, జైనులను ప్రధ్వంసం చేసినవారు కూడా వీరశైవులే. విష్ణుకుండిన యుగమున జైనం పోయింది. వజ్రయానతాంత్రికం వల్ల బౌద్ధం పోయింది.

నాల్గవ సంగీతి క్రీ.శ. 72లో కనిష్కుడు కాశ్మీర్‌లో పెట్టాడు. వసుమిత్రుడు అధ్యక్షత వహించాడు. అశ్వఘోషుడు అందులో ప్రధానుడు. సర్వాస్థివాదులు, మహాసాంఘికులు, మహాయానులుగా - స్థవిర వాదులు ఇతర తెగలు హీనయానులుగా చీలిపోయారు. మహావిభీష సూత్రం కృతి చేయబడింది.

క్రీ.శ. 8వ శతాబ్దిలో వజ్రయానం తాంత్రిక స్వభావానికి లోనైన శాఖ. కాలచక్రాది ఆరాధనా పూజా విధానాలకు దారితీసింది.

శాతవాహనుల తర్వాత బౌద్ధునికి క్రీ.శ. 13, 14, శతాబ్దాల వరకు, లేదా బ్రిటీషు వాళ్ళు వచ్చేవరకు రాజాదరణ లేదు. అయినా ఆంధ్రదేశ మంతటా బౌద్ధ మతవ్యాప్తి చిహ్నాలు చాలా గొప్పగా ఉన్నాయి. ఎక్కడ తవ్వినా బౌద్ధ శిల్పాలు బయట పడుతూనే ఉన్నాయి. ఆరామాలు, స్తూపాలు, బౌద్ధ విగ్రహాలు ఇంచుమించు ఊరూరా వెలిశాయేమో! అనేక బౌద్ధ విగ్రహాలు హైందవ దేవాలయ విగ్రహాలుగా మార్చబడ్డాయని రుజువు లేర్పడుతున్నాయి. తెలుగులో అనేక బౌద్ధగ్రంథాలు వెలువడ్డాయి. శిల్పాలు చిత్రకళలు ఈనాటికి ఆంధ్రలో విరివిగా గోచరిస్తున్నాయి.

ఉత్సాహ మేర్పడుచున్నది.

ముగింపు :

రాజపోషణ పోయినాక, బౌద్ధం స్వతంత్రంగా నిలబడింది. పవిత్ర జీవులు దాన్ని కొనసాగించారు. చేతిపనివారలు, వ్యాపారస్థులు, రాజాంతఃపురకాంతలు ఔదార్యంగా దాన్ని నిలిపారు. మహిళా పోషకుల్లో ఇక్ష్వాకు వంశస్థులైన దంతిసిరి, రుద్రధారభట్టారిక, విష్ణుకుండిన వంశానికి చెందిన పరమ భట్టారిక, ఒక ధనిక వ్యాపార కుటుంబానికి చెందిన బోధిసిరి చరిత్రలో నిలిచారు.

నాగార్జున, బుద్ధఘోష, దిజ్ఞాగ, ఆర్యదేవ, బుద్ధ పాలిత, బావ వివేక, ధర్మకీర్తి, మున్నగు వారు ఆంధ్రులు. క్రీ.శ. 1-7 మధ్యవారులు. నాగార్జున, ఆర్యదేవ, అసంగ, వసుబంధు, దిజ్ఞాగ, ధర్మకీర్తులను భారత వర్షపు ఆరు రత్నాలుగా టిబెటీయులు ఆరాధిస్తారు.

బౌద్ధం వల్ల కలుపుగోలు తనం పెరిగింది. జాతుల తారతమ్యం తొలిగింది. ఆర్థిక సంపద, జీవన వృత్తులు, సాంస్కృతిక వైభవం హెచ్చింపబడ్డాయి. కళా సంపద విజృంభించింది. తెలుగుజాతికి నాగరికత నేర్పింది. వైదిక మతం అణచివేత, విధ్వంసకత సృష్టించేదాక బౌద్ధానికి గొప్పస్థితి గతంలో వుంది. బౌద్ధ ప్రభావంతో 'కరుణ' నవరసాల్లో భాగమైంది.

తాత్త్విక చింతన ద్వారా మానవ మేథస్సును, ధార్మిక సాధన ద్వారా మానవుని హృదయాన్ని శుద్ధక్రియల ద్వారా మానవుని కరకమలాన్ని, సమతాసామ్రాజ్యాల ద్వారా మానవ సమాజాన్ని మహోన్నత స్థితికి ప్రశాంతతకు ప్రపంచ చరిత్రలో తీసుకొనివెళ్ళింది. ఒక్క బౌద్ధం మాత్రమే. బౌద్ధమే ఈనాటికీ, ఈ ప్రపంచానికి శరణ్యమని సాధకులకు, మేధావులకు ఎప్పటికి అవగాహనలోకి వస్తుందో ఎదురు చూడాలి. అందుకు ఒక్కొక్కరూ కృషి చేయాలి, అందరూ ఏకం కావాలి.

పోకల లక్ష్మీనరసు వ్రాసిన బౌద్ధ గ్రంథం, వాల్‌పోల్ రాహుల్ వ్రాసిన గ్రంథాలు, డా॥ బి.ఆర్. అంబేద్కర్ రచించిన బౌద్ధ గ్రంథాలు. బి.యస్.యల్. హనుమంతరావు వ్రాసిన 'ఆంధ్రలోమతం' అనుగ్రంథం మతంలో ఉద్యమ చరిత్రను సృష్టించాయి. గతాన్ని స్పష్టంగా మన కళ్ళముందు పెట్టాయి. బౌద్ధాన్ని సహేతుకంగా సరిదిద్దాయి. అపార్థాలను తొలగించాయి. అసలైన నాగరిక, సాంస్కృతిక జీవనాన్ని మానవతా సాధనాన్ని సూచించాయి. బౌద్ధాన్ని ఫక్తు మానవ - సామాజిక - సంబంధంగా చూపించాయి. తాత్త్విక, ధార్మిక లోతులను కూడ చూపాయి. ధమ్మమంటే నైతిక తాత్త్విక సహేతుక మానవ శాస్త్రమని మనం అర్థం చేసుకోవాలి.

# అహంకార శూన్యత - కరుణాపూర్ణత - బౌద్ధం

- డా॥ వావిలాల సుబ్బారావు

"పక్షపాత రహితంగా ఆలోచించాలి దేన్ని గురించి అయినా" అనే సూక్తిని అందరు తమ సంభాషణల్లో వల్లిస్తుంటారు. objective గా ఉండాలి - అనిగూడ ఒక ఇంగ్లీషు పదం పడేస్తుంటారు. అది సాధ్యమా! తన పూర్వాభిప్రాయాలను పక్కనపెట్టి - వాటి నీడ పడకుండా వినేవాడు, ఏదీ పట్టించుకోని వాడయి ఉండవచ్చు. తనకొక సిద్ధాంతం మీద అభిమాన నిష్ఠ అంటూ ఉంటే ఎదుటి వారి వాదాన్ని రంగుటద్దాలతో తప్ప చూడలేడు. ఎవరి వాదాన్ని వారి భూమిక (stand porat) నుండే ఆలోచించి, ఇతర వాదనలకు సమన్వయాన్నో, సముచిత స్థానాన్నో ఇవ్వటం, వాదానికి కాకుండా సత్యశోధనకే నిబద్ధుడైన వానికి మాత్రమే సాధ్యం కావచ్చు. నిజమైన బౌద్ధ సంస్కారం ఉన్నవారు కొంత వరకు అట్లాంటి పరిశీలన చెయ్యగలడు. బౌద్ధ అభిమానం వల్ల నేనీమాట అనటంలేదు. బౌద్ధ సంస్కారంలో హేతుబద్ధ చింతన, సమత్వ దృష్టి, కాల్పనికత లేని వాస్తవ దృక్పథం, ప్రధానాంశాలు. కనుక బౌద్ధంలో పర సిద్ధాంత ఖండన ఉన్నా - అవి ఊహాపోహల మీద ఆధారపడి ఉండవు. వాస్తవ పరిశీలన మీద ఆధారపడి ఉంటాయి.

'అన్ని సిద్ధాంతాలను, మతాలను పరిశీలించి అంచనా వేయటానికి బౌద్ధమేమైనా చర్చావేదికా? ఇదిగూడ మతమేగదా?' అనవచ్చు. మతం అనే మాట Relgion కు సమానార్థకం కాదు. 'మతం' అనే మాటను భారతీయ భాషల వినియోగం వేరు. 'కొన్ని హేతువులతో కొన్ని ప్రతిపాదనలను స్థిరీకరించి సిద్ధాంత పరచటం' - అనేది భారతీయ భాషల ప్రయోగం. త్రిమతాచార్యులు అంటే మూడు సిద్ధాంతముల ప్రతిపాదకులు - అనే అర్థం "రిలిజియన్" అనికాదు. "ఆలంకారికమతం" అంటే సాహిత్యాలంకార శాస్త్రవేత్తల సిద్ధాంతం - అనే అర్థం. 'రెట్టమతం' కొక్కోకమతం," "వాత్స్యాయన మతం' - అంటే మన్మథ శాస్త్రంలో భిన్న అభిప్రాయాలు అనే గాని 'రిలిజియను'లు - అని అర్థంకాదు గదా!

'రిలిజియన్' కు మన భాషలలో దాదాపు సమానార్థకం - ధర్మం అన్నపదం... వైదిక ధర్మం-బౌద్ధ ధర్మం - జైనధర్మం - మొదలైనవి ఉదాహరణలు 'ఉపనిషన్మతం'అంటే ఉపనిషత్తుల సిద్ధాంతం అని మాత్రమే 'ధర్మం' - అన్నమాటలో "సిద్ధాంతము - విధి - ప్రచరణ" అన్న భాగాలు ఇమిడి ఉన్నాయి. ('ధర్మ' శబ్దానికి ఉన్న ఇతర అర్థాలను గురించి కాదు)

'రిలిజియన్' అనే మాటను పాశ్చాత్యవేత్తలు "నిర్దిష్ట విశ్వాసాలతో చేసే బాహ్యాచరణాల సముదాయం" అని నిర్వచిస్తున్నారు (World religions). రిలిజయన్‌ను ఆచరణల సముదాయంగానే గుర్తించాలని అంటున్నారు. ఆటవిక జాతుల ఆచరణను గూడ వారు "ట్రైబల్ రిలిజయన్" గా గుర్తిస్తున్నారు గనుక - వారిలో సిద్ధాంతాలు ఏర్పడని విశ్వాసాలు మాత్రమే ప్రధానం గనుక ఈ రకమైన వివరణ ఇచ్చారు. అంటే విశ్వాసాలు, ఆచరణలు భేదిస్తే వేరు వేరు మతాలుగా గుర్తించాలి అని అర్థం. భారతీయ పద ప్రయోగ నేపథ్యంలో వైదికధర్మం-బౌద్ధధర్మం-జైనధర్మం అనే అంటారు.

---

డా॥ వావిలాల సుబ్బారావు, రిటైర్డ్ - తెలుగు లెక్చరర్, అమరావతి

బుద్ధుడు చేసిన ప్రవచనాన్ని ధర్మచక్ర ప్రవర్తనం అనే అన్నారు. ఈ పదబంధాలను బట్టి సిద్ధాంతం - ఆచరణల సమన్వయ పూర్వకమైన పరిపాటిని ధర్మం అంటారు.

అయితే శ్రమణులకు - మహాయానులకు. థేరవాదులకు నిర్దిష్టమైన ఆచరణ మార్గలు క్రమంగా ఏర్పడిన పిదప వాటికి గూడ 'రిలిజియన్' పదాన్ని విస్తరించవచ్చు. బుద్ధుడు ధర్మం బోధించాడు - క్రమంగా దాని చుట్టు మతం గూడ అల్లుకుంది. కాని వైష్ణవ, శైవ ఆచరణ పద్ధతలు ఏర్పడినా వారిని వేరు మతంగా ఉదహరించటాన్ని ఆ మార్గానుయాయులే అంగీకరించరు. వారుగూడ వేదముల మొదలు భగవద్గీత వరకు ఉన్న గ్రంథాలనే ప్రమాణంగా స్వీకరిస్తున్నారు గనుక అవి సంప్రదాయములేగాని మతములు కావు. ఇంతకూ చెప్పదలచిందేమంటే రిలిజియన్ = మతం అనటానికి చాలా ప్రతిబంధకాలు ఉన్నాయి అన్నదే.

కొన్ని చోట్ల మతం నల్లమందు అయిందేమో గాని 'ధర్మం' నల్లమందు కాలేదు. ధర్మం నైతిక జీవితానికి సత్యాన్వేషణకు శిక్షణ ఇచ్చింది. ధర్మం గూడ రిలిజియన్ రూపాన్ని పొందిన కొన్ని సందర్భాలలోను, రాజ్య వ్యవస్థ చూపిన ఎరలకు ప్రలోభాలకు లోబడిన సందర్భాలలోను యుద్ధాలు జరిగాయి. బౌద్ధ ధర్మం మాత్రం యుద్ధాలను ఆశ్రయించలేదు. ఘర్షణలకు పాల్పడకుండానే భిన్న స్థానిక సంప్రదాయాలను తన ధర్మం వైపుకు ఆకర్షించింది. ఏమేరకు ఆమోదమైతే ఆ మేరకే ధర్మాచరణను స్వీకరించే వాస్తవ దృష్టికలది బౌద్ధం.

ప్రతి మతము (రిలిజియన్) సత్యం గురించే మాట్లాడుతుంది. తమ గ్రంథం గాని, ప్రవక్తగాని బోధించేదే సత్యమని అదే సర్వకాల సర్వజీవులకు తుదితీర్పు అని, ఎదురుగా ఏముంటే దాన్ని గుద్ది వాదిస్తాయి. సత్యమంటే ఏమాటో ఏదో - మల్లయోధుల వంటి పండితులు వాద ప్రతివాదాలలోను, క్రికెట్ ప్రేక్షకుల వంటి శ్రోతల కేరింతలలోను తేలదు. - 'శ్రీనాథు'ని గెలుపును - తన ఓటమిని స్వయంగా ప్రకటించిన గౌడ డిండిమభట్టు వంటి నిజాయితీ పరులు, తన భర్తయైన మండనమిశ్రుని ఓటమిని, శంకరాచార్యుని గెలుపును తీర్పు చెప్పే మిశ్రులవారి భార్య "ఉభయభారతీదేవి" వంటి నిజాయితీ పరులు కరువైన లోకంలో వాదాలు-తీర్పులు ప్రయోజనకారులు కావు.

మీరనుకొనే సత్యానికి మీ అర్థం ఏమిటి అని మహాత్మాగాంధీని ప్రశ్నిస్తే - 'అప్పటికి నాకు ఏది ఆచరణ సాధ్యమో - అప్పటికి అది నాకు సత్యం' - అని చెప్పారుట - ఒకచోట. ఒకరికి సాధ్యమైనది మరొకచోట మరొకరికి సాధ్యం కాకపోవచ్చు. సత్యానుష్టానంలో సాధ్యాసాధ్యాలు సాపేక్షాలు అనవచ్ఛిన్నమైన సత్యం స్థల కాలపరిమితమైన మనస్సుకు జ్ఞాత పరిధిలోరాలేదు. సర్వకాల అబాధిత సత్యం ఒకటి ఉన్నది అనుకోవటం భావనామాత్ర విషయం. సతార్కికమే అయినా ఊహాజనితం. అనుభవ పరిధిలోనిది కాదు. మనకు తెలిసినది మన పరిమితులకు లోబడినదే. దాని గరిష్ఠ పరిధి ఎంత అన్నది మన ఆచరణవల్లనే నిరూపితం కావాలసి ఉంటుంది - అని నేను మహాత్మాగాంధీ మాటలను అర్థం చేసుకుంటున్నాను. అహింసా సూత్రాన్ని మాంసాహారానికి వర్తిస్తే - 'ఎస్కిమో' జాతి వారికి ఆహారమే ఉండదు. అక్కడ అనవసర హింస లేకపోవటమే అహింస.

ఆచరణ విషయమై మానవ జాతి మీద మతాల ప్రభావం ఏమిటి అని పరిశీలిస్తే అన్ని మతాలు రెండు ప్రధానాంశాల మీద దృష్టి నిలిపాయి.

1. మంచిని ప్రోత్సహించటం, 2. చెడు నుండి మరలించటం. ఈమేరకు మతాలు మానవ జాతికి తలపెట్టిన మేలుకు మనం కృతజ్ఞులుగా ఉండవలసిందే. ఈ లక్ష్యాలను సాధించటానికి మానవుల మనసుల మీద విధి నిషేధాల రూపంలో ఆదేశాలను జారీ చేసాయి. ఏదో ఒక అధికారాన్ని చేతబట్టి నడిపించాయి. కొందరు భగవంతుని ఆదేశమన్నారు. కొందరు అపౌరుషేయవాక్కు అన్నారు. ఎట్లా అన్నా ఒక అతీత అస్తిత్వాన్ని - ఆధిపత్య కర్తృత్వాన్ని అంగీకరించటం తప్పనిసరి అని నిర్దేశించాయి.

భారతీయ ధర్మాలు, మతాలు - అందులోని అనేక శాఖలు అతీత అస్తిత్వం యొక్క ఆదేశం కన్న అతీత అనుభవాన్ని లక్ష్యంగా చూపించి మార్గసూచన చేసాయి. యోగ, సాంఖ్యాది దర్శనాలు, ఉపనిషత్తులు ఇందుకు తార్కాణాలు. వాటికి పొంద దగిన అనుభవమే అలౌకికం - అవి అదేశాలు నియమాలు కావు. సాధకులకు వారి మాటల సాక్ష్యాలు మాత్రమే. (ధర్మశాస్త్రాల ఆదేశాలు - సామాజిక నియమాలేగాని మత భాగాలు కావు) భగవద్గీతలోని ప్రతివాక్యం భగవంతుని వాక్యమే ననటం - రామాయణంలోని ప్రతి వాక్యము అక్షరశః ప్రమాణం అనే మాటలు - వేదం పరమ ప్రమాణం - అపౌరుషేయం అనటం - కొందరి నోట ఇంకా వినబడుతున్నా - అవి కాలం చెల్లిన మాటలని హిందువులు గూడ గుర్తిస్తున్నారు.

"భగవంతుడు," "యహోవా"నో, "అల్లా" యో ఎవరో ఒకరు సృష్టికర్తగా ఉండి ఉండాలనే ఊహకు మూలం ఏమిటి? కుమ్మరి - కుండలు; సాలెపురుగు - దారం మొదలైన ఉదాహరణలు పరిశీలించిన మీదట సృష్టికి - కర్త ఒకరుండాలన్న ఉపమాన, అనుమానాల మీద ఆధారపడిన చింతన అయి ఉంటుంది. - ఉపమానం మారితే ఊహ కూడ మారుతుంది. కల్పన గూడ మారుతుంది. కనుక ఇట్లాటి ఊహాజనిత సిద్ధాంతాలను సర్వ ప్రామాణికాలనిగాని, సర్వజన శిరోధార్యాలని గాని నిర్ధారించలేం. కాని ఊహించదగిన దేదో ఉంది.

అయితే వీటన్నిటిని - అబద్ధం, మోసం, కుట్ర మొదలైన వ్యాఖ్యలతో విమర్శించటం అనాలోచితమైన క్రూర విమర్శ. ఆ కల్పన వల్ల జరిగిన గొప్ప కళా పురోగమనాన్ని నిర్లక్ష్యం చేయతగదు. స్వార్థ రహితులైన సిద్ధపురుషులకు, మహా భక్తులకు కలిగిన అపూర్వానుభవంలో పొందిన దర్శనాలను, స్ఫురించిన వాక్యాలను వెల్లడించారు. వాటిని చెప్పినవారు - వారిని నమ్మిన వారు పాటించారు. అందువల్ల నైతిక రంగంలో, అనుభవ సాధనా మార్గంలో కొంత కొంత పురోగమనం జరిగింది. ఆ కల్పనలు కల్పించుకొన్న వారికి వ్యక్తిగత సత్యాలు తక్కిన వారికి పాక్షిక సత్యాలు - అంతేగాని కుట్రలు మోసాలు కావు.

దీనివల్ల గొప్ప కళా వికాసం కలిగింది. ఆ కళే సర్వజనులకు హృద్యం అయింది. రాముడు అబద్ధం అనుకున్న వారికి గూడ రామ భావన నుండి పుట్టిన త్యాగరాజ సంగీతం, రామదాసు తాదాత్మ్యత పులకరింతలనే కలిగిస్తున్నాయి కదా! కళలు మన మనస్సును సమ్మోహితం చేసి రసానుభవం ద్వారా అంగీకరింపజేస్తాయి (ప్లేటోకి ఇందుకే కాబోలు కళలమీద కోపం) - గొప్ప సత్యాలు అనిపించేంత మహా వాక్యాలు వెలువడతాయి. "సర్వంఖల్విదం బ్రహ్మ" - "తత్వమసి" "అహం బ్రహ్మాస్మి" అన్నా Civilization is the march of God on earth" అన్నా ఇవన్నీ మహానుభవం నుండి వెలువడిన,

మహా సత్యాలనిపించే కవితాత్మక వాక్యాలే. సర్వకళా చరిత్రకు భగవద్భావన అపూర్వమైన ఆధారభూమి అయింది. వ్యధార్త జీవులకు గొప్ప ఓదార్పు అయింది. అందుచేత భగవదస్తిత్వ భావనకు ఒక నమస్కారం చేసి ముందుకు సాగవలసి ఉంది.

ఎవరో ఒకరిని ప్రమాణంగా తీసుకొనటం మొదలు పెడితే రకరకాల వ్యాఖ్యానాలు, అపవ్యాఖ్యానాలు; చర్చలు ఉపచర్చలు వస్తాయి. ఆచరణలో సరిచూడని బద్ధ కస్తులు తయారవుతారు. ఒకరు చెప్పారుగదా అని ప్రమాణంగా తీసుకొని వారు విధించిన నిబంధనలను పాటించటం సరయిన మార్గం కాదు. కనుక సత్య దర్శనానికి స్వీయ సాధనే సరైన మార్గం. బుద్ధుని చివరి ఉపదేశం కూడా ఇదే. నీకు నీవే దీపం (ద్వీపం) అన్నీ అనిత్యాలే ఎల్లపుడు ఎరుక కలిగి ఉండు - అని చెప్పాడు.

అయితే నీతివంతమైన జీవితానికి, సామాజిక క్రమశిక్షణకు ఎవరి ఆదేశాన్ని ఆమోదించక పోతే భగవంతుని అస్థిత్వం, అతీత పురుషుని ఆమోదం అక్కరలేకపోతే అరాచకం కలగదా! ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా! అన్న సమంజసమైన, సర్వసాధారణమైన సందేహానికి బౌద్ధ ధర్మం సమాధాన పూర్వకమైన ప్రతిపాదన చేసింది - శీల శుద్ధి ఉంటే (శీల) సరయిన అంతరవ లోకనం కలుగుతుంది (సమాధి). దాని నుండి ఒక విశిష్ట జ్ఞానం కలుగుతుంది (ప్రజ్ఞ) అక్కడ నుండి క్రీయాశీలమయ్యే మనస్సు సమత్వంతో ప్రవర్తిస్తుంది. కనుక నైతిక సామాజిక క్రమశిక్షణా సమస్యలు ఉత్పన్నం కావు అని సమాధానం చెపుతుంది బౌద్ధ ధర్మం.

ఇదంతా నిజమా! ఆయన మాట నమ్మకుంటారా? అనే సందేహ భావులకు - నమ్మమని చెప్పలేదు - "రండి వచ్చి ఆచరించి చూడండి" అని సాధనకు ఆహ్వానించాడు. పైన చెప్పిన సమాధానాన్నంతా వివరించి విశ్లేషించితే అదే అష్టాంగ మార్గం అవుతుంది. దాన్నే శీల - సమాధి - ప్రజ్ఞలుగా సంగ్రహ పరచి చెప్పారు - దీని ఆచరణ వల్ల కలిగే లాభం ఏమిటి - అంటే - సిద్ధార్థ గౌతముడు ఏమి ఆశించి, దీన్ని అన్వేషించటం కోసం, ఇల్లు వదలి, శిక్షణా శ్రమలు పడి, చివరకు బోధివృక్షం క్రింద తెలుసుకున్న ఆ దుఃఖ నివారణమే ఫలితం. దుఃఖ రహిత స్థితినే 'నిర్వాణం' అని బౌద్ధం చెపుతుంది. ఆ దశలో ఘర్షణ లేని స్థితికి మనసు చేరుకుంటుంది. ఘర్షణ పడని మనసుకే సత్యం బోధ పడుతుంది. విభజన వల్లనే ఘర్షణ కలుగుతుంది. సత్యం అంటే విభజన లేని దృష్టి - విభజించు కొనటమే అసత్యం.

ఈ ఘర్షణ లేని స్థితి కలగటానికి ధ్యాన మొక్కటే సాధనం. "అందుకు ఒక మార్గం ఉంది. అది నా దగ్గరే ఉంది అనటం దంభమే. అనంతత్వంలోకి మార్గాలు గూడ అనంతం. అది ఎవరి గుత్తాధిపత్యము కాదు. 'నాదీ మార్గం' అని ఎవరయినా అంటే అది తనకే మార్గం అని మాత్రమే అందరకు కాదు. "నేనే మార్గం - నేనే గమ్యం" - అని జీసస్ అంటే 'నేను' అనేదే మార్గం - 'నేను' అనేదే గమ్యం అని, అది ఎవరికి వారు స్మరించుకొనవలసిన వాక్యమని నేను అర్థం చేసుకుంటాను. అంటే ఎవరికి వారే మార్గం, ఎవరికి వారే గమ్యం అన్న మాట.

అందుకే బుద్ధుడు ఎవరి మాటా ఏ పూర్వ గ్రంథము ప్రమాణం కాదన్నాడు. చివరకు తన మాట గూడ పరమ ప్రమాణంగా తీసుకొనవద్దని - తమ స్వీయ విచారణకు, అనుభవానికి సరిపోతేనే స్వీకరించమని చెప్పాడు. ఏ విలువలకయినా ధ్యాన, జ్ఞాన, స్థితుల నుండి పుట్టిన ఆచరణే మూలం.

జిడ్డుకృష్ణమూర్తి కూడ - 'ధ్యాన మగ్నమైన మనసు నిశ్శబ్దం నుండి క్రియాశీలమవుతుంది. ఆ నిశ్శబ్దం జడం కాదు. అమిత చైతన్యవంతమైన స్థితి'' అని అంటారు. అటువంటి మనసు నుండి కరుణ, మైత్రి - ముదిత - ఉపేక్ష వంటి గుణాలు కలుగుతాయి. వీటినే బ్రహ్మ విహారాలు అని బౌద్ధం వివరిస్తుంది. ఇవి అత్యుత్తమ మానసిక స్థితులు. బ్రహ్మ అంటే సృష్టికర్త అని గాని బ్రహ్మన్ అనిగానే అర్థం కాదు. తపస్సు అని, వృద్ధి పొందునది అని అతి ఉదాత్తమైన, గొప్పదైన, అని మాత్రమే అర్థం (బృంహతి) ఈ స్థితి నుండి కలిగే ఉదార ప్రవర్తన అందరకు ఉదాహరణ ప్రాయమవుతుంది. ఆ దశకు చేరని ఇతర జనులకు కూడ ఆ శ్రేష్ఠుల ఆచరణే మార్గదర్శక మవుతుంది.

భౌతిక వాదుల దృష్టిలో నైతిక విలువలు అంటే ప్రయోజన పూర్వకమైన పరస్పర ఒప్పందాలు. మత విశ్వాసుల దృష్టిలో - అవి - భగవంతుని / ప్రవక్త / ప్రమాణ గ్రంథాల మీద ఆధారపడ్డ నియమాలు. బౌద్ధం ప్రకారం నీతి ప్రజ్ఞ నుండి వికసించిన పరిణత స్వభావం. సమ్యక్ దృష్టి నుండి ఇది కలగటం వల్ల భ్రాంతి జన్యమైన విశ్వాసాలు ఉండవు.

భగవంతుని కేంద్రంగా చేసుకొని విశ్వ క్రమాన్ని వర్ణించటంవల్ల వ్యక్తి భగవంతునికి సేవకుడైనాడు. మానవుని కేంద్రంగా చేసి వివరించుకొనటం వల్ల మానవుడు అహంభావి అయినాడు. జీవులందర్నీ సమానంగా విశ్వ పరిణామ ఫలితాలేనని వివరించటంవల్ల ప్రేమ సమత్వాలతో మానవుడు కరుణామూర్తి అవుతాడు.

తత్త్వవేత్తలు ఇప్పటిదాకా ప్రపంచాన్ని వివరించటంలో గడిపారు. ఇక ప్రపంచాన్ని మార్చటం ఎట్లాగన్నది తత్త్వవేత్తల బాధ్యత అన్నాడు. "మార్క్స్' తాను మారకుండా ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయటమంటే తనకు అనుకూలంగా ఘర్షణను సిద్ధం చేయటమే. తనను తాను పునర్నిర్మించుకొనటం ద్వారా ప్రపంచాన్ని దుఃఖరహితం ఎట్లా చేయవచ్చో మార్గం సూచించిన వాడు బుద్ధుడొక్కడే.

జీవంగలవన్నీ, సత్వములన్నీ; సమానములే అనటంవల్ల సర్వజీవ సమదృష్టి, కలుగుతుంది. పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక కార్యక్రమంగా భావించనక్కరలేదు. అందుకు ఉద్యమాలు అక్కరలేదు. బౌద్ధంలో పర్యావరణ పరిరక్షణ స్వాభావికమైన సహజీవన గుణాలు. నేటి పర్యావరణ ఉద్యమాలు అవసరార్థ ఉద్యమాలు, అగ్రరాజ్య అధిపత్యోద్యమాలు.

మన మనస్సులన్నీ, పుట్టక ముందు, మరణించిన తర్వాత, గురించిన ఆలోచనలతో చిక్కుపడి పోయాయి."పుట్టుటయు నిజము - పోవుటయు నిజము - నట్ట నడిమి పని నాటకము'' - ఈ రెండు నిజాల ముందు వెనకల ఊహలు భ్రాంతి మూలకాలు. నట్టనడిమి నాటకం అంతా మార్పు - మార్పు - మార్పు; పరిణామం - పరిణామం - పరిణామం. అవిచ్ఛిన్న పరిణామాన్ని అనుభవంలోకి తెచ్చుకొనటమే ధ్యానం.

దాని ఫలితం -

"అహంకార శూన్యత
కరుణా పూర్ణత"

# ఏకాగ్రత - స్మృతి - అంతర్దృష్టి - అవగాహన

- షణ్ముఖానంద

'సోము జిలేబి తింటున్నాడు. అది చూచిన శేఖర్‌కి కోరిక కలిగింది. సోముడ్ని అడిగాడు కొంచం పెట్టమని. సోము ససేమిరా అన్నాడు. శేఖర్‌కి కోపం వచ్చి సోముడ్ని తన్ని జిలేబి లాక్కొని తిన్నాడు. అది తెలిసిన సోముడి తండ్రి శేఖర్‌ని చితక బాదాడు. తన్నులు తిన్నాక శేఖర్ పాశ్చాత్తాపానికి గురి అయినాడు. జిలేబీ లాక్కోకుండా ఉంటే బాగుండేది అని అనుకున్నాడు. జిలేబి తినాలని అనిపించకుండా ఉంటే బాగుండేది అని అనుకున్నాడు.

ఇంచుమించు ఇలాంటి సంఘటనలే అందరి నిత్య జీవితాలలో జరుగుతూ ఉంటాయి. జిలేబి బదులు - ధనం గాని, భూమిగాని, పదవిగాని, మరేదన్నా అయి ఉండవచ్చు. కారణం కోరిక కావచ్చు, ద్వేషం, లోభం, మోహం కావచ్చు. మరేదన్నా కావచ్చు. అలా చేయకుండా ఉంటే బాగుండు, అలా జరగకుండా ఉంటే బాగుండు. ఇలా ఎన్నో భూతకాలానికి సంబంధించిన క్రియల పట్ల మన ఆలోచనలు కొనసాగుతాయి. కానీ అలాగే మరలా మరలా చేస్తూ ఉంటాము. మన జీవితమంతా ఆశాభంగం, అసంతృప్తి, అశాంతి, ఆందోళన, అసహనం, ఉద్విగ్నత, అభద్రతా, స్వనింద, దుఃఖంతో గడిచిపోతూ ఉంటుంది. వీటిని అధిగమించాలని అనుకుంటాము. కాని, చేత కావటం లేదు. దీనికి తోడు అజ్ఞానం అప్రయత్నం.

జిలేబిని చూడటం, దానిని తినాలని కోరిక మనసులో కలగడం, కోరికతో ఉన్న మనస్సు సోముని అడిగేటట్లు చేయడం, వాడు ఇవ్వనందున, కోరిక నెరవేరనందున దుఃఖం కలగడం, ఆ దుఃఖం దౌర్జన్యంగా మారటం వాడి దగ్గర నుండి లాక్కుందాం అని అనిపించడం. అలా అనిపించగానే లోపల అచేతనంలో దాక్కున్న మృగం మేల్కొని శేఖర్‌ని పశువుని చేసి దాడి చేయించింది.

పైన చెప్పిన క్రియా క్రమంలో ఎక్కడా కూడా శేఖర్‌కి స్పృహ (లేదా) స్మృతి లేదు. అంతర్దృష్టి గాని లేదు. నేను జిలేబిని చూసాను, నాకు తినాలనిపిస్తుంది. సోముని అడుగుతున్నాను. వాడు ఇవ్వనందుకు నాకు కోపం వస్తుంది. నాలో మృగం బయటకువస్తుంది, సోముని తంతున్నాను. ఇలా వర్తమానపు క్రియ పట్ల ఎఱుక కలిగి ఉండటమే స్మృతి. ఈ స్మృతి శేఖర్‌కి ఏ క్షణంలో కలిగినా తదుపరి చర్య జరిగేది కాదేమో?

ఒకవేళ ఇలాంటి స్మృతి కలిగినా, అయితే ఏమిటంటా మర్యాదగా అడిగినా ఇవ్వలేదు గనుక తన్నాల్సిందే అని తనను తాను సమర్థించుకుని ముందుకు సాగితే ఏమి చేయగలిగింది లేదు. అందుకే అష్టాంగ మార్గంలో శీలానికి తగు స్థానాన్ని ఇచ్చాడు బుద్ధుడు.

స్మృతిని గురించి తెలుసుకుందాం. స్మృతిని ఎలా పెంపొందించుకోవాలో తెలుసుకుందాము. సోముని కొట్టి జిలేబీ లాక్కున్న సంఘటన శేఖర్‌కి గుర్తుకు వస్తే అది జ్ఞాపకం. సంఘటనను జ్ఞాపకం చేసుకుంటున్న విషయాన్ని గుర్తించగలిగితే అది స్మృతి. అనగా ఎఱుక. జ్ఞాపకం, జరిగిపోయిన దాని పట్ల ఎఱుక. స్మృతి, జరుగుతున్న దానిపట్ల ఎఱుక.

---

షణ్ముఖానంద, బౌద్ధ అభిమాని, విపస్సనా ధ్యానంలో ప్రవేశం ఉంది, హైదరాబాదు.

స్మృతి అద్దం లాంటిది. అద్దం మన భౌతిక రూపాన్ని మనకు చూపినట్లు, స్మృతి మన ప్రవర్తనను గాని, ఆలోచనను గాని వర్తమానంలో జరుగుతున్న దానిని జరుగుతున్న విధంగా ప్రతిబింబిస్తుంది.

సోము అద్దంలో చూసుకున్నాడు. జుట్టు చెదిరిపోయిన సంగతి గుర్తించి సరిచేసుకున్నాడు. అలాగే శేఖర్ ఆలోచనలో నిమగ్నమై ఉన్నాడు. స్మృతి, ఆలోచనలో నిమగ్నమైన సంగతిని శేఖర్‌కి ఎఱుక పరిచింది. అప్పుడు ఆలోచన నుండి తప్పుకున్నాడు. (లేదా) సరైన ఆలోచనకి శ్రీకారం చుట్టాడు. సోము జిలేబీ ఇవ్వలేదన్న కోపంలో శేఖర్ ఉన్నాడు. కోపంతో ఊగిపోతున్నానన్న ఎఱుక స్మృతివల్ల శేఖర్‌కి కలిగింది. తమాయించుకున్నాడు. తదుపరి చర్య ఆగిపోయింది.

ఈ స్మృతిని ముందుగా ఏకాగ్రత సాధన ద్వారా పెంపొందించుకుని మానసిక - అలవాటుగా చేసి నిత్య జీవితం లోనికి కూడా ప్రాకేటట్లు చేయాలి. అప్పుడు అవిచ్ఛిన్నమైన స్మృతి స్థితిని, అంతర్దృష్టిని పొంది మనల్ని మనం సంస్కరించుకోగలం. దుఃఖాన్ని జయించగలం.

మనసు కోతి లాంటిది అంటారు. అది నిరంతరం చలిస్తూనే ఉంటుంది. ప్రతిక్షణం కూడా మామూలు ద్రష్ట దాని అస్థిత్వాన్ని గుర్తించలేనంత వేగంగా మారుతుంది. మనసుని ఒక వస్తువు మీద కేంద్రీకరిస్తే దాని వేగం తగ్గుతుంది. ఏ వస్తువూ లేకుండా మనసుని కేంద్రీకరించలేము కాబట్టి ఎల్లవేళలా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే శ్వాసను ధ్యాన వస్తువుగా ఎంచి మనసుని కేంద్రీకరించాలి. ఈ కేంద్ర బిందువు లేనట్లయితే మనసులో అనంతంగా జరుగుతున్న మార్పులను గమనించలేము. వాటిలో కొట్టుకుపోతాం. ఉదా : రైలు ప్రయాణంలో కిటికీలన్నీ మూసి ఉంచితే రైలు కదులుతుందన్న సంగతి మనకు తెలీదు. కిటికీ నుండి బయటకు మనం దృష్టి సారించినపుడు బయట దృశ్యం కదిలి పోతుందనిపించడంతో రైలు కదులుతుందన్న విషయం స్పష్టం అవుతుంది.

శరీరాన్ని స్థిరంగా ఉంచి, ఉశ్వాస నిశ్వాసాలను గమనిస్తూ ఉండటాన్ని అభ్యాసం చేయాలి. అలా గమనిస్తూ ఉన్నప్పుడు ఉన్నట్లుండి ఏదో ఆలోచన అది జ్ఞాపకం కావచ్చు, భవిష్యత్తు పట్ల ఊహ కావచ్చు, మనసులోకి దూసుకు వస్తుంది. ఈ విషయాన్ని గుర్తించి మనసుని మళ్ళీ శ్వాస మీదకి లాగుతాము. మరలా అది దారి తప్పుతుంది. దారి తప్పిన విషయాన్ని గుర్తించగలగడం అంటే స్మృతి శక్తిని పెంచుకున్నామనే అర్థం.

ధ్యాన వస్తువుగా శ్వాసను ఉపయోగిస్తూ చేసే సాధనలో కొంత పురోగతి సాధించిన తర్వాత సాధారణ జీవిత కార్యకలాపాలలో కూడా ఏకాగ్రతను, సావధానతను అనువర్తింప జేయవచ్చు. మనము అనేక పనులు ప్రతి రోజూ చేస్తూ ఉంటాము. కూర్చుంటాం, నడుస్తుంటాం, పడుకుంటాం, ఇతరులతో సంభాషిస్తాం, చదువుకుంటాం; ఈ ఎడతెగని క్రియల పట్ల ఎరుక కలిగి ఉండటాన్ని సాధన చేయాలి. మన మనసును ప్రతి సెకను తెరిచే ఉంచాలి.

మన మనసును ధ్యాన వస్తువు మీదే ఉంచలేం. అది శబ్దాలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలు, సంజ్ఞలు, స్ఫురణల వైపు వెళుతుంది. స్మృతి మనం ఏకాగ్రతని కోల్పోయిన సంగతిని పసిగట్టినపుడు ఏకాగ్రత

భగ్నం కావటానికి కారణమైన ఆలోచనలు స్ఫురణల పట్ల మనకి ఒక దృష్టి ఏర్పడుతుంది. అదే అంతర్దృష్టి

ఇక్కడ మనం మనసు యొక్క రెండు వేర్వేరు గుణాలని పెంపొందించుకుంటున్నాము. ఒకటి ఏకాగ్రత. రెండు స్మృతి. మనసుని ఒక చోటుకి అనగా ఇక్కడ శ్వాస మీదకి తేవటాన్ని ఏకాగ్రత అంటాము. శ్వాస మీద మన ఏకాగ్రత మళ్ళుతుంది. ఈ మళ్ళిన విషయాన్ని స్మృతి గుర్తిస్తుంది. ఎలాగంటే? శ్వాస మీద మనసుని కేంద్రీకరించినపుడు ఏకాగ్రత శ్వాసనే చూస్తుంది. స్మృతి ఈ ప్రక్రియకి దూరంగా నిలిచి శ్వాసని, దాని మీద ఏకాగ్రతని, ఏకాగ్రత తీవ్రతని, గమనిస్తూ ఏకాగ్రత భగ్నం కావడం వల్ల జరిగిన మార్పుని కారణాన్ని కూడా గుర్తిస్తుంది. ఇలా గుర్తించి తిరిగి మనసుని శ్వాస మీదకి తెచ్చేది స్మృతి.

స్మృతి మనం చేస్తున్న క్రియపట్ల సావధానతని కలిగి ఉంటుంది. ఈ స్మృతి జారిపోయినపుడు ఆలోచనలోకి దిగిపోతాం. దీనినే మనం పరధ్యానం అంటాం. మనసు ఒక చోట, శరీరం ఒకచోట అన్నట్లు. స్మృతి, దీనిని గుర్తించి తిరిగి సావధానంగా ఉండేటట్లు చేస్తుంది.

స్మృతి సంజ్ఞాత్మకమయిన ఆలోచనకి పూర్వదశ. మనం జిలేబీని చూసినపుడు ఈ విషయాన్ని విషయంగా అనుభూతి చెందుతాము. ఇదే స్మృతి. ఇంకా మన మనసు దాని మీదకు దూకలేదు. ఈ విషయం మీద ఇంకా ఆలోచించలేదు. అనగా ఇంకా స్మృతితోనే ఉన్నాం. ఓహో! ఇది జిలేబి అని గుర్తించక, నిర్ధారించక ముందు దాకా స్మృతి ఉంటుంది. ఇది జిలేబి అనంగానే స్మృతి పోతుంది.

శేఖర్ మార్కెట్టుకి వెళ్ళాలి. నడుస్తూ ఉన్నాడు. నడుస్తూ ఉన్నటువంటి వర్తమానపు క్రియపట్ల ఎరుకతో ఉన్నాడు. అనగా మనస్సులో ఏమీలేదు. ఉన్నదల్లా నడుస్తూ ఉన్నటువంటి అనుభూతి. నడకని అనుభూతి చెందుతున్న స్థితి. సోము దూరంగా కనబడ్డాడు. సోము నయనేంద్రియంతో సంపర్కం చెందడం చేత శేఖర్‌కి, సోము ఉన్నాడన్న జ్ఞానం కలిగింది. దగ్గరకి రాగానే పలకరిద్దామనే ఆలోచన కలిగింది. సోము జిలేబి తినడం చూసాడు. తిందాం అన్న కోరిక కలిగింది. తర్వాత కథ మనకి తెలిసిందే. సోముగా గుర్తించిన మరుక్షణం నుండే శేఖర్ స్మృతిని కోల్పోయాడు. మనస్సు రంగప్రవేశం చేసింది కాబట్టి. తిరిగి స్మృతిని నెలకొల్పుకునే దాకా ప్రతిచర్య జరుపుతూనే ఉంటాడు.

అంతర్దృష్టిని పొంది మనో ప్రక్రియలైన ఆలోచనలు, భావోద్వేగాలు, కార్యకలాపాలు, కోరికలు మొదలగు వాటి ప్రదర్శనలంతా దర్శించవలెనంటే లోతైన మనస్థితిలోకి త్రోవుకు పోవాలి. ఏకాగ్రతని ఉపయోగిస్తూ తీక్షణమైన స్మృతిని పొందినపుడు సాధ్యమవుతుంది.

లోతైన మనస్థితిల్లోకి పోయినపుడు మనకి అవగాహన కలుగుతుంది. మన మనోవ్యధలకు మనమే కారణమని తెలుస్తుంది. మనమే కష్టాల్ని, భయాలను, ఒత్తిళ్లను నిర్మించుకున్నాం అని తెలుస్తుంది. దుఃఖాల్ని, బలహీనతలను, పరిమితులను, మనంతట మనమే ఎలా నిర్మించుకున్నదీ చూడగలం. మన స్వార్థపూరిత ప్రవర్తనలను వీక్షించుకుంటాం. మన దుఃఖాన్ని వీక్షించుకుంటాం. వీటిల్ని అవగాహన చేసుకున్న తర్వాత, అర్థం చేసుకున్న తర్వాత అవి మనపై పట్టుని కోల్పోతాయి.

ఏకాగ్రత స్మృతులు చట్టాపట్టాలేసుకుని నడుస్తాయి. ఏకాగ్రత మనుసుని ప్రశాంత పరుస్తుంది. అంతరంగాన్నంతటినీ మెత్త పరుస్తుంది. సున్నితం చేస్తుంది. మనసుని అదుపులోకి తెస్తుంది. రాగద్వేషాల వలయం నుండి బయట పడవేస్తుంది. కోరికలకు బద్ధులై వాటిచే ప్రేరితలు వివసులు కావడం జరగదు.

శీలానికి మనోనిగ్రహం కావాలి. స్వనియంత్రణ లేనిదే ఏరకమైన శీలాలన్ని పాటించడం సాధ్యం కాదు. ఈ నిగ్రహం ఏకాగ్రత వల్ల సాధ్యమవుతుంది. ఏకాగ్రత వల్ల మనసు నిదానిస్తుంది. మనసులో కలిగిన ప్రేరణ క్రియారూపం దాల్చడానికి మధ్య వ్యవధి పెరుగుతుంది. ఈ వ్యవధి చాలు విచక్షణతో మెలగటానికి.

స్మృతి అనేది మనకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే ఎమర్జెన్సీ కిట్ వంటిది. మనకు కోపాన్నిగాని, భయాన్నిగాని, ఆందోళనగాని కలిగించే పరిస్థితి ఎదురైనపుడు మనం మన మనస్సునే పరిశీలించుకునేటట్లయితే మనసు గురించిన చేదు నిజాలు తెలుసుకోగలం.

ఏకాగ్రతని కొంత ప్రయత్నం ద్వారా సాధించిన తర్వాత స్మృతిని నిలబెట్టుకున్నాం. తద్వారా అంతర్దృష్టిని పొందగలిగాం. ఇదంతా ఒక ఎత్తైతే అవగాహన ఏర్పరచుకోవడం విపస్యనా భావనని సాధన చేయడం ఒక ఎత్తవుతుంది.

2,500 సంవత్సరాల క్రితం బుద్ధుడు అవిచ్ఛిన్నమైన స్మృతి స్థితిని అనుభవించి విపస్యనా భావనని రూపొందించాడు.

ప్రపంచాన్ని కొత్తగా అనుభూతి చెందించేదే విపస్సన. ఇది మనస్సుకు సంబంధించిన శిక్షణ. మన లోపల, మన చుట్టూ ఏమి జరుగుతుంది అనే దానిని తెలుసుకుంటాము. ఇది మనలను మనం కనుక్కునే ప్రక్రియ, అన్వేషణ.

విపస్సన అనగా ఒక విషయంలోకి స్పష్టతతోనూ తీక్షణతోనూ చూడటం. ఈ ప్రక్రియ అన్నింటి మౌలికతత్వాన్ని గురించిన అంతర్దృష్టి ప్రసాదిస్తుంది.

అంతర్దృష్టి పూర్తి అవగాహనలకు దారితీసే ఒక ప్రత్యేకమయిన రీతిలో విషయాలను దర్శింపజేసే మానసిక వికాసమే విపస్సనా భావన అనవచ్చు.

మనం ప్రతి ఉద్దీపనకు అసూయ, కోపం, భయం, వంటి ప్రతిక్రియలను జరుపుతాం. మనం చేయవలసింది వీటి ప్రారంభాన్ని గుర్తించటం. కలత, ఆందోళన, మొదలైనవి కూడా ప్రక్రియలు. దీనిలో మెట్లు ఉంటాయి. మొదటిది కోరిక లేదా తిరస్కారం. ఏ విషయం మన మనస్సులో తలెత్తినా దాన్ని ఆలింగనం చేసుకోవటానికో లేక త్రోసిపుచ్చటానికో ప్రయత్నిస్తాం. దీనితో కలతగాని, మరొక లాంటి ప్రతి స్పందన మొదలవుతుంది.

మనం ప్రతి అనుభవాన్ని ఇది మంచి, ఇది చెడు లేకుంటే తటస్థం అని విభజిస్తాం. మంచి అనుకుంటే, సుఖం అనుకుంటే స్థిరంగావించుకోవడానికో, మళ్ళీ మళ్ళీ పొందటానికో ప్రయత్నిస్తాం. చెడుగా స్ఫురించినపుడు దానిని త్రోసి వేస్తాం, నిరాకరిస్తాం, దాని నుండి ముక్తిని పొందాలని

ప్రయత్నిస్తాం. ఈ రకంగా సుఖం కోసం నిరంతరంగా పరుగుపెట్టడం, దుఃఖం నుండి నిరంతరంగా పారిపోయత్నించడం ఇదే మనం చేసేది. అనగా రాగద్వేషాల కారాగారంలో బంధితులమయ్యాము. దుఃఖిస్తున్నాం వ్యక్తులు ప్రదేశాలు భౌతిక వస్తువుల పట్లే కాక అభిప్రాయాలు, సిద్ధాంతాలు, నమ్మకాల పట్ల కూడా రాగద్వేషాలను చూపుతాము.

మనకు కావలసినదల్లా కోరిక తీరినపుడు కలిగే విముక్తి సుఖం. కోరిక ఉన్నంత సేపు అవిశ్రాంతి, ఒత్తిడి ఉంటుంది. కోరిక తీరిన తర్వాత ఒత్తిడి, తపన మొదలగు వేదనలు నశిస్తాయి. తద్వారా సుఖంగా, శాంతంగా ఉంటుంది. అయితే అది మరో కోరిక ఉత్పన్నం కానంత వరకు మాత్రమే.

ఈ ప్రక్రియలను సూక్ష్మంగా పరిశీలించటమే విపస్సనా భావన. ఒక ఆలోచనగాని, సంజ్ఞగాని ఉత్పన్నం గావటాన్ని మనం రాగ రహితంగా చూడాలి. కొంతకాలానికి ప్రతిక్రియలో చిక్కుకోము.

శేఖర్‌కి జిలేబీని చూడగానే తినాలనిపిస్తుంది. వెంటనే స్మృతి శేఖర్‌కి ఎఱుక పరుస్తుంది. జిలేబి పట్ల కోరిక కలిగింది అని. అంతే శేఖర్ మనసులోకి తొంగి చూసాడు మనసులో కలిగే ఉద్దీపనలకు స్పందించకుండా గమనిస్తూ ఉన్నాడు. కోరిక కరిగిపోయింది.

సంవేదనలకు, సంజ్ఞలకు ప్రతిస్పందించకుండా, ప్రతిక్రియ జరపకుండా గమనిస్తూ ఉంటే దానంతట అదే మనలో శాంతి నెలకొల్పపడుతుంది. ఆలోచన యొక్క వ్యామోహింప జేసే స్వభావం నుండి ఇలా బయటకు రాగలగడం వాస్తవానికి సంబంధించిన ఒక దృక్కోణాన్ని ప్రసాదిస్తుంది. దీనిని యథాభూత జ్ఞాన దర్శనం అంటాము.

ఉన్నది ఉన్నట్లుగా సత్య సందర్శనం చేసే విపస్సన "నేను" అనేది కూడా ఒక సంజ్ఞ (స్ఫురణ, ప్రతిబోధ, Perception (పర్‌సెప్షన్) నే నని తెలుపుతుంది. నిరంతరం మార్పుకు గురి అవుతుండే ఆలోచన, అనుభూతి, శారీరక సంవేదనలు ఘనీభవం చెంది ఒక మానసిక రూపాన్ని ఇస్తాయి. దీనినే మనం 'నేను' అంటాం. దీనిని స్థిరము శాశ్వతము అయిన విషయంగా భావిస్తాం. ఆ ప్రకారం వ్యవహరిస్తాం.

విపస్సన ద్వారా 'నేను' అనేది ఒక ప్రక్రియ అని తెలిసిన తర్వాత మన కతృత్వాన్ని విడనాడతాం. అప్పుడది మబ్బుతునకలాగా చెల్లా చెదురై పోతుంది. ఆత్మ ఉందనే విశ్వాసం సడలిపోతుంది. ఈ అనాత్మ బోధ ఆత్మనే విశ్వాసం నుండి ఉత్పన్నమయ్యే అజ్ఞానాన్ని జయిస్తుంది.

ఇక మిగిలిందల్లా ఆత్మరహితమైన పరస్పర సంబంధాలున్న అనేక అంశాల సంహారం మాత్రమే. ఆలోచనలు ఉంటాయి గాని, ఆలోచించేవాడు ఉండడు. కోరికలు, భావోద్వేగాలు ఉంటాయి గాని వాటి కర్త ఉండడు. ఇల్లు ఉంటుంది కానీ ఇంట్లో ఎవరూ ఉండరు. భారమంతా దిగిపోతుంది.

విపస్సనా భావనపు ఒక ఘడియలో అస్తిత్వపు మూడు లక్షణాలైన అనిత్యత, దుఃఖం, అనాత్మల బోధ మన భావాలను, నమ్మకాలను పటాపంచలు చేస్తూ మనలని చేరుకుంటుంది. నిర్వాణమనే పరమశాంతి మనదవుతుంది.

# అంబేడ్కర్ బౌద్ధం ఎందుకు స్వీకరించాడు?
# ప్రపంచ మానవుడిగా ఎదగాలంటే బౌద్ధమే మార్గం

- కత్తి పద్మారావు

సుమారు రెండు వేల ఐదు సంవత్సరాల సుదీర్ఘమైన చరిత్ర కలిగిన బౌద్ధం సిద్ధార్థ గౌతముని చేత ప్రతిపాదించబడిన సిద్ధాంతాల పునాదుల మీద నిర్మించబడింది. ఇంగ్లీషులో బుద్ధిజం అంటే బుద్ధుని యొక్క అంకిత భావంతో కూడిన వ్యక్తిత్వమని అర్థం. బుద్ధవాదం అంటే వివేచన కలిగించే వాదమని అర్థం. బుద్ధుడు అనేది సిద్ధార్థుడికి వచ్చిన గుణాత్మకమైన అన్వర్థనామంగా పరిణామం చెందింది. చరిత్రలో బుద్ధుని మొదటి నామం గౌతముడు. బౌద్ధం అనేది ఆధ్యాత్మికతకు సంబంధం లేకుండా పూర్తిగా వివేచనకు సంబంధించిన పేరు. ముఖ్యంగా సత్యాన్ని కనుగొనడం కోసం గౌతముడు చేసిన అన్వేషణ నుండి ఈ బౌద్ధం రూపు చెందింది. పాళీలో 'గోతమ' అనే పేరు సంస్కృతంలో 'గౌతమ'గా మారింది. పాళీలో సిద్ధత్త అనే పేరు సంస్కృతంలో సిద్ధార్ధగా పలుకబడుతుంది. అది బౌద్ధంలో ఎక్కువ అంశాలు పాళీలో చెప్పబడినవే. అవి సంస్కృతంలో వచ్చేటప్పటికి ఉచ్ఛారణ పరంగానే గాక అర్థపరంగా కూడా కొన్ని మార్పులు వచ్చాయి. బుద్ధుడు చెప్పిన సూత్రాలు మారలేదు గాని సూత్రాల అన్వయాలు ఆచరణలు విస్తృతంగా మారుతూ వచ్చాయి. బుద్ధుడుగా ప్రవచించిన అనేక అంశాలు గౌతమ బుద్ధుడికే ప్రధానంగా చెందుతాయి.

### గౌతమ బుద్ధుని ఆవిర్భావం:

బుద్ధుడుకి ముందు బుద్ధుని తరువాత బుద్ధుళ్ళు అవతరించారని అయితే వారు గౌతమ బుద్ధుడు కేంద్రంగానే ప్రవర్తిల్లారని పీటర్ హార్వే తన యాన్ ఇంట్రడక్షన్ టు బుద్ధిజం అనే గ్రంథంలో పేర్కొన్నారు.

"From its earliest times, though, the Buddhist tradition has postulated other Buddhas who have lived on earth in distant past ages, or who will do so in the future. The later tradition also postulated the existence of many Buddhas currently existing in other parts of the universe. All such Buddhas, known as samma – sambuddha's, or 'perfect fully Awakened Ones', are nevertheless seen as occurring only rarely within the vast and ancient cosmos. More common are those who are 'buddhas' in a lesser sense, who have awakened to the truth by practising in accordance with the guidance of a perfect Buddha such as Gotama

1 (An Introduction to Buddhism, Peter Harvey, page: 1)

బౌద్ధం సుదీర్ఘమైన చరిత్రలో వైవిధ్య భరితమైన బోధనలు ప్రవేశపెట్టింది. ఈ బోధనల యొక్క ఫలితం వలన ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. ఎన్నో విశ్వజనీనమైన వ్యక్తిత్వాలు, బోధనాత్మకమైన భావజాల పరిపూర్ణులైన బిక్కులు అందుండి జనించి, సమాజానికి పనికిరాని అంశాలని త్రోసిపుచ్చటం జరిగింది. మానవుడిని మోహపూరితం చేస్తున్న అంశాల నుంచి, భ్రమపూరితం చేస్తున్న అంశాలని నుంచి తప్పించి సత్యపూరితమైన, వాస్తవ పూరితమైన సమాజాన్ని దర్శించే నేత్రాలను ప్రసాదించింది బౌద్ధం. మానవ పరివర్తనంతటికి మూలభూతమైన సూత్రాలను అందించినది బౌద్ధ ధమ్మమే.

---

కత్తి పద్మారావు, ప్రముఖ దళితవాద రచయిత, పొన్నూరు.

## బౌద్ధం ఒక విద్య

బౌద్ధధమ్మలోని శాశ్వత సత్యాలు, సర్వజనీన సూత్రాలు. నిబద్ధ జీవన విధానాలు అన్నీ బుద్ధుని బోధ నుండి కూర్చబడినవే. బుద్ధునిలో గొప్ప తనం కేవలం బోధనలే కాదు, ఆచరణ కూడా. ముఖ్యంగా ఆచరణకి జీవన సూత్రాలు ఏర్పచడంతో బుద్ధిజం ఒక విద్యగా మారింది. అందుకనే బౌద్ధ విద్యనుండి విజ్ఞానాత్మకమైన వ్యక్తిత్వాలు వచ్చాయి. బుద్ధిజం అంటే అసలు అర్థం ధమ్మాన్ని అర్థం చేసుకొని ఆచరించడమే. బుద్ధిజం అనేది ఒక సంఘంగా రూపొందడానికి కారణం సాధారణ వ్యక్తుల వలన కాదు. బుద్ధ బిక్కులు, బుద్ధ బిక్షుణుల వలన. నిబద్ధ జీవితం లేని సామాన్య మనుషులు బౌద్ధ అభిమానులే కాని బౌద్ధులు కాలేరు. సుమారు బుద్ధుడు చనిపోయిన తరువాత వంద సంవత్సరాలకు బౌద్ధ సంఘంలో కొన్ని విభేదాలు వచ్చాయి. మెల్లగా కొన్ని సూత్రాలవైపు కొందరు గ్రూపులుగా ప్రారంభమయ్యారు. ఇక్కడి నుండి చిన్న చిన్న సూత్రాల భేదంతో ఒక నియమ నిబంధనలకు సంబంధించిన సమూహాలు ప్రారంభమైయ్యాయి. ప్రతి సమూహానికి ఒక గురువు. ఇలా విబేధాలే బౌద్ధంలో విభిన్న శాఖలుగా రూపొందడానికి కారణం. అంతకు ముందు వున్నటువంటి సూత్రాలకు కొంత నూత్నత్వాన్ని కలిపి కొన్ని శాఖలు ఏర్పడుతూ కూడా వచ్చాయి. ఈ పరిణామాన్ని బౌద్ధ పరిశోధకుడు పీటర్ హార్వే ఇలా వివరించారు.

"The most important bearers of the Buddhist tradition have been the monks and nuns who make up the Buddhist Sangha or 'Community', From approximately a hundred years after the death of Gotama, certain diferences arose in the Sangha, which gradually led to the development of a number of monastic fraternities (nikaya), each following a slightly different monastic code, and to different schools of thought (vada's). All branches of the Sangha trace their ordination - line back to one or other of the early fratemities" 2 (Ibid-Page:2)

ఇక్కడ పీటర్ హార్వే విస్పష్టమైన వివరణ ఇచ్చారు. ఏ తత్వశాస్త్రమైనా పరిణామంలో కొన్ని మార్పులకు గురౌతుంది. అయితే ఆ పరిణామాలన్నీ శాఖలుగా మారితే విబేధాలు ఎక్కువ అవుతాయి. ముఖ్యంగా బౌద్ధం మనిషి పంచేంద్రియ ఉన్మాదం అవుతున్నప్పుడు అతని బుద్ధికి పదును పెట్టి అతని కోరికల్ని అదుపు చేసే పనిని చేపట్టింది. అందుకే బౌద్ధం ప్రపంచంలో వున్న మానవులందరికి ఒక ఔషదంలా అవసరం అయింది. మతంలా కాదు. మతంలా ఘనీభవింప చేయాలనుకున్నప్పుడల్లా అది తన వ్యక్తిత్వాన్ని స్వయం ప్రతిభని కోల్పోతూ వచ్చింది. మళ్ళీ పునరుజ్జీవితం అవుతూ వచ్చింది. అందుకే ఎందరు పరిశోధించినా బౌద్ధంలో అనేక అంశాలు బయటకు వస్తూనే వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధం వ్యాప్తి చెందడానికి కారణం మానవుడు కేంద్రంగా బౌద్ధం ముందుకు వెళ్ళడమే. మొదట బుద్ధుడు ప్రబోధించిన సూత్రాల అనుసరించే వారిని థేరవాదులు అంటారు. బుద్ధుడు చెప్పినటువంటి సిద్ధాంతాలకు ప్రాధాన్యత రావడానికి కారణం అవి ఆచరించి చెప్పబడినవి కావడం వల్లనే. అవే ధమ్మంగా రూపొందాయి. అంతకు ముందు ఆధ్యాత్మిక వాదంలో ఒక వ్యక్తి యొక్క అనుభూతి నుండి ఎక్కువ చెప్పబడ్డాయి. ఇక్కడ అలా కాకుండా ఆచరించి చెప్పడంతో ఎక్కువ

మంది జీవితాలకు అనువర్తితం అయ్యింది బౌద్ధం. అందుకే థేరవాదులు ప్రామాణికులుగా చెప్పబడుతున్నారు.

## అడ్డంకుల్ని అధికమిస్తూ విస్తరించిన బౌద్ధం

అయితే బౌద్ధానికి ఎంత అనుకూల ప్రచారం జరిగిందో అంత వ్యతిరేక ప్రచారం కూడా జరిగింది. ప్రముఖ పరిశోధకుడు అమర్త్యసేన్ బుద్ధుని ఆలోచనలు చైనాలోకి ప్రవేశించడానికి ఎన్నో అడ్డంకులు ఏర్పడినవి అని చెప్పాడు. కన్‌ఫ్యూషియన్ మతానికి సంబంధించిన హెన్‌యూ బుద్ధిజాన్ని గురించి ఇలా వ్యాఖ్యానించాడు.

"The Buddha was of barbarian origin. His language differed from Chinese speech; his clothes were of a different out; his mouth did not pronounce the prescribed words of the Former Kings; his body was not clad in garments prescribed by the Former Kings. He did not recognize the relationship between prince and subject, nor the sentiments of farther and son."3 (The Agrumentative Indian, Amartya Sen, Page: 170)

క్రీ.శ. నాల్గువ శతాబ్దిలో బౌద్ధం చైనాలో ప్రవేశించడానికి ఎన్నో అడ్డంకులు వచ్చాయి. చైనా నుండి భారతదేశానికి ఎందరో బౌద్ధ బిక్కులు వచ్చి బౌద్ధాన్ని అధ్యయనం చేసి ఈ సూత్రాలు మన దేశానికి అన్వర్తిస్తాయని ప్రతిపాదించినప్పుడు చాలా మంది వ్యతిరేకించారు. బౌద్ధ సూత్రాలు గాని, ఆహార్యం గాని చైనా ప్రభువులకు పనికి రావని కూడా చెప్పారు. చైనాలోని హేన్‌యూ ఇంకా ఇలా చెప్పాడు. బౌద్ధం ఎలా పనికి రాదో ఒక కథ వివరించాడు. ఒక రాజు అంతకు ముందు మాంసాహారం భుజించి దృఢంగా వుండేవాడని బౌద్ధ సూత్రాల ప్రకారం పండ్లు, కూరగాయలు తిని శుష్కించాడని, తరువాత అతను తరిమివేయబడి ఆకలితో చనిపోయాడు. బౌద్ధంలో శరీర ధర్మాలకు విరుద్ధమైన ఆహార నియమాలు వుండటం వల్ల ఆ రాజు భవిష్యత్తు ముగిసి పోయిందని వ్యాఖ్యానించాడు. ఆ రోజుల్లోనే డావోయిజం అని ఒక తాత్విక ఉద్యమం చైనాలో వుండేది. డావోయిజం యొక్క సూత్రాలు బౌద్ధానికి దగ్గరగా వుండేవి. చైనీయుల యొక్క దేశీయతని, ఉన్నతత్వాన్ని వాళ్ళు విశదీకరించేవారు. బౌద్ధం భారతీయుల మతం అనే ఉద్దేశ్యం కూడా వారికి వుంది. ఈ రెండింటికీ మధ్య వైరుధ్యం కూడా నడిచింది. అవి రెండు సమకాలీన మతాలు అవ్వడం వల్ల వాటి ప్రచారకులు ఘర్షణ పడ్డారు. ఇలా బౌద్ధం ప్రపంచ దర్శనంగా ఎదగడానికి ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొంది.

## మహాయానం

రాను రాను బౌద్ధంలో మహాయాన శాఖ ఆవిర్భవించింది. కొత్త మార్గాల్లో అది ప్రయాణం చేసింది. కొత్త అంశాలతో కూడిన కొత్త గ్రంథాలు ఆవిర్భవించాయి. బౌద్ధంలోని సంఘ ఆచరణతో పాటు వైయక్తిక జీవన విధానాలు, అనేక సాంప్రదాయక ఆచరణలు జొరబడ్డాయి. భారతదేశంలో అయితే మహాయానం అనేక తరగతులుగా రూపొందింది. అది పోయి పోయి మంత్రయానం దాక విస్తరించింది. ఇటు హిందూమతంలో వుండే ఆచారాలు మరియు మూలజాతుల్లో వుండే ఆచారాలను కూడా సమీకృతం చేసుకుంది. యోగము, ధ్యానము, మెడిటేషన్ వంటి అనేక విధానాలు వైయక్తిక ఆచారణను బట్టి ప్రతిపాదించబడ్డాయి.

## బౌద్ధానికి మానవుడే కేంద్రం

బుద్ధుని జ్ఞానార్జన మీద అనేక పూర్వ సంఘాల ప్రభావం వుంది. అనేక సాంప్రదాయాల్ని బుద్ధుడు పరిశీలించాడు. కొన్ని ఆచరణలో కూడా పెట్టి చూశాడు. బుద్ధికి అందిన మేరకు ఆయన స్వీకరించాడు. శరీరాన్ని బాధించే అంశాల్ని పక్కన పెట్టాడు. బుద్ధ సూత్రాలను మాగధి భాషలో చెప్పాడు. అది థేరవాద బౌద్ధంగా రూపొందింది. మహాయాన బౌద్ధం బుద్ధుడిలో వున్న సంఘవాదాన్ని జీర్ణించుకోలేకపోయింది. అందుకనే డా॥బి.ఆర్. అంబేడ్కర్ బుద్ధుడు చెప్పిన సూత్రాలనే పరిగణలోనికి తీసుకున్నాడు. అప్పటి వరకు గ్రీకు తత్వశాస్త్రం ఆధిపత్యంలో వుంది. బుద్ధుడు బౌద్ధాన్ని తీసుకరావడంతో తత్వశాస్త్రానికి ఆసియా వారి ప్రాధాన్యం పెరిగింది. ప్రపంచ వ్యాపితంగా విస్తరించడానికి సంబంధించిన ఒక విశ్వజనీనతను బుద్ధుడు తన సూత్రాల్లో తీసుకొచ్చాడు. బౌద్ధంలోని ప్రధాన అంశం మానవుడ్ని కేంద్రం చేసి ఆలోచించడమే. అది ఎన్ని మలుపులు తిరిగినా మానవుణ్ని వదిలిపెట్టలేదు. అందుకే అది విస్తరించగలిగింది. మహాయాన బౌద్ధం వచ్చిన తరువాత అది సంస్కృతభాషలోకి వ్యాపించింది. సంస్కృత భాషలో వున్న సాంప్రదాయికత వచ్చి మహాయానంలో జొరపడింది. ఏ భాషలోకి ఏ తత్వం వెళ్ళినా ఎన్నో కొత్త అంశాలు జోడించబడతాయి. ఎన్నో శాఖల్లోకి విస్తరించడం జరిగింది. సంస్కృత వాఙ్మయంలో బౌద్ధానిది కూడా పెద్ద అధ్యాయమే. దీనితో బ్రాహ్మణులు బౌద్ధంలో తమ పాత్ర నిర్వహించగలిగారు. ఈ విషయాన్ని గురించి మాట్లాడుతూ "బి.ఎన్.పూరీ తన బుద్ధిజం ఇన్ సెంట్రల్ ఏసియా" లో ఇలా విశ్లేషించారు.

"Besides numerous Sanskrit writings dealing with religious or quasi-religious subjects like medicine and grammar, comparatively modern Mahayanist literature is traced in abundance. Portions of lost Sanskrit canons, corresponding to the Pali ones, provide the original text for translation into Chinese. Portions of a Sanskrit grammar have also been found near Turfan, thereby suggesting that Sanskrit was probably under stood in polite and learned society. According to the testimony of Fa-hien, the monks of Central Asia were all students of the language of India, and the same point was recorded about the Buddhist monks of Kucha by Hsuang-tsang. Some palm leaves from Mingoi contain fragments of two Buddhist religious dramas, one being the Sariputraprakarana of Asvaghosa, written in the script of the time of Kaniska. "4.
(Buddhism in Central Asia, B.N. Puri., Page : 24)

ప్రపంచ భాషలన్నిటిలో సంస్కృతం తాత్విక అధ్యయనానికి ఒక వాహికగా పనిచేసింది. తరువాత చైనా, జపాన్ భాషలోకి బౌద్ధం చొచ్చుకుపోయింది. దీనంతటికి కారణం అంతకు ముందున్న తత్వశాస్త్రాలన్నింటిలో దేవుడు ప్రధాన పాత్ర వహించాడు. నిజానికి అవి ఆధ్యాత్మిక వాదాలే. మానవుణ్ణి గురించి ప్రకృతికి, మానవుణ్ణి గురించి పరిణామానికి అన్వయించేదే చర్చించేదే తత్వశాస్త్రం. ప్రపంచ తత్వశాస్త్రాలన్నింటిలో బౌద్ధంలో మానవుడు ముందుకు వచ్చినంత మరి దేనిలో రాలేదు. మిగిలిన వాటి అన్నింటిలో మానవుడు కర్మ. కానీ బౌద్ధంలో మానవుడు కర్తగా మారాడు. మానవుడి ఆచరణలు ముందుకు వచ్చాయి. మానవుడికి సంఘంతో, ప్రపంచంతో వుండే సంబంధాలు చర్చించబడ్డాయి.

మనుస్మృతి ప్రతిపాదించిన వర్ణ సిద్ధాంతానికి భిన్నమైన తత్వశాస్త్రంగా అది ముందుకు వచ్చింది. అందుకే డా॥ బి.ఆర్.అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించారు. మహాయానంలో గాసటబీసటగా మారింది. అందుకే అంబేడ్కర్ బుద్ధుడు చెప్పిన బౌద్ధ సూత్రాల్ని పరిగణలోకి తీసుకున్నాడు. బౌద్ధాన్ని ఆయన మరింత హేతుబద్ధం చేశాడు. దానిలో లోపిస్తున్న మానవతా స్పర్శని పునరుజ్జీవింప చేశాడు. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ భారతీయ అస్పృశ్యుణ్ని ప్రపంచ మానవుడిగా మలచడానికి బౌద్ధాన్ని వాహికగా చేశాడు. బౌద్ధం భాషలన్నింటిలోకి చొచ్చుకుపోవడానికి కారణం దానిలో వున్న విశ్వజనీనతాభావం. బుద్ధుడు ప్రాకృతంలో చెప్పిన ధర్మాలన్నింటిని తరువాత సంస్కృతంలోకి మార్చారు. ఎందరో క్షత్రియ రాజులు బౌద్ధాన్ని సొంతం చేసుకొని బుద్ధుడు ప్రాకృతంలో చెప్పిన అంశాలన్నింటిని సంస్కృతంలో క్రోడీకరించారు. అయితే అప్పుడు కొంత భావాల మార్పు కూడా జరిగింది. బుద్ధుడు పలికిన పలుకులు ప్రాకృతంలో, పాళీలో వున్నంత బలంగా సంస్కృతంలో లేవు.

## ఏ తత్వశాస్త్రమైనా మూలజాతుల నుండే ఆవిర్భవిస్తుంది.

ప్రపంచంలో ఏ తత్వశాస్త్రమైనా మూలజాతుల భావజాలం నుండే వస్తుంది. అది రాజ భాషలోకి వచ్చేటప్పటికి ఆ తత్వశాస్త్రం అర్థాలు మార్తాయి. కొన్ని సార్లు తమ ప్రయోజనాలకు అనుకూలంగా కూడా అనుయాయులచేత మార్పిస్తారు. ఈ ప్రభావాలన్ని సంస్కృతంలోకి పరిణామం చెందేటప్పుడు జరిగాయి. బౌద్ధం ఆసియా దేశాల బౌద్ధిక మేధో సంపన్నతను ప్రకటిస్తుంది. చైనా, భారతదేశం, టిబెట్, థాయిలాండ్ దేశాలను మనం సాంస్కృతికంగా ఐక్య పర్చాలనుకున్నప్పుడు బౌద్ధాన్నే మరల ఆశ్రయించవలసి వుంటుంది. ఈ దిశగా ఇప్పుడు పరిశోధన కూడా జరుగుతుంది. నిజానికి చైనా దగ్గర నుండి మిగిలిన ఆసియా దేశాల మూల భాషలకు కూడా కొన్ని సంబంధ బాంధవ్యాలు వున్నాయి. చైనా భారతదేశ ప్రజలు, వారి మౌకిక సాత్విక అభినయం, అభివ్యక్తి చాలా దగ్గర సంబంధాలతో కూడుకొని వుంది. అందుకే బి.ఎన్.పూరి తన పీఠికలో (బుద్ధిజం ఇన్ సెంట్రల్ ఆసియా అనే గ్రంథానికి) "కేవలం చరిత్ర, తత్వశాస్త్ర అంశంగానే గాక ఆసియా దేశాల ఐక్యతకు బౌద్ధం ఎలా ఉపకరిస్తుందనే దృక్పథంతో చూస్తున్నాను" అన్నాడు.

## డా॥ బి.ఆర్. అంబేడ్కర్ బౌద్ధాన్ని దళితులకు ఎందుకు ఇచ్చాడు

డా॥బి.ఆర్. అంబేద్కర్ నిర్మించిన సూత్రాల నుండి గాని మనం ఆసియా దేశాలవైపు పయనిస్తే మనకు విస్తృతమైన భూభాగంలో బౌద్ధ పునర్నిర్మాణం జరుగుతుంది. భారతదేశం నుంచి చైనాకు ఎందరో తాత్వికులు అశోకుని కాలంలో కూడా ప్రయాణం చేసేవారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో భారతీయులు ఒక బోధకుల్లా అడుగుపెట్టగలిగింది బౌద్ధం వల్లే. ఈ రోజు క్రైస్తవ మతం పేరుతో ఐరోపా దేశం నుండి మనకు ఎందరో బోధకులు వస్తున్నారు. ఏ దేశానికైనా దాని ప్రవాహ శీలతకు ఒక మానవ ధర్మం ఒక తత్వశాస్త్రమే వాహిక అవుతుంది. ఈనాడు అస్పృశ్యులుగా చెప్పబడుతున్న అంబేడ్కర్ వీరికి ఇచ్చిన మార్గమే బౌద్ధం. అది ఆయన దూరదృష్టితో వీరికి ప్రతిపాదించాడు. హిందూమతంలో వీరిని దేవాలయాల్లో ప్రార్థనలకు నిషేధించారు. అటువంటిది ఇవ్వాళ మహర్‌ల్లో

పుట్టిన వారు ఎందరో ఐరోపా దేశాల్లో బౌద్ధ భిక్షులుగా వున్నారు. లండన్‌లో నేనే స్వయంగా కొందర్ని కలిశాను. ఈ పరిణామానికి అంబేద్కరే మూల పురుషుడు. బౌద్ధం ప్రపంచ వ్యాపితమైన అనేక సంస్కృతుల్ని సమ్మిశ్రితం చేసింది. బౌద్ధానికి గ్రీకులు ఎంతో ఉత్తేజితులయ్యారు. తమ గాంధార సాంప్రదాయంలోకి బుద్ధుడ్ని మలుచుకున్నారు.

## ఆసియా దేశాలకు విస్తృతమైన వేదిక బౌద్ధం

బౌద్ధం ఆసియా దేశాల తాత్విక ప్రగతికి విస్తృతమైన వేదికను నిర్మించింది. ఎంతో సాహిత్యం బౌద్ధం నుండి వచ్చింది. ఎంతో ప్రయాణం జరిగింది. ఈ విషయాన్ని చెప్తూ ప్రొ॥బి.ఎన్.పూరీ తన ప్రిఫేస్‌లో ఇలా వివరించారు.

"The political history of Central Asia has to be studied in details since royal patronage to the creed of the Buddha was always forthcoming, as recorded by the Chinese pilgrims who passed through their kingdoms. Those lying on the Northern Route-Badakshan, Kashgar and Kucha-were great centres of the Sarvastivadin school, while Mahayanism dominated in khotan and Yarknad. This demarcation of distinct representation symbolised two religious currents passing over these areas. The spread of the Sarvastivadin school of Buddhism is no doubt connected with the growth of the Kusana empire, maybe preceding the conversion of Kaniska as supposed by some scholars. Mahayanism subsequently became more popular. The two schools were like coaches provided for travelling the same road to salvation, gradually absorbing the traffic awaiting the final journey."5 (Ibid - Page: VI)

ప్రపంచంలో బౌద్ధ భిక్షువులు చేసినంత ప్రయాణం ఎవరూ చేయలేదు. ఒక అంకిత భావంతో కూడిన ప్రయాణం బౌద్ధంలో జరిగింది. బౌద్ధంలోని మూల సూత్రమైన అహింస, మానవతావాదం ఈ ప్రయాణానికి ఊతం ఇచ్చాయి. ప్రయాణికుడు తిండి ప్రియుడైన, కోరికలు విరివిగా కలిగినవాడైనా తన ప్రయాణాన్ని చివరిదాకా కొనసాగించలేడు. బ్రాహ్మణవాదానికి ప్రత్యామ్నాయంగా పుట్టిన బౌద్ధం మనిషిని ప్రపంచ మానవుడిగా ఎదగడానికి వీలైన బాటలు వేసింది. బ్రాహ్మణవాదం మనిషిని నియంత్రించి, గిరిగీసి, ఆచారాల చట్టాల్లో ఇరికించి కదలకుండా చేసింది.

## ప్రపంచ మానవుడిగా ఎదగాలంటే బౌద్ధమే మార్గం

బౌద్ధం ఒక ప్రపంచ దర్శనం. ఒక మానవీయ తత్వం. దేవుడికి, ఆత్మకి, పరమాత్మకి సంబంధం లేకుండా మనిషి కేంద్రంగా ఆలోచించిన తత్వం. మానవుడు మానవుణ్ని ప్రేమించడం ద్వారా ప్రపంచం మొత్తం విస్తరించవచ్చు. మానవుడు తోటి మానవుణ్ణి ద్వేషించడం వల్ల ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేడు. అందుకే భారతీయ మానవుణ్ని ప్రపంచ మానవుడిగా రూపొందించడానికి బౌద్ధ సూత్రాలు ఒక వాహిక. వాటినే అంబేద్కర్ పునర్నిర్మించి ఇప్పటి సమాజానికి అందించాడు. ముఖ్యంగా బుద్ధుడు చెప్పినవి బుద్ధుడు ఈ సూత్రాలను సమాజం నుంచి తీసుకున్నాడు. అందుకే అవి సంఘ ధర్మంగా రూపొందినాయి. ఈ సంఘ ధర్మాన్ని అనుసరించిన ప్రతివాడు ప్రపంచ మానవుడు అవుతాడు.

# కమ్మ (కర్మ)

మూలము : బుద్ధదర్శనము

- ఇంకొల్లు ప్రభాకరరావు

"నహికశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్" అన్నట్లు మానవుడు అనుక్షణము ఏదో ఒక పనిని చేస్తూనే ఉంటాడు. అది మానసికమో, వాచికమో, లేదా కాయికమో గావచ్చు. సత్కర్మయైనా, లేదా దుష్కర్మయైనా గావచ్చు.

కర్మను పాళీభాషలో "కమ్మ" అంటారు. కమ్మ అంటే చేయుట, ఆచరించుట, చేయబడినపని, చర్య, క్రియ.

కర్మను బౌద్ధం మూడు విధాలుగా వర్గీకరిస్తుంది.

1) కుశలకర్మ 2) అకుశలకర్మ 3)అనేంజ్యకర్మ. సత్కర్మను కుశల కర్మ అనీ, దుష్కర్మను అకుశల కర్మ అనీ, తటస్థ కర్మను అనేంజ్యకర్మ అనీ అంటారు.

బుద్ధులు, ప్రత్యేక బుద్ధులు, శ్రావకులు, బోధిసత్త్వులు, అర్హతులు, మొ॥ వారు ఒనర్చు కర్మలు అనేంజ్య కర్మలు. సకల మానవుల సుఖ శాంతుల కొరకు, నిర్వాణ ప్రాప్తికి, వీరు అవిశ్రాంతంగా శ్రమిస్తుంటారు. వీరి కర్మలువిపాక రహితాలు. (ఫలితాలు లేనటువంటివి) అవి కుశల కర్మలకు, అకుశల కర్మలకు అతీతము. అవి తృష్ణ, అవిద్యా, ఉపాదానాల నుండి విముక్తమయ్యాయి. వీరు వస్తువులను, విషయాలను, వ్యక్తులను, యధాతథంగా దర్శించగలగడం వల్ల "కార్య-కారణ బంధాలను, విశ్వ శృంఖాలను" భవబంధాలను తుద ముట్టించగలిగారు.

ప్రతికర్మకు తదనుగుణమైన విపాకముంటుంది. విపాకము అనగా ఫలితము, ప్రతిచర్య, ప్రతిక్రియ. "నీవు విత్తిన విత్తనాన్ననుసరించి, తదనుగుణమైన ప్రతి ఫలముంటుంది" అని సంయుక్తనికాయ తెలియజేస్తుంది. వేపవిత్తనాన్ని నాటితే వేపకాయేగాని, మామిడి పండు లభించదు. మనమనుభవించు సుఖ దుఃఖములకు కారణము, మనం గతంలో చేసిన సుకృత, దుష్కృతాలే !

"ఆకాశంలోగాని, సముద్ర మధ్యలోగాని, కొండగుహలోగాని, మరెక్కడన్నాగాని, దాగి ఉన్నను, మన మొనర్చిన దుష్కర్మ ఫలితము మనలను వదలదు"- ధమ్మపథం - 127.

చేతనా చేతయిత్వాచ, కర్మోక్తం పరమర్షిణా ।<br>
అస్యానేక విధోభేదః కర్మణః పరికీర్తితః॥" మ.కా. 17:2.

కర్మలను చేతనాలని, చేతయితాలని, బుద్ధుడు, రెండుగా విశ్లేషించాడు. చేతనములనగా మానసిక కర్మలు. వాచిక, కాయిక కర్మలను చేతయితాలంటారు.

అంగుత్తరనికాయ ననుసరించి చేతనయే కర్మ. చేతన అంటే సంకల్పించుట. ఏ పనినైనా సంకల్పించాకనే, మనము మనస్సుతోనో, వాక్కుతోనో, శరీరంతోనో చేస్తాము. అలా ప్రతి సంకల్పిత చర్య కమ్మగా వ్యవహరింపబడుతుంది.

ప్రతి కమ్మలోను, తత్సంబంధితమైన విపాకము బీజప్రాయంగా సంస్థితమై ఉంటుంది. అనుకూల పరిస్థితులు తటస్థించి నపుడు, తద్విపాకము ఉనికిలోకి వస్తుంది.

ఇంకొల్లు ప్రభాకరరావు ఎమ్.ఏ;ఎమ్.ఇడి, చీరాల - 523 155.

కుశల కర్మలవల్ల సిరి-సంపదలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు, కీర్తి - ప్రతిష్ఠలు, సౌష్టవమైన, అందమైన శరీరము, మొ॥నవి సంప్రాప్తిస్తాయి. దీనినే "అని సంస" అంటారు.

| కుశలకర్మ | తద్విపాకం |
|---|---|
| 1) దానం | 1) సంపద |
| 2) శీలం | 2) ఉన్నత కుటుంబములో జన్మించి, సుఖశాంతులను అనుభవింపవచ్చు. |
| 3) ధ్యానం (భావనా) | 3) జ్ఞానప్రాప్తి, నిర్వాణసిద్ధి. |
| 4) పుణ్యం (అపచాయనం) | 4) సంపద |
| 5) సేవ (వెయ్యావచ్చ) | 5) పరివారాన్ని కలిగి ఉండడం. |
| 6) పుణ్యాన్ని దానం చెయ్యడం (పత్తిదానం) | 6) అధిక సంపద |
| 7) అన్యుల మంచితనాన్ని అభినందించుట (అనుమోదనా) | 7) సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చు |
| 8) ధమ్మాన్ని శ్రద్ధగా వినడం (ధమ్మసవన) ధమ్మాన్ని ప్రచారం చేయడం (ధమ్మదేసనా) | 8) జ్ఞానిగా జన్మించును |
| 9) త్రిశరణాలను స్వీకరించుట | 9) రాగద్వేషాలు అంతరిస్తాయి |
| 10) అప్రమత్తత | 10) తన ప్రవర్తనను, దృక్పథాన్ని సవరించుకోగలగడం, ఆనందాయకమైన జీవితాన్ని గడపవచ్చు. |

అకుశల కర్మలవల్ల అల్పాయుష్షు, అంగవైకల్యం, పేదరికం, కురూపిగా జన్మించడం, దీర్ఘవ్యాధులు, మొ॥ అనర్థాలు సంభవిస్తాయి. వీనినే "అదీ నవ" అంటారు.

| అకుశలకర్మ | తద్విపాకం |
|---|---|
| 1. హత్యచేయుట (పానాతి పాతా) | 1. దీర్ఘవ్యాధులు, అల్పాయుష్షు, అయిన వారితో యడబాటు వల్ల దుఃఖము; భయం పడగ నీడన జీవించుట. |
| 2. దొంగతనం. (అదిన్నాదానా) | 2. దారిద్ర్యము; కష్టాలు, నైరాశ్యం; పరాధీనతా |
| 3. వ్యభిచారము (కామేసుమిచ్చాచార) | 3. అననుకూలమైన భార్య/భర్త; మహిళగాగాని, నపుంసకునిగాగాని జన్మించుట; అధికంగా విరోధులుండుట. |
| 4. అబద్ధాలాడడం (ముసావాదా) | 4. అప్రతిష్ట; విశ్వసనీయతను కోల్పోవుట; ఇతరులచే నిందింపబడుట; దుర్వాసనగల నోరు. |

5. అన్యులపై అపనిందలు వేయుట. (పిశునావాచా) — 5. నిష్కారణంగా స్నేహం చెడిపోవుట.

6. అధిక ప్రసంగము (సంఫప్పలాపా) — 6. అంగవైకల్యము; విశ్వసనీయతను కోల్పోవుట.

7. కటువుగా సంభాషించుట. (పరుసావాచా) — 7. అన్యులచే ద్వేషింపబడుట; కర్కశమైన కంఠస్వరము.

8. లోభము (అభిజ్ఞా) — 8. తీరని కోరికలు.

9. దుస్సంకల్పము (వ్యాపాద) — 9. అందవిహీనమైన రూపము; దీర్ఘ వ్యాధులు, గర్హనీయమైన స్వభావము.

10. మిథ్యాదృష్టి (మిచ్ఛా దిట్ఠి) — 10. అజ్ఞానము; మందబుద్ధి; దీర్ఘవ్యాధులు; నీచమైన వాంఛలు

కర్మభేదం కారణాంగానే జీవులు ఉన్నత - నీచ; కులీన - అకులీన ; సుఖ - దుఃఖ భాగులుగా జన్మిస్తారు. అందం - అందవికారం, శరీరసౌష్టవం - అంగవైకల్యం, వ్యక్తిగత శారీరక లక్షణాలు సంప్రాప్తిస్తాయి. లాభ - నష్టాలు, కీర్తి - అపకీర్తులు, నిందా - స్తుతులు, జయాపజయాలు లాంటి పరిస్థితులు లభిస్తాయి. అని అత్థ సాలినీ టీక వివరిస్తుంది. ఒకే తావున, ఒకే సమయంలో, ఒకే తల్లి దండ్రులకు జన్మించిన కవలపిల్లలలోకూడ, దైహికంగా, మానసికంగా, నైతికంగా, ఎంతో వైవిధ్యాన్ని చూస్తున్నాము. పరమ దుర్మార్గునికి, ఉదాత్తచరితుడైన సన్మార్గుడు జన్మిస్తున్నాడు. ఋషితుల్యుడైన, కులీన కుటుంబ సంజాతునికి, పరమ నీచుడు జనిస్తున్నాడు. ఇలాంటి అసమానతలకు, విపర్యాసాలకు కారణం ఏమైయుంటుంది? సమీప లేదా సుదూర జన్మలలో చేసిన కర్మఫలితంగా వచ్చు. అనువంశకత-పరిసరము, (Heridity and Environment), ప్రకృతి-పోషణ (Nature and Nurture) గావచ్చు. లేదా జన్యువుల అమరికలోని వ్యత్యాసాలుగావచ్చు.

ప్రతిప్రాణికి, దేని కర్మదానికి, దేని వారసత్వం దానికి, దేని సహజాత కారణాలు దానికి, దేని రక్తబంధువులు దానికి, దేని ఆశ్రయం దానికి, ఉంటుంది. అలా కర్మఫలితంగా, ఉన్నత-నీచ, స్థితులలోకి జీవులు నెట్టబడతాయి. ముద్రలు, అనుభవాలు, ప్రచోదనలు, ప్రవృత్తులు, క్రియాశీలంగా అచేతనంలో, అంతర్గర్భితంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులు తటస్థించినప్పుడు, అవి బహిర్గతమవుతాయి. “కర్మనియమము ప్రధానమైనదే అయినా ప్రతిదానికి, బౌద్ధం కర్మతో ముడిపెట్టదు. 24 కారణాలలో (ప్రత్యయాలలో) కర్మఫలానుభూతి ఒకటి.

కర్మ పని తీరు మిక్కిలి సంక్లిష్టమైనది. బహుగహనమైనది. లోకోత్తరుడైన సిద్ధార్థుడు మాత్రమే, దీనిని సమగ్రంగా, విస్పష్టంగా అవగతం చేసుకోగలడు.

విపాకం తీవ్రతననుసరించి, కమ్మను నాలుగు విధాలుగా బౌద్ధం విభజిస్తుంది. అవి - 1)గరుక కమ్మ 2)ఆసన్న కమ్మ 3)ఆజిణ్ణ కమ్మ 4) కటత్తా కమ్మ.

**1. గరుక కమ్మ:** ఘోరమైన లేదా దారుణమైన దుష్కృత్యాలు గరుక కమ్మలుగా వ్యవహరింపబడతాయి. ఉదా:- తల్లిదండ్రులు, అర్హతులు, బోధిసత్వులు, ప్రత్యేక బుద్ధులు, మొ . వారిని హత్యచేయుట, బుద్ధుని గాయపరచుట, సంఘంలో చీలికలకు కారకుడగుట. మొ॥ ఇలాంటి

దారుణమైన కమ్మలకు విపాకములు కూడ తీవ్రంగా ఉంటాయి. వీనిని ఈ జన్మలోగాని, మరుజన్మలోగాని, అనతికాలంలోనే అనుభవింపవలసివస్తుంది. ఇలాంటి కమ్మలను "అనంతరీయ కమ్మలు" అని అంటారు. వీని వలన గతంలో చేసిన కుశల కమ్మల యొక్క సత్ఫలితము కూడ అడుగంటి పోవు ప్రమాదం గలదు.

**2. ఆసన్న కమ్మ:** ఒక వ్యక్తి మరణించ బోవు ముందుగా (అంత్యకాలమందు) చేయుకమ్మ ఆసన్నకమ్మ. దీనియొక్క విపాకము భావిజన్మను నిబద్ధిస్తుంది. అందువలననే. మరణించబోవు సమయమాసన్నమయినప్పుడు, మంచిపని చేయమని గాని, మంచి ఆలోచనను చేయమనిగాని ప్రోత్సహించినట్లయితే, మరుజన్మలో సుఖశాంతులు బడయవచ్చును. ఇదే విషయాన్ని భగవద్గీత కూడ ప్రస్తావించింది.

"యం,యం, వాపిస్మరన్ భావం, త్యజత్యంతే కలే బరమ్।
తంతమేవైతి, కౌంతేయ, సదాతద్భావ భావిత:" భ.గే. **VIII - 6**

ఒక జీవి మరణ సమయంలో ఏఏ భావములు మదిలో మెదలునో, మరుజన్మలో ఆయా రూపములను పొందును.

**3. ఆచిణ్ణ కమ్మ:** పదేపదే అలవాటుగా చేసే పనిని, "ఆచిణ్ణకమ్మ" అనే పారిభాషిక పదము సూచిస్తుంది. అది సదలవాటు గావచ్చు. దురలవాటు గావచ్చు. ఉదా :- మధ్యపానము, వ్యభిచారము, జూదము మొ. దురలవాట్లు. తన శక్తిమేర ఆర్తులకు ఆపన్న హస్తాన్నందివ్వటం, సన్మార్గగామిగా, తన శీలాన్ని మలచుకొనుట, ధమ్మాన్ని శ్రద్ధగా ఆలకించుట, ప్రచారం చేయుట, మొ॥ సదలవాట్లు సాధారణంగా, మరణించు సమయంలో, అవే జ్ఞప్తికి రావడం వల్ల, తన భావిజీవితంపై అవి తదనుగుణమైన ప్రభావాన్ని చూపుతాయి.

**4. కటత్తా కమ్మ:** దీనినే సంచిత కర్మ అని కూడ అంటారు. 'కటత్తా' అంటే గతంలో చేయబడినది. ఇది పై మూడింటికికన్న భిన్నమైనది.

తల్లిదండ్రుల నుండి తనకు సంక్రమించిన, శుక్ర, అండకణాలవల్ల శారీరక, మానసిక లక్షణాలు కన్నా తనలోని జన్యువుల స్వభావం కన్నా, కొన్ని సందర్భాలలో, గత జన్మలో తానొనర్చిన కర్మ ప్రవృత్తులే, తన జీవన యానంపై, తనువుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది.

కర్మకు కారణం, "అవిద్యా." అవిద్య అంటే, ఉన్నదానిని వున్నట్లుగా కాక, మరోదానిలా గ్రహించడం. ఇదే అన్యథాగ్రహణము. ఇందువల్ల తదనుగుణమైన సంస్కారము జనిస్తుంది; (అవిజ్జా పచ్చయా సంఖారా) అని బుద్ధుడు పటిచ్చ సముప్పాదలో (ప్రతీత్య సముత్పాదంలో) ప్రవచించాడు. కర్మకు మరొక కారణం, తృష్ణ (తణ్హా). అంటే అంతులేని వాంఛలు. ఇవి కర్మాచరణను ప్రోత్సహించే చోదక శక్తులుగా పనిచేస్తాయి.

"కర్మను చేసేవాడూ లేడు. తత్ఫలితాన్ని అనుభవించేవడూ లేడు" అని విశుద్ధ మగ్గలో బుద్ధఘోషుడు వివరించాడు. కమ్మను చేసేది చేతనయే! అంటే సంకల్పించడమే! ఏ పనైనా చేయాలంటే ముందు సంకల్పించాక, తర్వాతనే మనస్సుతోగాని, వాక్కుతోగాని, శరీరంతోగాని చేస్తాము. కర్మ ఫలితాన్ననుభవించేది వేదనయే. అలా కర్మాచరణ, కర్మఫలానుభూతి, అంతా (సంకల్ప జన్యమే,) మానసిక ప్రవృత్తియే.

"అనిరుద్ధమనుత్పన్నమ్, కర్మోక్తం, నిః స్వభావకః।
ఆత్మగ్రహాద్ధి, తజ్జాతం, జనకోఽపి వికల్పతః ॥ శూన్యతాసప్తతి - 34

కర్మ స్వభావాన్ని వివరిస్తూ, బుద్ధుడు ఇలా అభిభాషించాడు. కర్మ అనిరుద్ధం, అనుత్పన్నం, నిః స్వభాకం. దీనిని, ఎవరి అవగాహనాస్థాయి ననుసరించి, వారు సంభావిస్తుంటారు. అందువల్ల కర్మవికల్ప జన్యం.

వికల్పమనగా "శబ్దజ్ఞానానుపాత, వస్తుశూన్యవికల్పః" - పతంజలి యోగ దర్శనం 1-9 పదం (సంకేతం) ఉంది. ఆ పదంచే సూచింపబడు వస్తువు (సంకేతి) ఏది అస్తిత్వంలో లేదు. అలాంటి నిర్విషయకమైన శబ్దజ్ఞానం వల్ల జనించే చిత్తవృత్తిని వికల్పమంటారు. కర్మ స్వతస్సిద్ధ మైందిగానందువల్ల నిఃస్వభావకము (స్వభావ శూన్యము) అని అనవలసి వస్తుంది. దానికి శాశ్వతత్వం లేదు. అది అవిద్యా సంజనితమైనందువల్ల అనుత్పన్నం ఉత్పత్తిలేని దానికి నిరోధముండదు గాన అనిరోధము. ఇంతవరకు, థేరవాదులు, మహాయానులంతా అంగీకరిస్తారు. కాని అవిద్యవల్ల మానవులు, ఎవరికి తోచినట్లు వారు, మంచి-చెడులను, పాప-పుణ్యాలను, ధర్మాధర్మాలను, నీతి అవినీతులన, సుగతి-దుర్గతులను, వ్యాఖ్యానించుకోవడం కారణంగా, వివిధ రకాల కర్మలు ఉనికిలోకివచ్చాయి. కావున అవి అయదార్థాలు. శాశ్వతాలుగావు. అందుచేత అవన్నీ వైకల్పికాలే అని నాగార్జునుడు శూన్యతా సప్తతిలో విశదపరిచాడు.

కర్మసిద్ధాంతానికి సంబంధించి, బౌద్ధం, ఒక వినూత్నమైన కోణాన్ని ఆవిష్కరించింది. అకుశలకర్మ ఫలితం అనుల్లంఘనీయంగాదు. తత్ఫలితాన్ని నిస్సహాయంగా, బానిసలాగ అనుభవింపనవసరంలేదు. కర్మ నియతికి మనం నిబద్ధితులంగాదు. ఆ దుష్ఫలితాలను సవరించుకొనే అవకాశం మనకు ఎల్లప్పుడు వుంటుంది. నియంతలాగా మన జీవితాలను నిర్దేశిస్తుందని బౌద్ధం ప్రచారం చేయదు. కర్మాధ్యక్షుడు, కర్మఫల ప్రదాత, అని స్తుతించబడే విధాతయో, దైవమో, మన జీవితాలను నిబద్ధిస్తాడని విశ్వసింప నక్కరలేదు. కష్టాలను, దుఃఖములను పరిహరించుకునే అవకాశం ఉంది.

సంకల్పస్వేచ్ఛతో (Free will), స్వప్రయత్నంతో (Self Effort) తన జీవితగమనాన్ని తానే సవరించుకోవచ్చు. మలచుకోవచ్చు. "తన భావిజీవితానికి తానే రూపకర్త" అని అంగుత్తర నికాయంలో బుద్ధుడు ప్రబోధించాడు. తన అభ్యున్నతికి గాని, అధః పతనానికిగాని, తిరోగమనానికి గాని, పురోగమనానికి గాని తానే బాధ్యుడు. అంతేగాని, ప్రతిదీ పూర్వనిర్దేశితమనే సిద్ధాంతాన్నిగాని (Theory of Pre-determinism), విధివాదాన్ని గాని (Fatalism) బౌద్ధం విశ్వసింపదు.

కష్టాలు, కన్నీళ్ళు తనను చుట్టుముట్టినప్పుడు, బౌద్ధుడు నిరాశతో కుంగిపోకుండా, ఆత్మ విశ్వాసంతో, సంకల్ప బలంతో, స్వయం కృషితో తన బాధల నుండి తాను విముక్తుడు గావడానికి ప్రయత్నిస్తాడేగాని, ఏ దేవుని, ఏ దేవతను, ఏ స్వాములవారిని, ఏ బాబాను, ఏ అమ్మను ప్రాధేయపడడు, ప్రార్థించడు. తన నిర్ణాయక పాత్రను ఎన్నడూ విస్మరించడు. మన భవితకు మనమే కర్తలం, శిల్పులం. తన స్వర్గం, నరకాలకు, తానే కారకుడు. ఈ అచంచల విశ్వాసమే ప్రతిబౌద్ధుని ప్రయత్నాన్ని బలపరుస్తుంది. ఉత్సాహపరుస్తుంది. సత్కర్మాచరణవల్ల, ఆహ్లాదకరమైన జీవితాన్ని పండించుకోవడం తన చేతుల్లోనే ఉంది. విలక్షణమైన ఈ అంశమే బౌద్ధాన్ని అన్య మతాల నుండి వేరు చేస్తుంది.

*"బుద్ధం శరణం గచ్ఛామి!"*

# బౌద్ధధమ్మ వ్యాప్తితో పునీతుడైన ధమ్మాశోక చక్రవర్తి

- సవేర

కొందరు వారి వ్యక్తిగత ఆనందంకోసమే జీవించి కాలగర్భంలో కలిసిపోతారు. మరికొందరు వారి కుటుంబ సంక్షేమమే లక్ష్యంగా మనుగడ సాగించి మరుగున పడిపోతారు. అతి కొద్ది మంది మాత్రమే ప్రజాశ్రేయస్సే జీవితాశయంగా బ్రతికి చరిత్రలో చిరస్థాయిగానిలిచిపోతారు. ఈ మూడవ శ్రేణిలో మొదటి మహోన్నత వ్యక్తి నాటికి నేటికి ఏనాటికి గౌతమ బుద్ధుడే. అందుకే ఆయన ఆసియా ఖండపు అఖండ జ్యోతిగానే గాక ఈ సమస్త భూమండలానికి జ్ఞాన సూర్యుడుగా వెలుగొందుచున్నాడు.

ఆ తథాగతుని ధమ్మాకాశంలో ధ్రువతారగా భాసిస్తున్నావాడు అశోకుడు. "బౌద్ధ చరిత్రలో అశోకుని ప్రాధాన్యత ఏమంటే బౌద్ధమత స్థాపకుని తర్వాత 2వ స్థానంలో ఎప్పటికీ నిలిచి ఉండే వ్యక్తి అశోకుడు. "బౌద్ధమత పోషకుడేకాదు - యధార్థమైన ప్రవక్త" అన్న చరిత్రకారుడు బండార్కర్ అభిప్రాయం అక్షరసత్యం. ప్రపంచ చరిత్రలో, బౌద్ధ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన, ఆ ధార్మిక చక్రవర్తికి అక్షర నివాళిగా ఈ వ్యాసాన్ని అందిస్తున్నాను.

**జననం బాల్యం - పరిణయం - పట్టాభిషేకం:** అశోకుని తండ్రి మౌర్య చక్రవర్తియైన బిందుసారుడు. తల్లి కంప ప్రాంతపు బ్రాహ్మణ కుటుంబానికి చెందినది. ఈమెనే పేరు సుభద్రాంగి. ఈమెనే ధమ్మా అని కూడా పిలిచేవారు. సుభద్రాంగి అపురూప సౌందర్యవతి. అసాధారణ ప్రతిభాశాలి అంతఃపురం చేరిన సుభద్రాంగి అందచందాలకు అసూయపడిన రాణివాసపు స్త్రీలు ఆమె చేత క్షురకర్మ వంటి పనులు చేయించి హింసించేవారు. అయినా సహనశీలి అయిన సుభద్రాంగి అన్నిటినీ ఓర్చుకుంది. అంకిత భావంతో బిందుసారుని సేవించి, అతని మనసు గెలుచుకొని పట్టపురాణి కాగల్గింది.

ఆమె అంతఃపుర జీవితంలోని కష్టాలు, కడగండ్లు అంతమైన సంతృప్తితోనే తన జ్యేష్ఠ కుమారునికి అశోకుడు (శోకరహితుడు) అని, రెండవ కుమారునికి విగతాశోకుడు (దుఃఖ విముక్తుడు) అని నామకరణం చేయించింది. అశోకుని తల్లియైన సుభద్రాంగి ఆజీవక మత విశ్వాసానికి చెందినది. ఈ మత శాఖకు చెందిన సన్యాసి ఒకరు సుభద్రాంగి మహారాణి అవుతుందని, అశోకుడు మౌర్య సామ్రాజ్యానికి చక్రవర్తి కాగలడని జోస్యం చెప్పాడట. జ్యోతిష్యం మహిమ కాదుగాని, అశోకుడు స్వశక్తితోనే చక్రవర్తి కాగలిగాడు.

అశోకుని తాతగారు విశ్వవిఖ్యాత చక్రవర్తులలో ఒకడైన చంద్రగుప్త మౌర్యుడు. ఈయన నిష్ఠాగరిష్టుడైన జైనమతస్థుడు. చంద్రగుప్త మౌర్యుడు తన వృద్ధాప్యంలో ఉల్లేఖనతో ... (ఉపవాసంతో ధ్యానంతో మరణించడం) జైన క్షేత్రమైన శ్రావణ బెళగొళలో నిర్వాణం చెందాడు.

తాతగారి జైనమత సిద్ధాంతం, తండ్రిగారి మానవీయ తాత్వికాదర్శం, తల్లిగారి ఆజీవక విశ్వాసం ఇలా మూడురకాల నమ్మకాల నేపథ్యం, మతస్వేచ్ఛ, సామరస్యాల నిలయమైన రాజప్రసాదం సమీప భవిష్యత్తులోనే చండాశోకుడు ధమ్మాశోకుడుగా పరివర్తన చెందడానికి, మౌర్య సామ్రాజ్యధిపతి బౌద్ధ మహాచక్రవర్తిగా వెలుగొందడానికి దోహదం చేసియుండవచ్చు.

బాల్యమాదిగా అన్ని విద్యలను శ్రద్ధాసక్తులతో అభ్యసించిన అశోకుడు తాతనుమించే మనవడూ, తండ్రిని మరపించే తనయుడూ కాగలడనే నమ్మకం కల్గించాడు. మగధ సామ్రాజ్య పాలిత - పాలక వర్గాలకు యువరాజుగానే తండ్రి బిందుసారుని ఆదేశం మేరకు తక్షశిలలో తిరుగుబాటును

సరెళ్ళ వెంకటరత్నం (సవేర) ప్రముఖ రచయిత, 'ధమ్మపథం' ఎడిటర్, అమలాపురం

అణచివేయడమే గాక 'భాసా' ప్రాంతాన్ని జయించి రాజ్య విస్తరణకు తోడ్పడ్డాడు. అశోకుని యుద్ధ నైపుణ్యాన్ని, రాజనీతజ్ఞతనూ మెచ్చుకొన్న బిందుసారుడు అతనిని అవంతికి వైస్రాయిగా నియమించాడు.

అశోకుడు తన విజయోత్సాహంతో తిరిగి వస్తూ వేదిన ప్రాంతాధిపతియైన దేవశెట్టి ఇంట విడిది చేసాడు. అతని కుమార్తెయైన 'దేవి'ని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. పాలించే రాజులకు ప్రేమించే హృదయమూ ఉంటుందని నిరూపించాడు. ఈ ఆదర్శ దంపతుల సంతతియే మహేంద్ర, సంఘమిత్రలు. అశోకుని దేవేరియైన దేవి రాణిగా అంతఃపుర రాజభోగాలను ఆశించక జీవితకాలమంతా పుట్టినింటనే గడిపింది. ఈ మాతృమూర్తి నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా ఆమె బిడ్డలైన మహేంద్ర సంఘమిత్రలు బిక్షుక జీవనంతో బౌద్ధధమ్మ వ్యాప్తికి అంకితం కావడం ఒక ఆదర్శయుత సాదృశ్యమే.

బహుభార్యత్వమొక రాజకీయ అవసరమైన ఆనాటి కాలంలో అశోకునికి ఐదుగురు భార్యలుండేవారు. వారిలో అసంధిమిత్ర మహారాణిగా, విశ్వాస పాత్రురాలైన ధర్మపత్నిగా మెలగింది. ఆమె మరణానంతరం తిస్సారక్షిత మహారాణియై అశోకునికి తీవ్ర మనస్తాపాన్నే మిగిల్చింది.

**రాజ్యాధికారం:** నేతి బీరలో నెయ్యి శూన్యమైతే, రాజనీతిలో నీతి ఛాయామాత్రమని చెప్పవచ్చు. బలవంతుడిదే రాజ్యమన్నది ఆటవిక నీతియైనా నేటికీ అదే అనివార్యంగా ఆచరణలో ఉంది. దీపం చుట్టూ నీడలా రాజస మొలికే రాజకుటుంబంలోనూ స్వార్థం వెన్నంటే ఉంటుంది. నీతి రాజనీతి ముందు పరాజిత అవుతుంది. అధికార దాహం ముందు రక్తబంధం అదృశ్యమై పోతుంది. అయితే కొందరు అధికార దాహంతో సింహాసన మధిష్ఠించినా ఆపై పరివర్తన చెంది ప్రజా సంక్షేమమే జీవిత లక్ష్యంగా పాలించినవారు కొందరున్నారు. వారిలో ప్రథముడూ, ప్రసిద్ధుడు అశోకుడు.

బిందుసారుడు మరణించే సమయానికి అశోకుడు ఉజ్జయినికి వైస్రాయిగా ఉన్నాడు. అప్పటికే ఒక యోధుడుగా, విజేతగా, ప్రతిభావంతుడుగా, పాలనాదక్షుడిగా అశోకుడు ప్రజల దృష్టిలో నిలిచియున్నాడు. రాజ్యాధికారం కోసం బిందుసారుని 101 మంది కుమారుల మధ్య (అశోకునితో సహా) భీకర యుద్ధం ప్రారంభమైంది. ఇది సుమారు 4 సంవత్సరాలు కొనసాగింది.

కౌరవ పాండవ కుటుంబ పోరులో నూరుగురు హతమైతే బిందుసార పుత్ర బృందంలో 99మంది నేలకొరిగారు. సమర్థుడే నిలుస్తాడు (The Fettest will Survive) అన్నట్లు వీరుడైన అశోకుడు విజేతగా నిలిచాడు. క్రీ.పూ. 269లో మగధ సింహాసనాన్ని అధిష్టించాడు. అతనితో భుజం కలిపి పోరాడిన సోదరుడు తిష్యుడు సహపాలకుడైనాడు.

**కళింగయుద్ధం - పరివర్తన:** "ఏ దేశ చరిత్ర చూసినా, ఏ రాజు పాలన చేసినా యుద్ధ రహితం కాదు, ప్రజాహితమే ప్రధానం కాదు" - అనేది ఒక చారిత్రక సత్యం. 'రాజ్యం వీర భోజ్యం' అంటూ యుద్ధమూ, రాజభోగమే జీవిత లక్ష్యమైన పాలకులెవరైనా ప్రజాద్రోహులే.

"రాజ్యరక్షణ కోసమే యుద్ధం, ప్రజాహితం కోసమే పాలన"అనేది ప్రజాభిప్రాయం. అశోకుడు సింహాసనాన్ని అధిష్టించిన 12వ ఏట క్రీ.పూ. 254 తన సహజ రాజ్య కాంక్షంతో గాని, తన సామ్రాజ్య ఏకీకరణ లక్ష్యంతోగాని కళింగపై దాడిచేసాడు ఈ భయంకర యుద్ధంలో లక్షమంది సైనికుల మరణానికి కారకుడయ్యాడు. ఇందుకతడు చండాశోకుడుగా నిందించదగిన వాడే. అక్షరాలా అది ఘోర నేరమే.

మానవేతిహాసంలో ఒక రక్తసిక్త అధ్యాయమే. అయితే అతి సాధారణంగా ప్రతి విజేత తన విజయాన్ని మరో ఘన విజయానికి సోపానంగా భావిస్తాడు. ఆ క్రమిత రాజ్యాలతో తన సామ్రాజ్యం మహా సామ్రాజ్యం కావాలని ఆశిస్తాడు.

కాని కళింగ యుద్ధ రంగంలో పడియున్న శవాలకుప్పలు, పారుతున్న నెత్తుటేరులు, క్షతగాత్రుల ఆర్తనాదాలు, వారి బంధుమిత్రుల హృదయ ఘోషలు అతని గుండెల్ని పిండి నట్లయింది. అతనిలో మానవీయత మేల్కొంది.

అతని హృదయంలో పరివర్తన అంకురించింది. ప్రత్యణువునా పశ్చాత్తాపం ప్రతిధ్వనించింది. ఘోర క్రూర మరణహోమానికి బదులు శాంతి అహింసలు ప్రాతిపదికలుగా గల బౌద్ధమే శరణ్యమని భావించాడు. కరుణ, ప్రజ్ఞ, శీలం, స్వేచ్ఛ, సమత, సమానత్వాలను ప్రబోధించిన బుద్ధుడే తనకు మార్గదాతయని విశ్వసించాడు. పూజ్య ఆచార్య ఉపగుప్తుని నుండి ధమ్మా దీక్షను స్వీకరించాడు. నెత్తురు తాగే ఖడ్గాన్ని విడిచి ధమ్మచక్రాన్ని ఆశ్రయించాడు. రాజ్యాల దురాక్రమణదారుడే శాంతిప్రేమల ప్రబోధకుడైనాడు. "యుద్ధ విజయానికి బదులు ధమ్మ విజయానికి అంకితమైనాడు. చండాశోకులు ధమ్మాశోకుడైనాడు. ఇలా క్రొత్త జీవితాన్ని ప్రారంభించాడు, చక్రవర్తి అశోకుడు.

**అశోకుని బౌద్ధ జీవనం / బౌద్ధ ధర్మం:** అశోకుడు బౌద్ధం స్వీకరించలేదని కొందరు, అశోకుడు బౌద్ధాన్ని కాలానుగుణంగా మార్పులు చేసి, అకర్షణీయంగాను ఉత్తేజపూరితంగాను రూపొందించాడని మరి కొందరు అభిప్రాయపడ్డారు. కాని ఇవన్నీ చారిత్రకాధారాలు లేని ఊహాపోహలే.

అశోకుడు గౌతమ బుద్ధుడిని పలుసార్లు ప్రభువు (ది లార్డ్) అని గుండె గొంతు లోంచి కీర్తించాడు. ఈ ధరణిపై బౌద్ధమే సరియైన ధర్మమని ఉద్ఘాటించాడు. రెండున్నర సంవత్సరాలపాటు ఉపాసక జీవితాన్ని గడపి బుద్ధునికి, ధమ్మానికి, సంఘానికి శరణుపొందాడు. సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలైన లుంబిని, బుద్ధగయ, నిగలిసాగర్ మొదలగు ప్రదేశాలను భక్తి శ్రద్ధలతో సందర్శించాడు.

**హేతువాద దృక్పథం:** తథాగతునికి యధార్థమైన అనుచరునిగా అశాస్త్రీయమైన మత ధర్మసూత్రాలను, అహేతుకమైన గతకాలపు విశ్వాసాలను నిరసించారు. అంతేగాక వివిధ సందర్భాలలో ఆచరించే నీచమైన, అమానుషమైన క్షుద్రపూజలను, ఉత్సవాలను, సంబరాలను వ్యతిరేకించాడు. బౌద్ధాన్ని హేతు బద్ధ ధర్మంగానే ఆచరించాడు.

**అశోకుని (బౌద్ధ) ధర్మం:** అశోకుని ధర్మంగా ప్రపంచంలోకి వచ్చిన ప్రత్యంశం బౌద్ధంతో ప్రభావితమైనది. ఆచరణీయమైన నైతికతతో ఉద్దీపింపబడినది. హేతుబద్ధతతో ప్రామాణికమైనది. విశ్వాసంలో విలక్షణమైనది. సమతకి, మానవతకి భూమికయైనది. మానవ జీవితానికి సంబంధించిన ప్రాథమిక విలువలతో కూడినది. సర్వకాలీనమూ, విశ్వజనీనమైనది. కరుణ, స్వేచ్ఛ, పరిశుద్ధత, ఆర్ద్రత, సత్యసంధత, మానవీయత మొదలగు లక్ష్య లక్షణాలకు ప్రాధాన్యత ఇవ్వబడినది. హింసాతత్వం, నిరంకుశత్వం, అసూయ, ఆగ్రహావేశాలను వ్యతిరేకించేది.

హార్దికమైన కృతజ్ఞాతభావం, శ్రద్ధాపూర్వక విశ్వాసం కలిగియుండాలని సూచించింది. అశోకుని ధర్మం అహింసా సిద్ధాంతాన్ని సమాజపు అంచులదాకా అందించగల్గింది. అతనికి పూర్వం బౌద్ధధర్మం కొంత క్షీణదశకు చేరినా అనతికాలంలో మళ్ళీ మహోజ్వల స్థాయికి చేరుకొంది. అతని జీవన గమనంలో ధర్మం ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

**బౌద్ధ ధమ్మ పోషణ:** రాజుల, ప్రభుత్వాల పోషణ, సంపన్నుల ఆదరణ తోడైనప్పుడు ఏమతమైనా ప్రచారంలో ముందుంటుంది. ఈ ప్రచారం ఆచరణకు దోహదపడుతుంది. ప్రపంచంలో బౌద్ధాన్ని స్వీకరించి, పోషించిన చక్రవర్తులలో అశోకుడు అగ్రగణ్యుడు. అతడు బౌద్ధ సంఘాలకు అన్ని సౌకర్యాలను సమకూర్చేందుకు చేతికి ఎముక లేకుండా విరాళాలిచ్చాడు. గౌతమబుద్ధుని జీవిత కాలంలో ముఖ్య అనుచరులైన సారిపుత్ర, మొగ్గల్లాన, మహాకాశ్యప, ఆనందుడు మొదలగువారి సమాధులను, స్మారక కేంద్రాలను సందర్శించి వాటి సక్రమ నిర్వహణకు చర్యలు చేపట్టాడు. జంతువులవేట, వినోదయాత్రలు, విహార యాత్రల స్థానంలో ధమ్మయాత్రలను ప్రోత్సహించాడు. ఇవి ప్రధానంగా మేధావులను సందర్శించి వారి నుండి ధర్మోపదేశాలను పొందడానికి, నిస్సహాయులైన వృద్ధులను సేవించి తరించడానికి ఉద్దేశింపబడినవి. ఇటువంటి ధార్మిక యాత్రలకు 156 రాత్రులు, తన విలువైన సమయాన్ని అశోకుడు వెచ్చించి ఆదర్శంగా నిలిచినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

**మూడవ బౌద్ధ (సంగీతి) సభ నిర్వహణ:** ప్రశస్తమైన బౌద్ధ ధమ్మం పట్ల ప్రజలందరి సదవగాహన కోసం బుద్ధుని ప్రబోధాన్ని ప్రజల కందించే క్రమంలో తన రాజధానీ నగరమైన పాటలీపుత్రలో మొగ్గలపుత్త తిస్స నాయకత్వంలో మూడవ బౌద్ధ మహాసభ (సంగీతి) జయప్రదంగా నిర్వహింపజేసాడు. ఈ సభకు సుమారు వెయ్యిమంది బౌద్ధ బిక్షువులు హాజరైనారు. కథావత్థు రచన జరిగింది ఈ సంగీతిలోనే.

దేశ విదేశాలకు మాన్య బిక్షువులను పంపించి బౌద్ధ ధమ్మాన్ని ప్రచారం చేయించాలని ఈ మహా సభలో తీర్మానం చేయబడింది. దీని ప్రకారం అనేక మంది బౌద్ధ ప్రచారకులు వివిధ ప్రాంతాలకు నియమించబడ్డారు. అప్పుడే మన ఆంధ్రదేశంలోని అమరావతికి "మహాదేవ" అనే మత ప్రచారకుడు విచ్చేశాడు. అమరావతిలో జగత్ప్రసిద్ధమైన మహాస్థూపాన్ని ప్రతిష్ఠించిన తర్వాత ఆయన శ్రీలంకలో స్థూపాల నిర్మాణానికి వెళ్ళాడు.

**స్థూపాలు - చైత్యాలు - విహారాలు - స్తంభాల నిర్మాణం:** అశోకుడు జ్ఞాన సూర్యుడైన బుద్ధుని ప్రసిద్ధ బోధనలను శిలాఫలకాలపైన, స్తంభాలపైన, స్థూపాలు, చైత్యాలు విహారాలు, గుహలలోను చెక్కించాడు. ఇవన్నీ అప్పటికి ప్రాచుర్యంలోనున్న బ్రాహ్మి, ప్రాకృత లిపులలో అక్షరీకరించబడ్డాయి. ఈ నిర్మాణాలు, చెక్కడాలు, భారతీయ శిల్పకళకు, భవన నిర్మాణ నైపుణ్యతకు, బౌద్ధధమ్మ విశిష్టతకు చెరగని శిలాక్షర సాక్ష్యాలుగా వెలుగొందుతున్నాయి.

ఇలా శిలాక్షరాలుగా శాశ్వత రూపంలో సిద్ధపరచబడిన తథాగతుని ధమ్మా ప్రబోధం ప్రజల్ని మరింత ఆకర్షించి, చైతన్యపరచి, బౌద్ధులుగా మార్చిన దనుటలో అతిశయోక్తి లేదు. ఒక్క అశోకుని కాలంలోనే మన దేశంలోని అనేక ప్రాంతాలలో 84 వేల బౌద్ధ స్థూపాలు నిర్మించబడ్డాయి. ఇది నాటికి నేటికి భవన - శిల్పకళా చరిత్రలో ఒక అద్భుత ప్రపంచ రికార్డుగా పేర్కొనవచ్చు.

అశోకుడు బుద్ధుని జన్మ స్థలమైన లుంబినీని దర్శించి పూజార్హమైన ఆగ్రామంలో పన్నులు రద్దు చేసినట్లు ఆక్కడ బయల్పడిన శాసనము (స్తంభంపై)ను బట్టి తెలుస్తోంది. హ్యూయాన్‌త్సాంగ్, పాహియాన్‌ల రచనలను బట్టి కూడా ఇక్కడ అనేక స్థూపాలు, చైత్యాలు, విహారాలు, నెలకొల్పబడినట్లు వెల్లడవుతోంది.

మన జాతీయ చిహ్నమైన నాలుగు సింహాల శిల్పమూ, జాతీయ పతాకంలోని ధమ్మచక్రమూ అశోకుడు సారనాథ్‌లో నిర్మించిన స్తంభం నుండే స్వీకరించబడ్డాయి. ధమ్మ ప్రచారం కోసం అశోకుడు

వేయించిన శాసనాలు ఒరిస్సా, ఆంధ్ర, కర్నాటక ప్రాంతాలలో లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. మన రాష్ట్రంలో ఇప్పటికి బయల్పడిన సుమారు 300 బౌద్ధ క్షేత్రాలలో అత్యధిక భాగం అశోకుని కాలం నాటివే వీటిలో అమరావతి నుండి ఆదుర్రు దాకా, సారనాథ్ నుండి నందలూరు దాకా అన్నీ దర్శనీయ స్థలాలే. ప్రతి క్షేత్రం, ప్రతి శాసనం అశోకుని బౌద్ధ సామ్రాజ్య విశిష్టతకి చెరగని అక్షర ప్రభలే. వీటి నిర్మాణానికి విరాళాల నిచ్చిన వివిధ వర్గాలకు చెందిన దాతల జాబితాలు ఆనాటి ప్రజల బౌద్ధాభిమానానికి, ఆచరణకి తిరుగులేని ఆనవాళ్ళే.

**అశోకుడు చెక్కించిన ప్రచారం చేసిన ధర్మగుణాలు:** 1. ప్రతి వ్యక్తి తల్లి దండ్రుల పట్ల విధేయత, బంధుమిత్రుల పట్ల ఆప్యాయత, నౌఖర్లు బానిసల పట్ల సౌజన్యత, శ్రమణులు బ్రాహ్మణుల పట్ల ఔదార్యం, మహిళలపట్ల గౌరవభావం కల్గియుండాలి. 2. విద్యార్థులు గురువులను గౌరవించాలి. 3. చిన్న పెద్ద అన్ని ప్రాణుల పట్ల దయ కలిగి యుండాలి. ఏ ఒక్క ప్రాణికి ఏ విధమైన హాని చేయకూడదు. 4. పవిత్రమైన శీలం, పటిష్టమైన మనో నిగ్రహం, పరిశుద్ధమైన ఆలోచన, హార్దికమైన కృతజ్ఞతా భావం, శ్రద్ధా పూర్వక విశ్వాసం మొదలగు సద్గుణాలను అలవర్చుకొని ఆదర్శంగా జీవించాలి. 5. ఖర్చుచేయుటలో పొదుపును పాటించాలి. 6 అహంకారము, ద్వేషభావము మొదలగు దుర్గుణాలకు బదలు నిరాడంబరత, ఉదారత, సౌజన్యతలను అలవర్చుకోవాలి. 7. జననం, అనారోగ్యం, పరిణయం, ప్రయాణం, వంటి సందర్భాలలో స్త్రీలు అనుసరించే మూఢాచారాలకు బదులు మంగళసుత్తను పఠించాలి. 8. పరిశుద్ధమైన, శ్రేష్టమైన మనస్సు కల్గి యుండాలి. 9. ఎట్టి పరిస్థితులలోను జీవితాన్ని ఛిద్రం చేసుకోరాదు.

ఈ విధంగా అశోకుడు ప్రజలకు ధమ్మాచరణ పరంగా సరియైన దృష్టిని దృక్పథాన్ని, సమున్నత విజ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేసాడు. చతురార్య సత్యాలు ప్రతీత్య సముత్పాదన సిద్ధాంతం వంటి అంశాలకన్నా ధమ్మపద, మంగళ సుత్తాది ధర్మ సూత్రాల ఆచరణకు, ప్రచారానికే అధిక ప్రాధాన్యత నిచ్చాడు. అతని ధమ్మ సంకల్పం నీతి బద్ధమైనది, మతాతీమైనది.

ప్రజాహితమే తన అభిమతమైన అశోకుడు అస్తవ్యస్తంగానున్న న్యాయ వ్యవస్థను, శిక్షాస్మృతిని, సంస్కరించాడు. ఒకే రాజ్యం, ఒకే ప్రజ అన్న భావంతో తన రాజ్యమంతటా ఒకే విధమైన న్యాయవిధానాన్ని రూపొందించి ఆచరణలో పెట్టాడు. బిక్షవులలో కొందరు నిమ్నకులస్థులన్న చులకన భావనంతో చూసిన యసుడనే మంత్రివర్యుని కులహంకారాన్ని తొలగించి సంస్కరించాడు. చంటిబిడ్డను సంరక్షణ నైపుణ్యం గల నర్సుకి అప్పగించినట్లు తన ప్రజల సుఖసంతోషాల బాధ్యతను న్యాయాధికారాలకు అప్పగించాడు.

**విదేశాలకు విస్తరించిన బౌద్ధం:** ప్రజా సంక్షేమానికి పనికివచ్చే విజ్ఞానమైనా, విశిష్ట ధర్మమైనా అది విశ్వవ్యాప్తం కావాలి. అందుకు వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు త్యాగనిరతితో ముందుకు రావాలి. అశోకుడు వ్యక్తిగాను, చక్రవర్తిగాను తనదైన, అరుదైన త్యాగనిరతితో బౌద్ధ ధమ్మాన్ని, బౌద్ధ సాహిత్య సంపదను సర్వ జగత్తుకి అందించిన మహనీయుడు. సామంతుడైనా తన బిడ్డ చక్రవర్తి కావాలనుకోవడం సర్వసాధారణం. కాని చక్రవర్తియే తన బిడ్డలిద్దరిని బిక్షు సంఘానికి సమర్పించడం అసాధారణం. "సంతతి క్షేమానికన్నా సమాజ సంక్షేమమే మిన్న" అన్న సదాశయంతో అశోకుడు తన

బిడ్డలైన మహేంద్ర, సంఘమిత్రలను శ్రీలంక (పూర్వపు సింహళం) దేశానికి ధమ్మ ప్రచారం కోసం బౌద్ధ బిక్షువులుగా పంపించాడు. ఈ అన్నా చెల్లెళ్ళ అనిర్వచనీయమైన కృషి ఫలితంగానే శ్రీలంక నేటికీ ఒకమేటి బౌద్ధదేశంగానే గాక బౌద్ధ ధార్మిక కేంద్రంగా బౌద్ధ సాహితీ నికేతనంగా విరాజిల్లుతోంది.

ధమ్మాశోకుని దీక్షాదక్షతల ఫలితంగానే బౌద్ధం తన మాతృదేశ సరిహద్దులు దాటి, సముద్రతీరాలు దాటి శ్రీలంక, సిరియా, మయన్మార్, ఈజిప్టు, మాసిడోనియా, ఉత్తరాఫ్రికా మొదలగు ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాలలోని అనేక దేశాలకు శరవేగంతో విస్తరించింది. ఒక ప్రాంతీయ మతంగా వెలుగులోకి వచ్చిన బౌద్ధం విశ్వమతంగా వెలుగొందడానికి ప్రధాన కారకుడు అశోకుడే. "అశోక అవదాన," "మహావంశ" వంటి ప్రాచీన బౌద్ధ సాహిత్య గ్రంథాల పరంగా అతడు ఆసియా బౌద్ధులకు మరింత చిరస్మరణీయుడైనాడు.

అంతేగాక ఏడు ద్రోణ స్థూపాల నుండి బుద్ధుని అస్థికలను గ్రహించి వాటిని **84** వేల స్థూపాలలోనూ ఏర్పాటు చేసి "పక్కాయదయాన్" (బౌద్ధ సంఘాల అవసరాలు తీర్చినవాడు) గాను, తన బిడ్డలు ధమ్మదీక్షను పొందుటవలన "శాసన దయాన్" (బౌద్ధ ధమ్మ వారసుడు) గాను బౌద్ధ చరిత్రలో అజరామరుడై ప్రాతః స్మరణీయుడైనాడు.

**బౌద్ధ సంఘాల ప్రక్షాళన:** అశోకుడు నిబద్ధ బౌద్ధ చక్రవర్తిగా, వితరణ శీలిగా బిక్షుక సంఘాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి వారి ధార్మిక, సాంఘిక, సేవా కార్యక్రమాలకు వీలు కల్పించాడు. వీటితో విశుద్ధ బిక్షువులతో పాటు ధర్మ విరోధులు, పరాన్న భుక్కులు కూడా ఆకర్షితులైనారు. ఆషాఢభూతుల్లా అక్కడ తిష్టవేసారు. దీనితో బిక్షు సంఘంలో ఊహించరాని విధంగా క్రమశిక్షణ లోపించింది. ఈ అవాంఛనీయ పరిణామాల నుండి సంఘాన్ని ప్రక్షాళన చేసేందుకు అశోకుడు బిక్షువుల సాధారణ సమావేశాన్ని (సమోధమ్మ) ఏర్పాటు చేసాడు. తాను సాధించిన ధార్మిక జ్ఞానంతో ధమ్మ విరోధులైన బిక్షువులను సంఘం నుండి బహిష్కరించాడు. మిగిలిన బిక్షువులు వారి విద్యుక్త ధర్మాలైన ధమ్మ వ్యాప్తిలో సంఘసేవలో నిమగ్నమై మెలగసాగారు. ఈ విధంగా బిక్షుసంఘం పరిశుద్ధమైంది.

తృతీయ సంగీతి నిర్వహణ ఫలితంగా బిక్షుసంఘం సర్వవేళలా సమైక్యంగా, ఆదర్శయుతంగా చిరకాలం సాగడానికి సమాయత్తం చేయబడింది. బిక్షువులు, బిక్షుణిలు అధ్యయనం చేయవలసిన ముఖ్యాంశాలు, ఆచరించవలసిన నియమ నిబంధనలు రూపొందించబడ్డాయి. రాష్ట్రాధికారులైన ధమ్మ మహామాత్యుల నుండి ఉపాధ్యాయులదాకా పలు వర్గాల వారితో 9మంది బిక్షువుల ఆధిపత్యంలో 9 బృందాలను ఏర్పరచి వారికి దేశ విదేశాలలో బౌద్ధ ధమ్మ ప్రచార బాధ్యత అప్పగించబడింది. అశోకచక్రవర్తి ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి 'పంచవార్షిక' అనే బౌద్ధ ఉత్సవం ఏర్పాటు చేసి బౌద్ధ ధమ్మంపై ప్రయోజనకరమైన చర్చలను నిర్వహించేవాడు.

**ఆదర్శ పాలన:** "నేను భోజనం చేస్తున్నా, స్త్రీల సమక్షంలో ఉన్నా, శయ్యామందిరంలో ఉన్నా ఉద్యావనంలో ఉన్నా, అన్ని వేళలా, అన్ని స్థలాలలో ప్రజల మేలుకోరే చర్యలు, సంప్రదింపుల కోసం ప్రభుత్వ ప్రతినిధులు నిరభ్యంతరంగా నన్ను దర్శింపవచ్చు. నా ప్రజలందరి సంక్షేమం కోసం నేను అహర్నిశలు అవిశ్రాంతంగా పనిజేస్తాను" అని ప్రకటించి, ఆఖరి శ్వాస వరకు ఆచరించిన ఆదర్శ పాలకుడు, అశోక సార్వభౌముడు. పాలితుల మాన ప్రాణాలను, సిరిసంపదలను కాపాడి ఈ ప్రపంచంలో

భౌతికాభ్యున్నతిని సాధించడమే కాదు, వారి నైతిక స్థాయిని సమున్నతంగా పెంచి, వారికి ఆనందమయ జీవితాన్ని ప్రసాదించిన పాలనాదక్షుడు అశోకుడు.

"చంటి బిడ్డల సంరక్షణకు, సంతోషానికి ఒక నైపుణ్యంగల నర్సు శ్రద్ధవహించునట్లే నా రాజ్య ప్రజల సంక్షేమం కోసం నేను నియమించిన రాజ ప్రతినిధులు బాధ్యత వహిస్తారు"అన్న అశోకుని మాటల్లో ప్రజల పట్ల ఆయనకున్న పితృభావం ప్రస్ఫుటమౌతుంది. లైంగికానందాన్నిచ్చే మానవ యంత్రాలుగా చూపబడిన స్త్రీలు అశోకుని కాలంలో స్వేచ్ఛను తత్వశాస్త్రాన్ని సైతం అధ్యయనం చేసే అవకాశాన్ని పొందగలిగారు.

అశోకుడు యోధులు మెచ్చిన మహా యోధుడే కాదు, రాజనీతి కోవిదులు మెచ్చిన రాజనీతిజ్ఞుడు; రోమన్ సామ్రాజ్యం కన్నా శక్తివంతమైన, సువిశాలమైన సామ్రాజ్యాధిపతియైన రాజ్య విస్తరణకు పాల్పడని శాంతిప్రియుడు అశోకుడు. "ఆయుధాలతో సాధించే విజయం కన్నా ధమ్మంతో సాధించే విజయమే, నిజమైన విజయం" - అని నమ్మిన దార్శనికుడు అశోకుడు. ధమ్మాశోకుని పాలనలో ఒక్క తిరుగుబాటు లేకుండా రాజ్యమంతటా శాంతి సమగ్రతాభావం విరాజిల్లడం / చరిత్రకారులనే ఆశ్చర్యపరచిన విశేషం.

అశోకునికి ముందు దేశంలో పాలకుల నిరంకుశత్వం, ఆధిపత్యం, వర్గాల దోపిడీతత్వం, అట్టడుగు ప్రజల బానిసత్వం, అలవికాని అజ్ఞానాంధకారం వీటన్నిటితో తిరోగమిస్తున్న విషాదమయ భారత చరిత్రలో 28 సంవత్సరాల సుదీర్ఘకాలం అత్యంత చైతన్యవంతంగా, శ్రేయోదాయకంగా సాగిన పాలనాకాలం ఒక్క అశోకుడిది మాత్రమే అనుట అతిశయోక్తి కాదు. అతని కాలంలో అధికార యంత్రాంగపు జులుంకి తెరదించబడింది.

"ప్రతి అంశం ధమ్మంతోనే రూపుదాల్చాలి. ధమ్మంతోనే నిర్వహించబడాలి. ధమ్మంతోనే సాధింపబడాలి. ధమ్మంతోనే అభివృద్ధి చెందాలి" అన్న ధమ్మాశోకుని విశిష్ట ఆశయ లక్ష్యాలు చాలా వరకు విజయవంతమైనాయి.

"అహింస, ఆదరణ, శాంతి, సానుభూతి మొదలగు వాటితోనే మానవాళిని దుఃఖము నుండి, వేదనల నుండి విముక్తి చేసి, ఉద్ధరించగలం" - అని త్రికరణ శుద్ధిగా విశ్వసించి, ఆచరించిన వ్యక్తి, ధార్మిక శక్తి, చక్రవర్తి, ధమ్మాశోక చక్రవర్తి.

**ప్రజాహిత కార్యక్రమాలు:** "నా రాజ్య ప్రజలంతా నా బిడ్డలతో సమానం. నా బిడ్డల పరంగా నేను ఆశించునట్లే నా ప్రజలూ అన్ని విధాల సుఖశాంతులను పొందాలి" అన్న ఈ ఒక్క ఆదర్శం అశోకుని ప్రాచీన ఆధునిక ప్రపంచంలో అతిగొప్ప చక్రవర్తిగా నిలుపుతుందనుట నిర్వివాదాంశం. "దేవానాం ప్రియ," "ప్రియదర్శి" అనే బిరుదులు రెండూ ప్రత్యక్షంగా అమరి, అలరిన, ప్రజల హృదయాలలో స్థిరంగా నిలిచిపోయిన ఒకే ఒక పాలకుడు అశోకుడు. ఇందుకు ప్రధాన కారణాలు అతడు చేసిన ప్రజాహితకార్యాలూ, వ్యాప్తి చేసిన విశిష్ట బౌద్ధధర్మమే.

"నీరు ద్రవరూపంలో ఉన్న బంగారు' అంటే అతిశయోక్తి కాదు. అశోకుడు వేలాదిగా బావులు త్రవ్వించి సాగునీరు అందించిన చారిత్రక బగీరథుడు, ధరిత్రికి, యాత్రికులకు సతత హరిత ఛత్రం పట్టేలా రహదారుల పొడవునా లక్షలాది చెట్లను నాటించిన పర్యావరణ పరిరక్షకుడు, ప్రజలకే గాక పశువులకు సైతం వైద్యశాలల్ని నెలకొల్పిన ఆపద్బాంధవుడు, ఉద్యానవనాలతో పాటు ఔషధపు మొక్కల కేంద్రాలను ఏర్పాటు చేసిన మేటి తోటమాలి ఎవరో కాదు, అశోకచక్రవర్తియే.

**అసాధారణ వితరణ:** అశోకుడు బిక్షు సంఘాలకు అత్యంత ఉన్నతంగా, ఉదారంగా సహకరించిన వివరాలను పాఠకులు కొంతవరకు గ్రహించి యుంటారు. అంతకుమించిన విశేషమేమిటంటే అశోకుడు తన తండ్రి వలెనే 60వేల మంది శ్రమణులకు, బ్రాహ్మణులకు ప్రతిదినము భోజన సౌకర్యాన్ని సమకూర్చాడు.

అనాధ పిండకుని వలెనే తాను కూడా బౌద్ధ భిక్షువులకు నూరుకోట్ల బంగారు నాణాలను సమర్పించాలని సంకల్పించి, వృద్ధాప్యం సమీపించే నాటికి 94 కోట్లు మాత్రమే అందజేయగల్గాడు. మిగిలిన నాల్గుకోట్ల నాణాలను పంచేందుకు ప్రయత్నించగా కాబోయే చక్రవర్తియైన కునలుడు అడ్డుకొనగా తాను భోజనం చేసే బంగారు, వెండి, రాగి, కంచాలను సంఘానికి సమర్పించి, అపర దాన కర్ణుడు అశోకుడు. దయా సింధువైన అశోకుని దానగుణానికి నొచ్చినవారు మట్టి పాత్రలో వడ్డించినా ఆనందంగా భుజించాడు. రాజ్యాధికారాన్ని కోల్పోయిన, తర్వాత కూడ ఆయన చేతిలోని ఫలంలో సగభాగాన్ని సంఘానికి సమర్పించిన అభినవ రంతిదేవుడు ధమ్మాశోకుడు. "దాతా భవతివా నవా?" అన్నట్లు అశోకుని వంటి అసాధారణ వితరణ శీలి మరొకరు లభించడం అసంభవం కావచ్చు.

**స్ఫూర్తిమంతమైన మతసహనం:** మనిషి మనిషి అభిమతమే మతం. మతం కోసం మనిషి కాదు - మనిషి కోసమే మతం. నీతిమంతమైన నడవడిని సుఖ ప్రదమైన మనుగడని నిర్దేశించేది మతం. కొందరు తన మతమే గొప్పదని భావించి అన్యమతాలపట్ల ద్వేషాన్ని పెంచుకొనేవారున్నారు. అలనాటి క్రూసేడుల నుండి ఈనాటి గుజరాత్ జినోసైడ్‌ల దాకా మత విద్వేషంతో నేలపై మనిషి నెత్తురింకని చోటు లేదంటే ఆశ్చర్య పడనక్కరలేదు.

అయితే క్రీ.పూ. 3వ శతాబ్దిలోనే అశోకుడు మత సహనాన్ని పాటించిన మాన్యుడుగా అన్యమతాలను సైతం అభిమానించిన అసామాన్యుడుగా చరిత్ర సృష్టించాడు. మౌర్య సామ్రాజ్య రాజధానీ నగరమైన పాటలీపుత్ర రాజప్రసాదము మూడు తరాల పాటు పలుమత విశ్వాసాలకు కూడలిగా ప్రసిద్ధి గాంచింది. ఈ మానవీయ మత నేపథ్యంతో పెరిగి పెద్దవాడైన అశోకుడు "పరమత సహనం ఒక మహోన్నత లక్షణం అది మనిషి విశ్వాసానికి మరింత ఘనతను చేకూరుస్తుది" అని విశ్లేషించి మతం వ్యక్తిగతమని నమ్మి, పరస్పరం గౌరవించుకొంటూ స్నేహ భావం పరిమళించేలా, శాంతియుత సహజీవనం చెయ్యాలని అశోకుడు తన ప్రజలకు ఉద్బోధించాడు. తాను బౌద్ధ మతానికి చెందినవాడైనా, ఆ మత వ్యాప్తికి అంకితమై పనిచేసినా వైష్ణవ, శైవ, జైన, మతాల పట్ల గౌరవాభిమానాలను చూపించి, భూరి విరాళాలను అందజేసాడు. అట్లే గయ దగ్గర గల గుహలను అజీవికులకు కానుకగా ఇచ్చాడు. దీనిని బట్టి అక్బరు చక్రవర్తి కంటె 17 శతాబ్దాలకు పూర్వమే, ఏ రాజకీయ ప్రయోజనాన్ని ఆశించకుండా చిత్త శుద్ధితో మత సహనానికి ప్రతీకగా, స్ఫూర్తిమంతంగా విరాజిల్లిన ఏకైక చక్రవర్తి అశోకుడు మాత్రమే.

**చరిత్రలో ఒక స్వర్ణయుగం:** "చరిత్ర పుటల్లో నిలిచిపోయిన పదులు, వందలు, వేలు చక్రవర్తుల పేర్ల మధ్య సర్వజన సమ్మతమైన సార్వభౌమాధికారంతో, రాచరికపు ఔన్నత్యంతో, మానవతా పరిమళాలతో, విశాల ప్రశాంతాకాశంలో అశోకుని పేరు ఒకే ఒక్కటి మాత్రమే ఒక ఉజ్వల తారవలె ప్రకాశిస్తూ ఉంటుంది" అన్న సుప్రసిద్ధ చరిత్రకారుడైన హెచ్. జి. వెల్స్ ప్రశంసొక్కటి చాలు అశోకుని పాలనాకాలం మానవేతిహాసంలో స్వర్ణయుగమని చెప్పడానికి. ఈ ప్రపంచంలో సర్వమానవాళినే కాదు - సకల ప్రాణికోటినీ తన విశాల దృష్టితో, దయార్ద్ర దృక్పథంతో ప్రభావితం చేసిన, పరివేష్టించియున్న

ఏకైక సార్వభౌముడు అశోకుడు మాత్రమే. ప్రతి వ్యక్తి జీవన సూత్రాలకు, సామాజిక ప్రవర్తనకు శాంతి, అహింస, ప్రజ్ఞ, కరుణ, సహనం, సదవగాహనలే పునాదియని నిర్వచించి, ఆచరించి, ప్రచారం చేసి, ఫలితాన్ని చూపిన ఒక వినూత్న తత్వవేత్త. ఒక విశిష్ట ప్రవక్త. ఒక మానవీయ రాజ్యాధినేత, ఒక విశ్వశాంతి స్ఫూర్తి ప్రాత. ఒకే ఒక్కడు, అతడే అశోకుడు.

"ప్రపంచ ప్రఖ్యాత చక్రవర్తులైన అలెగ్జాండర్, చార్లిమేన్, కాన్‌స్టాంటైన్, సెయింట్‌పాల్, నెపోలియన్ వీరందరితో సరితూగే ఏకైక చక్రవర్తి అశోకుడు. రష్యాలోని ఓల్గా నదీతీరం నుండి జపాన్ దేశపు పసిఫిక్ మహాసముద్ర తీరందాకా ఆయన ధార్మిక సిద్ధాంతాల సాక్షిగా, సాధించిన విజయాల సాక్షిగా ఆయన కీర్తి ప్రతిష్టలు యథాతథంగా భాసిస్తూనే ఉన్నాయి" అన్న విజ్ఞుల నిశ్చితాభిప్రాయం ఒక నగ్నసత్యం. "అశోకుని కాలం నుండి బౌద్ధ ధమ్మ ఆచరణతో భారత జాతి విశిష్టత మరింతగా శోభిల్లింది" అన్న ప్రముఖ చరిత్ర కారుడు డి.డి. కోశాంబి గారి కితాబు ప్రత్యక్ష నిదర్శనం.

అశోకుడు నిస్సందేహంగా భారతదేశాన్ని పాలించిన మహోన్నత చక్రవర్తి. భారత చరిత్రకూ, సంస్కృతికీ ఆయన అందించిన సేవలు అమోఘమైనవి. ఆదర్శప్రాయమైనవి. దేశ దశ దిశలా ఆయన నిర్మించిన **84** వేల స్థూపాలు, విహారాలు, స్తంభాలు భారత శిల్పకళా చరిత్రలో కీర్తి పతాకాలై అలరారుతున్నాయి. అశోకుడు బ్రాహ్మి, ప్రాకృతమాది భాషల్లో చెక్కించిన శిలాశాసనాలు భారతీయ లిపి పరిణామ క్రమంలో మార్గదర్శకంగా నిలిచాయి. సెయింట్ పాల్, అగస్టిన్ చక్రవర్తులు క్రైస్తవ మత వ్యాప్తికి పాటుపడినట్లే అశోకుడు బౌద్ధమత వ్యాప్తికి అంకితమై శ్రమించాడు.

బౌద్ధమత ద్వేషులైన కుహనా చరిత్ర కారులు ఏమన్నప్పటికినీ భారతదేశ చరిత్రలో అశోకుని పాలనా కాలం అక్షరాలా స్వర్ణయుగం. మానవ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. అశోకుని పరిపాలనతోనే మన దేశం బౌద్ధ భారతం, అశోకుని సామ్రాజ్యమే ఈ భూగోళంపై ప్రథమ బౌద్ధ మహాసామ్రాజ్యం. అశోకుని అవిశ్రాంత కృషి ఫలితంగానే బౌద్ధం నాడూ - నేడు ఒక విశ్వమతం. అశోకుని బౌద్ధ జీవనం సమస్త మానవాళికి ఆదర్శ ప్రాయం.

**సంప్రదించిన గ్రంథలు:**

1. Ashoka Beloed of the Gods - రచన: యస్. వీరనారాయణ రెడ్డి, ప్రచురణ: ఆనంద బుద్ధ విహార్.
2. Indian History and Culture - డా॥ బి. యస్. యల్. హనుమంతరావు & కె. బసవేశ్వరరావు
3. "A Short History of The World" - హెచ్.జి. వెల్స్.

"భారతదేశ చరిత్రలో సమున్నత స్వాతంత్ర్యం, ఔన్నత్యం, వైభవం వెల్లివిరిసిన కాలం ఒకే ఒక్కటున్నది. అది మౌర్య సామ్రాజ్యం, మహోజ్వలంగా వెలుగొందిన కాలం. మిగిలిన రాజ్యాల, రాజుల పాలనా కాలమంతా దేశం పరుల చేతిలో పరాజయాలతోను, పలు రంగాలలో గాఢాంధకారంలోను మ్రగ్గిపోయింది. అట్లే కొంతవరకూ చాతుర్వర్ణ వ్యవస్థ నిర్మూలించబడి, బహుజనులుగానున్న శూద్రులు వారి స్వశక్తితో రాజ్యపాలకులైన కాలం మౌర్యుల పాలనా కాలంలో మాత్రమే"

**- డా॥ అంబేడ్కర్ (డా॥ అంబేడ్కర్ రచనలు - ప్రసంగాలు, సంపుటి - 3)**

# బుద్ధుని ధమ్మం - విజ్ఞాన శాస్త్రం

- పి.రాంబాబు

Buddhism as Education,
Buddhism as Knowldge,
Buddhism as Equality,
Buddhism is Science
Buddhism as Sociality
But Buddhism is not a Religion.

"విజ్ఞాన శాస్త్ర సూత్రాలు ఏమతంలోనైనా నిక్షిప్తమై వున్నాయంటే అది ఒక్క బౌద్ధమతంలోనే. నేను ఏమతానికి చెందిన వాడను కాను. ఒక వేళ మతంలోనికి వెళ్ళవలసివస్తే బౌద్ధమతంలోనికే ప్రవేశిస్తాను" అన్నాడు. - ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.

బుద్ధుని ధర్మమొక విజ్ఞాన భాండాగారం. అది ఒక విజ్ఞాన శాస్త్రం. అదొక విద్యావిధానం అదొక జీవన విధానం. అది ఒక సామాజికత. అది ఒక సమానత్వపు ధర్మశాల. మానవుని సుఖజీవనానికి కావలసిన సుగుణాలన్నీ బుద్ధుని ధమ్మంలో నిక్షిప్తంగా పదిలంగా నిండుగా వున్నాయి. ప్రపంచ దేవాల ప్రజలకు ఎన్ని సాంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతులెన్ని వున్నా మానవ జీవితం విజ్ఞాన శాస్త్రం చుట్టూ పరిభ్రమిస్తూనే వుంది. విశ్వంలో జీవరాశికి శాస్త్రానికి ఉన్న సంబంధం విడదీయరానిది. జీవం పుట్టుక నుండి ఆహారం, ఆరోగ్యం నివాసం, బట్ట, విద్య, వైద్య, వృత్తి మరణం ఇత్యాది సమస్త అంశాలన్నీ విజ్ఞాన శాస్త్రంతో ముడిపడి వున్నాయనే సంగతి తెలియనిది కాదు. బహుశా విజ్ఞాన శాస్త్రానికున్నంత ప్రాధాన్యత ఏ శాస్త్రానికి లేదేమో! అసలు విజ్ఞాన శాస్త్రం లేనిదే ఈ భూమిపై జీవరాశి మనుగడే ప్రశ్నార్థకమై వుండేది. ఇటువంటి శాస్త్రానికి ఆద్యుడు మరియు మొదటి శాస్త్రవేత్త ఆదిమ మానవుడు.

విజ్ఞాన శాస్త్రంలో కనుగొనబడిన విషయాలు సమయానుకూలంగా వెలికి వస్తున్నపుడు, లేదా కొత్త అంశాలను ఆవిష్కరించినపుడు ఇవి మా మత గ్రంథాల్లో ఏనాడో చెప్పబడినవని, ఇపుడు సైన్స్ కొత్తగా చెప్పేదేమీలేదని వ్యాఖ్యానించడం పరిపాటిగా మారిపోయింది. ఆ మాటకొస్తే ఏ మత గ్రంథాలు విజ్ఞాన శాస్త్రానికి ఇవ్వవలసిన ప్రాధాన్యతను, గౌరవాన్ని ఇవ్వలేదు. సరికదా సైన్స్‌కి విరుద్ధమైన అంశాలను నీతి వాక్యాలుగా బోధించడము జరిగినది.

దేవుడే జీవసృష్టి జరిపాడన్న మత సిద్ధాంతాన్ని సవాల్ చేస్తూ 'చార్లెస్ డార్విన్' పరిణామ సిద్ధాంతాన్ని ప్రకటించినపుడు కోతి దేహానికి డార్విన్ తలనతికించి వేసిన కార్టూన్లతో హేళన చేయడం ఎవరూ మర్చిపోలేదు. 'అలెసెండ్రా ఓల్టా' అను శాస్త్రవేత్త విద్యుచ్ఛక్తిని కనుగొని నపుడు, ఆ విద్యుత్‌చ్ఛక్తి రంగంలో మైకేల్ ఫేరడే విప్లవాత్మకమైన కొత్త విషయాలను 1831లో కనుగొని నపుడు దేశం నాశనమై పోతుందని, ప్రజలకు ఎనలేని కీడు జరుగబోతుందని మతవాదులు సృష్టించిన మారణహోమం యొక్క ఛాయలు ఇంకను సమసిపోలేదు. భూమి బల్లపరుపుగా లేదు గుండ్రంగా వుందని చెప్పిన "బ్రూనో"ని సజీవ దహనం చేసిన మంటల వేడి ఇంకా తగ్గనూలేదు. కాని ఈ శాస్త్ర వేత్తలు కనుగొన్న అద్భుతాలు ఈనాడు ప్రపంచాన్ని ఎలా శాసిస్తున్నాయో తెలిసినదే. ఈ సందర్భంలో మతం సైన్స్ కిచ్చిన గౌరవం ఏమిటో అవగాహనై వుంటుంది.

పి.రాంబాబు, బౌద్ధ పరిశోధనా, అధ్యయన కేంద్రము, రామచంద్ర పురం, తూ.గో. జిల్లా.

అయితే బుద్ధుని ధర్మంలో విజ్ఞాన శాస్త్రమెంత? అనే అంశాన్ని తులనాత్మక పరిశీలన చేయవలసి వుంది. ముందు చెప్పినట్టుగానే బౌద్ధంలో ఎన్నో సుగుణాలున్నా ఈ వ్యాసాన్ని బౌద్ధము - విజ్ఞాన శాస్త్రమునకే పరిమితం చేసి, బుద్ధుని ధమ్మంలో సైన్స్‌ను చెప్పడానికి ప్రయత్నించ దలచాను.

**బుద్ధుని ధ్యానము-శరీరధర్మశాస్త్రం (Buddha's meditation - Human physiology):**

సమాజం పట్ల సక్రమ ఆలోచన, మంచి నడవడిక, మంచి వ్యక్తిత్వ లక్షణాలు, చెడుని ఆవహించుకోని గుణం పొందాలంటే మంచి ఆరోగ్యాన్ని కలిగివుండాలి. మంచి పోషకాలు తీసుకున్నపుడు, వ్యాయామం చేసినపుడు భౌతిక ఆరోగ్యం మాత్రమే సిద్ధిస్తుంది. మానసిక ఆరోగ్యం కూడ ఎంతో అవసరం. ఇది కావాలంటే మనసులోని మాలిన్యాలను విసర్జించాలి. భౌతిక, మానసిక ఆరోగ్యాలకు 'ధ్యాన' మొక్కటే మార్గం. ఈ మార్గదాత, ధ్యానానికి ఆద్యుడు గౌతమ బుద్ధుడు. ధ్యానం వల్ల మనలోనికి మనం చూసుకునే (Inner sight) లక్షణం ఏర్పడుతుంది. అంటే మనలోని చెడు భావాలను మనం దర్శించి త్యజించే గొప్ప సుగుణం ఏర్పడుటయే గాక ఇతరులను వేలెత్తి చూపే అపగుణం నశిస్తుంది. ధ్యానమెరుగని బౌద్ధుడికి ధమ్మ విషయాలు వెలితిగానే వుంటాయి.

ఇదియేగాక ధ్యానం వల్ల ఉచ్ఛ్వాస, నిశ్వాస క్రియలను అదుపులో పెట్టవచ్చు. దీనివల్ల రక్తప్రసరణ క్రమబద్ధీకరించబడుతుంది. ప్రతి అవయవానికి దానికి అవసరమైన మేరకు రక్తము, పోషకాలు, ఆక్సిజన్ సరఫరా చేయబడుతుంది. జీర్ణ, విసర్జక వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయి. హార్మోనులు తగిన స్థాయిలో (optimum) విడుదలై నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. నాడీ వ్యవస్థలో మెదడు ప్రధానభాగం. మెదడుకు ఒత్తిడి లేకుండా ఏ విషయం పట్లనైనా సానుకూలంగా స్పందించే గొప్ప లక్షణం కలుగుతుంది. శరీరం మన అధీనంలో వుంటుంది. హార్మోనుల సక్రమ విడుదల వల్ల జీవన చర్యలన్నీ తగిన స్థాయిలో జరిగి మానసిక, భౌతిక పెరుగుదలలు పూర్తి స్థాయిలో జరుగుతాయి. మొత్తంగా ధ్యానం అనేది మానవ శరీర ధర్మశాస్త్రానికి చెందినది. ఈ శాస్త్రాన్ని తొట్టతొలుత ప్రతిపాదించినది గౌతమ బుద్ధుడు. ఈ నవయుగంలో వైద్యశాస్త్రం ధ్యానానికిస్తున్న ప్రాముఖ్యత ఎనలేనిది. ధ్యాన మార్గాన్ని నేడు ఎంత మంది స్వీకరించినా, ఎన్ని శాఖలుగా విభజించి ఎన్ని పేర్లు పెట్టినా దాని మూలాలు బౌద్ధ ధర్మంలో నిగూఢమై వున్నాయి. బుద్ధుడు దీనిని ఆచరించి ప్రజలకందించాడు.

**అభిధమ్మం - మనోవిజ్ఞాన శాస్త్రం (Abidhamma - Psycology) :-**

నేటి ఆధునిక సమాజంలో మనోవిజ్ఞాన శాస్త్రానిది ప్రముఖస్థానం. దీనికి 'శాస్త్ర' గుర్తింపువున్నది. విద్య, వైద్య, సామాజిక శాస్త్రాల అభివృద్ధికి మనోవిజ్ఞాన శాస్త్రమే కీలకం. వ్యక్తిత్వ వికాసం (Personality development), నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడమెలా (Leadership Qualities) అనే విషయాలపై తామర తంపరగా, ఇబ్బడి ముబ్బడిగా అనేక పుస్తకాలు ప్రచురించడం గమనిస్తున్నాం. వీటికి మూలాధారమైన మూర్తిమత్వ సిద్ధాంతాన్ని (Personality) అందించినది బుద్ధుడు. బుద్ధుడు చెప్పిన చెప్పిన 'అభిధమ్మ' మంతా మనోవిజ్ఞాన శాస్త్రమే. ఈ శాస్త్రంలో అద్భుతమైన అనుభవైక సారాన్ని జోడించి మూర్తిమత్వాన్ని బోధించాడు. 'విశుద్ధమగ్గ' (Patu of purification) ను అధ్యయనం చేస్తే ఈ విషయాలు వెల్లడవుతాయి.

బుద్ధుడు చెప్పిన విషయాలను ఇంత వరకు ఏ మనోవిజ్ఞానశాస్త్ర వేత్త చెప్పలేకపోయాడనుట అతిశయోక్తికాదు. బుద్ధుడు బోధించిన మనోవిజ్ఞాన శాస్త్ర విషయాలను ప్రాశ్చాత్యులు తమ చికిత్స విధానంలో ఉపయోగించడమే గాక, బుద్ధ ప్రతిపాదిత మనో విజ్ఞాన శాస్త్రంపై పరిశోధనలు జరుపుతూనే వున్నారు.

ప్రాచీన గ్రీకు డెల్ఫీ దేవాలయ ముఖ ద్వారంపై "నిన్ను నీవు తెలుసుకో" అని వ్రాయబడిన వాక్కు బుద్ధుని మనోవిజ్ఞాన బోధన నుండి గ్రహించడాన్ని బట్టి అత్యంత విజ్ఞానవంతులైన గ్రీకులు సహితం బుద్ధ ధర్మాన్ని అనుకరించారనుట గమనార్హం. ప్రజ్ఞ, కార్యాకారణ సిద్ధాంతాల గూర్చి బుద్ధుడు అతి ప్రాచీన కాలంలోనే అమూల్యమైన వివరణలనిచ్చాడు. జాన్‌డ్యూయీ, రూసో, ఆల్ఫ్రెడ్ బీనె, గెస్టాల్డ్, టోల్మన్, ఇవాన్ పావ్‌లోవ్, సిగ్మండ్ ఫ్రాయిడ్ వంటి ప్రఖ్యాత మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు తమ తమ సిద్ధాంతాలను బుద్ధుని ప్రతిపాదిత మనో విజ్ఞాన శాస్త్రమాధారంగానే నిర్మించాడనుట నిస్సందేహం. 'రెవరెండ్' లెస్లీబోల్టన్' బౌద్ధం యొక్క ఆధ్యాత్మిక మనోవిజ్ఞానమే బుద్ధుడు అందించిన అతిగొప్ప విజ్ఞాన శాస్త్రంగా భావిస్తున్నానని చెప్పాడు.

భవిష్యత్తులో మానవునికి ఏది అవసరమో, ఏదికాదో ఏది స్వీకరించాలి? దేన్ని త్యజించాలి? ఏ అంశాలు సమాజ సంక్షేమానికి తోడ్పడగలవు? అనే విషయాలపై వేల సంవత్సరాల ముందుగానే అంచనావేసి బుద్ధుడు వాటినే బోధించాడు. ఈ బోధనలు శాస్త్రీయ దృక్పథంతో కూడి బుద్ధుని ధర్మం సమకాలీన సమాజానికి నవ్యనూతనంగా పరిడవిల్లుతూ వుంది. బౌద్ధ పండితులు ఈ మార్గాన్నే అనుసరించారు. తత్ఫలితంగా ఎందరో భిక్షువులు శాస్త్రీయ అంశాలపై శోధన చేసి ఫలితాలను మానవాళికందించారు. అటువంటి వారిలో జీవకుడు ఒకరు.

### చికిత్సా విద్య - వైద్యశాస్త్రం : **(Chikitsa Vidya - Medical Science :)**

బౌద్ధ సంస్కృతిలో అగ్రస్థాయిలో అభివృద్ధి సాధించిన మరొక విజ్ఞాన విభాగం వైద్యశాస్త్రం. దీని పూర్వాపరాలు తెలుసుకునే ముందు ఈ శాస్త్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైనాన్ని అవలోకించడం ఎంతైనా అవసరం. ముఖ్యంగా వైద్య శాస్త్రాన్ని వైదికం నిరశించినది. ఆ శాస్త్రాన్నొక చీడపురుగుగా పరిగణించినదనడానికి ఈ క్రింది నిదర్శనాలు గమనించండి.

1. "పుయం చికిత్సా కాస్యనమ్" - మనుస్మృతి (4-220)
   వైద్యులు తినేది చీము వంటి ఆహారం. వారికి తినే యోగ్యత లేదు.
2. "బ్రాహ్మణో భవతి నా చికిత్సకా" - వశిష్టస్మృతి (3-4)
   వైద్య వృత్తి చేసే బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే కాదు.
3. వైద్యో విప్ర నా పూజ్యయంతె బృహస్పాది సభాయాది - అత్రి స్మృతి (387)
   వైద్యుడు గౌరవానికి తగియుండడు. బృహస్పతి యే గొప్ప శక్తిగల విద్యావంతుడు.
4. భిసహంజి పుయా షోనితమ్ - మహా భారతం. అనుశాసనపర్వం (90-13)
   ఎవరైతే వైద్యశాస్త్రంపై దృష్టి పెడతారో వారు దున్నపోతులు. వారు దున్నపోతుల మాంసాన్ని, రక్తాన్ని ఆహారంగా గ్రహించినట్లే.

5. అపుతో వా ఇమొ మనుష్య చారో బిష్జో ఇతి
తస్మాత్ బ్రాహ్మణాన్ బిష్జామ్ నా కయామి
అపుతో హి ఇషో మిద్యా భిస్వాల - యజుర్వేదం. తైత్తరీయ స్మృతి(6-4-9)
వైద్యవృత్తి చేసే బ్రాహ్మణుని దేవుడు వెలివేస్తాడు. కాబట్టి మానవ సంక్షేమం కోసం పాటుపడే వైద్యుడిని వెలివేయండి. వైద్యమనేది మిద్య.

వైదిక గ్రంథాలు వైద్యశాస్త్రాన్ని ఈ విధంగా కించపరచగా, బౌద్ధధర్మం ఈ శాస్త్రాన్ని పెంచి పెద్దదిచేసి మానవ శారీరక బాధల నుండి రక్షణ కల్పించినది. నేడు వైద్యశాస్త్రంలో కొత్త ఆవిష్కరణలు, దాని ప్రాముఖ్యత తెలియనిది కాదు.

18-19 శతాబ్దాల మధ్యకాలంలో జరిగిన ఒక అత్యున్నత స్థాయి సర్జన్‌ల సమావేశంలో జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా వంటి ప్రపంచ దేశాల సర్జన్‌లు బహిరంగంగా ఒక తీర్మానం చేశారు.

"The Indian surgery is the mother of modern surgery" అని. ఇదే సమావేశంలో పుట్టుక రీత్యా బెర్లిన్ వాసి అయిన జర్మన్ దేశపు సర్జన్ మరొక ప్రకటన చేస్తూ ఇలా పేర్కొన్నాడు.

The plastic surgery was invented by Ancent Indian physicians" అదే విధంగా బ్రిటన్ దేశపు 'విజ్ఞాన సర్వస్వం' అనే గ్రంథంలో "భారతదేశపు ప్రాచీన వైద్యులు కంటియొక్క కాటరాక్ట్ ఆపరేషన్‌కు, ముక్కు (Nose) మార్పిడికి ఆద్యుల"ని వ్రాయబడి వుంది.

పై అంశాలను బట్టి నేడు ఆధునిక వైద్యశాస్త్రమనుకుంటున్న దానికి ఇండియాలో మొట్టమొదట నాంది పలికినది బౌద్ధయుగంలో. ఈ ఆధునిక వైద్యశాస్త్ర (Advanced Medical Sciences) పితామహుడు "జీవకుడు" అనే బౌద్ధ పండితుడు. మాల్వతి కుమారుడైన జీవకుడు మగధ చక్రవర్తి బింబిసారుని పెంపకంలో పెరిగి గౌతమ బుద్ధునికి ప్రత్యేక వైద్యుడుగా కూడ నియమించబడ్డాడు. 'కౌమారభృత్య' ఇతని అసలుపేరు కాగా, మహావగ్గ, జాతక కథలలో 'వైద్యరాజ జీవక కౌమారభృత్య" గా పేర్కొనబడినాడు. ప్రఖ్యాత బౌద్ధ విశ్వ విద్యాలయమయిన తక్షశిల (పాకిస్తాన్ లోని రావల్పిండి జిల్లా) యందు మరో వైద్యప్రొఫెసర్ మరియు బౌద్ధాచార్యుడైన 'కపిలాక్షు'ని వద్ద ఏడు సంవత్సరములు వైద్యంలో శిక్షణ పొంది గురువును మించి అగ్రవైద్యుడైనాడు.

ఆ కాలంలోనే జీవకుడు ఆక్యుపంక్చర్ విధానం ద్వారా 'ఎనస్థీషియా' (మత్తు)ను ఇచ్చి ఏనొప్పి లేకుండా ఆపరేషన్ నిర్వహించాడు. బింబిసారుని మిత్రుడైన ఒక చక్రవర్తికి బ్రెయిన్ ఆపరేషన్ చేసిన సంఘటన ప్రాచీన వైద్యశాస్త్రంలో ఒక మైలురాయి. బింబిసారునికి తన ఏనస్‌లో ఫిస్టులా అనే వ్యాధిరాగా శస్త్రచికిత్స ద్వారా దానిని నిర్మూలించగలిగాడు. ఒకసారి సిద్ధార్థుడు మూలగంధకూట విహార్‌లో విశ్రాంతి తీసుకొనుచుండగా ఒక రాయి దొర్లి వచ్చి కుడికాలు బొటనవ్రేలు యొక్క ఎముక విరిగి పోగా జీవకుడు దానికి శస్త్రచికిత్స జరిపాడు. జీర్ణ వ్యవస్థకు, విసర్జక వ్యవస్థకు సంబంధించి అనేక ఆపరేషన్స్ నిర్వహించేవాడు. ఎవరి వద్ద ఎటువంటి రుసుము లేకుండా చక్రవర్తి నుండి బీదసాదల వరకు తన అమోఘమైన వైద్య సేవలందించినందునే జీవకుడిని వైద్యరాజ (The King of Physician) అని, రాజవైద్య (Royal Physician) అని బిరుదాంకితుడను చేశారు.

'వ్యాధి అనేది ఒక శాపం కాదు. అది ఒక హెచ్చరిక. స్వయం పరీక్షకు అది ఒక నిలువుటద్దం. జీవితానికి మరణానికి అది ఒక రహస్యం చెబుతుంది. జననం ఒక విషాదం. మరియు వ్యాధి దానికి అధికారపూర్వమైనట్టిది". - అభిధమ్మాకోశం.

వైద్యశాస్త్రం బౌద్ధం అందించిన ఒక వరం. బహుజన హితానికి విశేష కృషి సల్పుతున్నది. బౌద్ధ సంస్కృతిలోని ఈ వైద్య విధానాన్ని ప్రేరణగా తీసుకుని మౌర్య చక్రవర్తి అశోకుడు మానవ సంక్షేమ కోసం ప్రజా వైద్యశాలలను, జీవకారుణ్యం పేరుతో పశు వైద్యశాలలను ఏర్పాటు చేశాడు.

బౌద్ధ ఉపాసకులైన చరకుడు, శుశృతుడు ఆయుర్వేద వైద్యంలో నిష్టాగరిష్టులు. వారి పరిశోధనాత్మక గ్రంథాలే నేటి ఆయుర్వేదానికి జీవనాడిగా నిలిచాయి.

## అనిత్యా సిద్ధాంతం - భౌతిక శాస్త్రం :

19వ శతాబ్దపు ఉత్తరార్ధంలో సృష్టిని గురించి చెబుతూ పదార్థం, ద్రవ్యరాశి, శక్తి అనే మూడు ఉత్పత్తి కారకాలుగా విశ్వసించబడ్డాయి. సకల విశ్వం యొక్క స్వభావం ఈ మూడింటితోనే రూపుదిద్దుకొందని ఇవే సృష్టిని శాసిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ విశ్వం నాశంలేని అణువులతో నిండివుందని సిద్ధాంతీకరించారు. సకల సృష్టికి పునాదులై నాశన మెరుగనవిగా మాక్స్‌వెల్‌చే ప్రశంసించబడిన కారకాలు పందొమ్మిదవ శతాబ్దపు చివరలో జె.జె. థాంప్సన్ అణు విభజన మొదలు పెట్టిన తరువాత అణువు ప్రోటానులుగా, ఎలక్ట్రానులుగా విడిపోయింది. దీనితో ద్రవ్యరాశి పరిణామ రహితమైనదని, స్థిరమైనదనే భావనలు వీగిపోయాయి.

ఫలితంగా బుద్ధుడు చెప్పిన అనిత్య సిద్ధాంతం ఋజువు చేయబడినది. ప్రతి పదార్థం పరిణామం చెందుతని, అస్థిరమైన ప్రమాణాలతో పదార్థం ఏర్పడుతుందని, నిరంతర చలన, చైతన్య శక్తులను ఇవి కలిగి వుంటాయని బుద్ధుని అనిత్య సిద్ధాంతం చెపుతుంది. విశ్వవిధానం సమీకరణాలు, పునః సమీకరణాలు, విచ్ఛత్తిలేనని శాస్త్రం ఋజువు చేసింది. అనిత్య సిద్ధాంత ఫలితంగా ఎలక్ట్రానిక్స్, మీడియా, కంప్యూటర్ వంటి శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతూ వుంది. అంటే ఆధునిక విజ్ఞాన శాస్త్రం బుద్ధుని అనిత్య సిద్ధాంతాన్ని ప్రతిధ్వనింప చేస్తుంది.

ఇ.జి.టేలర్ తన "బుద్ధిజమ్ అండ్ మోడరన్ థాట్" అనే గ్రంథంలో నైతిక వ్యవస్థ కలిగిన మానవుడు తనకు తానే స్వయం పాలకుడు కావాలని, మానవ మనుగడ ఉన్నంత వరకు బుద్ధిజంలో ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం వెలుగు చూస్తూనే వుంటుందని చెప్పాడు.

బుద్ధుడు అందించిన చతురార్య సత్యాలలో (Universal Truths) దుఃఖం, దుఃఖసముదయం, దుఃఖకారణం, దుఃఖోపశమనంలలో సమస్య, సమస్యను గుర్తించడం, దానిక్కారణాన్ని శోధించడం, పరిష్కార మార్గాన్ని సూచించడం అనేవి ఆధునిక శాస్త్రీయ మార్గాలను చూపుతున్నాయి. అందుకే ఐన్‌స్టీన్ "ఆధునిక శాస్త్రీయ అవసరాలకు సరిపోయే మతమేదైనా వున్నదంటే అది బౌద్ధమే" అని చెప్పాడు. ఐన్‌స్టీన్ కలలుగన్న కాస్మిక్ రెలిజియన్ లక్షణాలన్నీ బౌద్ధంలో ఉన్నాయి.

**రసవిద్య - రసాయన శాస్త్రం :**

రసవాద సిద్ధాంతానికి ఆద్యుడు బౌద్ధాచార్య నాగార్జునుడు. ఇతడు అచ్చ తెలుగువాడు. గుంటూరు జిల్లా శ్రీ పర్వతం (నాగార్జునకొండ) ఇతని స్థావరం. శాతవాహన చక్రవర్తి శాతకర్ణి తొలిపించిన ఏడంతస్థుల బౌద్ధ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్రానిదే (Chemistry) ప్రథమ ప్రాధాన్యం. ఆధునిక రసాయన శాస్త్రానికి మూలపురుషుడు నాగార్జునుడేనని "నవనాథ చరిత్రము" వంటి పౌరాణిక గ్రంథాలు కూడ ధృవీకరించాయి. రసాయన, వైద్య, వృక్ష శాస్త్రాలలో ఇతడు ప్రజ్ఞావంతుడు. అనేక రసాయనాలను, పొడులను ఇతడు తయారు చేసేవాడు. నాగార్జున కొండ పురావస్తు తవ్వకాలలో లభించిన వస్తు సామగ్రి, చిన్న చిన్న బూడిద రాశులు (Ashes) ఈ అంశాన్ని ధృవీకరిస్తున్నాయి. బంగారాన్ని (ఆరమ్) తయారు చేసే రసాయన ఫార్ములా నాగార్జునుని వద్ద ఉండేదనే ఆధారాలున్నాయి.

రసము లైదును నుప రసలు లెన్మియును
బసరులు మందులు బాషాణములును
గలువంబులును జాలగా సమకూర్చి.....

బసరులు కలిపి - పాల్పడ మామవార
లరు దొందగా మూస లమరించు వారు
మొనసి క్రమ్మలు బుటంబులు వెట్టువారు
కలయంగ మారిన కనకంబు దివిసి

'రసరత్నాకరమ్' అనే గ్రంథంలో పురానాగార్జునోదితమ్ అని అనేక చోట్ల ఈ గ్రంథ రచయిత నిత్యానాధుడనే సిద్ధుడు పేర్కొనడాన్ని బట్టి నాగార్జునుడే ఈ శాస్త్రానికి ఆద్యుడనే విషయం తెలుస్తుంది. అదియును గాక నాగార్జునుని కృతమైన 'కక్షప్రటతంత్రమ్' అనే గ్రంథంలో రసాయన విద్య గురించి అనేక విషయాలు చెప్పబడినాయి. ఇతడు రచించిన అనేక గ్రంథాలు టిబెట్, చైనాలలో వున్నాయి. అందులో ఒక వైద్య గ్రంథము ముద్రిత మైనట్లు వినికిడి.

బౌద్ధ ధర్మ సూత్రాలను అశోకుడు శిలాస్తంభాలపై చెక్కించినట్లే, రోగులు తమ దేహ రోగాలను చాపుకొనుటకు వైద్య సూత్రాలను స్తంభాలపై చెక్కించి ప్రకటించేవాడని నాగార్జునుడికి పేరు వుంది. నాగార్జున కొండ అద్భుతమైన బౌద్ధ క్షేత్రమే కాదు అదొక గొప్ప పరిశోధనాలయంగా కూడ కీర్తి నార్జించినది. రసాయన శాస్త్రంలో నాగార్జునుడు 'అస్రవనము' (Distillation), 'నిస్తాపనము' (Calcination) మొదలగు రసాయన ప్రక్రియలను కనుగొన్నాడు. ఈ ప్రక్రియలే నేటి ఆధునిక రసాయనశాస్త్రంలో కర్బన పరీక్ష, పారిశ్రామిక, వైద్య రసాయన శాఖలకుపయోగించ బడుతున్నాయి. ఇతనొక ప్రకృతి శాస్త్రవేత్త కూడ.

**ఖగోళ - గణిత శాస్త్రాలు (Astronomy and Mathematics) :**

"ఫలానా గ్రంథంలో ఉన్నది గనుక నమ్మకు. ఒక తాత్త్వికుడు చెప్పాడని గుడ్డిగా నమ్మకు. భగవానుడు చెప్పాడని అనుసరించకు". లోకంలో నీ అనుభవ సారాన్ని జోడించి అది వాస్తవమనుకుంటే

నమ్ము". అని బుద్ధుడు బోధించిన దానినే ప్రేరణగా తీసుకుని బౌద్ధులు ప్రజా సంక్షేమం కోసం నిత్యం 'శోధన' లో నిమగ్నమై చివరకు ఖగోళశాస్త్ర విషయాలను సహితం ఆవిష్కరించారు. గ్రహాల చలనం, వాతావరణ మార్పులు, జీవరాశిపై వాటి ప్రభావం గూర్చి బౌద్ధం విశేషమైన కృషి సల్పినది.

గణితశాస్త్ర పద్ధతుల నుపయోగించుకుని ఆకాశ హర్మ్యాలవంటి స్థూప, చైత్య నిర్మాణాలు గావించారు. వేల సంవత్సరాలు గడిచినా ప్రకృతి వైపరీత్యాలను ఒకవైపు, దుండగుల దాడులను మరొకవైపు తట్టుకొని నిలిచాయంటే వారికి గణిత, ఆర్కిటెక్ శాస్త్రాలలో గల నైపుణ్యమే కారణం. వృత్తాకారపు స్థూప నిర్మాణంలో ఇది మరింత దోత్యకమవుతుంది.

ప్రతి బౌద్ధ క్షేత్రము ఒక మహా విశ్వవిద్యాలయంగా వర్థిల్లినది. ప్రపంచంలో మొట్టమొదటి విశ్వవిద్యాయంగా పేరొందిన నలంద, తక్షశిల, విక్రమశిల జాతీయ స్థాయిలోను, మన రాష్ట్రంలో అమరావతి, నాగార్జునకొండ, బావికొండ, గుంటుపల్లి విశ్వవిద్యాలయాలు విజ్ఞాన సముపార్జనతో దిగ్విజయంగా నడిచినవి. హుయాన్ త్సాంగ్, ఇత్సింగ్‌ల వ్రాతల ప్రకారం నలందాలో హేతువిద్య (లాజిక్), శబ్దవిద్య (గ్రామర్), చికిత్సా విద్య (మెడిసన్), అస్త్రానమి, (ఖగోళశాస్త్రం), మెటాఫిజిక్స్, రసాయన శాస్త్రం, పాళీ, సంస్కృత భాషలు వంటి ఎన్నో సబ్జెక్టులపై తర్ఫీదు ఉండేది. శ్రీలంక, చైనా, టిబెట్, మంగోలియాల నుండి ఉన్నత విద్యల కోసం వచ్చేవారు. పదివేల మంది విద్యార్థులు, 200 మంది అధ్యాపకులు, 1500 మంది ఇతర ఉద్యోగులు ఉండేవారు. భారత్‌కు చెందిన బౌద్ధ గురువు 'శీలాభద్ర మహాథేర' నలందాకు కులపతిగా (Vice - Chancelor) వుండేవారు. 'ద్వారపండిత' అని పిలవబడే ఒక ప్రొఫెసర్ ద్వారా ప్రవేశ పరీక్షలు (Entrance Examinations) జరిగేవి. అతి కష్టంగా వుండే ఈ పరీక్షలలో విదేశీయులు 20%, భారత్‌కు చెందిన వారు 30% మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యేవారు.

హిందూ శాఖలకు సంబంధించి ఆరు ఖండాలకు కూడ ఇక్కడ శిక్షణ వుండేది. ప్రతిరోజు 100కు పైగా చర్చలు, గోష్టులు, సెమినార్‌లు జరుగుతుండేవి. విద్యాలయంలో ఒక సువిశాల ఎత్తయిన భవనంలో ఖగోళశాస్త్ర పరిశోధనకు సంబంధించిన అత్యాధునిక పరికరాలుండేవి. ( ఈ విశ్వవిద్యాలయాన్ని నేను 2006 సెప్టెంబర్‌లో సందర్శించాను)

విజ్ఞాన శాస్త్రమే బౌద్ధంగా, బౌద్ధమే విజ్ఞాన శాస్త్రంగా పరిఢవిల్లిన కాలం ఇండియాకు నిజమైన స్వర్ణయుగం. బౌద్ధం ఇప్పటికి విజ్ఞాన శాస్త్రాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేస్తున్నది. బౌద్ధం సర్వజగత్తుకి మంగళదాయకముగా ఉన్నది. నాడు నేడు ప్రపంచ జనబాహుళ్యం బుద్ధుని ధర్మాన్ని ఆచరించి తరించినది. తరిస్తున్నది. సమాజంలో సమస్త వైషమ్యాల నివారణకు దివ్య ఔషధం బౌద్ధ ధర్మాచరణమొక్కటే మార్గం.

# బౌద్ధ ధమ్మం - ప్రపంచశాంతి

- దొమ్మేటి సత్యనారాయణ బోధి

బౌద్ధ ధమ్మం కేవలం విహారాలలో ఉండే భిక్షువులకు మాత్రమే ఉద్దేశించినదనే ఒక అపోహ చాలా మందిలో ఉంది. బౌద్ధాన్ని అనుసరించాలంటే గృహస్థ ధర్మాన్ని విడిచి ఏ బౌద్ధ విహారానికో లేక ఏకాంతవాసానికో పోవాలనుకుంటారు. ఇది బౌద్ధ ధమ్మాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోవటం వలన కలిగే దురవగాహన మాత్రమే.

బౌద్ధ ధమ్మం కేవలం విహారాలలోని బిక్షువులకు మాత్రమే ఉద్దేశించినది కాదు. ఇది సామాన్య గృహస్థులకు కూడా అంతే ఉపయోగకరమైనది. బౌద్ధం నిజ తత్వాన్ని అర్థం చేసుకొన్నట్లయితే దాన్ని గృహస్థ జీవితం గడుపుతూ కూడా దీనిని అవలంబించవచ్చు.

రొదలు, ఆటంకాలకు దూరంగా ఏ ప్రశాంతమైన చోటనో విశ్రాంతి జీవనం గడపటం కొందరికి యిష్టం కావచ్చు. కాని తోటివారి మధ్య వుంటూ, వారికి సహాయమూ, సేవలు అందిస్తూ బౌద్ధ ధమ్మాన్ని అనుసరించటం యెంతో ప్రశంశనీయం. ఇతరుల శ్రేయస్సుకై కృషిచేయటానికి కొంత సామర్థ్యం కావాలి. ఈ సామర్థ్యాన్ని పొందటానికి అవసరమైన నైతిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక శిక్షణలను పొందుటకు, తద్వారా మనస్సును, వ్యక్తిత్వాన్ని, ధృడతరం చేసుకోవటానికిగాను, కొందరికి కొంతకాలం పాటు ఏకాంత జీవనం గడపటం అవసరం కావచ్చు. కాని ఒకవేళ ఎవరైనా సాటివారి గూర్చి చింతన విడనాడి, కేవలం తమ సుఖం గురించి, విముక్తి గురించి మాత్రమే ఆలోచిస్తూ ఏకాంత జీవితం గడిపినట్లయితే, ఇది ప్రేమ,- కరుణ,- సేవలపై ఆధారపడిన బౌద్ధ ధమ్మానికి అనుకూలం కాదు.

సామాన్యులు కూడా బౌద్ధ ధమ్మాన్ని ఆచరించడం సాధ్యమే అయితే భగవానుడు బిక్షు సంఘాన్ని ఎందుకు స్థాపించాడని కొందరి ప్రశ్న. ఇతరుల సేవలకై తమ జీవితాన్ని వెచ్చించమని, ఒక సాధారణ గృహస్థుని కోరలేం. కాని కుటుంబ భారమూ, సంసారిక బాదరబంధీలు లేని భిక్షువు బుద్ధుని ప్రభోదనల ఆధారంగా బహుజన హితాయ, బహుజన సుఖాయ, కోసం జీవితాన్ని గడపగలడు. ఈ కారణాల వల్ల చారిత్రక క్రమంలో బౌద్ధ విహారాలు, కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగా మాత్రమే కాక విద్యా, సాంస్కృతిక కేంద్రాలుగా కూడా అభివృద్ధి చెందాయి. బౌద్ధులు కావాలని ఆశించే వారికి దీక్షలు గాని బాప్టిజాలు కాని ఉండవు. అయితే బిక్షువులుగా జీవించాలనే వారికి మాత్రం ముందే కొంతకాలం పాటు బిక్షువుల దగ్గర ధమ్మ వినయాలకు చెందిన ప్రశిక్షణ పొంది తీరాలి. బుద్ధుని ధమ్మాన్ని అర్థం చేసుకొని శ్రద్ధతో అవలంబించే ప్రతీవారు బౌద్ధులే. అయితే బౌద్ధ దేశాలలో నేటికి పాటిస్తున్న సాంప్రదాయం ప్రకారం బౌద్ధులు కావాలనుకొనేవారు త్రిరత్నాల శరణుబొంది, పంచశీలాలను పాటించడం అనేది ప్రతి ఉపాసిక ఉపాసకులకు తప్పనిసరి అయిన నైతిక కర్తవ్యం.

బౌద్ధం ఒక జీవనమార్గం. ముఖ్యమైందల్లా పంచశీలాలను ఆర్య అష్టాంగ మార్గాన్ని అనుసరించటమే.

బౌద్ధం కేవలం ఉన్నతమైన ఆదర్శాలు, నైతిక, దార్శనిక, చింతనలపట్ల ఆలోచనే కాకుండా, జనాల జీవితాల గురించి, వారి ఆర్థిక సామాజిక, ఆచార వ్యవహారాలను, విస్మరించకుండా, వారి జీవితాలను సామాజిక, ఆర్థిక, రాజకీయ దృష్టి కోణాలన్నింటి నుండి బుద్ధుడు దర్శించాడు. నైతిక, ధార్మిక, తాత్విక,

---

దొమ్మేటి సత్యనారాయణ బోధి, ఛైర్మన్, బుద్ధవిహారట్రస్టు , మెహర్‌నగర్ , కాకినాడ.

సమస్యలను గూర్చి బుద్ధుడు ప్రభోదించిన ధమ్మ అందరికి తెలుసు. కాని సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలను గురించి ఆయన ధమ్మం అందరికి తెలియదు. పాశ్చాత్తులకైతే అసలే తెలియదు. "దీఘ నికాయ" అనే గ్రంథములో నైతిక విలువలను పాటించకుండా, దొంగతనాలు, మోసాలు, హింసద్వేషాలు, క్రౌర్యము లాంటి నేరాలకు పాల్పడటం దారిద్ర్యమే కారణమంది. ఈ రోజుల్లో యిప్పటి ప్రభుత్వాల మాదిరిగానే నాటి రాజులు కూడా నేరాలను శిక్షల ద్వారా అరికట్టాలని చూసారు. యిదే దీఘ నికాయ గ్రంథంలో కూట దంత సుత్తం, ఈ శిక్షించడం అనేది వృధా ప్రయత్నమని చెబుతుంది. ఈ పద్ధతి ద్వారా నేరాలను అరికట్టలేమంటుంది. దీనికి బదులుగా ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచినట్లయితే నేరాలను అరికట్టవచ్చునని బుద్ధుడు చెప్పటం జరిగింది.

దీనికై వ్యవసాయం చేయాలనుకునేవారికి విత్తనాలను; వర్తక, వాణిజ్యాలను చేయదలచినవారికి మూల ధనాన్ని; ఉద్యోగాలు చేయదలచిన వారికి ఉద్యోగం తగిన వేతనాలను ఇవ్వాలని దీఘనికాయ గ్రంథములో బుద్ధుడు తన అభిప్రాయాన్ని చెప్పడం జరిగింది. ఇలా జనాలకు తగిన ఆదాయాన్ని పొందే అవకాశాలు కల్పించినప్పుడు, వారు సంతృప్తి చెంది, యెటువంటి భయోత్పాతాలకు పాల్పడకుండా పాలకులకు తోడ్పడతారు. అప్పుడు జనాలు నేరాల నుండి విముక్తి చెంది దేశంలో ప్రశాంతతను నెలకొల్పుతారు. ప్రతి ఒక్కరు తమ తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవడం చాలా అవసరం అని బౌద్ధం చెబుతుంది. అలాగని తమ ధమ్మం యొక్క ప్రాథమిక నియమాలను వ్యతిరేకంగా, తృష్ణలోభాలకు ప్రేరితులై చెడ్డ మార్గంలో ధనార్జన చేయకూడదంటుంది.

బుద్ధ భగవానుడు ఆర్థిక శ్రేయస్సును సైతం మానవ సుఖ-సంతోషాలకు అవసరమైనదిగా గుర్తించాడని, అయితే ఆ శ్రేయస్సు నైతిక - ధార్మిక పునాదులపై ఉండాలన్నదే బుద్ధుని ప్రభోదన. రాజకీయాలు, యుద్ధాలు-శాంతి గురించి కూడా బుద్ధుని అభిప్రాయాలు స్పష్టమైనవే. బౌద్ధం అహింసా-శాంతిని సమర్థిస్తుందని, ఇదే బౌద్ధం-విశ్వానికిచ్చే సందేశమని ఏ విధమైన హింసనూ సమర్థించదనే విషయం అందరికీ తెలిసినదే. బౌద్ధం ప్రకారం ధర్మయుద్ధం అనేది ఏదీ లేదు. కేవలం ద్వేషాన్ని, క్రౌర్యాన్ని, హింసనూ, జనసంహారాల్ని న్యాయమనటానికి, ఆ పాప భారం నుండి తప్పుకోవటానికే ఈ ధర్మ యుద్ధమనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. యిక్కడ ఫలానాది న్యాయమూ, ధర్మమూ అని నిర్ణయించేదెవరు?

బలవంతులు- విజేతలు ధార్మికులైతే

దుర్బలులు - పరాజితులు అధార్మికులు.

బలవంతులు చేసే యుద్ధమెప్పుడూ ధార్మికమే అంటారు. యిటువంటి వాదాలను బౌద్ధం అమోదించదు.

అహింస - శాంతులను ఉపదేశించటమే కాక బుద్ధ భగవానుడు స్వయంగా యుద్ధరంగానికి వెళ్లి మరి యుద్ధాన్ని ఆపాడు. రోహిణి నదీ జలాల వివాదం శాక్యులకు - కొలియులకు మధ్య యుద్ధంగా మారినప్పుడు రక్తపాతం జరగకుండా బంధు వర్గంలో ఒకరినొకరు చంపుకోకుండా యుద్ధాన్ని నివారించాడు. యిది చరిత్ర.

ఈనాటి పాలకుల్లాగానే, బుద్ధుని సమయంలో కూడా అన్యాయపరులైన రాజులుండేవారు. ప్రజలు అణచివేతకు, దోపిడికి, వంచన, యాతనలకు, మరణశిక్షలకూ గురి అవుతు ఉండేవారు. పన్నులు

ఎక్కువగాను శిక్షలు భయంకరంగానే ఉండేవి. నేరాన్ని బట్టి కాక వర్ణాన్ని బట్టి శిక్షలను విధించేవారు. బుద్ధుడు ఈ అసమానతలను చూస్తూ ఊరుకోలేదు. దీనికి గాను ఆయన తన దృష్టిని న్యాయోచిత పాలన వైపు సాగించినట్లు ధమ్మపద వ్యాఖ్యానం అట్ట కథలలో చెప్పబడింది. పాలకుడైన రాజు, అతని మంత్రులు, అధికారులు, అన్యాయపరులు, అవినీతిపరులూ అయినప్పుడు, ఒక దేశం మొత్తం అంతా ఎలా అవినీతిమయమూ, పతనము అయి దుఃఖంలో కూరుకుపోతుందో ఆయన చెప్పాడు. ఎందుకంటే ఒక దేశంలో సుఖ-శాంతులు వెల్లి విరియాలంటే ఆ ప్రభుత్వం న్యాయబద్ధమైనదై ఉండాలి. ఈ న్యాయబద్ధమైన పాలననే యెలా పొందవచ్చో ఆయన రాజధర్మాలలో దశ ధర్మాలను చెప్పడం జరిగింది.

అయితే మనం పాతపదమైన రాజు స్థానంలో కొత్త పదమైన ప్రభుత్వాన్నుంచాలి. బుద్ధుడు చెప్పిన పది రాజధర్మాలు కూడా ప్రభుత్వంలో భాగస్థులైన రాష్ట్రపతులూ, ప్రధానులు, మంత్రులూ, రాజకీయనాయకులూ, న్యాయాధికారులూ, పాలనాధికారులూ, అందరికీ వర్తిస్తాయి.

పదిరాజ ధర్మాలలో మొదటిది "దాన" అంటే ఉదారత. పాలకుడు ధనసంపత్తుల పట్ల మమకారము, తృష్ణా కలిగియుండక ఆ సంపదను ప్రజల శ్రేయస్సుకై వినియోగించాలి.

రెండవది "శీల" దీనిలో భాగంగా పాలకుడు కనీసం గృహస్థులకు చెప్పిన పంచశీలాలను పాటించాలి.

మూడవది పరిత్యాగం. ఇది ప్రజలకై సర్వస్వం దారపోయడం. అతడు తన సౌకర్యాలను, పేరు ప్రతిష్టలను, ఆఖరుకి జీవితాన్ని సైతం ప్రజలకై త్యాగం చేయగలగాలి.

నాల్గవది "అజ్జవం" అంటే ఆర్జవం, మంచితనం, సరళత్వం. దీని అర్థం ముక్కుసూటితనం, నిజాయితి, సత్యనిష్టలు. తన విధి నిర్వహణలో అతడు భయాన్ని బందుత్వాలను దరిచేయనీయకూడదు. తన ఉద్దేశాలపట్ల నిజాయితి కలిగి ఉండాలి. ప్రజలను మోసం చేయకూడదు.

అయిదవది "మద్దవం" అంటే మార్దవత లేక మృదుత, అతడు సౌమ్య స్వభావం కలిగి ఉండాలి.

ఆరవది "తపం" అతడు సామాన్యమైన జీవితం గడపాలి. విలాసవంతమైన జీవితాన్ని గడపకూడదు. ఇంద్రియాలపై నియంత్రణ కలిగి యుండాలి.

ఏడవది "అక్కోదం" క్రోధాన్ని, దుర్భావనలని, శతృత్వాన్ని విడనాడాలి. యితరులపట్ల అక్కసు కలిగి ఉండకూడదు.

ఎనిమిదవది "అవిహింస" దీని అర్థం యితరులకు హాని చేయరాదని మాత్రమే కాదు. అతడు శాంతి ప్రయత్నాలు చేస్తూ యుద్ధాన్ని సయితం, ప్రాణనష్టానికి - హింసకూ దారితీసే యెటువంటి పద్ధతినైనా నివారించాలి.

తొమ్మిదవది "ఖంతి" అంటే సహనశీలత. అతడు కష్టాలకు, సమస్యలకు, చికాకు పడకుండా ఓర్పుతో భరించగలగాలి.

పదవది "అవిరోదం" అంటే అతడు ప్రజాభిప్రాయానికి తలొగ్గాలి. ప్రజాశ్రేయస్సుకు దోహదం చేసే ఏ ప్రణాళికకూ ఎదురాడకూడదు. మరోమాటల్లో చెప్పాలంటే, అతడు ప్రజానుకూలంగా పాలనను మలచుకోవాలి.

ఇటువంటి పాలకులను పొందగలిగిన దేశం సుఖవంతమవుతుందని వేరే చెప్పనవసరంలేదు. అయితే ఈ నీతులు చెప్పుకోవడానికి, వినడానికి బాగానే ఉంటాయి. కానీ ఆచరణలో సాధ్యమా? అనే ప్రశ్న అందరికీ యెదురవుతుంది. ఎందుచేతనంటే కంచే-చేనును మేసే చందంగా పరిపాలన సాగుతున్న రోజులివి.

ఇది కాల్పనిక దేశం కాదు, ఈ దేశంలోనే ఈ శీలాన్ని పాటిస్తూ, శాంతి సామరస్యాలను నెలకొల్పిన బౌద్ధ మహాచక్రవర్తి సామ్రాట్ అశోకుని పరిపాలన యిది సంభవమని నిరూపించింది.

నేటి ప్రపంచం అనుక్షణం భయ సందేహాల, ఒత్తిడులు మధ్య బ్రతుకుతుంది. సైన్సు ఊహాకందని వినాశనాన్ని సృష్టిస్తుంది. ఒకదానికి పోటీగా మరొకటి తయారవుతుంది. ఈ మారణాయుధాలను ఘుళిపిస్తూ ఒక దేశం మరో దేశాన్ని బెదిరిస్తుంది. మీకంటే మేమే ఎక్కువ వినాశనాన్ని సృష్టించగలమని సిగ్గు లేకుండా బాహాటంగా చెప్పుకుంటున్నాయి. వీరి అహంభావం యింతటితో ఆగనందున సంపూర్ణ మానవజాతి వినాశనం తప్పదేమో అనే భయాందోళనతో మానవాళి జీవిస్తుంది.

మనిషే సృష్టించిన ఈ పరిస్థితిని చూచి భయభీతుడై మనిషి బయటపడటానికి ఏదైనా మార్గం కోసం వెతుకుతున్నాడు. అయితే మానవాళికి బుద్ధుడు సూచించిన దారి తప్ప మరేదారి లేదు. ఆయన సందేశాలైన అహింసా, శాంతి, ప్రేమా, కరుణ, సహనమూ, సానుభూతి, సత్యమూ, వివేకమూ, అన్ని ప్రాణుల పట్ల గౌరవాదరములు, స్వార్థం నుండి, ద్వేషం నుండి, హింస నుండి, విముక్తి పొందడమే ఆ పవిత్రమైన మార్గం. ఈ సందర్భముగా బుద్ధ భగవానుడంటాడు:

నహీ వేరేన వేరాని ॥ సమ్మన్తీధ కుదాచనం ॥
అవేరేన చ సమ్మన్తి ॥ ఏస ధమ్మో సనన్తనో ॥

వైరవభావ మెన్నటికి - వేరం వలన శాంతించదు. అది ప్రేమ వల్లనే శాంతించుతుంది. ఇదే సత్యమైన ధర్మం.

కోపాన్ని ప్రేమతోను, దుష్టుని సాధుత్వంతోనూ, లోభిని దాన గుణంతోనూ జయించాలి. పొరుగువారిని జయించి అణచి వేయాలని భావిస్తూ దానికోసం ప్రయత్నిస్తున్నంతకాలం, శాంతి - సుఖాలు లభ్యం కావు. దీనినే బుద్ధ భగవానుడు ఇలా చెప్పాడు. విజేత వైరిని పొందుతాడు. పరాజితుడు దుఃఖాన్ని పొందుతాడు. జయాప జయాలను విడచిపెట్టిన శాంతమూర్తి సుఖాన్ని పొందుతాడు.

శాంతినీ - సుఖాన్ని ప్రసాదించే ఏకైక విజయం గురించి బుద్ధుడిలా అంటాడు:

యోసహస్సం సహస్సేస ॥ సజ్గామే మానుసే జినే
ఏకం చ జేయ్య మత్తానం ॥ సవే సజ్గా మజుత్తమో

శాంతిని, సుఖాన్ని ప్రసాదించే ఏకైక విజయం?

తనపై తాను సాధించిన విజయం మాత్రమే. ఒకడు సంగ్రామంలో వేలకు వేలమందిని జయించవచ్చును. కానీ తనొక్కడిని తానే జయించినవాడు సంగ్రామజితులందరిలోనూ ఉత్తముడు.

యిది ఆచరణయోగ్యం కాదనే వాదన ఒకటుంది. నిస్సందేహంగా అంత సులువైనది కాదు. అయినప్పటికి ప్రయత్నించక తప్పదు. ప్రయత్నించటమే ప్రమాదంతో కూడుకున్నదనే వాదనకి సమాధానం ఏమంటే? అణుయుద్ధానికి తయారుకావడం కంటే యిది అంత ప్రమాదం కాదు.

ఈ సందర్భముగా అశోక చక్రవర్తిని తలంచుకోవాలి. ప్రాచీన యుగంలో ప్రసిద్ధి చెందిన పాలనా దక్షతతో ధైర్యాన్ని, విశ్వాసాన్ని, కలిగి ఈ అహింసా, శాంతి, ప్రేమలకు చెందిన బోధనలను తన మహా సామ్రాజ్యపు పాలనా యంత్రంగానికి మాత్రమే గాక, జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో సైతం అనుసరించాడనేది గుర్తుచేసుకోవడం మనకు సాంతన్యనూ, ప్రేరణనూ కలిగిస్తుంది. "అశోకా ది గ్రేట్" దేవానాం పియ అనే సార్ధక బిరుదాంకితుడుగా ప్రఖ్యాతి చెందాడు అశోకుడు.

మానవుని లోని క్రూరత్వం, అమానుష ప్రవృత్తి ఒక్కసారి నశిస్తే మానవుడు ఎంతటి మహోన్నతుడౌతాడో అశోకుని జీవితమే నిదర్శనం. మానవుని మేధ పరిణతి చెంది వివేచన కల్గితే, మానవ జీవితం మధుర క్షణాలు అనుభవిస్తుందని, బుద్ధుడు చెప్పిన ప్రభోదనలు వాస్తవమని అశోక చక్రవర్తి నిరూపించాడు.

కళింగ యుద్ధం మొదటి ఫలితం అశోకుడు మానవతావాదిగా మారి మానవసేవ చేయటం, యుద్ధంలో జరిగిన రక్తపాతానికి హృదయవిదారకంగా విచారించాడు. సుమారు 18 మాసాలు అంతః పురం నుండి బయటకు రాలేకపోయాడు. ఉపగుప్తుడనే బౌద్ధభిక్షువు బుద్ధుని యొక్క ప్రభోదనలను సమాజానికందించి, మానవత్వాన్ని పెంపొందించాడు. ప్రపంచంలో ధృవతారగా నిలిచాడు. ఇతడు చేసిన బౌద్ధమత ప్రచారం ద్వారా ఈమతం ప్రాకి ప్రజలను దగ్గరకు చేర్చింది. దేశమంతటా చెక్కించిన శిలాశాసనాల లోని ధర్మసూత్రాలు, భావసమైక్యతను సాధించింది. అశోకుని శిల్పకళ ఈనాటికి ప్రపంచంలో నలుమూలలా ప్రజలందరి అభిమానాన్ని చూరగొని ఆ శిల్పకళను దర్శించాలని దేశ విదేశాల నుండి జాతి-తెగ-భాషా బేధాలు లేకుండా యాత్రలు చేస్తున్నారు. అశోకుని సర్వమానవ సౌభ్రాతృత్వం, మానవత్వం, సంక్షేమ రాజ్యవ్యవస్థ, ఈవిధంగా యుద్ధాల ద్వారా కన్నా ప్రజల హృదయాలను చూరగొన్నందున ఐక్యత అద్భుతంగా సాధించబడినదనుటలో అతిశయోక్తిలేదు.

ప్రపంచ శాంతికాముకుడు : తథాగతుని శాంతి సందేశాన్ని ప్రపంచం నలుమూలలా ప్రచారం చేయటానికి బౌద్ధ బిక్షువులతోబాటు తన కుమార్తె సంఘమిత్ర మరియు కుమారుడు మహేంద్రను పంపి విశ్వశాంతికి పాటుబడిన మహాచక్రవర్తి అశోకుడు.

అశోకుని ఆదర్శాలనే నేడు ఐక్యరాజ్యసమితి కూడా అంగీకరించి అనుసరించటానికి ప్రయత్నించడం, ముఖ్యంగా భారతీయులైన మనం గర్వించదగ్గ విషయం. మన పూర్వులు కొన్ని వేల సం॥ల క్రిందట వారు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేడు ప్రపంచ శాంతికోసం UNESCO Charter లో యిలా చెప్పబడింది.

The preamlse to the UNESCO Charter reminds us that "It is in the minds of men that the defence of Peace must be Constructed." What we need today is to bring about a change in Man's Mind more than a change in the Environment. Since Wars begin in the Minds of men, Since Conflicts are cause of War. In our quest for Peace, we have to remove the causes of confilicts.

సుమారు 2500 సం॥ల క్రిందట పుట్టిన గౌతమబుద్ధుడు ధమ్మపధంలో మొట్టమొదటి ప్రవచనంలోనే ఇదే విషయాన్ని ఇంకా లోతులకు వెళ్లి చెప్పటం జరిగింది. అదేమిటంటే?

| | |
|---|---|
| మనో పుబ్బంగమా ధమ్మా | అన్నిటికి అగ్రగామి మనసే |
| మనోసేట్టా మనోమయా | మనసే సర్వం మనసే ముఖ్యం |
| మనసా చే పదుట్ఠేనా | చెడుమనసుతో పలికిన పలుకులు |
| బాసతివా కరోతివా | చేసిన చేతలు చిరు దుఃఖాలై |
| తతోనం దుఃఖ మన్వేతి | ఎద్దుల గిట్టల వెంబడి వచ్చే |
| చక్కం వ వహతో పదం | బండి చక్రముల వలె వెన్నంటును |
| మనో పుబ్బంగమా ధమ్మా | సకల కర్మలకు మనసే మూలం |
| మనోసేట్టా మనోమయా | మనసే ముఖ్యం సర్వం మనసే |
| మానసాచే పసన్నేన | మంచి మనసుతో పలికిన పలుకులు |
| భాసతివా కరోతివా | చేసిన చేతలు |
| తతోనం సుఖ మన్వేతి | ఎప్పుడు వీడని తోడు నీడలై |
| చాయవా అనపాయినీ | చిరుసుఖాలు నీ జంటగా సాగును. |

దీనినే యమక వర్గం అంటారు. యమక అంటే ద్వయమని (జత). ప్రతి జత ఒకే విషయానికి చెందిన అనుకూల, వ్యతిరేఖ అంశాలను వివరిస్తుంది. మానవ జీవితంలో మనసు నిర్వహించే పాత్రను ఈ రెండు గాధలు నొక్కి చెబుతున్నాయి. మనము నుంచే మాటలు చేతలూ (సకలం) ఉత్పన్నమవుతాయి. వాటి మంచి చెడ్డలు మనసు నిష్కల్మషమా? లేకా కలుషితమా? అన్నదాని బట్టే నిర్ణయమౌతాయి.

ప్రాచీన యుగంలో గొప్ప విజేత అనిపించుకున్న సామ్రాట్ అశోకుడు తన శక్తి-సామర్థ్యాలకు తిరుగులేని తరుణంలో, తన రాజ్యపు యెల్లలు విస్తరించ కలిగివున్న తరుణంలో యుద్ధాన్ని - హింసనూ త్యజించి, శాంతి-అహింసలవైపు మళ్లిన సంఘటన మానవజాతి చరిత్రలోనే అపురూపమైంది.

నాటి సామ్రాజ్యనేత యుద్ధాన్ని-హింసను విడనాడి బహిరంగంగా బుద్ధుని అహింసా శాంతిబోధనలను అంగీకరించి అమలపరిచాడు. ఆనాటి ఏ పొరుగు రాజైనా అశోకుని ధమ్మ పరాయత్వాన్ని అలుసుగా తీసుకొని ఆక్రమణకు ప్రయత్నించాడని కాని, అశోకుడు జీవించి ఉండగా ఆయన రాజ్యంలో తిరుగుబాటు జరిగిందనికాని చెప్పే చారిత్రక ఆధారాలు ఏమీలేవు. దీనికి విరుద్ధంగా ఉపమహా ద్వీపంలో శాంతి సామరస్యాలు విరాజిల్లాయని, పొరుగు రాజ్యాలు అశోకుని సహృదయ నేతృత్వాన్ని హర్షించాయని మనకు తెలుస్తుంది.

వేర్వేరు భౌగోళిక మహాశక్తుల మధ్య సమతూకాన్ని స్థాపించటం ద్వారానో, అణ్వాస్త్రాల బూచిని చూపడం ద్వారానో శాంతిని కొనసాగించడం సాధ్యమనే వాదన తెలివైనవాదన కాదు.

అణ్వాస్త్రాలు భయోత్పాతాన్ని సృష్టించగలవు కానీ శాంతి సామరస్యాలను సృష్టించలేవు. భయం కేవలం ద్వేషం, దుర్భావన, శతృత్వానికి మాత్రమే జన్మనిస్తుంది. భయం సహాయంతో శాంతిని చిరకాలం కొనసాగించడం సాధ్యంకాదు. అది ఏదోనాడు విస్ఫోటం చెంది మానవాళి మనుగడకే ప్రమాదం తెస్తుంది. నిజమైన శాంతి, భయ సందేహాలు, ప్రమాదము లేని బుద్ధుడు బోధించిన మెత్తా (మైత్రి, కరుణ, ముదిత, ప్రేమ, సహనము) అనే ఎల్లలు లేని మైత్రీభావం వలన మాత్రమే ప్రపంచ శాంతిని సాధించగలం.

# అశోకుని జీవితంలో ప్రధాన ఘట్టాలు

- డా. ఈమని శివనాగిరెడ్డి
- వై. మురళీ మోహన్‌రాజు

క్రీ.పూ. 265వ సంవత్సరంలో అశోకుడు మౌర్య సామ్రాజ్యాధిపతిగా సింహాసనాన్ని అధిష్టించాడు. అసంధిమిత్త అతని పట్టపురాణి. క్రీ.శ. 265 నుంచి మూడేళ్ళపాటు రాజ్యాన్ని పరిపాలిస్తూ, అనేక దానధర్మాలను చేశాడు. సంతృప్తి కరమైన జీవనాన్ని కొనసాగిస్తున్నా, ధార్మిక అంతర్మథనానికి గురై, వివిధ మతాలకు చెందిన జ్ఞానులను తన రాజ ప్రాసాదానికి రప్పించుకొని, వివిధ దర్శనాల, ధర్మాల మర్మాలను తెలుసుకొన్నట్లు దీపవంశమనే గ్రంథంలో ఉంది.

క్రీ.పూ. 265-262 సంవత్సరాల మధ్యకాలం అశోకుని జీవితంలో అతిముఖ్యమైన సంఘటనలు చోటుచేసుకొన్నాయి. ఏదర్శనాన్ని ఆదర్శంగా తీసుకోవాలో తెలియక సతమౌతుండగా, పాటలీపుత్రంలోని కుక్కుటారామానికి చెందిన నిగ్రోధుడనే సామనేరుడు 'అప్పమాద' అనే అంశంపై చేసిన ప్రసంగంలోని నైతిక విలువలకు ఆకర్షితుడై, బౌద్ధదర్శనంపై అభిమానం పెంచుకొన్నాడు.

క్రీ.పూ. 262-259 సం॥ల మధ్యకాలంలో, వివిధ ప్రాంతాల్లో నిక్షిప్తం చేయబడిన బుద్ధుని ధాతువులను వెలికితీసి, వాటిని వివిధ ప్రాంతాలకు పంపి, వాటిపై స్థూపాలను నిర్మించటమే కాక అక్కడ అనేక ఆరామాలకు సహాయ సహకారాల నందించాడు. అశోకుడు బౌద్ధధర్మ వ్యాప్తికిగాను 84,000 స్తూపాలను నిర్మించాడని బౌద్ధ సాహిత్యం పేర్కొంటుంది. బౌద్ధధర్మం పట్ల అంకితభావంతో చేసిన సేవలకుగాను అంతకు ముందరి చండాశోకుడునే ధర్మాశోకుడైనాడు. క్రీ.పూ. 260లో అశోకుని చిన్నతమ్ముడు తిస్స, అల్లుడు అగ్గి బ్రహ్మలిద్దరూ బౌద్ధాన్ని స్వీకరించి, ఉపసంపద పొంది, భిక్షువులై సంఘంలో చేరారు.

పట్టాభిషిక్తుడైన ఆరేళ్ళకు అంటే క్రీ.పూ. 259-58లో విశేషంగా ధర్మ వ్యాప్తికి పూనుకోవటమే కాక, సంఘావసరాలను కూడా తీర్చిన అశోకుడు 'పాచ్చయదాయాది' గా పిలువబడినాడు. తమ తండ్రిని 'శాసన దాయాది'గా చూడాలన్న తలంపుతో, అశోకుని కొడుకు మహేంద్రుడు, కూతురు సంఘమిత్రలు బౌద్ధాన్ని స్వీకరించి భిక్షు, భిక్షుణీలైనారు. అశోకుడు కూడ, ఉపాసకుడై ధర్మ కార్యక్రమాలను ముమ్మరం చేశాడు.

ఉపాసకుడైన సంవత్సరం తరువాత, అశోకుడు సంఘానికి మరింత దగ్గరై (సంఘే ఉపయింతే) బౌద్ధ గ్రంథాలను లోతుగా చదివి, ధమ్మచర్చల్లో పాల్గొని, వీలైనంత వరకు ధమ్మాన్ని ఆచరించటం ప్రారంభించాడు. పట్టాభిషిక్తుడైన ఎనిమిదేళ్ళకు (క్రీ.పూ. 257లో) కళింగపై విద్యుక్త ధర్మంగా యుద్ధం చేసినా అందులో జరిగినది అపార ప్రాణ నష్టానికి, బంధువుల ఆక్రందనలకు అశోకుడు చలించి పోయాడు. ఆయుధాల సాయంతో యుద్ధాల్లో గెలవటం అమానుష మనుకొని, అలాంటి యుద్ధాల ద్వారా లభించే విజయం అక్కరలేదనుకొంటాడు. దానికి బదులుగా నైతిక విలువలు, సత్ప్రవర్తనల

డా. ఈమని శివనాగిరెడ్డి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, హైద్రాబాద్‌లో సీనియర్ ఫాకల్టీ

యర్రగుడి మురళీమోహనరాజు, మధురైకామరాజ్ యూనివర్సిటీలో టూరిజం స్టడీస్ రిసర్చ్ స్కాలర్.

వల్ల కలిగే ప్రయోజనాలను ప్రచారం చేయటం ద్వారా పొందే ధమ్మ విజయాన్ని కాంక్షించి, చివరిదాకా అదే విధానాన్ని కొనసాగించాడు.

ఆ తరవాత సంవత్సరంలో, సమయానికి సరైన సదుపాయం అందక కుంతీ పుత్రుడనే బౌద్ధ భిక్షువు మరణించాడన్న సంగతి అశోకుని మరింత బాధకు గురిజేసింది. సమాజానికి దారి చూపిస్తున్న సంఘానికి అప్పటి నుంచి వస్తు రూపేణా, ధన రూపేణా విశేషంగా దానాలను చేశాడు. ఒక సంప్రదాయం ప్రకారము ఒక్కో ఆరామానికి, ప్రతి రోజూ పదివేల నాణేలను విరాళంగా పంపే వాడని, అవసరాలకు మించి వచ్చి పడుతున్న ధన సహాయం పట్ల ఆకర్షితులై, సుఖ సంతోషాలు, విలాసవంతమైన సౌకర్యాలు ఊరికనే దొరుకుతాయని దొంగ భిక్షువులు (బౌద్ధంపై విశ్వాసం లేని సుఖ లాలసులైన వారు) సంఘంలో ప్రవేశించటం వల్ల క్రమశిక్షణకు మారు పేరైన బౌద్ధ సంఘంలో అపశ్రుతులు దొర్లాయి. దీనికి మనస్తాపం చెందిన మొగ్గలీపుత్త తిస్సథేరుడు, ఆరామాన్ని వదిలి, అహోగంగకు వెళ్ళాడు.

పట్టాభిషిక్తుడైన పదేళ్ళకు క్రీ.పూ. 255లో, అశోకుడు ఆచరణ యోగ్యమైన నైతిక ధర్మవర్తనను ప్రాపకం చేయటానికి పూనుకొని సత్య బోధకుడైనాడు. ఇరుగు పొరుగు దేశాలకు సైతం వైద్య సదుపాయాలను అందించే ఏర్పాట్లు చేశాడు. విలాసవంతమైన విహార యాత్రలకు బదులు నియమ బద్ధమైన ధర్మ యాత్రలను ప్రవేశపెట్టాడు. ధర్మయాత్రలో భాగంగా సిద్ధార్థుడు సంయక్సంబుద్ధుడైన బోధ యగలో నున్న (సం) బోధివృక్షాన్ని సందర్శించి సిద్ధార్థ గౌతమునికి వందనాలర్పించాడు.

ధమ్మ వ్యాప్తికి ముమ్మర చర్యలు చేపట్టిన ఒక సంవత్సరానికి అంటే క్రీ.పూ. 255 - 54లో అశోకుడు ధర్మయాత్రలో నుండగానే, ధమ్మం కేవలం సంఘంలోని ఉన్నత వర్గానికే చెందుతోందన్న వాదనను కాదని, బౌద్ధ మెరుగక విశ్వవ్యాప్తంగా ఆచరణయోగ్యమైనదే ధమ్మమని శాసనం వేయించాడు. అంతేకాకుండా, ధమ్మాన్ని ప్రజలకు చేరువగా తీసుకెళ్ళటానికి తాను ఏ విధంగా బండల, శిలా స్తంభాలపైన చెక్కించిందీ, రాజోద్యోగులుగా తమ తమ విధులతో పాటు ధమ్మ వ్యాప్తిలో ఎలా పాల్గొనవచ్చో తెలియజేశాడు. బౌద్ధ భిక్షువులు, ఉపాసకులు ఏడు పాళీ గ్రంథాలను అధ్యయనం చేసి, ధమ్మ దీక్షా బద్ధులై మెలగాలని కూడా పేర్కొన్నాడు. తన సామ్రాజ్య వాయువ్య సరిహద్దులో నున్న యవకుల కోసం రెండు భాషల్లో వేసిన శాసనంలో రాజుగా ధమ్మ వ్యాప్తికి, నైతిక వర్తన పెంపుదలకు చేస్తున్న కృషికి ప్రజల ఆమోదం కావాలనుకొన్నాడు. దూర ప్రాంతాల్లోనున్న పొరుగు దేశాలకు అందుకోసం దూతలను కూడా పంపాడు.

పట్టాభిషిక్తుడైన 12 ఏళ్ళకు (క్రీ.పూ. 253) ఖలతిక (బరాబర్) కొండల్లో తొలపించిన రెండు గుహలను అజీవక మునుల కోసం దానం చేశాడు.

ధమ్మాన్ని ప్రజలకు మరింత సులువుగా వివరించి చెప్పేందుకు 'ధమ్మలిపి' అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టి తన రాజ్యంలోని ప్రధాన రహదారులు, పట్టణాలు, కూడళ్ళ వద్ద ధమ్మ లిపుల ద్వారా ప్రజలను ధమ్మం వైపు మళ్లింప జేశాడు. ఈ పరంపరలోని మొదటి ధమ్మ లిపిలో క్రతు, కాంతడల కోసం జంతు బలులు నిషేధం, సమాజమని పిలువబడే మత పరమైన కలయికల నిషేధం, బ్రాహ్మణులు, శ్రమణులను గౌరవించి, వారి అడుగుజాడల్లో నడవాలన్న నిబంధన విధింపు, రాజుక, ప్రాదేశికులనే, ఉద్యోగులు కనీసం ఐదేళ్ళ కోసారి దేశ సంచారం చేసి ధమ్మాన్ని బోధించాలన్న ఆదేశం,

అంతఃపుర వంట శాలలో మాంసాహారం కోసం వధించే జంతువులను బాగా తగ్గించిన విషయం, వాయువ్య దక్షిణ సరిహద్దుల్లో నున్న పొరుగు రాజ్యాల్లో సైతం జంతు జాలానికి, మానవులకు కల్పించిన సదుపాయాలను గురించి, యుద్ధ భేరీల మోతలకు బదులు ధమ్మ ఘోషలను వినిపించటం, ధమ్మ సందేశ విధానంలో చేపట్టాల్సిన చురుకైన, మెరుగైన పద్ధతుల నవలంబించటం లాంటి విషయాలను పేర్కొన్నాడు.

పట్టాభిషిక్తుడైన 13 ఏళ్ళకు (క్రీ.పూ. 252) ధర్మ మహా మాత్రులనే రాజ్యోద్యోగులను కొత్తగా నియమించాడు. తరువాత సంవత్సరంలో, మొదటి సారిగా, పంచ వార్షికోత్సవాలను జరిపిన సందర్భంగా కోనాగమన బుద్ధిని కోసం ఇంతకు ముందు నిర్మించిన స్థూపం శిథిలమై పోగా, దాని మరమ్మత్తులు చేపట్టి మునుపటికంటే రెట్టింపు పరిమాణంలో నిర్మించాడు.

క్రీ.పూ. 249-48 మధ్య, సంఘంలో లుకలుకలు బయలుదేరిన సందర్భంగా సరిచేయటానికి ఒక మంత్రిని పురమాయించి, పాటలీపుత్రంలోని కుక్కుటారామంలో ఉపోసథోత్సవాన్ని నిర్వహింపజేశాడు. కోపిష్టి అయిన ఆ మంత్రి, తన మాటలను పెడ చెవిన పెట్టిన భిక్షువులను హతమార్చటం గమనార్హం. భిక్షువులను చంపిన సంగతి తెలుసుకొని ఖిన్నుడైన అశోకుడు కుక్కుటారామ సంఘంలో సయోధ్యను తీసుకు రావటానికి చేసిన ప్రయత్నాల్లో భాగంగా, విసుగు చెంది అహోగంగకు వెళ్ళిన ప్రముఖ బౌద్ధాచార్యుడైన మొగ్గలి పుత్త తిస్సను పిలిపిస్తాడు. తిస్సతో వారం రోజులు గడిపి, బౌద్ధ ధర్మాన్ని లోతుగా అధ్యయనం చేసి, సంఘంలోని అవకతవకలను సరిదిద్దమని కోరుకొంటాడు.

సంఘంలో చీలిక నివారించటం కోసం ఒక ప్రత్యేక శాసనాన్ని విడుదల చేస్తాడు. సంఘ భౌద్ధ నివారణకు 'కథావత్తు'ను ప్రవచించి, బుద్ధ శాసనాన్ని, వినయాన్ని వల్లె వేయిస్తాడు. ఇదే మూడో బౌద్ధ సంగీతిగా రూపుదిద్దుకొంది. తన సామ్రాజ్య సరిహద్దుల్లోను, వెలుపలా ఉన్న రాజ్యాల్లో బౌద్ధ ధమ్మాన్ని వ్యాపింపజేయటానికి తొమ్మిది మంది బౌద్ధా చార్యులను మొగ్గలీపుత్త తిస్స పంపుతాడు. అశోకుడు రెండో ధమ్మ లిపిని ఆవిష్కరించి, కొత్తగా 'ధర్మ మహామాత్ర'లను ఉద్యోగులను నియమించి, పరిపాలనలో వారివల్ల ఒనగూరే మేలుగురించి వివరిస్తాడు.

పట్టాభిషిక్తుడైన పది హేడేళ్ళ తరువాత క్రీ.పూ. 247లో శ్రీలంక రాజైన దేవానాం పియతిస్స పంపిన నలుగురు సభ్యుల బృందాన్ని, ఆయన పంపిన కానుకలను స్వీకరించిన అశోకుడు, అందుకు బదులుగా దేహనాం పియ తిస్స రెండోసారి పట్టాభిషేకం జరిపించుకోవటానికి కావలసిన వస్తు సామాగ్రిని పంపి, బౌద్ధ ధమ్మ వ్యాప్తి పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని గూడా తెలియజేస్తాడు.

క్రీ.పూ. 247-46లో అశోకుడు తన కొడుకైన మహేంద్ర థేరునితో పాటు బౌద్ధ భిక్షువుల బృందాన్ని శ్రీలంకకు పంపగా, మహేంద్రుడు దేవానాం పియ తిస్సను, ఇంకొందరు లంక ప్రముఖులను బౌద్ధోపాసకులుగా దీక్ష నిస్తాడు. లంకలో బౌద్ధ ధమ్మ వ్యాప్తికి అవసరమైన వన్నీ మహేంద్రుడు సమకూరుస్తాడు. ఆరాధన కోసం బుద్ధుని ధాతువులను అశోకుడు లంకకు పంపగా, అనూరాధ పురంలోని థూపారామంలోని మహాస్థూపంలోని వాటిని నిక్షిప్తం చేస్తారు.

మహేంద్ర థేరుని కోరిక మేరకు, అశోకుడు క్రీ.పూ. 246లో సంఘమిత్ర థేరి నాయకత్వంలో ఒక భిక్షుణీ సంఘాన్ని, వారితో పాటు, అనూరాధ పురంలో నాటటానికి బోధి మొక్కను పంపాడు. రాజోద్యోగుల విధులను నిర్వర్తించేపుడు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని పరిపాలనా పరమైన సమాచారాన్ని

ఎప్పటికపుడు రాజధాని చేరే ఏర్పాట్లను చేశాడు. క్రీ.పూ. 245లో ఖలతిక కొండల్లో తొలచిన మరో గుహను అజీవకులకు దానంగా ఇచ్చాడు.

పట్టాభిషిక్తుడైన ఇరవై ఏళ్ళు పూర్తయిన సందర్భంగా క్రీ.పూ. 244లో ఐదేళ్ళకో మారు నిర్వహించే పంచవార్షికోత్సవాలను రెండో సారి జరిపించాడు. బౌద్ధ పుణ్యక్షేత్రాలను చూడటానికి చేపట్టిన ధర్మ యాత్రలో భాగంగా, సిద్ధార్థుడు జన్మించిన లుంబినీ వనాన్ని దర్శించి, అక్కడ శాసన స్తంభాన్ని వేయించాడు. ఇదే సంవత్సరంలో నాలుగో ధమ్మ లిపి సంక్షిప్త శాసనాన్ని కళింగ దేశంలో చెక్కించాడు. అశోకుని పరమత సహనాన్ని తెలియజేసే ఈ శాసనంలో అర్థం లేని క్రతువులను వదిలేసి, నైతిక వర్తనవలవరచుకోవడం, రాజులైన వారు ధర్మ యాత్రలను చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పటం, రాజూ పేదా తేడా లేకుండా ధర్మాన్ని ఆచరించమని కోరుకోవటం, ధర్మ విజయ ప్రాశస్త్యాన్ని పేర్కొనటం లాంటి ముఖ్య విషయాలున్నాయి.

క్రీ.పూ. 245-240 ల మధ్య, తాను స్వాధీనంలోకి రాని సరిహద్దు ప్రాంతాల ప్రజలకు సంబంధించిన విధానాన్ని దానికి తగ్గట్టుగా ప్రభుత్వోద్యోగులు మెలగాల్సిన తీరును, న్యాయాధికారులు నిష్పక్ష పాతంగా వ్యవహరించాలన్న ఆదేశాలను రెండు లిపుల ద్వారా ప్రకటించాడు.

పట్టాభిషక్తుడైన 26వ ఏట (క్రీ.పూ. 239), మూడో పంచవార్షికోత్సవాన్ని నిర్వహించి, మూడు (ఐదు, ఆరు, ఏడు) ధర్మ లిపులను ఆవిష్కరించాడు. ఐదో ధమ్మలిపుల్లో ధమ్మం పట్ల తన ప్రగాఢ విశ్వాసం, పాలన, చట్టం, సంక్షేమం, సంరక్షణల్లో ధమ్మం ఎలా చొచ్చుకు పోవాలో వివరిస్తూ నైతిక పరంగా ధర్మాన్ని నిర్వచించాడు. ఆరో ధమ్మ లిపిలో బహుమతి - శిక్షల విచక్షణాధికారాలను రాజులకు కట్టబెట్టి ఈ విషయంలో సత్వర చర్యల నిమిత్తమై వారికి స్వేచ్ఛను ప్రసాదించాడు. న్యాయపాలనలో నిష్పాక్షికత ప్రాముఖ్యాన్ని వివరించటమే కాక, పెద్ద పెద్ద శిక్షల సందర్భంగా, వాటిని అమలు చేసే ముందు నిందితుల బంధువులపై అధికారాలకు అప్పీలు చేసుకోవటానికీ, అవకాశం కల్పించేందుకు మూడు రోజుల సమయాన్ని కేటాయించాలని పేర్కొన్నాడు. ఏడో ధమ్మలిపిలో జంతువుల బాగోగులను పట్టించుకుకొనేందుకు ఒక సంరక్షణాలయాన్ని ఏర్పాటు చేసి, జంతు గణన చేపట్టి, జంతు సంరక్షణ కోసం విధించిన ఆంక్షలను పేర్కొన్నాడు. అంతేకాక తాను సింహాసన్నాధిష్టించి 26 ఏళ్లైనా సందర్భంగా ఖైదీలకు కొన్ని ప్రయోజనాలను ప్రకటించాడు.

పట్టాభిషిక్తుడైన 27 ఏళ్లకు (క్రీ.పూ. 238) మూడో పంచవార్షికోత్సవాన్ని, ధమ్మ ప్రచారానికి పూనుకొని పదిహేనేళ్లైన సందర్భంగా, ఎనిమిదో ధమ్మ లిపిని ఆవిష్కరించాడు. క్రీ.పూ. 236లో ప్రధాన పట్టపురాణి అసంధిమిత్తా చనిపోవటం, రాజ ప్రాసాదంలో క్రమశిక్షణ లోపించటం, అధికారం కోసం పాకులాట ఇతర రాజుల మధ్య పొసగకపోవటం లాంటి విషయాలు చోటు చేసుకొన్నాయి. కొద్ది కాలం తర్వాత, (క్రీ.పూ. 239)లో తిష్య రక్షిత పట్టమనిషిగా నియామకమైంది. క్రీ.పూ. 233-30ల మధ్య మూడో ఐదో పంచ వార్షికోత్సవం, కారువాకి అనే రాణి కోసం ఒక శాసనాన్ని వేయటం జరిగింది. క్రీ.పూ. 230-228ల మధ్య కాలంలో తక్షశిల ప్రాంతంలో తిరుగుబాటు చెలరేగగా, అణచటానికి కుణాళుని పంపిస్తాడు. కుణాళుని కళ్ళు పెరికించిన తిష్య రక్షితకు మరణం దండన విధిస్తాడు. క్రీ.పూ. 228లో బోధివృక్ష నిర్మూలన జరిగిన నాలుగేళ్లకు సువిశాల సామ్రాజ్యాన్ని పాలించిన అశోక ధర్మరాజు మరణించాడు. ధమ్మ ఘోష మూగవోయింది. బోధివృక్షం మోడువారింది. ఆరామాలు విరామాన్ని చవిచూశాయి.

# మానవజన్మ - పవిత్రత

- కంజుల సత్యనారాయణ రెడ్డి

భిక్షులారా బౌద్ధ తత్త్వమునకు కర్మ సిద్ధాంతం మూల స్తంభంగానున్నది. బౌద్ధునకు విశ్వమంతయు కర్మ సిద్ధాంతముపై ఆధారపడి, కార్యా కారణ సంబంధము గల గొప్ప సూత్రంగా కనిపిస్తుంది. చెడు చేసినచో మానవుడు ఇప్పుడో మరి ఒకసారో దాని చెడు ఫలము మనం అనుభవించవలసివస్తుంది.

మానవుడు మంచిని కోరే వాడై ఉండి, మంచి పనులే చేయవలసి ఉంటుంది. చెడ్డ భావనలకు మనస్సుకలో తావు ఇవ్వకూడదు. అంతమాత్రమున కర్మ మానవుని అదృష్ట భాగ్యమని, భగవింతుడే మన భాగ్యమునకు కారకుడని మనం భావించరాదు.

జరిగిందేదో జరిగిపోయింది. దాన్ని గురించి విచారిస్తే లాభంలేదు. ఇకనైనా మనం మంచి పనులు చేసి భవిష్యత్తును చక్కదిద్దుకొందాం అని భావించి మనం మంచి పనులు చేయటానికి పూనుకోవాలి.

పునర్జన్మ మానవునకు ఈ కర్మ ఫలంగానే కలుగుతుంది. ఈ కర్మ సిద్ధాంతము దానికి తోడైన పునర్జన్మ సిద్ధాంతము లేనిదే విలువలేదు.

మానవునకు మరణం అనేది ఈ జన్మకు పునర్జన్మకూ మధ్యనున్న విశ్రాంతిలాంటిది. రెండు జన్మములకు మధ్య మనం నిద్ర అనే విశ్రాంతి పొందుతున్నాం. దైనందిన జీవితంలో ప్రొద్దునే లేచి-క్రిందటి రోజు మాదిరిగానే దినకృత్యములన్నీ మనం నెరవేర్చుకొంటున్నాం. అట్లే కొంచెం హెచ్చు తగ్గులతో పునర్జన్మలో గూడా క్రిందటి జన్మలోని అనుభవములు, సంస్కారములు అన్నీ కట్టగట్టుకొని మానవుని మనః ఫలకంపై మనకు కనిపించని వ్రాతలో వ్రాయబడి ఉంటాయి. దాన్నే మనం "తలరాత" అంటున్నాం. ఆ అనుభవముల ప్రభావము ఈ జన్మలో జీవుడి మీద తలపడుతుంది. ప్రతి జన్మయందు మేదస్సు కొత్తగా సృష్టింపబడుటచేత, మానవునకు పూర్వజన్మ స్మృతులు మనకు కలగటంలేదు. సంఘములోని హెచ్చు తగ్గులను ఈ పునర్జన్మ సిద్ధాంతము వివరించినంత సక్రమంగా మరేదియు వివరించదు. తథాగతుడు తన పూర్వజన్మలను గురించి చెప్పిన జాతక కథలు చూస్తే.. ఆయనకు పునర్జన్మ సిద్ధాంతముపై ఎంతటి విశ్వాసము ఉన్నదో మనకు బోధ పడుతుంది.

ఒకసారి కాశి యందలి ఒక బ్రాహ్మణ రైతు తన పొలము దున్నిన తర్వాత ఎద్దులను విడిచిపెట్టి వేరొక పని చేయుచుండెను. ఆ ఎద్దులు మెల్లగా తప్పించుకొని అడవి లోనికి పోయినవి. ఆ బ్రాహ్మణుడు ఎద్దుల కోసం వెదుకుతూ అడవి లోనికిపోయి దారితప్పాడు. చాలా రోజులు ఆహారము లేక అడవిలోనే తిరుగ సాగాడు. ఒకరోజు ఒక ఫల వృక్షాన్ని చూచి దాని పండు అందుకొనబోయి జారి ప్రక్కనే ఉన్న గోతిలో పడిపోయాడు. అప్పుడు అక్కడ కోతిగా జన్మించి ఉన్న బోధిసత్త్వుడు ఆ బ్రాహ్మణుణ్ణి రక్షించాడు. తర్వాత ఆ కోతి నిద్రపోతుండగా ఆ బ్రాహ్మణుడు కృతఘ్నుడై పెద్ద రాతితో ఆ కోతి తల పగులగొట్టాలనుకొన్నాడు. కాని మహాత్ముడైన బోధిసత్త్వునకు ఆ విషయం తెలిసి, లేచి ఒక చెట్టుపైకి లంఘించి తనను తాను రక్షించుకొన్నాడు. అయినను ఆ బ్రాహ్మణునిపై ద్వేషం లేక అడవి నుండి బయటకు పోయే మార్గమును చూపాడు. బ్రాహ్మణుడు బోధిసత్త్వునకు చేయతలపెట్టిన ద్రోహము వల్ల కుష్ఠు వ్యాధిగ్రస్తుడయ్యాడు. ఈ కథ మహాకపి జాతకంలో చెప్పబడింది. దీనిని బట్టి జీవుడికి జన్మలున్నాయని, కర్మఫలితాన్ని జీవుడు అనుభవించక తప్పదని మనకు తెలుస్తుంది.

జీవుడు జ్ఞానము కలిగి యోగసాధన చేసిపుడు జన్మరహితమైన మోక్షస్థానాన్ని చేరుకుంటాడు. ధానధర్మములు, పరోపకారము చేసిన మానవుడు బీదవాడైనను మరుజన్మలో శ్రీమంతుడై పుడతాడు. శ్రీమంతుడు పరోపకారము మొదలగు దివ్య గుణములు కలిగి ఉండకపోతే మరు జన్మలో

కంజుల సత్యనారాయణ రెడ్డి ప్రిన్సిపల్, శ్రీ గొర్ల హనిమిరెడ్డి మరియు చినమల్లారెడ్డి జూనియర్ కళాశాల, గుంటూరు

బీదవాడవుతాడు. కావున ఉన్న దానితోనే దానధర్మాలు, పరోపకారం చెయ్యాలి. ఒక కాలులేని భిక్షగాడు బిచ్చమెత్తుకొంటూ ఉండేవాడు. దారినపోయే ఒక జ్ఞానిని చూపి అతడు స్వామీ దేవుడు నాకు కాలు లేకుండా చేశాడు, అని విలపించాడు. అది కాంచి ఆ జ్ఞాని ఇట్లు పలికాడు. పిచ్చివాడా దేవుడు కాదు నీవే చేసుకున్నావు. నీవు పూర్వ జన్మలో చాలా బలవంతుడవు. నీకు డబ్బిచ్చి ఎవరిని కొట్టమని చెప్పినా వారిని కొట్టి వస్తుండే వాడివి. డబ్బుకోసం నీవు ఒకడికాలు నరికావు తత్ ఫలితముగా ఈ జన్మయందు నీ కాలును నీ పాపం ఖండించింది.

మానవుడు తాను చేసిన పాపములను మరుజన్మలో అనుభవిస్తాడు. ఒక స్త్రీ దుఃఖపడుచు ఒక జ్ఞాని వద్దకు వచ్చి స్వామి నా భర్త నాకు అన్యాయం చేశాడు. నన్ను కొట్టి ఇంటి నుండి తరిమివేశాడు. అని చెప్పుకుంది. అందుకా జ్ఞాని అమ్మాయీ, ఇది నీవు చేసుకున్న కర్మయే నీవు పూర్వజన్మలో కొడుకూ కోడలు అన్యోన్యతను సహించక, అత్తరికం చెలాయిస్తూ నీ కోడల్ని అనేక విధముల కష్టములు పెట్టి వాళ్ళ అన్యోన్యతకు భంగం కలిగించి నీకోడల్ని తరిమి వేశావు. అందువలననే నీకిప్పుడు ఈ వియోగము కలిగింది అని చెప్పాడు. మనము చేసెడి ప్రతికర్మకు ఫలితాన్ని అనుభవించక తప్పదు.

దానము ధర్మము పరోపకారము, చేస్తూ పాపకార్యాలు చేయకుండా ఉంటే వాళ్ళు శ్రీమంతులుగా, ఆరోగ్యవంతులుగా పుడతారు. దానము ధర్మము చేసి పాపపు పనులు చేయువారు శ్రీమంతులుగాను, వ్యాధిగ్రస్తులు గాను పుడతారు. దానము ధర్మము చేయకుండా పాపపుపనులు చేయకుండా ఉండే వారు కర్మఫలాభిలాషులైన కూలివారుగా జన్మిస్తారు. ఆత్మగౌరవము కల బీదవారుగా పుడతారు. అచ్చంగా పాపకార్యాలు చేసేవారు, మరుజన్మలో వ్యాధిగ్రస్తులుగా జన్మిస్తారు. మానవుడు సాటి మానవుడ్ని ప్రేమించాలి, ఆదరించాలి. జీవితమును గడుపుటకు ఎవ్వరికి ఏవిధమైన అపకారము చేయరాదు. సాధ్యమైనంత ఉపకారము చేయాలి. తేనెటీగ పుష్పము నుండి మకరందాన్ని తీసుకునేటప్పుడు ఆ పుష్పానికి గాని, వృక్షమునకుగానీ ఎట్టి అపకారము చేయక పుప్పొడి నిగ్రహించి, చెట్టు మరలా జీవించి పుష్పించటానికి మరియొక పుష్పము మీద వాలి ఫలదీకరణకు తోడ్పడుతుంది. మానవ జీవితము కూడ ఇట్లా ఉండాలి. యోగుల సంఘము మనలను ఆత్మా సాక్షాత్కార మార్గములో ప్రవేశపెడుతుంది. చెడు స్నేహము మనలను పాపాబారులుగా చేస్తుంది. మనము చేసెడి వృత్తి పరోపకారము కలదిగా ధర్మయుక్తంగా ఉండాలి. ఆహారము మితంగా, హితంగా, పోషక విలువలతో కూడి ఉండాలి. ఆహారము స్థూల శరీరమునకు శక్తినిస్తుంది. ధ్యానము మనస్సుకు ఆహారము అవుతుంది. అందువలన వ్యాయామము, ప్రాణాయామము, ధ్యానమును మానవుడు తప్పక చేస్తుండాలి. మానవుడు తన ప్రవర్తనయందు పంచశీలములు (5 సూత్రములు) అనగా అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, వ్యసనత్యాజము, తప్పక అనుసరించాలి. మానవుడు దుఃఖములు లేకుండా జీవించాలంటే కొన్ని ధర్మాల్ని ఆచరించవలసి ఉంటుంది. తీసుకొనే ఆహారాన్ని, సమతుల్యంగా పోషక పదార్థములతో ధర్మ సంపాదనతో సముపార్జించి తీసుకోవాలి. పరిశుభ్రమైన భట్టలు ధరించాలి తనకు కలిగిన దాంతో తృప్తిగా సంతోషంగా ఉండాలి. పంచశీలను పాటించిన వాడు నిర్వాణ మార్గంలో ఉంటాడు. తరవాత రాగ, ద్వేష మోహాలను వీడి లోక త్రిలక్షణ భ్రమ నుంచి బయట పడిన వానికి స్వేచ్ఛ లభిస్తుంది. ప్రపంచం నిత్యమని, ఆత్మమయమని, సుఖమయమని, భావించడమే భ్రమ. ఎందుకంటె ఈ ప్రపంచం శాశ్వతం కాదు, ఈ ప్రపంచంలో ఆత్మలేదు, ఈ ప్రపంచం సుఖకరం కాదు. శాశ్వతం కాని దానిని శాశ్వతమని, లేని ఆత్మను ఉన్నదని భావించడం, దుఃఖమయమైన ప్రపంచాన్ని సుఖకరమని ఎంచడం - ఈ మూడూ భ్రమలే. భ్రమ నుంచి బయట పడడమే స్వేచ్ఛ, అదే నిర్వాణం.

# వజ్రయాన దేవతలు - మంత్రాలు

- ఘండికోట బ్రహ్మాజీరావు

వంగదేశంలో బర్ద్వాన్ జిల్లాలో దీనినే బరమాన్ జిల్లా అని కూడా అంటారు. ఒక గ్రామంలో 1897 సంవత్సరం, జనవరి 6వ తారీకున చినయతోష్ భట్టాచార్య జన్మించారు. వీరి జనకులు మహామహోపాధ్యాయ హరిప్రసాద్ శాస్త్రి, హేమంతకుమారీదేవి వీరి జనని. వీరు స్కాటిష్ చర్చి కాలేజీ, కలకత్తాలో బి.ఏ. పాసయ్యారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి 1919లో ఎమ్.ఏ పాసయి బంగారు పతకం పొందారు. వీరు 1925లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టం పొందారు. ఆయన బరోడా సంస్కృత కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. చాల సంస్కృత గ్రంథాలను ప్రచురించారు. ఇండాలజీ మీద 200 వరకు వ్యాసాలు వ్రాశారు. చాలా సంస్థలకు వీరు జీవిత పర్యంతం సభ్యులుగా ఉన్నారు. 'రాజ రత్న' బిరుదును, బంగారు పతకాన్ని, 'జ్ఞానజ్యోతి' బిరుదును, రజత పతకాన్ని అందుకున్నారు. బౌద్ధమతంలో దేవతా విగ్రహాల గురించి, బౌద్ధుల రహస్య పూజా విధానం గురించి వీరు గ్రంథాలు రచించారు. 'సాధనమాల' సిరీస్‌లో తాంత్రిక దేవతల ఆరాధన గురించి పుస్తకాలు ప్రచురించారు.

ప్రకృతిలో గల శక్తులతో మానవ జాతికి సహాయం చేయాలని వీరు సంకల్పించారు. రత్నాల లోను, అయస్కాంత పదార్థాల లోను గల రోగ నివారక శక్తిపై వీరు చాలా పరిశోధనలు జరిపారు. కాస్మిక్ కిరణాల వైద్యం, రత్న వైద్యం, అయస్కాంత సహాయంతో భూగర్భ జలాలను కనుగొనడం వీరికి బాగా తెలుసు. బరోడా నుండి 1952లో వారు రిటైరయి, శేష జీవితం నైహాటీలో స్వగృహంలో ఉంటూ, మానవ సేవ చేస్తూ కాలం గడిపారు.

వీరు మంత్రాలపై చాలా పరిశోధనలు జరిపారు.

ఈ మంత్రాలు వైదిక మంత్రాలు కావు.

వేద సమ్మతములు కానట్టి మంత్రాలు, తంత్రాలకు సంబంధించినవి.

ఒక పద్ధతిలో సూత్రీకరించిన అక్షరాలు, మాటలు, వాక్యాలు - అర్థం కలిగినా, అర్థం లేకపోయినా - అవి నిజానికి శూన్యానికి సంబంధించినవి. అవి శూన్యం యొక్క సంక్షిప్త రూపాలు. ఇవి అధిక స్థితిలో ఉన్న కాస్మిక్ శక్తితో పులకించినవి. ఈ అక్షరాలు, ఈ మాటలు, ఈ వాక్యాలు - వీటన్నిటికి ఒక నియమితమైన కంపనశక్తి ఉంది. ఈ ప్రకంపనాలను మంచికి గాని, చెడుకుగాని ఉపయోగించవచ్చు.

కంటికగుపించే ప్రపంచంలో మనం అందరం ఉన్నట్లు, అదృశ్యమైన లోకంలో దేవతలుంటారు. ఈ దేవతలందరూ శూన్యానికి సంబంధించిన వారే. ప్రతి దేవతకు ఒక ప్రకంపన సంఖ్య ఉంటుంది.

దేవతను ఉద్దేశించి చదివే మంత్రం యొక్క ప్రకంపనలు, ఆ మంత్రం యొక్క అధిష్ఠాన దేవత యొక్క ప్రకంపనలతో సమానంగా ఉన్నప్పుడు మంత్రాలలోని బీజాక్షరాలు దేవతను ఆకర్షించి మనో నేత్రానికి కనిపించునట్లు చేస్తాయి. సాధనలో చివరి దశకు చేరుకున్నప్పుడు, దేవత మామూలుగా దర్శనమిస్తుంది. దీనినే దేవతా దర్శనమంటారు. అపుడు దేవతకు సాధకునికి భేదముండదు. ఇద్దరూ ఒకటిగానే భావింపబడతారు. తాను ప్రార్థించిన దేవతకున్న అద్భుత శక్తులన్నీ సాధకునికి లభిస్తాయి. మంత్రంలో గల అక్షరాలపై మనసు నిలిపి విడువకుండా మంత్రాన్ని జపిస్తూ ఉంటే మంత్రం చాల శక్తివంతమవుతుంది. మంత్రాన్ని తిరిగి తిరిగి చదువుతుంటే, అది ప్రకంపనలను విడిచి పెడుతుంది.

---

ఘండికోట బ్రహ్మాజీరావు, ఇండియన్ రైల్వేలో మెకానికల్, ఇంజనీర్‌గా పదవీ విరమణ, విశాఖపట్నం.

ఈ ప్రకంపనలు దేవతకు చేరుతాయి. అవి చాలా శక్తివంతమైనపుడు, దేవతను సాధకుడివేపు ఆకర్షిస్తాయి. కాస్మిక్ జగత్తులో నామానికి రూపానికి భేదం లేదు. నామం ఎప్పుడు స్మరించినా అది రూపానికి తగులుతుంది. దేవత పేరు గల మంత్రాలను ఉచ్చరిస్తే, అదృశ్య లోకంలో గల దేవతను అవి చేరుతాయి. మంత్రాన్ని మాటి మాటికి ఉచ్చరించడం వలన దేవత ఆకర్షింపబడి సాధనకునికి ప్రత్యక్షమవుతుంది.

ఈ సందర్భంలో భట్టచార్యగారు తమ అనుభవాన్ని ఉదహరించారు.

ఆయన తంత్రాల గురించి తీవ్రమైన పరిశోధన చేయకముందు, కొన్ని మంత్రాలు ఎంత సార్థకమైనవో తెలుసుకోదలచారు.

ముందుగా ఆయన తారా మంత్రం యొక్క శక్తిని తెలుసుకోడానికి ప్రయత్నించారు. మంత్రం జపిస్తే విజయం తప్పకుండా లభిస్తుంది.

మంత్రం ఈ విధంగా ఉంటుంది.

**'ఓం తారే తుత్తారే స్వాహా'**

ప్రతి రాత్రి ఆయన మనసును కేంద్రీకరించి, చాల భక్తితో, మంత్రానికి తిరిగి తిరిగి పఠించేవారు. ఏదేనా నూతనమైనట్టి అనుభవం కలుగుతుందో తెలుసుకోదలచారు. ఒక పదిహేను రోజులు, తీరిక దొరికినప్పుడు, ఆయన చాల తీవ్రంగా మంత్రజపం చేశారు. మంత్ర జపం చేసినపుడు ఆయన కళ్ళు మూసుకున్నాడు. మనసు మరోవేపు తిరగకుండా, అద్భుతమైన దేవతా దర్శనం తప్పిపోకుండా, ఆయన కళ్ళు మూసుకున్నాడు. ఒక పక్షం దినాలు ఈ విధంగా గడిచిన తరువాత, ఆకస్మాత్తుగా, మూసిన ఆయన కళ్ళముందు తీక్షణమైన తెల్లటి వెలుగు, చాలా అద్భుతమైనది, మెరిసింది. ఆ కాంతిలో ఆయనకు స్పష్టంగా ఒక దేవత యొక్క రూపం కనిపించింది. ఆమె ఆకుపచ్చని మరకత కాంతిలో ఉంది. సర్వాంగ సౌష్ఠవంగా దివ్యసుందర రూపంతో ఆమె సాక్షాత్కరించింది. మాటలతో ఆమెను వర్ణించడానికి సాధ్యం కాదు. ఆ దేవత రెండు పద్మాల మీద లలితాసనంలో ఆసీనమై ఉంది. ఆమె ఎడమ చేతిలో ఏవో ఆకులు ఉన్నాయి. కుడిచేయి వరద ముద్రలో ఉంది. అరచేతిలో వజ్ర మొకటి అత్యధికమైన కాంతితో ప్రకాశిస్తూ ఉంది. ఆయన కనుల ముందు ఆ దేవత కొద్ది క్షణాలు కనిపించి, తెల్లటి కాంతిలోకి అదృశ్యమైంది. ఆయనకు మొదటి అనుభవంలో సంతృప్తి కలిగింది. అక్కడితో మంత్ర జపం ఆపివేశారు. ఆ తరువాత కూడా కష్టాలు ఎదురైనప్పుడు ఆయన మంత్రాన్ని జపిస్తారు. కాని దేవత మాత్రం కనిపించలేదు.

దేవత తార చాల దయగలది.

తరువాత ఆయన ఉగ్రదేవత యొక్క మంత్రము మొకటి జపించడానికి పూనుకున్నారు. ఆ దేవత పేరు ఉగ్రతార. ఆమె మంత్రం -

**హ్రీం త్రీం హుం ఫట్**

ఈ మంత్రాన్ని ఆయన తీరికి దొరికినప్పుడు తీవ్రంగా జపించారు. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు, ఆఫీసులో కాళీగా ఉన్నప్పుడు, ఇంటి దగ్గిర ఉదయం వేళ, సాయంకాలం, రాత్రి ఆయన ఉగ్రతార మంత్రాన్ని జపించారు. ఒకవారం రోజుల తరువాత, రాత్రి తొమ్మిది గంటల వేళ, మూసిన ఆయన కన్నుల ఎదుట వింతమైన నీలపుకాంతి కనిపించింది. అది ఆయన 'మనో - ఆకాశాన్ని' పూర్తిగా కప్పేసింది. ఆ కాంతి లోతుల నుండి భయంకరమైన దేవత, ఉగ్రతార, పైకి వచ్చింది. ఆమె గాఢమైన కాటుక రంగులో ఉంది. పొడవుగా ఉందామె, శరీరావయాలు దృఢంగా ఉన్నాయి. ఆమె

పూర్తిగా దిగంబరంగా ఉంది. భూమిపై పాదాలు మోపి ఆమె నిలిచింది. ఆమె శిరస్సు గది పైకప్పును తాకుతున్నది. ఆమె కేశాలు చెదిరిపోయాయి. ఆ జుత్తు మేఘంవలె గది పైకప్పును, నాలుగు పక్కలను కప్పి వేసింది. ఆమె ముఖం చూడడానికి చాల భయంకరంగా ఉంది. ఆమె క్రోధ తామ్రాయతాక్షి - ఆమె కోరలు పైకి వచ్చాయి. ఆమె తన చేతులతో కత్తి లేక ఖట్వాంగము (కత్తి) నెత్తుటితో నిండిన కపాలం పట్టుకుంది. ఆమె వక్షం కపాల మాలిక చేత అలంకరించబడింది. కపాలాలు ఒక దానినికొకటి కొట్టుకొని కర్కశంగా భయం గొలిపే ధ్వని వెలువడుతున్నది. ఆమెను చూడగనే ఆయన విరుచుకుపడ్డారు. ఎప్పుడు మంత్రోచ్చారణ ఆపి వేశారో ఆయనకి తెలియదు. ఆ దేవతాదర్శనం కేవలం అరనిమిషం మాత్రమే కలిగింది. కాని ఈ కొద్ది కాలం యుగాలుగా ఆయనకు అనిపించింది. మృత్యువు సమీపించిందని ఆయన భావించారు. ఎప్పుడయితే ఆయన మంత్రోచ్చాటనం ఆపివేశారో, దేవత క్రమంగా గాలిలోకి అదృశ్యమైంది. ఆయన భయ విముక్తులై దీర్ఘంగా నిశ్వసించారు. అటువంటి దేవతలను జీవితంలో మరెప్పుడూ కదపకూడదని ఆయన ఒక నిశ్చయానికి వచ్చారు.

భట్టాచార్యులు ఈ విషయాలను చాల రహస్యంగా ఉంచారు. ఎవరికి చెప్పలేదు. ఈ విలక్షణమైన అనుభవాలను గురించి ఎక్కడా పుస్తకంలోకాని, వ్యాసంలోకాని ప్రస్తావించలేదు. ఎవరయినా ఈ సాధనలను ఆచరిస్తే ఆయన అనుభవాలు వారికి సహాయ కారులౌతాయని భావించారు. భయంకరమైన స్త్రీ దేవతలను సులభంగా దర్శించవచ్చునని, దయాళువులైన పురుష దేవతలు దర్శన మివ్వడానికి చాల హెచ్చుకాలం తీసుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. అవలోకితేశ్వరుని సాక్షాత్కారం చేసుకోవడానికి ఆయన 'ఓం మణి పద్మే హం' అన్న ప్రఖ్యాత మంత్రం జపించారు. కాని, అతని ప్రయత్నాలన్నీ వమ్మయాయి.

మంత్రాలంటే బీజాక్షర సముదాయాలు - రహస్యమైన తాంత్రిక పూజా విధానాలకు వజ్రయానానికి ఇవి వెన్నెముక వంటివి. ఈ మంత్రాలు చాలా రకాలు - బీజా హృదయాలు, ఉపహృదయాలు, పూజా మంత్రాలు, అర్ఘ్య మంత్రాలు, పుష్ప మంత్రాలు, దీప మంత్రాలు, ధూప మంత్రాలు, నైవేద్య మంత్రాలు, నేత్ర మంత్రాలు, శిఖా మంత్రాలు, అస్త్ర మంత్రాలు, రక్షా మంత్రాలు - ఈ విధంగా ఎన్నో మంత్రాలు అర్థంలేని అక్షరమాలలు - ఒకప్పుడు, మనకు తెలియని భాష యొక్క ప్రభావానికి ఇవి లోనయినట్లు అనిపిస్తుంది. వేదంలో వచ్చే దేవతా స్తుతులను మంత్రాలంటారు. ఈ మంత్రాలకు అర్థమంటూ ఉంటుంది. తాంత్రిక మంత్రాలకు ఇది లేదు. వజ్రయాన తాంత్రికులు తమ మంత్రాలు బుద్ధుడి నుంచి వచ్చినవని భావిస్తారు. వజ్రయానంలో వచ్చే మంత్రాలు ధారణుల నుండి వచ్చినవి అంటారు. ధారణులు బౌద్ధ మతంలో పురాతన కాలం నుండి ఉండేవని, అంతగా బౌద్ధ మతతత్త్వం తెలియని ఉపవాసకుల కొరకు ప్రవేశపెట్టబడ్డాయని విశ్వసిస్తారు. ఈ ఉపాసకులు ఈ లోకంలో తమకున్న ఆస్తి పాస్తులమీద, ఐశ్వర్యం మీద హెచ్చు శ్రద్ధ చూపించదలచిన వాళ్లు, వాళ్లకి నిర్వాణం మీద ధ్యానం లేదు. ఇటువంటి ఉపాసకులు, బౌద్ధానికి కొత్తగా పరిచయమైన వాళ్లు, కొన్ని సూత్రాలు చదవవలసి ఉంది. వాళ్లకు సులువుగా ఉండడం కోసం ఈ సూత్రాలను సంగ్రహంగా చేసి ధారణులుగా రూపొందించారు. ఉపాసకులను ఈ ధారణులు కంఠస్థం చేయమన్నారు. ఈ విధంగా సూత్రాలు ధారణులుగా మారి, ధారణులు కుదింపబడి మంత్రాలుగా ఉద్భవించాయి.

ఈ సందర్భంలో ఒక ఉదాహరణ: మహాయాన గ్రంథమైన 'అష్ట సాహస్రిక ప్రజ్ఞా పారమిత' ఎనిమిదివేల శ్లోకాలు కలది. బాగా విద్యావంతుడైన బౌద్ధుడు కూడా దీనిని చదివి అర్థం చేసుకోవడం కష్టం - అటువంటిది అల్ప విద్యావంతులు చదివి అర్థం చేసుకోలేరు. దీనిని నూరు శ్లోకాలు గల 'ప్రజ్ఞాపారమిత' గ్రంథంగా తీర్చారు. ఈ శ్లోకాలను ఇంకా తగ్గించి, కొద్ది శ్లోకాలతో 'ప్రజ్ఞా పారమిత

హృదయ సూత్ర' గ్రంథంగా రూపొందించారు. ఈ శ్లోకాలను ఇంకా కుదించి 'ప్రజ్ఞా పారమితా ధారణి'గా తీర్చారు. ఈ ఆవిర్భావ శృంఖలలో తరువాత చేసినది 'ప్రజ్ఞాపారమితా మంత్రము.' ఈ మంత్రానికి బీజాక్షరం 'ప్రం.' దీనిని బట్టి శూన్యం ప్రజ్ఞాపారమిత దేవతగా రూపాంతరాన్ని పొందుతుంది. ఈ విధంగా తాంత్రిక మంత్రం వివిధ దశలలో రూపాన్ని ధరిస్తుంది. ఇవన్నీ బౌద్ధంలోని తాంత్రిక మంత్రాలు. మనం హిందూ తంత్రాల వేపు దృష్టి మరలిస్తే, బౌద్ధ తాంత్రిక మంత్రాలు వాటిలో చోటు చేసుకున్నట్లు స్పష్టమవుతుంది. హిందూ తంత్రాలు వజ్రయానం తరువాత వచ్చాయి. బౌద్ధ తంత్రాలలోని కొన్ని మంత్రాలు యథాతథంగా వీటిలో ఉపయోగించబడ్డాయి.

బౌద్ధంలోని తంత్రాలు తొలిదశలో సంగీతులుగా ప్రవేశపెట్టబడ్డాయి. వీటిలో బుద్ధుడు ఒక విశ్వాసుల సమావేశంలో ఉన్నట్లు, అక్కడ అతడు తంత్రాలను సమర్పించినట్లు చెప్తారు. తంత్రాలనే కాక మంత్రాలను, రహస్య పూజా విధానాలను కూడా తెలియజేశాడు. అంతకు పూర్వం ఈ తంత్రాల గురించి ఎందుకు తన వారికి తెలియజేయలేదో వివరించాడు. ప్రజలు కొత్తదైన తంత్రాన్ని స్వీకరించే స్థితిలో లేరని అతడు చెప్పాడు. అందుచేత బుద్ధుడే ఈ తంత్రాలకు, మంత్రాలకు, రహస్య పూజా విధానాలకు, వాటి ఆచరణకు మూలపురుషుడని నమ్మవలసి వస్తుంది. ప్రజ్ఞాపారమితా మంత్రాన్ని బుద్ధుడే స్వయంగా చెప్పాడని అంటారు. బుద్ధుడే స్వయంగా ముద్రలు, మంత్రాలు, మండలాలు మొదలైన వాటి గురించి ప్రజలకు ఉపదేశించాడని, వాటి ఆచరణ వలన భోగ భాగ్యాలు లభిస్తాయని ఆనాటి మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ సాక్ష్యాలను బట్టి, బుద్ధుడు తన మతంలోకి రహస్య పూజా విధానాలను ప్రవేశపెట్టాడని ఒక నిశ్చయానికి రావచ్చు. ఈ పద్ధతులు క్రమంగా పలురకాల విధానాల ప్రభావం వలన సర్వ సంపూర్ణమైన రహస్య సాధనా పద్ధతిగా, వజ్రయానంగా క్రమంగా రూపొందాయి.

వజ్రయాన తాంత్రికులు మంత్రాలకు మరో ప్రభావముందని గుడ్డిగా నమ్ముతారు.

"నియమాలను అనుసరించి మంత్ర ప్రయోగం జరిగితే అవి ప్రపంచంలో సాధించని వేమున్నాయి?" అని ఒక చోట ఉంది.

"మంత్రాలను తిరిగి తిరిగి జపించడం వలన మనోశక్తి జనిస్తుంది. ఈ శక్తిని చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందుతుంది" అని మరొక చోట ఉంది.

మంత్ర జపం వలన బుద్ధత్వం ప్రాప్తిస్తుందని నమ్మకముంది.

లోకనాథుడి మంత్రం జపిస్తే పంచ మహాపాతకాలు నశిస్తాయి.

అవలోకితేశ్వరుడి ధారణిని జపిస్తే గర్దభం కూడా 300 శ్లోకాలను జ్ఞాపకముంచుకుంటుంది.

నియమాలను పాటించి జపిస్తేనే మంత్రాలు ఫలితాలనిస్తాయి. అందుచేతనే సాధరణ మానవులు మంత్రజపం చేయలేరు.

మంత్రాలను చాల జాగ్రత్తగా ఉచ్చరించాలి. తంత్రాలు సరియైన మంత్రజపం జరగడానికి మార్గాన్ని సూచిస్తాయి.

మంత్రాలను చాల తొందరగా గాని, చాల మెల్లగా గాని చదవరాదు. మంత్ర జపం చేస్తున్నపుడు మనసు నిర్మలంగా ఉండాలి. చెడు తలపులు ఉండరాదు. అలసట పొందనంతవరకు మంత్ర జపం చేయాలి.

మంత్రాలు చాలా పవిత్రమైనవని వజ్రయాన తాంత్రికులు భావిస్తారు. వేదమంత్రాలను కొన్ని పద్ధతుల వలన మార్పు లేకుండా కాపాడినట్లే తాంత్రికులు కూడా తమ మంత్రాలు నిర్దుష్టంగా

ఉండడానికి చాల పద్ధతులు అవలంబించారు. ఈ మంత్రాలు సాధారణంగా వచనంలో ఉంటాయి. వాటి అర్థం మామూలుగా బోధ పడదు. కొన్ని మంత్రాలు జ్ఞాపకం ఉంచుకోవడానికి శ్లోకాలలో చెప్పారు. ఈ శ్లోకాలు చాల వింతగా ఉంటాయి. మామూలు పాఠకులకు ఎటువంటి అర్థం తెలియదు.

ఒక ఉదాహరణ **ఆదౌ చక్రధర స్తతః పిచుయుగాల్**

**ప్రజ్ఞాన్వితో వర్ధని**<br>
**తస్మాచ్చ జ్వలయుగ్మమస్య చ పరే**<br>
**మేధా పరే వర్ధని**<br>
**ఏతస్మాత్ చరమం ధిరిద్వయమతో**<br>
**బుద్ధిస్తథా వర్ధని**<br>
**స్వాహాంతః కథితః స ఏవ**

**సుగలై ర్మంత్రః కవిత్వాదిభిః**

ఈ శ్లోకానికి తాత్పర్యం ఈ విధంగా ఉంటుంది:

ముందుగా చక్రధరుడు - అతని వెనుక రెండు పిచులు, ఒక వర్ధని -వీటిని కలుపుతూ ప్రజ్ఞ - తరువాత రెండు జ్వాలలు, వాటి తరువాత వర్ధని - వర్ధనికి ముందు మేధ - చివరను రెండు ధిరిలు - బుద్ధి, వర్ధని అన్నవి స్వాహాతో ముగుస్తాయి. ఈ మంత్రం కవి యొక్క మేధాశక్తిని శ్లోకం చదివినప్పుడు ఏ విధమైన అర్థమూ గోచరించదు. ఇది వజ్రవీణా సరస్వతి యొక్క మంత్రమని తెలుసుకున్న తరువాత పై శ్లోకానికి ఒక రూపం ప్రసాదించవచ్చు.

**ఓం పిచు పిచు ప్రజ్ఞావర్ధని జ్వల జ్వల మేధా వర్ధని**<br>
**ధిరి ధిరి బుద్ధి వర్ధని స్వాహా.**

మంత్రం ఏ విధంగా చెడిపోకుండా అక్షరాలను వేరు వేరుగా చేసి, వాటిని ప్రతీకలుగా చెప్పడం మరొక పద్ధతి.

ఈ మంత్రం సరస్వతీదేవికి చెందినది.

ఈ క్రింది శ్లోకంలో చెప్పబడింది

**సప్తమస్య ద్వితీయ స్థమష్టమస్య చతుర్థకం**<br>
**ప్రథమస్య చతుర్థేన భూషితం తత్ సచిందుకమ్.**

అది ఏడవ దానియందు రెండవది; ఎనిమిదవ దాని యందు నాలుగవది; మొదటి దాని యొక్క నాలుగవ దానిచే అనుగమించి, బిందువుచే భూషితమైనది.

ఈ శ్లోకం యొక్క తాత్పర్యం: వర్ణసమామ్నాయానికి చెందిన ఏడవ తరగతి అంతస్థములలో రెండవది ర (యరలవ లలో రెండవది) - ఎనిమిదవ తరగతి ఊష్మములలో నాలుగవది - హ - (శడసతాలలో నాలుగవది) - మొదటి అచ్చులలో లేక స్వరములలోనాలుగవది - ఈ - (అ ఆ ఇ ఈలలో నాలుగవది) - ఇది బిందువుచే అలంకరింపబడినది - అనుస్వారము కలిగినది - ఈ ప్రకారము సిద్ధించిన బీజ మంత్రము.

**హ్రీం**

**ఇది సరస్వతీ బీజము**

# కాలచక్ర - 2006

- డాక్టర్ చింతల వెంకట శివసాయి

**కాలచక్ర పూర్వరంగము:**

బుద్ధుడు కాలాన్ని చక్రంతో పోల్చాడు. కాలగతిని బట్టి మానవ జీవితాన్ని పోల్చి చూడటమే కాలచక్ర పరమార్థం. కాలచక్ర అనేది టిబెట్ దేశపు బౌద్ధ మతస్తుల ప్రార్థనా పద్ధతి, అత్యున్నత యోగతంత్రాలకు చెందిన ఒక బౌద్ధ తాంత్రిక ప్రక్రియ. టిబెట్ పురాణాల ప్రకారము ఈ కాలచక్ర ప్రవచనము బుద్ధశాక్యమునికి జ్ఞానోదయమైన అనంతర సంవత్సరంలో 3వ నెల 15వ రోజున జరిగింది. ఈ బోధనలను శంబలరాజు అయిన సుచంద్రుడు కోరినట్లు తెలుస్తుంది. శంబల అనేది కాశ్మీర్‌కు ఉత్తరముగా ఉన్నట్లు భావించే స్వచ్ఛమైన దేశము. బౌద్ధ మతాచారాలలో దీని ప్రస్తావన ప్రముఖంగా కనిపిస్తుంది. రాజ్‌గిర్ సమీపంలోని గృధ్రకూట శిఖరముపై జ్ఞానసాధన మీద బోధనలు ఇస్తున్న సమయంలోనే బుద్ధ భగవానుడు మూల లేదా కాలచక్ర మూలతంత్రాన్ని ధాన్యకటకములోని కొందరు అనుయాయులకు బోధించారు. వీరిలో దివ్యలు, శంఖాలకు చెందిన 96 సత్రప్‌లు ఉన్నారు.

కాలచక్ర శంబలకు చెందిన 7గురు ధర్మప్రభువుల ద్వారా 17 మందికి కల్కి సేనాధిపతుల ద్వారా క్రమానుగతంగా ఒకరి తరువాత ఒకరికి అందుతూ వచ్చింది. భారతీయ గురువులు మంజుశ్రీ పుండరీక పండితులు తమ రచనలు అయిన శ్రీ కాలచక్రము, విమలప్రభలో వరుసగా ఈ కాలచక్ర బోధనలను పొందుపరిచారు.

టిబెట్‌లో కాలచక్ర బోధనలు మొట్టమొదట అనువాద కర్త అయిన గ్విజోలొత్సు వదవా ఓసర్ ద్వారా విస్తరించాయి. ఖేద్రుప్ నర్సాంగ్ గ్యాట్సొస్ విమలప్రభ ఆధారంగా రచించిన "యాన్ అర్నమెంట్ ఆఫ్ ది స్టెయిన్‌లెస్ లైట్ సిర్కాను" కాలచక్ర తంత్రానికి సంబంధించిన ముఖ్యమైన రచనగా భావిస్తారు. 18వ శతాబ్దిలో కాలచక్ర పరంపర పరమపూజ్య ఏడవ దలైలామా ద్వారా నాంగ్యార్ మొనాస్టరి వారికి అందింది. ఇద్దరు దలైలామాలకు పంచన్‌లామాలకు కాలచక్ర ప్రక్రియలో దీర్ఘకాలిక సంబంధము ఉన్నది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ మతస్థులు ఒక చోట సమావేశమై ఉపదేశాలు విని బౌద్ధ ధర్మాన్ని మననం చేసుకోవటం కాలచక్ర ఉద్దేశ్యము. బుద్ధునికి దీపారాధన, పుష్పాలు, ధ్యానం అంటే అత్యంత ప్రీతికరం. కాబట్టి వాటిని మతస్థులు సమర్పించి మొక్కుబడులు తీర్చుకొంటారు. కాలచక్ర ప్రధాన ఘట్టం రోజు ఉదయం, సాయంత్రం ధ్యానం ఉంటుంది.

దీనిని బట్టి కాలచక్ర అనేది బౌద్ధ మత శాఖ అయిన వజ్రయాన శాఖకు చెందిన పూజా విధానము, మతబోధ కాలచక్ర అను ప్రక్రియ టిబెట్‌లో ఒక మతాచారముగా ప్రచారం చెందింది. బుద్ధుని ఉపదేశాలను టిబెట్‌లోని బౌద్ధ మత గురువైన దలైలామా భక్తులకు ఉపదేశించే ప్రక్రియ కాలచక్రగా చెప్పవచ్చు.

**కాలచక్ర ప్రశస్తి:**

బౌద్ధమతంలో హీనయానం, మహాయానం, తంత్రయానం అని 3 ప్రధాన శాఖలు. మొదటి రెండూ వరుసగా నరాకార, సాకార సాధనను బోధిస్తుంటే తంత్రయానం వైదిక కర్మాచరణకు కాస్త

డా॥ చింతల వెంకట శివసాయి, తత్త్వశాస్త్ర అధ్యాపకులు, వి.ఆర్.యస్. & వై.ఆర్.యస్. కళాశాల, చీరాల.

దగ్గరగా ఉంటుంది. సౌంఖ్యమాన పద్ధతి, మాండుక్య ఉపనిషత్, జైన మత ధర్మాలలోని సూత్రాలు, తంత్రయాన మత ధర్మాలలోని సూత్రాలు. తంత్రయాన మత నిర్మాణాన్ని ప్రభావితం చేశాయి. కాలచక్ర సాధన ఈ తంత్రయాన శాఖకు చెందినది. కాలమే అన్నిటికి మూలం. కాలమే భగవంతుని స్వరూపం. సమస్త జీవరాశులు కాలములోనే పుట్టి దానిలోనే లీనం అవుతున్నాయి. గౌతమ బుద్ధుని ఈ బోధనల సారమే కాలచక్ర ఆవిర్భావానికి నాంది. కాలచక్ర ప్రవచనాల సారం విశ్వశాంతి.

కాలచక్రంలో మొత్తం 3 చక్రాలు ఉంటాయి. మొదటి చక్రం విశ్వానికి సంబంధించినది. అది సూర్యచంద్రులు, భూమండలము, పర్యావరణాన్ని గురించి తెలుపుతుంది. రెండవ చక్రం మానవ శరీరాన్ని గురించి చర్చిస్తుంది. పరిపూర్ణ జ్ఞానసిద్ధి, వ్యక్తిత్వ వికాసము, కాలచక్ర ప్రధాన లక్ష్యము కాగా, మూడవది అతి ముఖ్యమైన చక్రము. బుద్ధునికి కాలానికి భగవంతునికి ప్రతీకగా ఖాళీగా ఉంటుంది. ఈ చక్రమే ఆధ్యాత్మిక మార్గాన్ని బోధిస్తుంది. ఈ కాలచక్రానికి **4** ముఖాలు, **24** చేతులు ఉంటాయి.

## దలైలామా అభిప్రాయం:

ఈ విశాల విశ్వంలో కాలచక్రము ఎక్కడో ఒకచోట నిక్షిప్తమై ఉందని బౌద్ధుల విశ్వాసం. దలైలామా కాలచక్రం ఉనికిని గురించి చెబుతూ కాలచక్రం విశ్వంలో ఎక్కడో ఉంది. అయితే ఖచ్చితంగా భూమిపై మాత్రం లేదు. ఒక వేళ ఉండి ఉంటే దానిని మనం చేరగలిగి ఉండేవారం కాదా? అన్నారు.

## కాలచక్ర తంత్రం కథ:

కాలచక్రం కాలానికి సాక్షి. ఒక చక్రానికి మొదలు, చివర అనేవి ఉండవు. కాలానికి అంతే, అద్యంతాలు లేని స్థితి కాబట్టి కాలచక్రం అన్నారు. సృష్టి పరిణామ క్రమం అంతా కాలం ఆధీనంలోనే ఉంది. కాలచక్రాన్ని ఒక తాత్విక సిద్ధాంతంగా బౌద్ధులు పరిగణిస్తారు. కాలచక్ర తంత్రం ద్వారా కాలదేవత లేదా కాలపురుషుని ఆవాహన చేస్తారు. కాలముతో మానసిక శక్తిని సముపార్జించుకుంటారు.

## సంగ్రహ పరిచయం:

బోధి చిత్తాన్ని సాధించటానికి, శూన్యతా సిద్ధికి, బుద్ధత్వం పొందటానికి బౌద్ధులు ఆచరించే విధానమే కాలచక్రతంత్ర విధానం. ఈ లక్ష్యాలు సాధించడానికి అంచెలంచెలుగా గురువు నడిపించే పద్ధతి ఇది. నీవే ఒక శిశువు అయితే నీ పురోగమనం అంతా నీ నిబద్ధత ఆ లక్ష్యాలను సాధించడానికి నీవు పెట్టే శ్రద్ధ మీద ఆధారపడి ఉంటుంది. దీనిని సంసిద్ధం చేయటానికి దీక్ష దానం చేసే గురువు ఎంత త్యాగం చేస్తాడో, అనేక మంది ఎంత శ్రమ చేయవలసి ఉంటుందో, దీక్షా స్వీకారానికి వచ్చిన వారు ఏ విస్పష్టమైన భావంతో స్వీకరిస్తారో, సాధించగలిగేదేమిటో తెలుసుకుంటే ఈ అపూర్వ అవకాశాన్ని వృథా చేసుకోరాదనిపిస్తుంది. సూటిగా ప్రత్యక్షంగా గురువుతోను, సాటి సాధక మిత్రులతోను ఋజు బుద్ధితో వ్యవహరించడం, ఈ నిజమైన దీక్షలో ఆవేశితమై ఉంటాయి. తన అంతరంగాన్ని, ఆత్మవంచనను పూర్తిగా బహిర్గతం చేసుకొనడానికి సమగ్ర ప్రయత్నం చేయాలి. తన అహంకారంలోని అపరిపక్వత, కర్కశ గుణాలను వెల్లడి చేసుకుని వినమ్రితం కావాలి.

సమగ్రంగా, పరిపూర్ణంగా అకళంక దీక్షను పొందాలంటే దీక్షా స్వీకర్త అత్యున్నతమైన గాఢమైన ప్రేరణను జ్ఞానోదయం మీద సత్పురుష సంభాష మీద కాంక్ష ఉండాలి.

**బోధిచిత్తం:**

చైతన్య సత్త్వుల కోసం జ్ఞానసిద్ధిని పొందాలన్నా బలమైన కోరిక, కరుణ, శూన్యతలను సాధ్యం చేసుకొనుట. సర్వమునకు మూలము, సర్వమునకు లయస్థానం.

**బుద్ధత్వం:**

శూన్యతను అనుభూతం చేసుకొనుట.

**పరిత్యాగము:**

ఏ విధమైన రాగబంధాల నుండి అయినా మానసికంగా విముక్తిని కలిగి ఉండటం.

**శూన్యత:**

అన్ని స్వభావాలకుండే భ్రాంతి గుణం, సంకల్పాల అస్తిత్వ రాహిత్యము, కేవలము స్థిరము అయినది ఏమిలేకపోవుట. అన్ని వేదనల మధ్య పరస్పర అనంత సంబంధము; ద్వంద్వాలు, వితర్క విచారాలు లేకపోవటం, స్థిరశాశ్వతమైనది ఏదీ లేకపోవటం.

**వర్గీకరణ:**

వ్యక్తిగత నిర్వాణమార్గాన్ని శాక్యముని బుద్ధుడు ఉపదేశించాడు. అది హీనయానంగా ప్రసిద్ధమైంది. వ్యక్తిగతంగానే కాకుండా సర్వజీవులను విముక్తిచేయగల, సమ్యక్ సంబుద్ధిని పొందటానికి ఉపదేశించిన మార్గం మహాయానంగా ప్రసిద్ధమైంది. సంబుద్ధిని సాధించటానికి మహాయానం రెండు మార్గాలను చూపుతుంది. ఒకటి సూత్రయానం, రెండవది వజ్రయానం. ఈ రెండింటిలో తంత్రమార్గమైన వజ్రయానం శ్రేష్ఠమైనది. ఈ తంత్రయానం మళ్లీ నాలుగు రకాలుగా విభజింపబడింది. ఒకటి క్రియాతంత్రం. రెండవ చర్యాతంత్రం. మూడు యోగతంత్రం. చివరగా అనుత్తరయోగం. అనుత్తర అంటే "దీని తర్వాత మరేది లేదు" అని అర్థం. అందువల్ల ఇది శ్రేష్ఠతమైన యోగం. అనుత్తర యోగతంత్రాలలో కల్పనాదేహం మీద ఆధారపడి నిర్వహణ పద్ధతికి ప్రాధాన్యమిచ్చే పురుష తంత్రాలు కొన్ని శూన్యత లేక ప్రజ్ఞా లక్షణం మీద ఆధారపడే స్త్రీ తంత్రాలు కొన్ని ఉన్నాయి. బౌద్ధ ధ్యాన ప్రక్రియలలో కెల్ల అత్యున్నతము ఉత్కర్షము అయిన కాలచక్రతంత్రం అనుత్తర యోగాలలో స్త్రీ తంత్ర విభాగానికి చెందినది.

అనుత్తర తంత్రాలు అన్నింటిలాగే కాలచక్ర తంత్రం కూడా రెండు అంతరువులుగా విభజింపబడింది. అందులో మొదటిది

**ఉత్పన్నక్రియ:**

ఇక్కడ ప్రధానమైన శ్రద్ధ అంతా కాలచక్రమండల మధ్యలో తన యందు దేవతా రూపాన్ని దర్శించుకొనటంలో లగ్నమయి ఉంటుంది.

**సమపన్న (ముగింపు) కర్మ:**

రెండవ దశ. ఇందులో ముఖ్యమైన శ్రద్ధ అంతా తనలో మధ్యను నాడీగతమైన వాయువులను, బిందువులను శుద్ధిచేసికొనటం మీద లగ్నమై ఉంటుంది. బుద్ధత్వం పొందటం అనే పర్యవసానానికి ఇదంతా ఆచరించవలసిన ప్రక్రియ.

కాలచక్ర సాహిత్యంలో ఐదు అంగాలున్నాయి. ఇవి జగన్నిర్మాణం, మనశ్శారీరక శాస్త్రం, దీక్ష, ఉత్పత్తికర్మ, సాధన, దీక్షా సమాపన తర్వాత కలిగే దివ్య రహస్య పరిజ్ఞానం. దీన్ని కాలచక్ర, అంతర కాలచక్ర, పర్యాయకాలచక్ర అని మూడు అంశాలుగా కూడా విభజించారు. బాహ్య కాలచక్రంలో జ్యోతిష్యం, భూగోళశాస్త్రం, చరిత్ర, పరలోక శాస్త్రాలుంటాయి. వీటి ద్వారా బాహ్య విశ్వాన్ని దాని గతి చక్రాన్ని వివరించటం జరుగుతుంది. అంతర కాలచక్రం నాడులు, వాయువులు, చక్రాలలోని బిందువులు మనస్సు వీటిని ఆధారం చేసికొని మానవ దేహంలోని అంతర్గత గతి చక్రాలను గురించి తెలుపుతుంది. ఇది తాంత్రికతకు మూలమైన గుప్త శారీరక శాస్త్రానికి ఆధారం. ఇక మూడవది పర్యాయ కాలచక్రం - ఉత్పన్న క్రియ సాధన. సమాపన్న క్రియ దశలోని ఆచరణలకు సంబంధించినది. బాహ్య అంతర కాలచక్రాలను పరిశుద్ధం చేసి బుద్ధునిగా పరిణమించడానికి ఉపకరిస్తుంది.

### చారిత్రక నేపథ్యం:

శాక్యముని అయిన బుద్ధుడు జ్ఞానోదయం పొందిన ఒక సంవత్సరం తర్వాత మధ్య ఆసియాలోని శివుని దేశమైన 'శంబల'ను పరిపాలించి 'సుచంద్ర మహారాజు' కాలచక్ర తంత్రాన్ని బోధించమని అర్థించాడు. అందుకే బుద్ధుడే కాలచక్ర దేవతా రూపంలో దక్షిణ భారత దేశంలోని ధాన్యకటక (నేటి అమరావతి) స్థూపం వద్ద ప్రత్యక్షమై రాజుకు పూర్ణదీక్ష నిచ్చాడు.

మూలమాతృక అయిన అనుత్తర యోగతంత్రాన్ని ప్రవచించి దానితోపాటు యమాంతర తంత్రం, చక్ర శంభార తంత్రం వంటి ఇతర తంత్రాలను కూడా ప్రసాదించాడు. అదే సమయంలో గృధ్రకూట శిఖరం మీద (బీహార్) ప్రజ్ఞాపారమిత సూత్రాలను కూడా ఉపదేశించాడు.

12000 శ్లోకాలున్న కాలచక్ర మూలతంత్రాన్ని నేర్చుకొని సుచంద్ర మహారాజు శంభల దేశానికి తిరిగివచ్చి ఆ తంత్రం మీద 60 వేల శ్లోకాల వివరణ వ్రాశాడు. ఏడు తరాల అనంతరం శంభాల దేశానికి కాలచక్ర తంత్రాన్ని ప్రధానమతంగా నిర్ణయిస్తూ మంజుశ్రీ కీర్తి, 1000 శ్లోకాలు గల "విమలప్రభా" అనే పేరుతో మూలతంత్రానికి సంగ్రహ గ్రంథం రాశాడు. పన్నెండవ ప్రవర్తకుని కాలంలో ఈ కాలచక్ర బోధలు ఇద్దరు భారతీయ పండితుల వల్ల భారత దేశానికి కొనిరాబడ్డాయి.

క్రీ.శ. 11వ శతాబ్దంలో ఈ బోధలను త్సొంగ్-ఖ-ప టిబెట్ దేశానికి తీసికొనిపోయాడు. అప్పటి నుండి ఈ కాలచక్ర బోధలు, ఆచరణలు, గురువు నుండి శిష్యునకు అవిచ్ఛిన్న పరంపరగా అందించబడుతూ లింగ్-రింపోచా ద్వారా నేటి 14వ దలైలామా వరకు కొనసాగుతూ వచ్చాయి.

### కాలచక్ర-విశ్వమాత, దేవతలు:

అసలైన దీక్షా విధానానికి ముందుగా కాలచక్ర దేవతా మరియు తన సహచరి అయిన విశ్వమాతతో ఐక్యమై ఉండే రూపాన్ని గురించి తెలుసుకోవడం ముఖ్యం. శిష్యుడు ఈ రూపాన్ని మనస్సులో ప్రత్యక్షించుకొని గురువునే దేవతగా భావించుకొనవలసి ఉంటుంది. పండిత లామా అయిన బూటన్-రించన్-ద్రూపా (1290-1364) సమకూర్చిన సంగ్రహ వివరణ ఇప్పుడు చూద్దాం.

కాలచక్ర మధ్య కాయం నీలం రంగులో ఉంటుంది. ఆరు భుజాలు ఉంటాయి. మధ్య ఉన్న నీలగ్రీవం ఆధారంగా, కోరలు బయటకు వచ్చి అతి ఉగ్రంగా కాలవర్ణంతో ఉండే ముందు వైపు ముఖం, ధ్యాన దృష్టితో వెనుక వైపున ఉన్న పసిమి వర్ణ ముఖం ఉంటాయి. ఎడమవైపున ఉన్న తెలుపురంగు

మెడ తెలుపు ముఖానికి ఆధారం. అది శాంతంగా ఉంటుంది. రక్తవర్ణంతో ఉండే కుడివైపు మెడ రక్తవర్ణ ముఖానికి ఆధారం. ఇది కాముక భావంతో ఉంటుంది. వాటి కేశాలు యోగుల వలె పైకి ఎత్తికట్టి ఉంటాయి. వజ్ర ముద్రితమైన శిరోవేష్టాలు ధరించి ఉంటాయి. వాటి శిఖరాన అర్ధచంద్రుడు, వజ్రసత్వం అలంకరించబడి ఉంటాయి. కుడి ఎడమ వైపుల నున్న మొదటి భుజం నీల వర్ణంతో ఉంటుంది. రెండవ భుజం ఎరుపు, మూడవది తెలుపు. ప్రతి భుజం నుండి రెండు ఎగువ చేతులు పైకి వచ్చి ఉంటాయి. మళ్లీ దాని నుండి రెండు చేతులు మొలుచుకొని వచ్చినట్లుంటాయి. ఈ విధంగా మొత్తం **24** చేతులు కనిపిస్తాయి. వీనిలో కుడి ఎడమ వైపుల నున్నచేతులు ఎరుపులోను, మూడవ నాలుగు తెలుపులోను ఉంటాయి. ప్రతి చేతిలో బొటనవ్రేలు పసుపు వర్ణం, చూపుడు వ్రేలు తెలుపు, నడిమివ్రేలు ఎరుపు, ఉంగరపు వ్రేలు నలుపు, చిటికెన వ్రేలు ఆకుపచ్చ, వ్రేళ్ళపై నుండి క్రింది దాకా కణుపుల మధ్య చర్మం తెలుపు, ఎరుపు, నలుపు రంగులు, కుడికాలు ఎరుపు, ఎడమకాలు తెలుపు, కుడివైపు ఉన్న మొదటి నాలుగు చేతులు నల్లని చేతులు వజ్రాన్ని ధరించి ఉంటాయి. రెండవ చేత ఖడ్గం, మూడవ చేత త్రిశూలం, నాల్గవ చేత చరిక నాల్గు రక్త వర్తణ హస్తాలలో మొదటి చేత మూడు బుణాలు, రెండవ చేత వజ్రాంకుశం; మూడవ చేత డమరుకం, నాల్గవ చేత ముద్గరం. నాల్గు శ్వేత హస్తాలలో మొదటి చేత చక్రం, రెండవ చేత డాలు, మూడవ చేత ఖట్వాంగం, నాల్గవ చేత నేత్తురు నిండిన కపాలం ఉంటాయి. నాలుగు ఎర్రని చేతులలో మొదట విల్లనంబు, రెండవ చేత వజ్రపాశం, మూడవ చేత ఆభరణం, నాల్గవ చేత పద్మహస్తం, శ్వేత హస్తాలలో మొదట శంఖం, రెండవ చేత దర్పణం, మూడవ చేత వజ్రశృంఖల, నాల్గవ చేత పుష్పాలంకృతమైన సృష్టికర్త నాల్గు ముఖాలు ఉంటాయి.

సూర్య, చంద్ర, రాహు, కాలాంగిణి అనే దివ్యమూర్తులను ప్రతిబింబించే ఆసనం మీద కాలచక్ర దేవుడు నిలబడి ఉంటాడు. తన కుడి కాలును బయటకు చాపి, కోర్కెల దేవతకు ఐదు పుష్పబాణాలు ధరించిన ఒక చేయి, తక్కిన మూడు చేతుల్లో ఒక విల్లు, పాశం, అంకుశం ఉంటాయి. కాలచక్ర దేవుడు తన ఎడమ పాదాన్ని శ్వేత వర్ణ దేవతపై నుంచి అణచి వేస్తుంటాడు. ఈ దేవత వినాశక శక్తి సంకేతం. ఒక ముఖం మూడు కాళ్లు, నాల్గు చేతులు ఉంటాయి. త్రిశూలం, ఢమరుకం, కపాలం, ఖట్వాంగం ధరించి ఉంటుంది. వీరిద్దరి భార్యలు కాలచక్ర దేవత పాదాలు పట్టుకొని విషాదంగా చూస్తుంటారు. కాలచక్ర దేవత వజ్ర ఖచితములైన ఆభరణాలు, కుండలాలు, కంఠహారము, వడ్డాణము, కడియములు, శాలువ, శృంఖలాలతో అలంకృతమై ఉంటాడు. పులిచర్మం అంగవస్త్రంగా వ్రేలాడుతూ ఉంటుంది.

కాలచక్ర దేవత పత్ని అయిన విశ్వమాత పసిమి వర్ణం గల మధ్య కాయంతో నాలుగు ముఖాలుంటాయి. ఎదుటి ముఖం, పసిమివర్ణం, కుడి ముఖం తెలుపు, ఎడమ ముఖం ఎరుపు, వెనుక ముఖం నలుపు వర్ణాలతో ఉంటాయి. ఎనిమిది చేతులుంటాయి. కుడివైపున ఉన్న నాల్గింటిలో కత్తి, అంకుశం, ఢమరుకం, జపమాల ఉంటాయి. ఎడమవైపున ఉన్న నాల్గింటిలో కపాలం, పాశం, ప్రఫుల్లపద్మం, ఒక ఆభరణం ఉంటాయి. ఆమె కిరీటం వజ్రసత్వంతో అలంకరించబడి ఉంటుంది. దానిపై ఆరు ముద్రలుంటాయి. ఆమె తన కాళ్ళను బాగా విస్తరించి కాలచక్ర దేవుని మిక్కిలి తమకంతో కాముకంగా ఆలింగనం చేసికొని ఉంటుంది.

సన్నాహం:

అభిషేక దీక్షకు ముందుగా ప్రారంభ కలాపాలున్నాయి. ఇవన్నీ శ్రమతో కూడినవి. సంక్లిష్టమైనవి. శిష్యుల కలాపం మొదటి మెట్టు. వజ్రదీక్ష నిచ్చే గురువు వద్దకు శిష్యుడు వచ్చి దీక్షాకలాపం ప్రారంభించవలసిందిగా అర్థిస్తాడు. అప్పుడు ఆరు తాంత్రిక శాఖలకు నేతృత్వం వహించే తథాగతులకు సంబంధించిన ఆరు బీజాక్షరాలను శిష్యుల షట్చక్రాల మీద గురువు నిక్షిప్తం చేస్తాడు.

అప్పుడు తంత్రం జరిగే ప్రదేశానికి సంబంధించిన నాలుగు విద్యుక్త క్రియలు ప్రారంభమౌతాయి. 1. మండల నిర్మాణానికి తగిన స్థల యోగ్యతను పరీక్షించటం 2. క్షేత్రపాలకుల నుండి, దివ్య శక్తుల నుండి దీక్షా క్రియకు అనుమతిని సంపాదించమని క్షేత్రాన్ని వేడుకొనడం. 3. స్థల శుద్ధి క్రియ. ఇందులో బాహ్య స్థల శుద్ధితో బాటు రక్షక దేవతల మండలాలు ధరించి, అసురులను గుచ్చే రక్షణ కత్తులను మండల స్థలానికి చుట్టూ ఉంచి తర్వాత శూన్యతను ధ్యానించడం. మండల నిర్మాణానికి వివిధ తథాగతుల అనుమతిని పొంది, స్థలాన్ని స్వాధీనం చేసికోవడం, స్థల కేళిలో అవరోధం కలిగించే శక్తులను ఆజ్ఞాపించి వెళ్ళగొట్టడం.

దీని అనంతరం ఆరు రకాల సన్నాహక విధులు ఉంటాయి. 1. లౌకిక పార లౌకిక కలశ దీక్ష. 2. లౌకిక, పార లౌకిక క్లుప్త దీక్షలు. 3. లౌకిక, పార లౌకిక గుప్త జ్ఞాన దీక్షలు. 4. పార లౌకిక దీక్ష. 5. మండల స్థలం నుండే పూలు సుగంధాలు అర్పించి భూదేవిని సన్నద్ధం చేయడం 6. పూర్ణ కలశం నిండా స్వచ్ఛ జలాన్ని, మండల రేఖలు గీయటానికి సుద్దపొడిని, మండల నిర్మాణానికి కావలసిన ఇసుకను, గురువు ఉపయోగించే వజ్రగంటలను సన్నద్ధం చేయటం.

గురువు అతని సహాయకులకు వచ్చే స్వప్నాలను విశ్లేషించి అందలి శుభశకునాలను బట్టి, మండల నిర్మాణానికి అనుకూల పరిస్థితులను తెలుసుకుంటాడు. మండల రచనకు నాలుగు ప్రధాన రేఖలను చిత్రించడం సుద్దపొడితో శాస్త్రోక్త విధి ప్రకారం చేస్తారు. కాలచక్ర మండల దేవతలను వారి వారి స్వస్థానాల నుండి బయలుదేరి సంసిద్ధం చేయబడిన మండలం మీదకు రావలసిందిగా ఆవాహనం చేస్తారు.

ఇప్పుడు మండల నిర్మాణం ప్రారంభమవుతుంది. ఇది చాలా సున్నితమైన, శ్రమసాధ్యమైన విధానం. మొదట ఐదు ధారలతో గుప్త జ్ఞానరేఖలతో స్థూల రేఖలపై ఏర్పరుస్తారు. మూడు ఏకకేంద్రక వృత్తాలను శరీరంలోని వాక్కు, మనస్సులకు సంకేతంగా రచించి వాటిని వేర్వేరు రంగుల ఇసుకతో నింపుతారు. తర్వాత అసురులకు గుచ్చే ఛురికలు, చుట్టూ ఉంచిన పది క్రతు కలశాలతో సహా ఈ మండలాన్ని ఆశీర్వదిస్తారు. ఒక యవనికను దాని రక్షణార్థం కవచంగా ఉంచుతారు. చివరిగా సంప్రదాయక వేడుక నృత్యం జరుపుతారు.

ఇప్పుడు శిష్యుణ్ణి సన్నద్ధం చేయటం ప్రారంభమౌతుంది. ఇందులో ఆరు అంచెలుంటాయి. 1. బోధి చిత్తం గురించి గురువు శిష్యులకు బోధించి ప్రేరేపణ కలిగిస్తారు. తర్వాత వారు తమను తాము విశ్వమాతతో కూడిన కాలచక్ర దేవతగా దర్శించుకొనే అధికారం కలగటానికి అంతర దీక్ష ద్వారా శిష్యులను నడిపిస్తాడు. 2. అప్పుడు శిష్యుడు దీక్షనిమ్మని అర్థిస్తాడు. గురువు సంబుద్ధి మార్గాన్ని చూపటానికి ఆమోదిస్తాడు. 3. తర్వాత శిష్యులు బోధిసత్వ తంత్ర ప్రతిజ్ఞలు చేస్తారు. గురువు

శిష్యుల శరీరాన్ని, వాక్కును, మనస్సును దీవిస్తారు. 4. తన తథాగత పరంపరను నిర్ణయించుకొనటానికి ప్రతి శిష్యుడు ఒక పన్ను కుట్టు పుల్లను చిన్న మండలంలో ఉంచుతాడు. తర్వాత శిష్యులు మూడు పుక్కిలింతలు చేయవలసిందిగా గురువు పవిత్ర జలాన్నిస్తాడు. ఎర్రని రక్షబంధన సూత్రం, కుశగ్రాసం పరకలు రెండు (దర్భలు) ఇస్తారు. 5. శిష్యుడు తన షట్చక్రాలలో ప్రతిదానితోను ఓం, అహ్, హుం, హుం, క్ష అనే బీజాక్షరాలను భావనామాత్రంగా దర్శిస్తాడు. 6. సంసార పరిత్యాగం చెయ్యమని, తాంత్రిక అభ్యాసానికి ఉత్సాహపూరితుడవు కమ్మని శిష్యునికి బోధించి స్వప్న పరీక్షను గురించి ఉపదేశిస్తాడు.

తర్వాత రోజున, క్రితం రాత్రి శిష్యులకు వచ్చిన స్వప్నాలను, వాటి అర్థాలను గురువు వ్యాఖ్యానిస్తారు. తాంత్రిక గురువులకు ఆవశ్యకమైన వాటిని గురించి పఠనం చేస్తారు. అప్పుడు శిష్యులు మండల ప్రవేశానికి అనుమతిని కోరతారు. అప్పుడు శిష్యులకు కళ్ళగంతలిచ్చి వెంటనే కట్టుకొమ్మంటాడు. తర్వాత సమర్పించటానికి ఎండిన పూలనిస్తాడు.

శిష్యులు మళ్ళీ తథాగత, తాంత్రిక ప్రమాణాలను తీసుకుంటారు. అవి ఒక్కొక్క తథాగతునికి ప్రత్యేక ప్రతిజ్ఞలతో ఉంటాయి. శిష్యులకిచ్చిన దీక్షను పూర్తిగా గోప్యంగా ఉంచమని చెప్పి, ప్రతి శిష్యునికి వేరువేరుగా తాంత్రిక దీక్షానామం ఇస్తారు. ఇప్పుడు కళ్ళకు గంతలు తీసివేసి 722 దేవతలున్న మండల అంతర్భాగాన్ని చూడటానికి అనుమతిస్తారు. బాహ్యమైన శరీర మండలంలో 536 దేవతలున్నారు. తర్వాతది వాఙ్మండలం. ఇందులో 70 మంది దేవతలున్నారు. వీరిలోనే 4 ముఖాలు 8 చేతులు ఉన్న విశ్వమాతను - నాలుగు ముఖాలు 24 చేతులు ఉన్న కాలచక్ర దేవత ఆలింగనం చేసుకొని మధ్యగతంగా ఉంటాడు.

### కాలచక్రదీక్ష:

కాలచక్ర దీక్షను 11 భాగాలుగా విభజించారు. మొదటి 7 భాగాలు - జల, కిరీట, పతక, వజ్రగంటా, వజ్రనిర్వాణ నామ, అనుమతి - అన్నవి. ఇవి శిష్యుడు "ఉత్పన్నస్థితి"ని అభ్యాసం చేయడానికి అర్హతనిస్తాయి. తదుపరి 4 పద్ధతులు లౌకిక, అలౌకిక, ఉన్నత దీక్షలో, ఇవి సమాపన దశను అభ్యాసనం చెయ్యడానికి సామర్థ్యానిస్తాయి.

**1. జలదీక్ష:** ప్రథమ దీక్ష మండల ప్రథమ ద్వారం వద్ద ప్రారంభమౌతుంది. అక్కడ కాలచక్ర -విశ్వమాతలు వజ్రాన్ని ధరించి తమవైపు వస్తున్నట్లు శిష్యులు భావిస్తారు. వజ్రం ఒక కొనను ధరించి శిష్యుణ్ణి సవ్య ప్రదక్షణంగా మండలం చుట్టూ ఉత్తర ద్వారం వైపు తీసుకొనిపోతారు. అక్కడ శరీరం శుద్ధతకు సంకేతమైన కాలచక్ర వామ భాగాన తెల్లని ముఖాన్ని చూస్తాడు. ఈ దీక్షలో మండలం చుట్టూ పది కలశాల నిండా ఉన్న జలం కనిపించే బాహ్యవస్తువు. శిష్యుని ధాతుపంచకం అంతరంగ వస్తు సముదాయం. ఇవి శిష్యునిలోని 5 ఊర్ధ్వ చక్రాలకు అన్వయమౌతాయి. ఈ పదార్థాలు రూపాంతరితమయ్యే ప్రారంభ దీక్షా దేవతలు. వీరు ఐదుగురు తథాగతులకు భార్యలు. ఈ దీక్షా క్షణాలలో తమలోని ధాతువులు ప్రయత్న సంసిద్ధంగా ఉన్నట్లు శిష్యులు అనుభూతిని పొందుతారు. శిష్యులలో నిర్వికల్పజ్ఞానం ఉత్పన్నమౌతుంది. అది పరమ సుఖకరం. జ్ఞానము, సుఖము, అవిభాజ్యమై ఉండే దశకు అది పర్యవశిస్తుంది.

ఈ జల దీక్ష శిష్యులలోని భూమి, అగ్ని, నీరు, వాయువు, ఆకాశం అనే ఐదు ధాతువులను శుద్ధి చేస్తుంది. తథాగతుని ఐదుగురు భార్యల సిద్ధులను పొంది ప్రథమ బోధిసత్వ స్థితిని పొందే అర్హతను శిష్యుడు పొందుతాడు. శిశువు జన్మించిన వెంటనే చేయించే ప్రథమ స్నానంతో ఈ దీక్షను పోల్చవచ్చు.

**2. కిరీట దీక్ష:** మండల ఉత్తర ద్వారం వద్ద శిష్యుడు ఇంకా కూర్చొని ఉంటారు. విశ్వం మనసులో సమర్పణ చేసి కిరీటం కోసం అర్థిస్తాడు. అర్పణకు బాహ్య పదార్థాలు పంచదాకోణ విభక్తమైన కిరీటం. ప్రతి భాగానికి వేరువేరు వర్ణాలు ఉంటాయి. అవి ఐదు తథాగత పరంపరకు సంబంధించినవై ఉంటాయి. అర్పణలో అంతర్గత మనోవిషయాలు శిష్యుని పంచస్కంధాలు. ఈ దీక్ష శిష్యుని మనశ్శరీరాలకు చెందిన స్కందాలను పరిశుద్ధం చేస్తుంది. ఐదుగురు తథాగతుల స్థితులను స్వాధీనం చేసుకోవడానికి, ద్వితీయ బోధిసత్వ స్థితిని చేరడానికి సామర్థ్యాన్నిస్తుంది. బాలుని పుట్టు వెంట్రుకల సంస్కారాలతో దీన్ని సరిపోల్చవచ్చు. ఈ రెండు దీక్షలు పూర్తి అయిన పిదప ధాతువులను పరిశుద్ధం చేసి నుదుటి మీది అజ్ఞాన చక్రంలోని బిందు శుద్ధిని జ్ఞానసిద్ధుని దృఢకాయాన్ని పొందడానికి తగిన పునాది పడుతుంది.

**3. కిరీట పతన దీక్ష:** గురువు మరల ఉత్తర ద్వారమున్న శిష్యుని వైపుగా వజ్రము ధరించి మండలానికి సవ్య ప్రదక్షణముగా దక్షిణ ద్వారము వద్దకు వచ్చి కాలచక్ర దేవునికి కుడి పార్శ్వముననున్న రక్త వర్ణ ముఖమునకు అభిముఖముగా ఉంచుతాడు. ఇది వాక్శుద్ధికి అనుసంధానితమై ఉంటుంది. ఈ దీక్ష బాహ్య వస్తువులుగా కిరీట పతకంలోని భాగాలు, అంతరంగా వస్తువులుగా దేహమంతటా తిరుగాడే వాయువులు.ఈ దీక్ష శిష్యుని దేహమండల దశ వాయువులను శుద్ధి చేస్తుంది. ఇందువల్ల దశ శక్తుల సిద్ధులు పొందే సామర్థ్యం అబ్బుతుంది. తృతీయ బోధిసత్వుని స్థితిని చేరడానికి అధికారమిస్తుంది. ఇది బాలునికి ప్రథమాలంకారమైన చౌలము (చెవులు కుట్టుట)తో పోల్చదగినది.

**4. వజ్ర, ఘంటాదీక్ష:** శిష్యుడు దక్షిణ ద్వారము వద్ద స్థిరముగా కూర్చొని మండలానికి అర్పణలు చేసి వజ్ర మరియు గంటా దీక్షలిమ్మని అర్థిస్తాడు. ఈ దీక్షకు బాహ్యమైన పదార్థాలు వజ్రము గంట. ఇందుకు అంతరంగ పదార్థాలు శిష్యుని, కుడి, ఎడమ నాడులు. ఈ దీక్ష శిష్యుని కుడి, ఎడమ నాడులను శుభ్రపరచి వాయువులను వాటిగుండా కేంద్రీకరించి మధ్యమనాడి గుండా పంపడానికి సామర్థ్యం కలిగిస్తుంది. చ్యుతిలేని పరమసుఖం, అత్యధికమైన కాలచక్ర, విశ్వమాతల గురించిన భావతీత జ్ఞానం కలిసి నాల్గవ బోధిసత్వ స్థితిని పొందే సామర్థ్యం లభిస్తుంది. ఈ దీక్ష శిశువుకు వచ్చే మొదటి నవ్వుతో పోల్చవచ్చు.

మండల దక్షిణ ద్వారం వద్ద జరిగే మూడు నాలుగు దీక్షలు పూర్తి అయిన తరువాత అంతర్గత వాయువులను, నాడులను విశుద్ధి చక్రంలోని బిందువును పరిశుద్ధం చేయడానికి పునాది వేసుకున్నాడు. దానితో బాటు దృఢవాక్కు అభేద్య వ్యక్తిత్వం సాధిస్తాడు.

**5. వజ్ర దీక్ష:** మళ్లీ గురువు వజ్రాన్ని ధరించి మండలం చుట్టూ సవ్యదిశగా ప్రదక్షిణం చేయించి తూర్పు ద్వారం వద్దకు తెచ్చి మనస్సుద్దికి అనుసంధానమైన కాలచక్ర పురోభాగమందలి నలుపు ముఖానికి ఎదురుగా ఉంచుతారు. దీని బాహ్య వస్తువు బ్రొటనవేలు ఉంగరమైన వజ్రము. ఇది పరమసుఖమును, అతీత జ్ఞానాన్ని కలిపి చూడగల మనస్సుతో వస్తువులను వినియోగించగల సామర్థ్యానికి సంకేతం. దీనికి అంతర వస్తువులు ఆరు ఇంద్రియాలు, మనస్సు, ఇంద్రియ విషయాలు.

ఈ దీక్ష శిష్యుని అవయవాలను వాటి విషయాలను పరిశుద్ధి చేస్తుంది. శిష్యునిలో ప్రవృత్తులు క్రమబద్ధం కావటానికి, ఏ విషయమై రాగబంధం లేకుండా నిర్వహించడానికి, వాటికి సుఖకరంగా, అతీతజ్ఞానంతో క్రీడలాగా భావించి వ్యవహరించగల సామర్థ్యం కలుగుతుంది. బోధిసత్వ స్థితిని సాధించటానికి ఉపకరిస్తుంది. మానసిక ఇంద్రియ విషయాలతో సుఖాన్ని పొందే బాలుని అనుభవంతో దీనిని పోల్చవచ్చు. పన్నెండు మంది స్త్రీ బోధిసత్వం చేత పురుష బోధిసత్వుల చేత ఇది స్థిరీకరించబడుతుంది.

**6. నామ దీక్ష:** ఇంకా తూర్పు ద్వారం వద్దనే ఉండి శిష్యుడు నామ దీక్షకు అర్థిస్తాడు. కంకణం దీనికి బాహ్య వస్తువు. ఇది ప్రవర్తనా నిగ్రహానికి సంకేతం. దేహంలోని భాగాలు వాటి చర్యలు దీని అంతర్గత విషయాలు. ఈ దీక్ష శిష్యుని శరీర భాగాలను వాటి విధులను పరిశుద్ధం చేస్తుంది. పన్నెండు మంది స్త్రీ పురుష దేవతల శక్తులను సాధించటానికి సామర్థ్యానిస్తుంది. అనంతమైన ప్రేమ, కరుణ, ముదిత, సమత అనే నాల్గు శక్తుల ద్వారా దుష్టశక్తులను నశింపజేసే సామర్థ్యం వస్తుంది. అరవ బోధిసత్వ స్థితిని చేరటానికి సామర్థ్యాన్నిస్తుంది. శిశువు నామకరణంతో దీనిని పోల్చవచ్చు.

**7. అనుజ్ఞ:** గురువు వజ్రాన్ని ధరించి మండలం చుట్టూ సవ్యప్రదక్షిణంగా పశ్చిమ ద్వారం వద్దకు శిష్యుణ్ణి తీసుకొని వెళ్ళి కాలచక్రం వెనుక వైపు హరిద్రా వర్ణ ముఖం ముందు ముఖాముఖిగా ఉంచుతాడు. ఇది ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పరిశుద్ధం చేయటంలో అనుబంధితం. బాహ్య వస్తువులు ఐదుగురు తథాగతులకు చిహ్నాలు, అక్షోభ్యానికి వజ్రం, అమోఘసిద్ధికి ఖడ్గం, రత్న సంభవునకు మణిరత్నం, అమితాభునికి పద్మం, వైరోచనునికి చక్రం; ఇందుకు అంతర్గత విషయాలు: ఇంద్రియ స్కంధాలు, విజ్ఞాన ధాతువులను శుద్ధి చేస్తుంది. శూన్యత నుండి వేరు చేయలేని దృఢమైన ఇంద్రియ జ్ఞాన సామర్థ్యాన్ని ఇస్తుంది. ఇది వజ్రసత్వునికి ప్రజ్ఞా పారమితలకు సహజధర్మం. మణపూరక చక్రంలోని బిందువును శుభ్రపరచి సప్తమ బోధిసత్వ స్థితిని చేరే సామర్థ్యాన్ని శిష్యునకిస్తుంది. ఇది శిష్యునికి ప్రథమ పాఠం నేర్పటం వంటిది.

ఈ ఏడు దీక్షలు శిశువు అభివృద్ధి దశలలో ఏడింటితో పోల్చవచ్చు. దీన్నే శిశువులాగా ప్రవేశించటం అనవచ్చు. ఇవి మొదటి ఏడు బోధిసత్వ భూమికలను పొందటానికి అర్హుణ్ణి చేస్తాయి.

1. జలదీక్ష : ప్రథమ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - సుఖప్రదం
2. కిరీట దీక్ష : ద్వితీయ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - నిష్కళంకం
3. కిరీట పతన దీక్ష : తృతీయ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - ప్రకాశపదం
4. వజ్ర-కిరీట దీక్ష : చతుర్ధ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - కాంతి ప్రసారకం
5. వ్రజ దీక్ష : పంచమ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - అజేయత
6. నామ దీక్ష : షష్ఠమ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - స్వస్వరూప సిద్ధి
7. అనుజ్ఞ : సప్తమ బోధిసత్వ భూమికను ప్రేరేపిస్తుంది - అత్యంత పురోగతి

ఈ ఏడు దీక్షలను స్వీకరించి వాటిని నిరంతరాభ్యాసం చేయాలి. పరిత్యాగం, బోధిచిత్తం, మధ్యమ మార్గం అన్న లక్షణాలను అలవరచుకోవాలి. ఈ అభ్యాసాన్ని ఉత్పన్న దశాసాధన అంటారు. ఉత్పన్న దశా సాధన నాలుగు భాగాలుగా విభక్తం.

*1. మహావిజయ మండలం:* దీక్ష పొందినవారిని సంతోషంతో నింపుతుంది. అతని / ఆమె ధాతువులను, స్కంధాలను, లక్ష్యాలను, అవయవాలను, చర్యలను, దైవత్వంలోకి పరిణమింపజేస్తూ అత్యంత దృఢమైన కాలచక్ర దేహాన్ని ఇస్తుంది.

*2. మహావిజయోత్సాహం:* కాలచక్ర మండలాంతర్గతులను కాలచక్ర మండలాన్ని పరిశుద్ధం చేస్తుంది. విశ్వం యొక్క బాహ్య కాలచక్రానికి, జ్ఞానం వల్ల పరిణమించిన వాని శరీరాంతర్గత కాలచక్రానికి, పర్యాయ కాలచక్రానికి, దేవతల వివిధ గుణవిశేషాలకు మధ్య గల ప్రతీకాత్మక సంబంధాలను గ్రహించగలుగుతారు. దీనివలన కాలచక్ర దృఢ వాక్కును సాధించగలుగుతారు.

*3. బిందుయోగము:* ఇది పరమ సుఖాన్ని శూన్యతను ఏక కాలంలో అనుభవించటం ద్వారా నాలుగు రకాల సంతోషాన్ని అనుభవిస్తాడు. దృఢమైన చిత్తాన్ని పొందగలుగుతాడు.

*4. సూక్ష్మయోగం:* నాల్గురకాల సుఖానికి గాఢానుభవాన్నిస్తుంది. దీని ద్వారా దృఢమైన ఇంద్రియజ్ఞానం కలుగుతుంది. ఈ సాధన స్వాధీనమైన తర్వాత మరణ దశను అనుభవిస్తాడు. ఈ అనుభవం మృత్యువుపై విజయానికి సన్నాహక సంజ్ఞాగా గుర్తిస్తాడు.

సమాపన్న దశ:

ఇప్పుడు నాల్గు ఉన్నత దీక్షలు స్వీకరించడానికి శిష్యుడు సిద్ధంగా ఉన్నాడు. వీటిని నిలువుగా రెండు భాగాలుగా విభజించవచ్చు. ఉత్తమాధిపత్యాన్ని ఇచ్చేది ఒక నాలుగు, ఉత్తమోత్తమాధిపత్యాన్ని ఇచ్చేవి ఇంకొక నాలుగు. ఉత్తమాధిపతిగా చేసే మొదటి నాలుగు పరంపరాగత సత్యాలకు చెందినవి. ఉత్తమోత్తమాధిపతిగా చేసే రెండవ నాలుగు పారలౌకిక సతాలకు చెందినది.

ఉత్తమాధిపత్యం ఇచ్చే నాల్గింటిలో మొదటిది కలశాధికారం. ఇది సుస్థిరమైన ఎనిమిదవ బోధిసత్వ భూమికకు కొనిపోతుంది.

రెండవది సుజ్ఞానమనే తొమ్మిదవ బోధిసత్వ భూమికకు కొనిపోతుంది. మూడవది ప్రజ్ఞాధిపత్యాన్ని సమకూర్చి ధర్మక మేఘమనే పదవ బోధిసత్వ స్థితికి తీసుకొని వెళుతుంది. నాల్గవది ప్రపంచాధిపత్యాన్నిచ్చే బుద్ధత్వానికి కొనిపోతుంది.

తర్వాత ఉన్నతోన్నత ఆధిపత్యానికి కూడా ఇటువంటి పేర్లే వేర్వేరుగా ఉంటాయి. మొదటిదైన కలశాధికారం సంతోషానుభవాన్నిస్తుంది. నిర్మాణకాయ సిద్ధిని కలిగిస్తుంది. రెండవదియైన రహస్యాధికారం అత్యంత సంతోషానుభవాన్నిచ్చి సంభోగకాయసిద్ధికి అర్హతనిస్తుంది. మూడవదియైన ప్రజ్ఞాధికారం పరమ సుఖానుభవాన్నిచ్చి ధర్మకాయ సిద్ధికి దారితీస్తుంది. ఈ విశ్వాధిపత్యం సంపూర్ణ సంబుద్ధితో పర్యవసించి, బుద్ధుని స్వభావ సత్యమైన దేహాన్ని పొందనర్హత నిస్తుంది.

ఇప్పుడు సమాపత్తి, సాధన ప్రారంభమవుతుంది. ఈ సాధన మళ్లీ ఆరు విభాగాలు. 1. ప్రత్యాహారం యోగం 2. ధ్యానయోగం 3. ప్రాణాపాయ యోగం 4. ధారణ యోగం 5. విపస్సనాయోగం 6. సమాధియోగం. ఈ దశలలో తీవ్ర అభ్యాసం ద్వారా కాలచక్ర - విశ్వమాత దేహాన్ని తన చైతన్యశక్తి నుండే సృష్టించుకోగలుగుతాడు. ఇది తంత్ర మార్గానికి కాలచక్ర దీక్షకు పరాకాష్ఠ.

## దీక్షా కలాపం ముగిసిన తర్వాత:

దీక్షాకలాపం అయిపోయిన తర్వాత నిర్మించిన మండలం మొత్తాన్ని కొన్ని మంత్రాలతో విధి విధానాలతో విచ్ఛిన్నం చేస్తారు. ముందుగా దేవతలను దీక్షా సమయంలో సమకూరిన పుణ్యఫలాల నన్నింటిని శిష్యులందరు చేతనా సత్వముల క్షేమం కొరకు, బుద్ధధర్మం వ్యాప్తి కొరకు, జీవుల జ్ఞానం కొరకు అర్పిస్తారు. దీక్షా కలాప నిర్వహణ సమయంలో ఏవైనా అపచారాలు జరిగి ఉంటే క్షమించమని దేవతలను అర్థిస్తారు. "ఆధ్యాత్మిక సిద్ధులు కలుగుగాక" అని మండల దేవతలను శిష్యులు ప్రార్థిస్తారు. తమ తమ నెలవులకు నిష్క్రమించవలసినదిగా అర్థిస్తారు.

మండల తూర్పు ద్వారం వద్ద ధ్యానించి, మండల మందలి దేవతల గుణ విశేషాలను గురువు వజ్ర సహాయంతో సమీకరించి, అన్ని ద్వారాల నుండి కోణాల నుండి కేంద్రానికి రేఖలతో గుర్తులు గీస్తారు. తర్వాత మండల నిర్మాణానికి వినియోగించిన ఇసుక నంతటిని కేంద్రం వైపుకు ప్రోగు చేస్తారు. దీనినంతటిని అలంకరించిన కలశంలో సేకరించి, సంతుష్టులైన నాగదేవతలున్న నదికి గాని సరస్సుకు గాని తీసుకొనిపోయి వేడుకతో దాన్ని స్వస్థలానికి చేరుస్తారు.

ఈ కలశాన్ని నీటితో నింపి మండల స్థలానికి తిరిగి తెచ్చి నీటిని అక్కడ చల్లుతారు. కలాపంలో వాడిన ఖడ్గాలను తీసివేసి పాలతో కడిగి ఖడ్గాలను ఆశ్రయించి ఉన్న దేవతలను తమ తమ నివాసాలకు నిష్క్రమించమని వేడుకుంటారు. చివరిసారిగా ముగింపు మంత్రాలు పఠించడంతో కాలచక్ర దీక్షా క్రతువు సమాప్తమవుతుంది.

## ముగింపు:

భారతదేశ చరిత్రలో మరొక కీలక ఘట్టం. ఇది 2006 జనవరి 5 నుండి 16 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, అమరావతిలో జరిగిన కాలచక్ర-2006 బౌద్ధ ధ్యాన విధానంలో అత్యున్నత స్థాయి యోగతంత్ర పరంపర! కాలచక్ర! బౌద్ధ ఆధ్యాత్మిక విశ్వాసాన్ని అనుసరిస్తున్న భక్తుడు కాలచక్ర సాధికారతను పొందటం ద్వారా ఒక ఉచ్ఛస్థితికి చేరుకునట్లుగ అవుతుంది. ఇప్పటివరకు 12 సార్లు ఈ సాధికారతను తన బౌద్ధ భిక్షువులకు దాఖలు పర్చిన మానవీయ 13వ సారి కాలచక్ర సాధికారతను బౌద్ధ ఆరామమైన అమరావతి చెంత వున్న శ్రీధ్యాన్య కటకంలో ఇచ్చినారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలకు చెందిన 'నర్బులక సంస్థ' కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహించినారు. దీనికి సుమారు లక్షమంది బౌద్ధ యాత్రికులు హాజరైనారు. సుమారు 30 దేశాల నుండి పాల్గొన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ముఖ్యమైన ఘట్టం. బౌద్ధ ధర్మాన్ని అనుసరించటం అనేది కొందరు బుద్ధజీవులకే పరిమితమైన అంశమా? బౌద్ధ ధర్మ అనుసరణ సామాన్యునికి అందుబాటులో లేని ఖరీదైన విషయమా? ఈ ప్రశ్నలకు కాలచక్ర-2006 సమాధానము ఇచ్చినది. మన తెలుగు నేల మీద బౌద్ధ ధర్మానికి మరో పునరుజ్జీవనం కలిగిందని చెప్పవచ్చు.

ఈ కాలచక్ర సభలలో నా అనుభవాల ఆధారంగా నేను గడించిన జ్ఞానాన్ని నా ఈ వ్యాసం ద్వారా మీకు తెలియజేయడానికి సదా గర్విస్తూ ఈ కీలక ఘట్టంలో నన్ను అనువాదకునిగా నా సేవలను ఉపయోగించుకొన్నందుకు కారకులైన అందరికీ నా కృతజ్ఞతలు.

# బౌద్ధ దేవతలు - ఒక పరిశీలన

- డాక్టర్ వి.వి. సుబ్బారెడ్డి

బౌద్ధమతం అనగానే సాధారణంగా మనందరికీ గౌతమ బుద్ధుడు గుర్తుకు వస్తాడు. కాని హిందూమతంలో వలే బౌద్ధ మతంలో కూడా అసంఖ్యాకంగా దేవతలు వెలిశారు. ఈ దేవతలనే బోధిసత్వులంటారు. ఈ మతంలో మూడు శాఖలున్నాయి. అవి - హీనయానం, మహాయానం, వజ్రయానం. ఈ మూడింటిని మూడు శాఖలుగా గాక బౌద్ధ మత వికాస చరిత్రలో ఒకే భావధార యొక్క మూడు ప్రవృత్తులుగా కూడా పేర్కొనవచ్చు. వజ్రయానం ఆవిర్భవించడంతో బౌద్ధులకు ఒక స్థిరమైన దేవగణ మేర్పడింది.

బుద్ధుడు భగవంతుని ఉనికిని గురించి మౌనం వహించాడు. దేవుడొకడున్నాడని (హిందూ మతం వలె) ఆయన నమ్మలేదు. అందువల్ల మొదట బౌద్ధమతంలో విగ్రహారాధన లేదు. కాని, మహాపరినిర్వాణం జరిగిన వెంటనే ప్రజలు బుద్ధుని ధాతువులను ఆరాధించసాగారు. వాటి మీద చైత్యాలు నిర్మించి వాటిని ఆరాధించారు. అంటే ఆనాడే బుద్ధుని అలౌకిక వ్యక్తిగా ప్రజలు పరిగణించారు. రాజులు పోటీపడి బుద్ధుని అస్థిధాతువుల్ని తెప్పించి కొత్త స్తూపాలను నిర్మింపజేసినట్లు బౌద్ధ వాఙ్మయాన్ని బట్టి తెలుస్తున్నది. మౌర్య అశోకుడు **84000** స్తూపాలను నిర్మించినట్లు బౌద్ధ గ్రంథాలు పేర్కొంటున్నాయి. అతి ప్రాచీన బౌద్ధ స్తూపాల మీద బుద్ధుని మానవ రూపంలో శిల్పీకరించలేదు. బౌద్ధం భౌగోళికంగా విస్తరించడం చేత బౌద్ధ భిక్షువుల ఆచారాలలో విభేదాలు పొడసూపాయి. రెండో సంగీతిలోనే ఈ విభేదాలు బలపడి సంఘం థేరవాద, మహాసాంఘిక శాఖలుగా చీలిపోయింది. బుద్ధునకు మొదటగా లోకోత్తర గుణాలను ఆపాదించినది మహాసాంఘికులే. ఈ నూతన ఆలోచనా విధానం ఫలితంగానే బోధివృక్షం, బుద్ధుని పాదముద్రలు, ధర్మచక్రం, చైత్యం మొదలైన బౌద్ధ చిహ్నాలను బుద్ధుని ఉనికిని తెలిపే సంకేతాలుగా భావించి ఆరాధించడం ప్రారంభించారు. వారికి బుద్ధుడే దైవం. అప్పటి నుంచే వాస్తు నిర్మాణాల మీద బుద్ధుని మానవ రూపంలో చూపుతూ ఉండడం కాలక్రమేణ ప్రారంభమైనది. మహాసాంఘికులలో కూడా రెండు శాఖలు బయలుదేరాయి. అవి యోగాచారము, మాధ్యమికము. యోగాచారులకు నిర్వాణమంటే నిరాత్మ అనే దేవీ సంగమము. ఈ సుఖ సంయోగ భావమే వజ్రయానంలోని కొన్ని రీతులకు కారణమై ఉండవచ్చు. వైదిక మతంలో యోగాచారంలో గల పద్ధతులకు వజ్రయాన పద్ధతులకు సామ్యముంది. వజ్రయానంలో మంత్రతంత్రాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. వజ్రయానంలో తాంత్రిక దేవతలను కొందరిని తమ శక్తులతో పాటు నాలుగు భంగిమలలో చూపిస్తుంటారు. అందులో కౌగిలి ఒకటి. దీనినే 'టిబెటన్' భాషలో 'యాణ్‌యూన్' అంటారు.

క్రీ.శ. రెండు లేదా మూడు శతాబ్దాల నాటికే, బౌద్ధ దేవగణం కొంత వరకు ఏర్పడింది. 'సుఖావతి వ్యూహ'మనే గ్రంథంలో అమితాభ, బోధిసత్వ, అవలోకితేశ్వర వంటి బౌద్ధ దేవతల పేర్లు ఉన్నాయి. క్రీ.శ. 7, 8 వ శతాబ్దాల నాటికి బౌద్ధులకు ఒక స్థిరమైన దేవగణం ఏర్పడింది.

అవలోకితేశ్వరుడు, మంజుశ్రీ, తార, మైత్రేయుడు, ధ్యానిబుద్ధులు వారి శక్తులు, హిందువుల నుంచి గ్రహించిన కొంతమంది దేవతలు మొదలైన వారంతా కలిసి బౌద్ధ దేవగణంగా ఏర్పడ్డారు.

డా॥ వి.వి. సుబ్బారెడ్డి రీడర్, చరిత్రశాఖ, ఎస్.జి.హెచ్.ఆర్. ఎం.సి.ఎం.ఆర్. కళాశాల, గుంటూరు.

బౌద్ధ దేవతలలో అవలోకితేశ్వరుడు, మంజుశ్రీ అనేవారు గొప్పవారు. మైత్రేయుడు, సుమంతభద్రుడు, మహాస్థానప్రాప్తుడు, క్షితిగర్భుడు అనేవారు చైనా, జపాన్‌లలో ప్రముఖులుగా పేర్కొనబడ్డారు.

అవలోకితేశ్వరుడు అంటే (స్వర్గం నుంచి) భూమిని చూచేవాడని అర్థం. ఈ పదానికి దృశ్యమానుడు (చూచేవాడు) అని అర్థం కూడా చెబుతున్నారు. అవలోకితేశ్వరుడు తన భక్తులను మరణశిక్ష నుంచి, హింస నుంచి, దుఃఖం నుంచి, దురాశ నుంచి, ఇంకా అనేక పాప కార్యాల నుంచి రక్షిస్తాడు. ఇతనిని పూజిస్తే సంతానం లేని స్త్రీలకు సంతానం కలుగుతుంది. ఈ దేవుడు అనేక రూపాలలో దర్శనమిస్తాడు. బుద్ధుడుగానో, బోధిసత్త్వుడుగానో, హిందూ దేవతగానో, పిశాచంగానో, బ్రాహ్మణుడుగానో ఇంకా అవసరం వస్తే ఏ రూపంనైనా ధరించగలడు. అవలోకితేశ్వరునకు మహాకరుణ, లోకనాథ, లోకేశ్వర, పద్మపాణి మొదలైన ఎన్నెన్నో ఇతర పేర్లు ఉన్నాయి. ఇతని ప్రతిమ మానవాకారంలో ఉంటుంది. ఇతడు తలకు కిరీటం ధరించి, కుడిచేయిని ముందుకు చాచి వరదముద్రలో, ఎడమ చేతిలో ఎర్ర కమలం ధరించి, వంటి నిండా అన్ని రకాల ఆభరణాల నలంకరించుకొని ఉంటాడు. కొన్ని సందర్భాలలో ఇతనికి నాలుగు చేతులు అంతకు మించి కూడా కనబడతాయి. ఇతని చేతుల్లో ఒక్కొక్కసారి పుస్తకం, జపమాల, అమృతభాండం మొదలైనవి ఉంటాయి. ఇతనికి చాలా కండ్లు, చేతులు వుండడాన్ని బట్టి ఆ కండ్లతో నాలుగు దిక్కులా బాధపడే తన భక్తులను చూచి వారికి తగిన సహాయం చేసి రక్షణ కల్పిస్తాడని నమ్మకం. అజంతా మొదటి గుహలో పద్మపాణి బోధిసత్త్వ అవలోకితేశ్వర చిత్రం వుంది. బుందేల్‌ఖండ్‌లో సింహనాద్ అవలోకితేశ్వరమూర్తి ఉంది. పద్మాలు ధరించిన మూర్తిని పద్మపాణి అంటారు.

ఔరంగాబాదులోని ఏడవ గుహలో పద్మపాణి అవలోకితేశ్వర శిల్పం ఉంది. తామరపూవు పీఠంపై నిలబడి ఒకచేత పువ్వుని ధరించి రెండో చేత అభయాన్ని ఇస్తూ నిలబడి ఉన్నాడు. అగ్ని పీడితులకు, యుద్ధ బాధితులకు, వరద బాధితులకు, సర్ప పీడితులకు, సింహ, శార్దూల మత్తేబాధి మృగ పీడితులకు 'కలి' చేత పీడింపబడే వారికి బాధా విముక్తి కలిగించడానికై అభయాన్ని ఇస్తూ అవలోకితేశ్వరుడు చిరునవ్వుతో నిలబడి ఉన్నాడు (చిత్రం 1).

అవలోకితేశ్వరమూర్తి పక్కగా తరుచుగా ఒక స్త్రీ విగ్రహం కనిపిస్తుంటుంది. ఆమె పేరు తార. ఈ దేవత టిబెట్‌లో ఎక్కువగా ప్రచారంలో ఉంది. తార అంటే తరింపజేయునది అని అర్థం. అంటే జీవన స్రవంతిని దాటడానికి మార్గాన్ని చూపేది అన్నమాట. తాంత్రిక విద్య విరివిగా ప్రచారంలో వున్న కాలంలో ఈమెను అవలోకితేశ్వరుని భార్యగా పరిగణించడం జరిగింది. ఈమె అనేక రూపాలలో కన్పిస్తోంది. క్రీస్తుశకం ఏడవ శతాబ్దం తర్వాత ఈమెకు శివశక్తులను ఆపాదించినట్లు తెలుస్తోంది. ఈమెకు గల అష్టోత్తర శతనామాలలో సాధుగుణాలను సూచించేవే గాక- భయంకర నామాలైన కపాలధారిణి మొదలైనవి ఉన్నాయి. పరిశీలింపగా, పై నామాలను బట్టి వీరు బోధిసత్త్వునకు శైవభావాలను ఆపాదించినట్లుంది. మన దేశంలో బీహార్ రాష్ట్రంలో 'తార' ప్రతిమలు విరివిగా లభ్యమయ్యాయి. ఔరంగాబాదు ఏడవ గుహలో 'తార' శిల్పం వుంది. అద్భుతమైన శిరోజాలంకరణ, చెవులకు పెద్ద పెద్ద రింగులు, కంఠాభరణాలు, నడుముకు అందమైన వడ్డాణం, భుజాలకు ఆభరణాలు, పాదాలకు మంజీరాలు ధరించి, సర్వాలంకార భూషితురాలై ఒక చేత కలువ పువ్వుని ధరించి ఉంది

(చిత్రం 2). బౌద్ధులు నేటికి 'తార'ను పూజిస్తారు. కంచిలోని కామాక్షి మొదట తారాదేవి అని శంకరాచార్యులు ఆమెను పార్వతిగా మార్చాడని కథనం.

అవలోకితేశ్వరుడు తర్వాత చెప్పదగిన గొప్ప బోధిసత్త్వుడు మంజుశ్రీ. క్రీ.శ. ఆరవ శతాబ్దం నుంచి మంజుశ్రీని దేవునిగా పూజించడం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇతనికి మంజునాథుడు, మంజుఘోషుడు, కుమారభూతుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. కుమార భూతుడు అనే పేరు ఉండడాన్ని బట్టి ఇతడు రాకుమారుడని, బుద్ధుని కుమారుడై వుంటాడని భావన. మైత్రేయ బోధిసత్త్వునికి ఇతడు గురువు. ఇతడు సింహంపై కూర్చొని ఒక చేతితో విజ్ఞాన ఖడ్గాన్ని, మరొక చేతితో గ్రంథాన్ని పట్టుకొని ఉంటాడు. ఒక్కొక్క సారి కేవలం ధర్మచక్రాన్ని పట్టుకొని ఉంటాడు. నిత్యయవ్వనుడవుట వలన ఇతనికి బోధిసత్త్వులందరూ బాగా తెలుసు. ఇతడు కరుణామయు డైనప్పటికీ మానవాళికి సహాయపడడనే నమ్మకం ఉంది. ఇతని రూపాలు గురించి, ఇతడు చేసే అద్భుత కార్యాలను గురించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. మంజుశ్రీని ఆరాధించడం మన దేశంలోనే గాక విదేశాలైన నేపాల్, టిబెట్, చైనా, జపాన్ దేశాలలో కూడా వాడుకలో వుంది. మధురలో ఇతని పేరు మీద నిర్మించిన ఒక స్తూపం కూడా ఉంది.

అవలోకితేశ్వరుడు, మంజుశ్రీల తర్వాత చెప్పుకోదగ్గ బౌద్ధ దేవుడు - మైత్రేయుడు. ఇతనికి 'అజితుడు' అనే పేరు కూడా ఉంది. మధ్య ఆసియాలోని తురఫాన్ అనే నగరంలో ఇతనికి ప్రసిద్ధమైన దేవాలయం ఉంది. మైత్రేయుడు కూడా బుద్ధుని వలె అనేక జన్మలెత్తి చివరకు బుద్ధత్వం పొందాడు. తన తర్వాత మైత్రేయుడు అవతారం దాల్చుతాడని గౌతమ బుద్ధుడే స్వయంగా చెప్పాడు. మైత్రేయుడు ధర్మచక్ర కార్యక్రమాలను పరిరక్షిస్తుంటాడు. ఇతని విగ్రహాలు నిలుచున్నట్లు గాని, కూర్చున్నట్లు గాని ఉంటాయి. 'పద్మాసనాసీను'డుగా కనిపించడు.

ఖరీదైన రత్నాభరణాలు, కుడిచేతిలో తామరపువ్వు, కిరీటంలో దైత్య చిహ్నం మైత్రేయుని లక్షణాలు. ఎల్లోరాలోని రెండోగుహలో గర్భగుహలో ప్రలంబ పాదాసీనుడైన బుద్ధునికిరువైపులానున్న బోధిసత్త్వ అనుచరులలో ఒకనిగా కుడిచేతిలో వింజామరము ధరించి ఎడమ చేతిని నడుముపైన ఆనించి 'మైత్రేయుడు' కనిపిస్తాడు.

సుమంతభద్రుడు టిబెట్ ప్రజలకు అత్యంత ప్రియతమ దేవత. బౌద్ధ ధర్మాలను పాటించని వారిని శిక్షించడం ఇతని విధి. ఆకుపచ్చని రంగు కలిగి, ఏనుగుపై స్వారీ చేస్తున్నట్లు ఇతడు చిత్రీకరించబడ్డాడు.

స్వర్గాన్ని ఏలే త్రిమూర్తులలో మహాస్థాన ప్రాప్తుడు ఒకరు. అమితాభుడు, అవలోకితుడు ఈ త్రిమూర్తులలో మిగతా ఇద్దరు. ఇతడు వజ్రపాణి బోధిసత్త్వుల కోవకు చెందినవాడు.

క్షితిగర్భుడు పురుషదేవత అయినప్పటికీ కొన్ని స్త్రీ లక్షణాలున్నాయి. స్త్రీలు ప్రసవించేటప్పుడు ఇతడు వారికి సహాయపడతాడు. అమితాభ అవలోకితుల వలెనే ప్రాణకోటిని రక్షించడమే ఇతని కర్తవ్యం. ఇతడు సన్యాసి రూపంలో బోడితలను, దండాన్ని కలిగివున్నట్లు చిత్రింపబడ్డాడు.

పైన పేర్కొన్న మైత్రేయుడు, సుమంత భద్రుడు, మహాస్థాన ప్రాప్తుడు, క్షితిగర్భుడు చైనా, జపాన్‌లలో ప్రముఖులుగా పేర్కొనబడుచున్నారు.

మహాయాన బౌద్ధమతం ప్రకారం గౌతమ బుద్ధుని తర్వాత అనేకమంది బౌద్ధ దేవతలు వెలిశారు. పెక్కు వ్యక్తులు బౌద్ధ దేవతలుగా కల్పితమయ్యారు. వీరిని తథాగతులంటారు. వీరు ఈ లోకంలోని వారు గాదు. ఈ విశ్వంలోని అన్ని దిక్కులకు చెందినవారు. ఇలాంటి అలౌకిక బౌద్ధ దేవతలలో ఐదుగురిని మాత్రం "ధ్యానిబుద్ధు"లంటారు. వారెవరంటే: వైరోచనుడు, అక్షోభ్యుడు, రత్నసంభవుడు, అమితాభుడు, అమోఘసిద్ధి. ధ్యాని బుద్ధులంటే ధ్యాననిష్ఠకు సంబంధించిన బుద్ధులు. ఈ అయిదుగురు ధ్యానిబుద్ధులు గౌతమ బుద్ధుని ధ్యానం ఫలితంగా ఉద్భవించారు. తిరిగి వీరు తమ ప్రతిబింబాలుగా బోధిసత్త్వులను, మానవ బుద్ధులను, స్త్రీ దేవతలను సృష్టించారు.

ఈ అయిదుగురిలో వైరోచనుడు, అమితాభుడు అనేవారు ముఖ్యులు. వైరోచనుని మహిమలు విరివిగా ప్రచారంలో వున్నాయి. వైరోచన అనే పేరు సూర్యునకు ఉంది. మరి ఈ సూర్య దేవుడు ఏ విధంగా బుద్ధుడయ్యాడో తెలియదు. అయితే కాంతికి, బుద్ధునకు అవినాభవ సంబంధముంది. అంధకారాన్ని కాంతి ఏవిధంగా తొలగిస్తుందో ఆ విధంగానే అజ్ఞానమనే అంధకారాన్ని బుద్ధులు తొలగిస్తారు.

అక్షోభ్యుడు తూర్పు దిశాధిపతియని ప్రతీతి. పోతే అమితాభునికి, 'అమితాయువు' అనే పేరు కూడా ఉంది. అమితాయువు అంటే మితము లేని ఆయుస్సు కలవాడని అర్థం. ఇతడు ఆసియా ఖండంలోని గొప్ప దేవతల్లో ఒకడుగా ప్రఖ్యాతి గాంచాడు. ఇతడు పశ్చిమ దిశాధిపతి, అమితాభుని యెడల భక్తి కలిగి ఆయనను సేవించిన వారిని వారి మరణానంతరం వారి ఆత్మలను "సుఖవతి" అనే అతని స్వర్గసీమకు తీసుకెళతాడు.

బౌద్ధ దేవతలకు నాలుగు శరీరాలు లేదా నాలుగు రూపాలు ఉంటాయి. అవి ధర్మకాయం : ఇది బౌద్ధ నిర్మాణానికి వర్తిస్తుంది. సంభోగకాయం : ఇది స్వర్గంలో దేవతలు ధరించే దివ్యమైన, తేజోవంతమైన రూపం. నిర్మాణ కాయం : ఇది మానవ రూపానికి మార్పు చెందే దశ. ఉదా: మానవ రూపం దాల్చిన బుద్ధుడు. మహాసుఖకాయం లేక వజ్రకాయం : సతీసమేతంగా విహరించే బోధిసత్త్వులకిది వర్తిస్తుంది.

మృత్యుదేవత చిత్రం టిబెట్‌లోని బౌద్ధ దేవాలయాలలో ఎక్కువగా చూడవచ్చు. ఈ దేవత ఒక చక్రాన్ని పండ్లతో పట్టుకొని క్రింద పడియున్న స్త్రీ పురుషులను కాళ్ళతో త్రొక్కుతున్నట్లుంది. ఒక వరాహం, ఒక కోడిపుంజు, ఒక సర్పం పరస్పరం కలహించుకుంటూ కరవడానికి ప్రయత్నిస్తున్నట్లు ఉంటాయి. వరాహం మూర్ఖత్వానికి, కోడిపుంజు వ్యామోహానికి, సర్పం ద్వేషానికి చిహ్నాలు.

భారతదేశంలో జన్మించి దైవత్వాన్ని పొందిన మహనీయుడు పద్మసంభవుడు, ఇతడు అశ్వారూఢుడై వుంటాడు. ఇతని చేతిలో ఒక దండముంటుంది. ఆ దండం పై భాగం మూడు భాగాలుగా చీలివుంటుంది. చీలిన భాగంలో ఒక కపాలం, ఒక శిరస్సు, ఒక వజ్రాయుధం వుంటుంది. ఇతడు ఎనిమిదవ శతాబ్దానికి చెందినవాడు. మహాయాన బౌద్ధాన్ని బహుళ ప్రచారం చేశాడు. ఈ పద్ధతిలో తాంత్రిక సాంప్రదాయపు ఆచారాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సాంప్రదాయం ప్రకారం బౌద్ధ దేవతలు ప్రచారంలోకి వచ్చారు. హిందూ మతం నుంచి కూడా బౌద్ధులు, గణపతి, సరస్వతి మొదలైన కొంతమంది దేవతలను వారి మతంలోకి దేవతలుగా స్వీకరించారు.

# బుద్ధుడు - బౌద్ధం

- నల్ల భూమయ్య

'వేద' భూమిలో, 'కర్మ' భూమిలో బుద్ధుడు సాక్షాత్కరించడానికి ముందు కొనసాగుతూ వస్తూన్న సాంఘిక జీవన గతులు - మనువాదం పాతుకు పోయివుంది. శూద్రుల జీవితము యావత్తు అగ్రవర్ణాల సేవలకు మాత్రమే అంకితం. 'పరలోక సుఖాలు', ఊర్వశి అందాల వూరింపులన్నీ నిమ్నవర్ణాలకు, వాటి అనుభవాలన్నీ మట్టుకు అగ్రవర్ణాల వారికి, సంఘంలో ముప్పావు సంఖ్యను మించి వున్న నిమ్నవర్ణాల, వాళ్ళ వృత్తి కళానైపుణ్యాలన్నీ గూడ బూడిదలో పోసిన పన్నీరే. నిమ్న వర్ణం వాడెవడన్నా దొంగచాటుగా వేదాన్ని చదివితే వాడి నాలుక మొదటి కంటా తెగ్గొట్టబడడమే. ఎవడన్నా దొంగచాటుగా వేదాన్ని వింటే వాని చెవి గూబ గుంటల్లో ఎర్రగా కరగించిన సీసపు ద్రవం నిండాల్సిందే. సంఘపు 'పాదాల రక్షకుడి' నీడ అగ్రవర్ణం వాడి మీద సోకితే, యింక ఆ నీడ ఆ తర్వాత భూమ్మీద కన్పించదు.

అగ్ర వర్ణాలకు మగువ, మధిరల సుఖ భోగలాలసత్వాలు జన సామాన్యానికి అంధకార జీవితాలు. నిమ్నవర్ణాల మెదళ్ళన్నీ బ్రాహ్మణుల స్వాదీనం, శరీరాలన్నీ రాజుల స్వాదీనం. వాళ్ళ శ్రమ ఫలితం వైశ్యుల స్వాదీనం.

రంతిదేవుడను రాజు
తొల్లి, అనుదినంబును గో సహస్ర -ద్వయంబు,
తా వధియింపడే వేయి వత్సరములు?

రాజు అనుదినంబును గో సహస్ర ద్వయాన్ని వధించి బ్రాహ్మణులకు సంతర్పణ చేయడం.

జన బాహుళ్యానికి - వ్యవసాయానికి, బ్రతుకుదెరువుకు దార్లు కరువై పోసాగాయి.

'మలి వేదమత' పునాదుల మీద నిలబడ్డ సమాజం.

ఆలిరంకు తెల్పు అఖిల యజ్ఞంబులు,

తల్లి రంకు తెల్పు తద్దినాలు -

అగ్రవర్ణాలు - లొట్ట తాగియతడు లోకుల జెరచురా అన్న విధంగా సాగుతూన్న సమాజం.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు కలిసి కట్టుగా శూద్రులను, చండాలురను దోపిడి చేయడం, హింసించడమే కాదు, బ్రాహ్మణులు, క్షత్రియులు ఆధిపత్యం గురించి ఒండొరులు పోరులు సల్పుకున్న సంఘటనలు గూడ వున్నాయి. క్షత్రియులు - శత్రు రాజులతో పోరాడి ప్రాణాలు తీసికోడానికైనా, యివ్వడానికైనా సిద్ధంగా వున్నది తాము - చావుబ్రతుకులకు వెనుదీయని బలవంతులు, పాలకులు తాము, మధ్యన పుక్కిటి బాపడు ఎవడు, వాడి ఆధిపత్యమేమిటి అంటూ బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని పతనం చేయడానికి పూనుకున్న క్షత్రియులున్నారు. కార్త్యవీర్యార్జునుడు, విశ్వామిత్రుడూ గట్రా.

క్షత్రియులు బ్రాహ్మణవంశాల్ని అంతమొందించడానికి - పూనుకుంటే, ప్రతికారం తీర్చుకోడానికి బ్రాహ్మణలు నడుంకట్టారు. క్షత్రియ వంశాల్ని అంతమొందించడానికి పరశురాముడు లాంటివాళ్ళు. ఆ తర్వాత ఏదో విధంగా సర్దుబాట్లు, సంయమనాలు. వాళ్ళ జగడం మాత్రం జనసామాన్యపు శ్రమను దోచుకునే కాడ మాత్రం కాదు - పంచుకునే కాడ మాత్రమే అన్నట్లుగా.

---

నల్ల భూమయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, హైదరాబాద్.

ఆవులు ఆవులు పోట్లాడుకుంటూంటే లేగల కాళ్ళు విరిగినట్లు - జనసామాన్యానికి ఎప్పుడూ కంటకమే. వాళ్ళు పోట్లాడుకున్నా, చెట్టాపట్టాలేసుకుని సాగుతూన్నా కూడా ప్రజా జీవితాలు మట్టుకు ఎప్పుడూ కంటకప్రాయమే. వ్యాధులు, బాధలు ముసిరే వేళ. తెలివి మీరుతూన్న జనసామాన్యాన్ని మభ్యపెట్టడానికి బ్రాహ్మణుడికి చేతగాని సమయాల్లో రాజులే జనసమాన్యాన్ని భయపెట్టడానికి 'బహ్మ' పదార్థాల్ని, 'ఆత్మల్ని', 'పరమాత్మల్ని' సృష్టించారు కూడా. సామోపాయం కాకపోతే దండోపాయం!

జనసామాన్యపు బ్రతుకులు అంధకార బంధురంలోనే ఈనుతూ వస్తున్నాయి. జన సామాన్యపు బ్రతుకులు కడగండ్ల మయం, అగ్రవర్ణాల వాళ్ళ బ్రతుకులు ఆనంద డోలికల్లో తేలియాడుతూ సాగుతూన్నాయి. జనసామాన్యాన్ని నరకపు పాపభీతిలో ముంచి, తాము మాత్రం స్వర్గసుఖాలలో మునిగి తేలసాగారు. జనసామాన్యానికి కనిపించని, అప్రయోజకమైన 'ఆత్మ' ను అందలాలు ఎక్కించారు. వాళ్ళు కన్పిస్తూన్న శరీరాలనుమట్టుకు అప్రయోజకాలు అన్నారు 'అధికులు'. నరక భయాల్ని ప్రజలకు పంచుతూ స్వర్గ సుఖాల్ని తాము పంచుకోసాగారు - అగ్రవర్ణాల వాళ్ళు.

లింగదార్ల కన్న దొంగలు లేరయా.

సతుల 'నిచ్చి' తాము సంతసింత్రు

మారు పేర్లు పెట్టి మధువును గ్రోలేరు,

వావి వరుస తప్పి వర్తించి చెడుదురు,

తలలు బోడులైన తలపులు బోడులా

అన్నట్లుగా బ్రాహ్మణుల జీవితం...

ఇలాంటి సాంఘిక నేపథ్యంలో, అగువర్ణాల వారి భోగలాలస జీవిత, నిమ్న వర్ణాల అంధకార బంధుర జీవితాల నడుమ బుద్ధుడు సాక్షాత్కరించాడు.

అహింస పరమోధర్మః అన్నాడు.

జీవహింస కూడదన్నాడు.

జీవహింస పాపమన్నాడు.

దీంతో పశువధ తప్పుతుంది. వ్యవసాయానికి పశువులు లభ్యంగా వుంటాయి. వ్యవసాయం నడుస్తుంది. తమ బ్రతుకులు కొనసాగుతాయి, కడతేరుతాయి.

వడగాడ్పులలో ఒడలిన తీగకు

చిగురులు వేసే చినుకువు నీవె

గారవించి దప్పిక తీర్చు కాలమేఘమా

నీవు, చెడనీక బ్రతికించు సిద్ధమంత్రమా

అన్నట్లుగా తోచాడు. వేదమతం - పెట్టి పోయలేని బీరముల్ వ్యర్థముల్ అన్నట్లుగా తోచింది జనసామాన్యానికి.

హెచ్చు కులజుడెవడు హీనుండెవండురా అన్నాడు.

జనసామాన్యపు నైతిక స్థైర్యం కూడదీయబడింది.

జీవులందేగానీ శిలల ఏమున్నది?

కాకులందు నేమి ఘనులకు పెట్టుడీ-

అన్నట్లుగా చెప్పాడు గౌతముడు.

మలివేద మతంలో సాగుతూన్న జనసామాన్యపు బ్రతుకులు- కొడుకు పుట్టినా ధనవ్యయభారమే, తండ్రి చస్తే మోయలేనంత ధనవ్యయభారం - బ్రతుకులు - పుట్టినా భారమే, గిట్టినా భారమే, బ్రతికినా భారమే... బ్రతుకంత బాధగా - కన్నీటి ధారగానే సాగుతూవచ్చాయి.

బౌద్ధం జనసామాన్యానికి జీవమైంది. బుద్ధుడు జన సామాన్యానికి జీవన దాత అయ్యాడు. లేవకుండా కుదేలేయబడ్డ జనసామాన్యానికి ఊతగఱ్ఱ దొరికింది. అనూహ్య స్పందన.

జన సామాన్యానికి ప్రియమైన మతం, సామ్రాట్టులకు ప్రియాతి ప్రియమైన మతం. జనరంజకమైన మతం.

బౌద్ధపు హోరులో మలివేదమతం మచ్చుకు కాన రాకుండా పోయింది - తుడిచి పెట్ట బడ్డది. అంతకు ముందెన్నడూ కానరాని సామ్రాజ్య స్థాపనలకు బౌద్ధమతం బీజాంకురం గావించింది - మౌర్య సామ్రాజ్య స్థాపనలకు పునాదులు లేచింది బౌద్ధ మతం మూలాలతోనే.

బుద్ధుడు వేదప్రమాణాల్ని తిరస్కరించాడు. కానీ తొలివేదపు మంచిని స్వీకరించాడు. బుద్ధుడు 'కపిలు'ని సాంఖ్య దర్శనానికి ప్రభావితుడైనట్లుగా చరిత్ర పుస్తకం చెప్తూంది.

బౌద్ధమతం దేశ విదేశాల నడుమ సంపర్కాన్ని పెంపొందించింది. స్థూపాలు, ఆరామాలు, చిత్రలేఖనం, శిల్పకళలు బౌద్ధమత ప్రసాదితాలు. బౌద్ధమతం - అశోకుడు, కనిష్కుడు, హర్షవర్ధనుడి వంటి మహాసామ్రాట్టులని, కళాప్రియులను దేశాని కందించింది. ఒక సహస్రాబ్ది పాటు దేశంలో దిశదిశలు వెలుగుల్ని ప్రసరించింది.

మలి వేద వక్తలు అహంభావులు, గర్వాంధులు.

బుద్ధుడు వినమ్రుడు, ప్రశాంతుడు. జ్ఞాని - మలివేద వ్యాఖ్యాతల అజ్ఞానాల్ని పారద్రోలాడు. గొప్పవక్త, ప్రవక్త. జ్ఞానంలో, మానవతలో అజేయుడు.

అష్ట సమ్యక్ గుణాల్ని బోధించాడు. సమ్యక్ దృష్టి, మనస్సు, ఆలోచన, వాక్కు, కర్మ, కేంద్రీకరణ, కృషి, జీవనం. ధర్మ పథాన్ని పర్చాడు.

వర్ణరహిత జనసామాన్య స్రవంతులు బౌద్ధ సాగరంలో లీనమవడానికి పరవళ్ళు తొక్కాయి. బౌద్ధమత మానవీయ లేళ్ళు సంఘారణ్యాల్లో నిండి, ఆనందంగా ప్రశాంతంగా గెంతుతూ పరుగులు తీయసాయగాయి.

దగా చేసేటోళ్ళంతా నిఘా వేసి చూస్తూంటారు....

ఇట్టి ఘనత వీరి కెందున కయ్యెరా?...

'మలివేద' వ్యాఘ్రాలు నాచు బెట్టుకుని వున్నాయి -

కంచము కడ పిల్లి గాచినట్లు.

బావిలో పడ్డ నక్క, మేకను బావిలో దూకించి, మేక తల మీదనే ఎక్కి బావి నుండి బయట పడడానికి ఎత్తులు వేస్తూనే వుంటుంది గదా!

బుద్ధుడు జినుడు, మహాత్ముడు. తరువాత తరువాత అతని వారసులు, పరివ్రాజకులు సామాన్య మానవులు, అల్పులు గదా! బుద్ధుడు ఇంద్రియ నిగ్రహకుడు, అతడి వారసులు

ఆ తర్వాత తర్వాత యింద్రియ లోలులు... బ్రహ్మ నిష్ఠ వెంట ప్రాకృతుడరుగునా? దాత యోర్చినట్లధముడోర్వగలేడు. మధువు, మగువ లోలత ఒకవేపు, వాళ్ళకు 'మలివేద' వ్యాఖ్యాతల ప్రలోభాలు మరోవేపు...

దగా జేసెటోళ్ళంతా ఒకవేపు - మలివేద మతస్తులు. తర్వాత తర్వాత బౌద్ధ భిక్షువులు -

అల్పనరులకెపుడు అతివలందేచింత

నాలిగన్నయపుడు నీలో తగదు - అని -

మతము దారి మరచుమధురాధరము జూచి,

ఉవిద జూచి పరమ యోగంబు మరచురా

కన్నెమీది ఆశ, కనకంబు పైనాశ

బంగరు పొడగన్న, భామల పొడగన్న

అంతమంతనమున నానందకేళిరా.

చర్మమెపుడు జీవసౌఖ్యంబుగోరును.

జార పురుషుమీద సద్భక్తి సలుపుచు-

పతికి నిచ్చకంబు పరపుభంగి.

విభుని శ్రేష్ఠ గుణము వేశ్య తానెరుగునా?

చెఱకు వెన్ను బుట్టి చెరచదా తీపెల్ల?

ఈ కారణంగా బౌద్ధంలో చీలికలు - హీనయాన, మహాయానాలు.

మిత్రబేధాల కల్పన, 'సంజీవకు'ని అంతమొందించడానికి 'దమనకు'ని దారి తెన్నుల వెతుకులాటలు.

బౌద్ధం కాంతిపుంజాలు దేశ; విదేశాల దశదిశలా వ్యాపించడానికి, మలివేదమతం కొడి గట్టడానికి ముఖ్య మూలాల్లో ఒకటి 'అహింస'. మలివేదమతం ఈ 'అహింస' ఆయుధాన్ని మాత్రం తానూ అందుకుంది. మరో ముఖ్య మూలం 'వర్ణ రహిత' సమాజం. మలివేదమతం దీన్ని మట్టుకు పూర్వం లాగానే కాపాడుకోవాలన్న సంకల్పం. వర్ణ వ్యవస్థను కొనసాగించడమే దాని మూలం.

బౌద్ధ వ్యాఖ్యాతల్ని 'పాళి' - ప్రజల భాష నుండి మరల్పజేసింది మలివేదపు ప్రలోభం... 'పాళి' నుండి ప్రాకృతానికి... భాషతో బాటుగా భావం దారి మరలిపోయింది...

దేశంలో - బౌద్ధం ఉద్భవించిన భూమిలో - దాని ప్రయాణం మట్టుకు మలివేదమతం వేపు...

మలివేదమతం, బౌద్ధాన్ని దాని జన్మస్థలి నుండి పెకిలించివేసింది... బౌద్ధం తన జన్మభూమిలో జీవం కోల్పోయి, దేశ పొలిమేరల కావల దేశాల్లో బ్రతికి బట్టగట్టు తోచింది. చైనా, జపాన్, టిబెట్టు, సింహళము, బర్మా, జావా, సుమిత్ర, బోర్నియో, చంపా, సియామ్, మధ్య ఆసియాల్లో వికసిస్తోంది. పుట్టిన గడ్డలో బౌద్ధం పాతిపెట్టబడింది... దాని సమాధుల మీద మలివేద మతపు పునాదులు బలంగా పాతుకుపోయాయి.

మౌర్య సామ్రాజ్యంతో పుట్టి హర్షసామ్రాజ్యంతో అంతమైంది బౌద్ధం - పురిటిగడ్డలో,

మలివేద మతం తిరిగి గుప్త సామ్రాజ్యంలో కాలూని, వ్యాప్తి చెందింది... గుప్తులది - మలివేదమత వ్యాప్తులది -

స్వర్ణయుగం! స్వర్ణయుగమే - అల్ప సంఖ్యాక - అగ్రవర్ణాలకు - మాత్రమే. అత్యధిక సంఖ్యాకుల - శూద్ర, ఛండాలురకు అది అంధకారయుగం... న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి. వ్రతములు, కల్పములు, క్రతువులు, మంత్ర, తంత్రాలు, ప్రజానీకం బ్రతుకులు తిరిగి అంధకార బంధురం... నిమ్నుని నీడసోకితే, వాని నీడను సోకించుకున్నవాడు స్నానం చేయకుంటే పరిహారం చెల్లించాలి....

మలివేదం వూడలు తన్నింది... అగ్రవర్ణ దురహంకారం, అవినీతి, మధిర, మగువ భోగలాలసత... నిమ్న వర్ణాలకు 'కారం చేదు'లు ఎన్నో...

'వేదభూమి', 'కర్మభూమి' తథాగతుడికి 'కర్మలు' చేసింది. 'మలివేద' చిరుత జనసామాన్యపు లేళ్ళను వెన్నాడుతోంది- వేదభూమిలో... వాటికి కర్మలు చేస్తోంది.

బౌద్ధం -తన పురిటి గడ్డలో -

అది - ఒకనాటి ఉద్యాన వనము - నేడు కనము.

ఈ భూమిని -

'మలివేదం' - మరుభూమిగా నీవు మార్చేవులే...

మానవీయతా విలువలు నిండిన బుద్ధుడు - అమానుషానికి నిలువెత్తు సాక్ష్యాలు మనువాదులు- మానవీయతను అమానుషులు బలి దీసుకున్నారు ఈ గడ్డలో.

మానవీయ మతాన్ని, అమానుష మతం మింగింది....

బౌద్ధమత బింబం మలివేదపు గ్రహణంలో అంధకారంలో మునిగి పోయింది - కప్పబడింది...

జాతికి గ్రహణం పట్టినవేళ...

మనువాదులు 'అహింస'ను పాటిస్తున్నది మహా అయితే పశువుల మాంసాన్ని భుజించడాన్ని విసర్జించడంలో మాత్రమే. కానీ, నిమ్న వర్ణాల నెత్తురును త్రాగడం మట్టుకు యథావిధిగా కొనసాగిస్తూనే వున్నారు...

# WESTERN INTERPRETERS OF THE DOCTRINE OF THE BUDDHA

The first Western scholar to interpret the religion of the Blessed one to the people of Europe was the Frenchman, Eugene Burnouf. The first European to collect Buddhist texts was Brian Houghton Hodgson, British Resident at the Court of Kathmandu. The first scholar to learn Chinese to translate the life of the great Chinese Buddhist pilgrim Hwen Tsang was Stanislaus Julien, a Frenchman. The first European to learn Tibetan to translate Buddhist works was Csoma d' Korosi. The first European to learn Pali to translate Buddhist works was George Turnour, the Government Agent, at Kandy, Ceylon. The first English missinory to learn Sinhalese was. Spence Hardy.

The names of the European scholars who had helped to translate Buddhist literature into Europeon languages are herein given:- Westergaard, Fausboll, Oldenberg, Spence Hardy, Schiefner, Trenckner Schlaganweit, Stanislaus Julien, Csomad' Korosi, Dr.Rhys Davids, R. Pischcl, E. Senart, Abel Remusat, Barthelemy St. Hilaire, Eugene Burnouf, Brian H. Hodgson, Cecil Bendall, Serge d' Oldenberg, Prof. Minayeff, Mrs. Rhys Davids, Dr. Wenzel, Prof. Windisch, M. Chaveinnes, Dr. len-inai;m, Dr. C.R. Lanman, C.H. Warren, Prof, Hopidus, A.Foucher, E. Hubers, Victor Henri, Dr. Bloomfield, Otto Schrader, the German Bhikkhu Nynatiloka, the Scotch Bhikkhu Silachara, C.T. StrattSS, Dr. Zimmermann, Thomas Hardy, S. Beal, Lavallee Poussia, Edkins, Otto Franke, Dr. Ariderson, Ed Foncaux, Sylvan Levi, Mrs. Mabel Bode, A. Barth, Robert Chalmers, B.H.T. Francis, E. Cowell, E.J.Thomas, Dr. Rouse, Norman, Richard, Morris, Estlin Carpenter, R.C. Childers, Edwin Arnold, R.F. Johnston, Monier Williams. Johnson, H.S. Olcott, Dr. Paul Carus, Timothy Richard, Gogerly, Dr. Eitel, Lafcadio Hearn, Max Muller, Alabaster, A. Weber, H.Kern, F.L. Woodward and H.P. Blavatsky.

Buddhist workers in India to-day are, the Anagārika Dharmapāla, pioneer of Indian Btiddhist Revival, Kiripā Mahathero, leader of Chittagong Buddhists, samana Punnanānda, Charu Chandra Bose. Dr.

Satis Chandra Vidyabhusana. Prof. Lakshmi Narasu, M. Singaravelu Chetty, Peandit Kosambi Dharmānanda, Dr. Beni Madav Barua, Chandramani Bhikkhu, Mahavir Thero and Rai Saheb, Isan Chandra Ghose.

Ciram ti*tt*hatu saddammo
Dhamme hontu sagāravā
Sabbepi sadākālena
Sammā devo pavassatu
Sammā vassatu kālena
Devopi jagati pati
Saddhamma nirato lokam
Dhammen eva pasāsatu
Ciram ti*tt*hatu lokasmim
Sammā sambuddha sāsanam
Tasmirn sagāravā niccam
Hontu sabbepi pānino.

Commentary

## తథాగతుడు అంటే ఏమిటి?

తథాగత శబ్దాన్ని బుద్ధునికి పర్యాయపదంగా, బుద్ధునికి ఒక బిరుదంగా ఉపయోగిస్తున్నారే కాని, ఆ పదానికి అర్థం ఇదమిద్ధమని తెలిసినట్లు కనపడదు. అలాగని పాళీనికాయాలలో గూడ ఈ "పద" అర్థాన్ని గురించి చర్చించలేదు. పాళీగ్రంథాలలో ఈ పదాన్ని బుద్ధుడు తననుతాను సంబోధించుకోవడానికి ఉపయోగించాడు. "తథాగతుడు ఇలా చెబుతున్నాడు" అంటాడు బుద్ధుడు తాను చెబుతూనే

మరి తథాగతునికి అర్థం ఏమిటి? దీనిని కొందరు సంధి విడగొట్టి రెండు అర్థాలు చెబుతారు. 1) తథా+గతః = ఇలా వెళ్ళినవాడు. 2) తథా+ఆగతః = ఈవిధంగా వచ్చినవాడు. కాని ఇక్కడ మనం గమనించాల్సింది ఏమంటే. ఆ పదాన్ని మొట్టమొదట సారి బుద్ధునికి అన్వయించినప్పుడు, ఆ అన్వయించిన అతడు, ఇలా రెండు అర్థాలు మనసులో పెట్టుకొని ఉపయోగించి ఉండడు. తరువాత తరవాత వారు ఇలా పదవిభజన చేసి రెండు అర్థాలు చెబుతున్నారు. కాని, ఎన్ని అర్థాలు చెప్పినా "ఇలా వచ్చాడు"లో "ఇలా" పదానికి,"ఇలా వెళ్ళాడు"లో "ఇలా" పదానికి, అంటే అసలు "ఇలా" అంటే ఎలా అని అర్థం ఎవరూ వివరించ లేకపోతున్నారు.

శ్రీమతి రైస్‌డేవిడ్స్ మాత్రం "సత్యం" గుండా "విజయం" సాధించినవాడు అని అర్థం చెప్పింది. (won through Truth)

అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి

# GOVERNMENT OF INDIA
# DEPARTMENT OF EDUCATION

(Archy)

Simla, the 30th June, 1916.

FROM

THE HON'BLE SIR **E.D. MACLAGAN, K.C.I.E., C.S.I.,**

*Secretary to Government of India*

To

**THE SECRETARY OF THE GOVERNMENT OF BENGAL**

*General Department.*

**STR,**

1. I am directed to state for the information of the Governor in Council that several Buddhist Relics have recently been found in various stupas at Taxila in the Rawal-pindi District of the Punjab dating from about the beginning of the Christian era. The Government of India are advised though it cannot be affirmed that they were relics of the Buddha himself, they were undoubtedly regarded with veneration two thousand years ago.

2. In addition to the above there is a well authenticated relic of the Buddha consisting of small piece of bone contained in a rock crystal casket which was discovered in 1892 at Bhattiprolu in the Kristna district of the Madras Presidency. This relic is now in the Government Central Museum, Madras. An account of its, discovery appears on pages 11-12 of volume XV. Of the new Imperial series of Reports of the Archaeological Survey of India and a translation of the inscription engraved on the relic box is given in a list of Brahmi inscriptions prepared by Professor Luders *vide* pages 158 - 159 of volume X. of the Epigraphia Indica. The date of these inscriptions which are in the early Brami script is the second century B.C.

3. I am to say that the Government of India will be prepared to present three of the relics including the Bhattiprolu relic to the Maha-Bodhi Society, (4-A,. College Square. Calcutta) and one to the Bengal Buddhist; Association, (5, Lalit Mohan, Das Lane, Kapalitola, Calcutta),

provided that both Societies can guarantee, that the relics will be enshrined in worthy V*iharas* and adequately safe-guarded and provided that the shrines are constructed before the relics are distributed.

4. I am to request, that, with the permission of the Governor in Council, that the Societies may be informed accordingly. I am also to ask that it may be suggested to the Maha-Bodhi Society that they should enshrine the three relics at Calcutta, Sarnath and Taxila, respectively.

I have & c.,

**(sd.) E.D. MACLAGAN,**

*Secretary to the Govt. of India.*

## GOVERNMENT OF BENGAL

GENERAL DEPARTMENT

*Miscellaneous Branch.*

*Calcutta, the 31st July 1916.*

From

**C.W. GURNER**, ESQ., I.C.S.,

*Under-Secretary to the Government of Bengal*

To

THE **SECRETARY** TO THE **MAHA-BODHI SOCIETY,**

*4- A, College Square, Calcutta.*


Sir,

I am directed to forward a copy of the marginally noted letter from the Government of India, Department of Education and to inquire the 30th July. 1918 whether the Maha-Bodhi Society is desirous of accepting the relics on the conditions laid down. If so, I am to request that you will report at an early date what arrangements the Society proposes to make for enshrining and safeguarding them in a suitable manner at Calcutta, Sarnath and Taxila.

I have & c.,

(Sd.) **C.W. GURNER.**

*Under-Secy. to the Govt. India.*




**ఆర్య సత్యాలు**

చిత్రకారుడు : ఉపాసక జి. గోవింద స్వామి

(రిటైర్డ్ టీచర్, తిరుపతి)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



దేవదత్తుడు బుద్ధుని చంపడానికి సారాపట్టి ఎగదోలిన నాలగిరి

చిత్రకారుడు : ఉల్చి, చీరాల